సత్యమేవ జయతే

సాక్షి

'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

WWW.SAKSHI.COM

పేజీలు: 18+6 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 31

మంగళవారం 23-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



Happiness blooms!

Welcome to Bhashyam Blooms. The Fastest Growing CBSE Network of Schools in South India.



Bhashyam schools, spread across Telangana, Andhra Pradesh and Karnataka, offer pioneering educational CBSE programmes that have earned us several regional, national and international accolades. Our commitment to constantly evolving and keeping up with emerging skills and trends worldwide has led us to forge tie-ups with leading global organizations to bring the best practices to our schools.

The outstanding success of Bhashyamities in CBSE, SSC, and top ranks in JEE and NEET has made us South India's leading and most preferred educational group. In three decades, we have created milestones through our path-breaking and innovative programmes.

Join us in our successful journey towards excellence in education. Together, let's shape a brighter future for our students!

BHASHYAM BLOOMS® the global school

bhashyamblooms.in











UNDISPUTED SUCCESS IN IIT JEE (ADV) 2023



A. Venkata Siva Ram HT. 236055009

YV. Maneendhar Reddy HT. 236054250

BHASHYAM A TRUE FORMULA FOR SUCCESS

Bhashyamites in IITs, NITs, IIITs and India's Top Engg. Colleges

200 Below Ranks	23
500 Below Ranks	47
1000 Below Ranks	59

A Sensational Success in JEE(Advanced) 2023. Bhashyam is proud to top in India again.

TOP RANKERS BELOW 100 WHO MADE THE STATE PROUD - ALL INDIA RANKERS IN ALL CATEGORIES OF JEE ADVANCED 2023

Rank	Name	HT. No.
1st Rank	Y. Maneendhar	HT. 236054250
5th Rank	A.V. Siva Ram	HT. 236055009
6th Rank	K.L. Surya	HT. 236050116
7th Rank	P.N. Subhash	HT. 236061054
8th Rank	R.A. Karthik	HT. 236050527
10th Rank	Y. Maneendhar	HT. 236054250
21st Rank	M.S. Vignesh	HT. 236030043
22nd Rank	V. Deepesh	HT. 236064143
28th Rank	A. Mourya	HT. 236049789
29th Rank	I. Harshitha	HT. 236049814
32nd Rank	P. Chandrahas	HT. 236017006
39th Rank	Ch. Kundan	HT. 236057020
53rd Rank	K.L. Surya	HT. 236050116
64th Rank	V. Ajay Kumar	HT. 236063050
85th Rank	B.S. Harshith	HT. 236031105
95th Rank	Ch. Praneeth	HT. 236030038

Success Rate 80%

Bhashyam Blooms, Andhra Pradesh:


Guntur: Ring Road, T: 98485 36968, **Vijayawada:** NH-65, Poranki, T: 95422 54444/64444.
Kakinada: Panasapadu, ADB Road, CBSE Campus, T: 88850 34224.
Vizianagaram: Beside Ramanarayanam, Via Koru Konda Road. T: 88862 86677, 88862 96677.
Rajahmundry: Gadalammapunta Road, Buchaiah Nagar, T: 88869 22422/33433.

BIIT® BHASHYAM IIT - JEE Academy

BHASHYAM®

Bhashyam Junior College | Guntur | Rajahmundry

Residential Boys : 96038 55528, 98485 36971 | CO Campus : 91210 58181, 98487 78345
Residential Girls : 96035 44563, 91210 58080 | Day Scholars : 98487 78358, 96035 66636
Day Scholars : 95151 53264, 95151 53263, 98485 36939



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+6 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 31

మంగళవారం 23-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



శభాష్ గుకేశ్..

క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో విజేతగా భారత యువ గ్రాండ్ మాస్టర్ - 13లో



కొనసాగిన కొనుగోళ్ల జోరు

సూచీలకు రెండో రోజూ లాభాలే.. సెన్సెక్స్ లాభం 560 పాయింట్లు -VIలో

న్యూస్‌రీల్

బెంగాల్‌లో 24,640 నియామకాలు రద్దు



బెంగాల్‌లో మమత ప్రభుత్వానికి కోల్‌కతా హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్లలో నియామకాలకు టీఎంసీ సర్కార్ ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది. స్టేట్ లెవల్ సెలక్షన్ టెస్ట్–2016 ద్వారా చేపట్టిన 24,640 నియామకాలన్నీ రద్దు చేసింది.

వివరాలు 6లో ▸

30 వారాల గర్భ విచ్ఛిత్తికి అనుమతి



అత్యాచారానికి గురై గర్భం దాల్చిన 14 ఏళ్ల బాలిక 30 వారాల గర్భ విచ్ఛిత్తికి సుప్రీం కోర్టు అసాధారణ అనుమతి మంజూరు చేసింది. బాలిక సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ, ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని.. బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును పక్కన పెడుతున్నట్లు తెలిపింది.

వివరాలు 6లో ▸

అమ్మ ఒడి.. సర్కారు బడి

జగన్ ఇచ్చిన నమ్మకం

పిల్లలను బడికి పంపే ప్రతి తల్లికీ రూ.15వేలు ఇస్తానని మేనిఫెస్టోలో హామీ

చెప్పినట్టే అర్హులందరి ఖాతాల్లోకి తొలి ఏడాది నుంచే జమ

- కానీ ఇద్దరు పిల్లలకు ఇస్తామని.. ఒక్కరికే ఇస్తున్నారంటూ రామోజీ కేకలు
- 2019–20లో తొలి ఏడాది 42.23 లక్షల మందికి రూ.6,349 కోట్లు
- గతేడాది 2022–23లో 42.62 లక్షల మందికి రూ.6,393 కోట్లు
- కానీ కండిషన్లు పెట్టి 1.86 లక్షల మందిని తగ్గించారని 'ఈనాడు' అబద్ధాలు
- 'అమ్మ ఒడి'కి బదులుగా ల్యాప్‌టాప్‌లు ఇస్తామన్నా ఇవ్వలేదని పిచ్చిరాతలు
- అమ్మ ఒడి' ఇస్తున్నపుడు బదులుగా ల్యాప్‌టాప్‌లు ఇవ్వలేదంటే అర్థముందా?
- పైపెచ్చు అమ్మ ఒడి కొనసాగిస్తూనే 8వ తరగతి పిల్లలకు ఫ్రీగా ట్యాబ్‌లు
- దాన్లో బైజూస్ కంటెంట్ కూడా... అన్ని తరగతులకూ ఉచితంగా కంటెంట్

10 లో



- ట్యాబ్‌లతో పిల్లలు పాడైపోతున్నారంటూ దీన్నీ అడ్డుకోబోయిన 'ఈనాడు'
- పెత్తందారీ వర్గాల చేతుల్లోనే ట్యాబ్‌లు ఉండాలనేలా అహంకారపు రాతలు
- రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఎదురు తిరగటంతో తోక ముడిచిన తీరు
- టాయిలెట్ల నిర్వహణ నిధులన్నీ స్కూలు కమిటీల ఖాతాలకే జమ
- వాటి నుంచే ఖర్చు; అయినా జమ చేయట్లేదంటూ రామోజీ అవాస్తవాలు
- విద్యా వ్యవస్థ మారినా... విష ప్రచారంతో దిగజారిపోతున్న ఎల్లో ముఠా

ప్రతిభ చాటిన

పేదింటి పిల్లలు

విద్యా వ్యవస్థలో సీఎం జగన్ విప్లవాత్మక సంస్కరణల ఫలాలు

పదో తరగతి ఫలితాల్లో స్పష్టంగా కనిపించిన ఉత్తీర్ణత పెరుగుదల

- తల్లిదండ్రులకు ఆర్థిక భారం లేని, అత్యాధునిక విద్యను అందించడంలో ప్రభుత్వం విజయం
- మొత్తం 86.69% మంది ఉత్తీర్ణత
- గతేడాదితో పోలిస్తే 14.43% పెరిగిన ఉత్తీర్ణత.. ఈసారి ఫలితాల్లోనూ బాలికలదే పైచేయి
- పరీక్షల నిర్వహణ, ఫలితాలు విడుదలలో చరిత్ర
- మరోసారి 96.37 శాతం ఉత్తీర్ణతతో పార్వతీపురం మన్యం జిల్లా టాప్
- భారీగా పెరిగిన 100% ఉత్తీర్ణత స్కూళ్లు.. తగ్గిన సున్నా స్కూళ్లు
- 4 రోజుల్లో వెబ్‌సైట్‌లో మార్కులు



ఫలితాలను విడుదల చేస్తున్న పాఠశాల విద్యాశాఖ అధికారులు

- పాఠశాలలు మార్కుల ఆధారంగా ర్యాంకులు ప్రకటిస్తే చర్యలు
- పదో తరగతి పరీక్ష ఫలితాలను విడుదల చేసిన పాఠశాల విద్యా శాఖ కమిషనర్

2 లో

సత్తా చాటిన గురుకులాలు

- బీసీ గురుకులాల్లో 98.43 శాతం ఉత్తీర్ణతతో రికార్డు
- రాష్ట్ర ఉత్తీర్ణత శాతాన్ని మించి గురుకులాల్లో ఉత్తీర్ణత
- ప్రతిభ చూపిన బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యార్థులు

2లో

సీఎం జగన్ హత్యకు కుట్రలు పన్నకండి చంద్రబాబూ



- బాబుకు మనిషిని చంపడమంటే గడ్డిపోచతో సమానం
- ఆయనకి తెలియకుండా ఏపీలో హత్యలు జరగవు
- మంచి సీఎంకు మద్దతుగా మాట్లాడితే చంపేస్తారా?
- రామ్‌గోపాల్‌వర్మ హత్యకు ప్లాన్ చేసి, తర్వాత ఆగారు
- మీ అమ్మను తిడితే లోకేశ్ చొక్కా పట్టుకున్నావా పవన్?
- నీకు నాలుగో పెళ్లాం లేదా? అయిదో పెళ్లాం కూడా వెయిటింగ్ కదా?
- వైఎస్సార్‌సీపీ నేత పోసాని కృష్ణమురళి సంచలన వ్యాఖ్యలు

12 లో

సీఎం జగన్ కుటుంబ స్థిరాస్తులు

రూ.106.96 కోట్లు

చరాస్తులు రూ.650.66 కోట్లు.. వివిధ కోర్టుల్లో 26 కేసులు

సీఎం తరఫున ఒక సెట్ నామినేషన్ దాఖలు చేసిన వైఎస్ మనోహర్‌రెడ్డి

25న పులివెందులలో రెండో సెట్ వేయనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

పులివెందుల/సాక్షి ప్రతినిధి, కడప/సాక్షి, అమరావతి: తన కుటుంబం పేరిట రూ.106.96 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. సీఎం జగన్ తరఫున పులివెందుల మున్సిపల్ వైస్ ఛైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి సోమవారం ఒక సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. ఉదయం 11.45 గంటల ప్రాంతంలో ఆర్వో కార్యాలయంలో పులివెందుల అసెంబ్లీ స్థానానికి నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఈ నెల 25వ తేదీన సీఎం జగన్ స్వయంగా పులివెందులలో రెండో సెట్ నామినేషన్‌ను దాఖలు చేస్తారని అనంతరం ఆయన మీడియాకు తెలిపారు. మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, సీఎం కార్యాలయ కోఆర్డినేటర్ జనార్దన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హాల్ గంగాధరరెడ్డి, కోడి రమణ, కిషోర్ తదితరులు ఆయన వెంట ఉన్నారు. అఫిడవిట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం సీఎం జగన్ పేరున మార్కెట్ విలువ ప్రకారం రూ.46.78



సీఎం జగన్ తరఫున ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న పులివెందుల మున్సిపల్ వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, ఆడిటర్లు బాలాజీ, సనత్ తదితరులు

కోట్ల విలువైన స్థిరాస్తి ఉండగా, సీఎం సతీమణి భారతిరెడ్డి పేరిట రూ.56.92 కోట్లు, ఇద్దరు కుమార్తెలు పేరుతో చెరో రూ.1.63 కోట్ల చొప్పున స్థిరాస్తులున్నాయి. వివిధ కంపెనీల షేర్లతో సహా అన్ని రకాల చరాస్తులను పరిగణనలోకి తీసుకుంటే రూ.650.66 కోట్లుగా పేర్కొన్నారు. ఇందులో

మిగతా 12వ పేజీలో ▶



ఓ విజేత జైత్రయాత్ర

రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసిన సీఎం జగన్ 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర

- ఇప్పటిదాకా 20 రోజుల పాటు 21 జిల్లాల్లో సాగిన యాత్ర.. ఈనెల 24న శ్రీకాకుళం జిల్లాలో బస్సు యాత్ర ముగింపు
- తమ బతుకుల్లో వెలుగులు నింపిన నేతకు అడుగడుగునా జన నీరాజనం
- రాయలసీమ.. దక్షిణ కోస్తా.. ఉత్తర కోస్తా.. ఉత్తరాంధ్ర.. ప్రాంతం ఏదైనా అదే ప్రభంజనం
- మండుటెండల్లోనూ పిల్లల నుంచి పండుటాకుల దాకా ఒకే ఆరాటం
- మంచి చేసిన మిమ్మల్ని గెలిపించుకుని మళ్లీ సీఎంగా చేసుకుంటామంటూ ప్రతిజ్ఞ
- బస్సు యాత్రలో భాగంగా నిర్వహించిన 14 సభలు జనసంద్రాలను తలపించిన వైనం
- కూటమి వెన్నులో వణుకు పుట్టించిన విశాఖ, విజయవాడ, రాజమహేంద్రవరం రోడ్ షోలు
- అపూర్వ ఆదరణ చూసి ఓర్వలేక సీఎం జగన్‌పై హత్యాయత్నానికి తెగబడ్డ టీడీపీ మూక.. నుదిటిపై తీవ్ర గాయమైనా చెదరని సంకల్పంతో సీఎం యాత్ర
- బస్సు యాత్ర ప్రభంజనంతో పోటీ ఏకపక్షంగా మారిందంటున్న రాజకీయ పరిశీలకులు

10 లో



ఆర్థికంగా, ఆరోగ్యంగా చాలా పుష్టిగా ఉన్నాడు.. మనం కొనలేం సార్!

'పెమ్మసాని'..

చాలా ధనికస్వామి

దేశంలోనే అత్యంత డబ్బున్న ఎంపీ అభ్యర్థుల్లో ఒకరిగా గుంటూరు టీడీపీ నేత

ఆస్తులు రూ.5,705 కోట్లు.. అప్పులు రూ.1,038 కోట్లు

- ఇప్పటివరకు రాజ్యసభ, లోక్‌సభలకు పోటీచేసిన అభ్యర్థుల్లో టాప్‌లో పెమ్మసాని
- ఇందులో భార్య పేరున రూ.2,289.35 కోట్లు
- కుమారుడి పేరున రూ.496.27 కోట్లు
- కుమార్తె పేరున రూ.496.47 కోట్ల మేర ఆస్తులు.. అలాగే, ఆభరణాలు, భూములు, భవనాలు, నగదు
- ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: అవును మీరు చదివింది నిజమే. దేశంలో ఇప్పటివరకు బాగా డబ్బున్న అపర కుబేర ఎంపీ అభ్యర్థుల్లో ఈయన టాప్‌లో ఉన్నారు. తన ఆస్తులు రూ.5,705 కోట్లకు పైగానే ఉన్నట్లు టీడీపీ తరఫున గుంటూరు నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తన ఎన్నికల అఫిడవిట్‌లో ప్రకటించారు. తన నామినేషన్‌ను ఆయన సోమవారం దాఖలు చేయడంతో ఈ వివరాలు వెల్లడయ్యాయి. ప్రస్తుత గణాంకాల ప్రకారం రాజ్యసభ, లోక్‌సభలకు పోటీచేసిన అభ్యర్థులలో అత్యంత ధనవంతుడు పెమ్మసానే. రెండోస్థానంలో తెలంగాణకు చెందిన బీఆర్‌ఎస్ ఎంపీ బండి పార్థసారథిరెడ్డి రూ.5,300 కోట్ల



మిగతా 11వ పేజీలో ▶



జిత్తులమారి బాబు కోసం గ్రామాల్లోకి గుంట నక్కలు

సర్కారు దిద్దిన చదువులు

రెండో విడతలో నువ్వా.. నేనా?

- వివరాలు I, II, III, IVలో

కుక్కలు చింపిన

విస్తరిలా కూటమి..

11లో

- జనసేన, బీజేపీలోనూ టీడీపీ నేతలకే టికెట్లు
- రాష్ట్రమంతా ప్రచారం సాకుతో పిఠాపురం నుంచి పవన్ తప్పుకునే చాన్స్
- పిఠాపురంలో వర్మను పోటీకి దించేలా చంద్రబాబు ప్లాన్
- చివరి ప్రయత్నంగా ఓట్లు కొనేందుకు ఎన్నారై విభాగాన్ని దించారు
- టీడీపీ ఎన్నారై మందలపట్ల వైఎస్సార్‌సీపీ శ్రేణులు జాగ్రత్తగా ఉండాలి
- ఓట్లు కొనే టీడీపీ ఎన్నారైలపై పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేయాలి
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



ఉడుకుతున్న రాష్ట్రం



ఉష్ణతాపంతో రాష్ట్రం ఉడుకెత్తుతోంది. సోమవారం పలుచోట్ల సాధారణం కంటే 3–5 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొన్ని చోట్ల 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 65 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 98 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. కాగా, నేడు, రేపు ఉత్తర కోస్తాలో పలు చోట్ల తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ విభాగం తెలిపింది.

5 లో

'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ

బాలాజీ చెరువు (కాకినాడ సిటీ): పదో తరగతి ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు మంచి మార్కులు సాధించారని ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్.శృతిరెడ్డి సోమవారం తెలిపారు. గన్ని సాయి సాత్విక్ 596 మార్కులతో ప్రతిభ చూపాడన్నారు. పరీక్షలకు 1,014 మంది హాజరు కాగా 590కి పైగా మార్కులు 33 మంది సాధించారని తెలిపారు. విద్యార్థులను చైర్మన్ శేషారెడ్డి, డైరెక్టర్ ఎస్‌వీరాఘవరెడ్డి అభినందించారు.

శ్రీప్రకాష్ విజయభేరి

తుని: పదో తరగతి ఫలితాల్లో శ్రీప్రకాష్ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారు. ఆడారి తనుశ్రీ 596, యల్లపు షణ్ముఖప్రియ 592, కె.యామిని జ్యోతిక 589 మార్కులు సాధించారని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్ ప్రకాష్ తెలిపారు. తమ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. మొత్తం 225 మందికి 135 మంది 500 పైగా, 62 మంది 550 మార్కులు సాధించారని తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు అభినందించారు.

నారాయణ ఆల్‌టైమ్ రికార్డు

విజయవాడ: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నారాయణ విద్యార్థిని సాయి మనస్వి 600 మార్కులకు 599తో ఆల్‌టైమ్ రికార్డు నెలకొల్పినట్లు నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్స్ డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ తెలిపారు. 598, 597 మార్కులు కూడా తమ విద్యార్థులు సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు. మ్యాథ్స్ సబ్జెక్టులో 100కి 100 మార్కులు 15.3శాతం మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

శ్రీచైతన్య విజయకేతనం

విజయవాడ: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు ముగ్గురు అత్యధికంగా 598 మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. 597 మార్కులు ఆరుగురు విద్యార్థులు, 596 మార్కులు 15 మంది, 595 మార్కులు 31 మంది, 590 ఆపైన 524 మంది, 580 ఆపైన 2,353 మంది మార్కులు పొందారని చెప్పారు.

డాక్టర్ కేకేఆర్ గౌతమ్ అద్భుత ఫలితాలు

విజయవాడ: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్స్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. 600 మార్కులకు పి.ప్రభాకర్ 596, పి.జోషిక ప్రియ, కె.గీతికశ్రీ, వి.జి.సృతజన్‌సాయి తేజ 595 మార్కులు పొందారని పేర్కొంది. 590 మార్కులుపైన 25 మంది, 580 ఆపైన 182 మంది, 500 ఆపైన 1,427 మంది విద్యార్థులు మార్కులు సాధించారని వివరించింది. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించింది.

తిరుమల విద్యార్థుల ప్రభంజనం

రాజమహేంద్రవరం రూరల్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తిరుమల ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. వి.సందీప్ 597, కె.మోహిత్‌గుప్త 596, కె.రఘువీర్, కె.సుప్రియ, జి.దేదీప్య, పీబీ నాగేంద్రవర్మ 595 మార్కులు సాధించారన్నారు. 590 పైన 66 మంది, 580 పైన 430 మంది, 570 పైన 800 మంది విద్యార్థులు మార్కులు పొందారని తెలిపారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులను తిరుమలరావు, డైరెక్టర్ సరోజినీదేవి అభినందించారు.

భాష్యం విజయకేతనం

గుంటూరు ఎడ్యుకేషన్: టెన్త్ ఫలితాల్లో భాష్యం విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్లు భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. జి.దీపికాశ్రీ 597, కె.వెంకటసాయి భావన 596, వై.షరీనా 596, ఎస్.గాయత్రి 595, కె.లక్ష్మీహంసిని 595, ఎస్.ఆశ్రిత 595 మార్కులు సాధించారని చెప్పారు. 590కి పైగా మార్కులు 90 మంది, 580కి పైగా 588 మంది, 570కి పైగా 1,299 మంది, 550కి పైగా 2,809 మంది ఉన్నారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ హనుమంతరావు అభినందించారు.

ఆక్స్‌ఫర్డ్ ప్రభంజనం

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారని ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎస్.ఫ్రాన్సిస్‌రెడ్డి తెలిపారు. అత్యధికంగా 592 మార్కులు నమోదైనట్లు చెప్పారు. 580కి పైగా మార్కులు 35 మంది, 570కి పైగా 96 మంది, 560కి పైగా 155 మంది, 550కి పైగా 243 మంది, 540కి పైగా 314 మంది, 530కి పైగా 386 మంది, 520కి పైగా 450 మంది, 510కి పైగా 518 మంది, 500కు పైగా 567 మంది మార్కులు సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయనతో పాటు వైస్ చైర్మన్ ఆరోన్‌రెడ్డి, డైరెక్టర్లు విజయభాస్కరరెడ్డి, జోసఫ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అమీనాబేగం అభినందించారు.

శశి వేలివెన్ను విజయభేరి

ఉండ్రాజవరం: పదో తరగతి ఫలితాల్లో శశి వేలివెన్ను విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ సోమవారం తెలిపారు. 600 మార్కులకు విద్యార్థులు హనుమంతు గాయత్రి 596, పి.కృష్ణ నాగ సాహితి 595, ఎన్.సూర్యతేజ 594, కె.సత్యవాణి, పి.రణరామ్, ఎన్‌జే విజయదుర్గ 593, జి.సత్య శ్రీహర్ష, సీహెచ్ బిందుజ, బి.వైష్ణవి కావ్య 592 మార్కులు పొందారని వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను శశి విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ బూరుగుపల్లి లక్ష్మీసుప్రియ అభినందించారు.

'పది'లో గెలిచి.. విధి చేతిలో ఓడి..!

- 513 మార్కులు సాధించిన చంద్రశేఖర్
- ఈనెల 4న రోడ్డు ప్రమాదంలో దుర్మరణం



తాళ్లపూడి: పరీక్షల్లో విజయం సాధించినా, విధి చేతిలో మాత్రం గెలవలేకపోయాడు ఆ విద్యార్థి. తూర్పు గోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం, తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన హనుమంతు చంద్రశేఖర్ మలకపల్లిలోని రవీంద్ర భారతి విద్యాలయంలో పదో తరగతి చదువుతున్నాడు. పబ్లిక్ పరీక్షలు రాసిన అనంతరం బంధువుల ఇంటికి వెళ్లి వస్తున్న సమయంలో ఈనెల 4న విశాఖ జిల్లా పెందుర్తి సమీపంలోని అక్కిరెడ్డిపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి ఆనందరావుతో సహా అక్కడికక్కడే మృతి చెందారు. అయితే సోమవారం విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో చంద్రశేఖర్ 513 మార్కులు సాధించాడు. ఫలితాల నాటికి తమ మిత్రుడు లేకపోవడంతో స్నేహితులు, పాఠశాల యాజమాన్యం, కుటుంబ సభ్యులు చంద్రశేఖర్‌ను గుర్తు చేసుకున్నారు.

ప్రతిభ చాటిన పేదింటి పిల్లలు

విద్యా వ్యవస్థలో సీఎం జగన్ విప్లవాత్మక సంస్కరణల ఫలాలు ■ పదో తరగతి ఫలితాల్లో స్పష్టంగా కనిపించిన ఉత్తీర్ణత పెరుగుదల

ఇది ఏపీలోనే సాధ్యమైంది

కంటి చూపు లేని విజువల్లీ చాలెంజ్డ్ విద్యార్థులు సహాయకుడి అవసరం లేకుండా కంప్యూటర్ ద్వారా పరీక్ష రాసేలా తీర్చిదిద్ది దేశంలోనే ఆంధ్రప్రదేశ్ చరిత్ర సృష్టిస్తోంది. గత ఏడాది ఈ విధంగా ఆరుగురు విద్యార్థులు పరీక్ష రాయగా, ఈ ఏడాది అనంతపురంలో 13 మంది పరీక్ష రాసి పాసయ్యారు.



అడ్వాన్స్ సప్లిమెంటరీ

అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు: మే 24 నుంచి జూన్ 3 వరకు

దరఖాస్తులు : మంగళవారం (నేటి) నుంచి పాఠశాలల హెచ్‌ఎంల ద్వారా ఆన్‌లైన్‌లో

ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తు చివరి తేదీ : ఈ నెల 30

రూ.50 ఆలస్య రుసుముతో: మే 1నుంచి 23 వరకు

పరీక్షకు హాజరైన విద్యార్థులు 6,16,615	ఉత్తీర్ణులైన బాలికలు 89.17% బాలురు 84.32%	ప్రథమ శ్రేణి 4,27,067 మంది 69.26%	ద్వితీయ శ్రేణి 73,200 మంది 11.87%	తృతీయ శ్రేణి 34,307 మంది 5.56%	ఏపీ రెసిడెన్షియల్, బీసీ వెల్ఫేర్ స్కూళ్లలో ఉత్తీర్ణత 98.43%	100% ఉత్తీర్ణత సాధించిన స్కూళ్లు 2,803 గతేడాది 933	సున్నా శాతం ఉత్తీర్ణత: 17 స్కూళ్లు.. గతేడాది: 38
ఉత్తీర్ణులు 5,35,574 మంది; మొత్తం ఉత్తీర్ణత శాతం 86.69	ఇంగ్లిష్ మీడియంలో పరీక్ష రాసిన ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు 2.23 లక్షలు	వీరిలో ఉత్తీర్ణులు 87.82 శాతం	590కి పైగా మార్కులు సాధించిన ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు 114 మంది	550కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 18 వేల మంది	గతేడాది ఫెయిల్ అయిన వారిలో పరీక్ష రాసిన విద్యార్థులు 71,500 మంది	ఉత్తీర్ణులైన వారు 29,373 మంది	

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యా రంగంలో తెచ్చిన సంస్కరణల ఫలాలు పదో తరగతి ఫలితాల్లో మరోసారి ప్రస్ఫుటించాయి. ఒకప్పుడు కార్పొరేట్ విద్యా రంగానికే పరిమితమైన అత్యుత్తమ ఫలితాలు ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలు సొంతం చేసుకున్నాయి. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు, ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్లు, బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లు, బైలింగ్యువల్ టెక్స్ట్‌బుక్స్, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లతో అందించిన డిజిటల్ బోధన ఫలాలు టెన్త్ ఉత్తీర్ణతలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. పదో తరగతి ఫలితాల్లో గతేడాదితో పోలిస్తే 14.43 శాతం అధిక ఉత్తీర్ణతతో విద్యార్థులు సత్తాచాటారు. 2023–24 పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 6,16,615 మంది విద్యార్థులు హాజరు కాగా 5,34,574 (86.69 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణతలో మరోసారి బాలురపై బాలికలు పైచేయి సాధించారు. బాలురు 84.32 శాతం పాసవగా బాలికలు 89.17 శాతం ఉత్తీర్ణత సాధించారు. వంద శాతం ఉత్తీర్ణత పొందిన పాఠశాలలు గతేడాది 933 ఉండగా, ఈ ఏడాది ఏకంగా 2,803కు పెరిగాయి. 114 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 590కిపైగా మార్కులు సాధించారు. 550కి పైగా మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 18 వేల మంది వరకు ఉండటం విశేషం. సున్నా శాతం ఉత్తీర్ణత వచ్చిన పాఠశాలల సంఖ్య 38 నుంచి 17కు తగ్గిపోవడం బలోపేతమైన విద్యా విధానానికి అద్దం పడుతోంది. వీటిల్లో ఒక్కటే ప్రభుత్వ పాఠశాల కాగా, 13 ప్రైవేట్ అన్ ఎయిడెడ్, 3 ప్రైవేట్ ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. ఈసారి కూడా ఉత్తరాంధ్ర విద్యార్థులు అదరగొట్టారు. వరుసగా రెండో ఏడాది పార్వతీపురం మన్యం జిల్లా 96.37 శాతం ఉత్తీర్ణతతో మొదటి స్థానంలో నిలిచింది. 93.35 శాతంతో శ్రీకాకుళం రెండో స్థానంలో ఉంది. కర్నూలు జిల్లా 62.47 శాతం అత్యల్ప ఉత్తీర్ణతతో చివరి స్థానంలోఉంది. ఈ ఏడాది విద్యా సంవత్సరం ముగియక ముందే టెన్త్ ఫలితాలను విడుదల చేసి ప్రభుత్వం చరిత్ర సృష్టించింది. మార్చి 18 నుంచి 30 వరకు పరీక్షలు జరగ్గా, ఏప్రిల్ 1 నుంచి 8 వరకు మూల్యాంకనం చేసి విద్యా సంవత్సరం ముగింపునకు ఒక్కరోజు ముందే ఫలితాలను ప్రకటించింది.

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ సోమవారం విజయవాడలో పదో తరగతి ఫలితాలను విడుదల చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ కేసులేవీ నమోదు కాకుండా పరీక్షలను విజయవంతంగా నిర్వహించామన్నారు. 70 వేల మందికిపైగా సిబ్బంది పరీక్షల్లో భాగస్వాములైనట్టు చెప్పారు. ఈ ఏడాది అత్యధిక ఉత్తీర్ణతతో విద్యార్థులు రికార్డు నెలకొల్పారని తెలిపారు. ఫలితాలను www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. నాలుగు రోజుల్లో పూర్తిస్థాయి మార్కుల జాబితా, మైగ్రేషన్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో, విద్యార్థి డిజీలాకర్‌లో కూడా ఉంచుతామని చెప్పారు. నిర్ణీత సమయంలోనే మార్కుల జాబితాలను పాఠశాలలకు పంపుతామన్నారు. పరీక్షల్లో పాసవని విద్యార్థులు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, వారికి విద్యా సంవత్సరం వృథా కాకుండా వచ్చే నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ విద్యార్థుల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆత్మస్థైర్యం నింపాలని సూచించారు. దీంతో పాటు రీ కౌంటింగుకు రూ.500, రీ వెరిఫికేషన్‌కు రూ.1,000 రుసుము చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెంచేందుకే ర్యాంకుల సంస్కృతికి స్వస్తి చెప్పినట్టు వివరించారు. పాఠశాలలు మార్కుల ఆధారంగా ర్యాంకులు ప్రకటిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రతి విద్యార్థికి 'పెన్' నంబర్

ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రతి విద్యార్థికి పర్సనల్ ఎడ్యుకేషన్ నంబర్ (పెన్) పేరుతో యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ కేటాయించామని తెలిపారు. దీని ద్వారా విద్యార్థి దేశంలో ఏ ప్రాంతానికైనా, ఏ యాజమాన్యానికైనా సులభంగా పాఠశాల మారవచ్చన్నారు. పాఠశాల, ఉన్నత విద్య నుంచి ఉద్యోగంలో చేరేవరకు విద్యార్థి వివరాలన్నీ పెన్ నంబర్ ద్వారా అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సీమ్యాట్ డైరెక్టర్ వి.ఎస్.మస్తానయ్య, సమగ్ర శిక్ష ఏఎస్పీడీ కె.వి.శ్రీనివాసులు రెడ్డి, శామో డైరెక్టర్ ఎ.సుబ్బారెడ్డి, పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవనంద రెడ్డి, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్ రెడ్డి, కేజీబీవీ సెక్రటరీ డి.మధుసూదన రావు, ఏపీఆర్‌ఐఈఎస్ సెక్రటరీ నరసింహారావు, ఏపీ ఓపెన్ స్కూల్ డైరెక్టర్ కె.నాగేశ్వరరావు, ఏపీ టిట్ జాయింట్ డైరెక్టర్ మేరీ చంద్రిక పాల్గొన్నారు.

మన ఆణిముత్యాలు

పేద పిల్లల్లో ప్రతిభను గుర్తించి, వారిని మరింతగా ప్రోత్సహించేందుకు, మిగతా పిల్లల్లో స్ఫూర్తిని నింపేందుకు జగన్ ప్రభుత్వం 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమాన్ని చేపట్టింది. ఏటా టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను 'జగనన్న ఆణిముత్యాలు'గా గుర్తించి సత్కరిస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న ఈ ప్రోత్సాహంతో విద్యార్థులు స్ఫూర్తి పొంది పట్టుదలతో చదివి, మంచి ఫలితాలు సాధిస్తున్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 2,803 పాఠశాలలు 100% ఉత్తీర్ణత సాధించి రికార్డు నెలకొల్పాయి. ప్రభుత్వ పాఠశాలల్లోనూ అద్వితీయ మార్పులు వచ్చాయి. గతేడాది కేవలం 94 జిల్లా పరిషత్ పాఠశాలలు 100% ఉత్తీర్ణత సాధిస్తే, ఈ ఏడాది వాటి సంఖ్య 436కి పెరిగింది. అలాగే ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ పాఠశాలలు 4 నుంచి ఏకంగా 42కు, ఏపీ టీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ పాఠశాలలు 9 నుంచి 28కి, కేజీబీవీలు 16 నుంచి 75కు, బీసీ వెల్ఫేర్ పాఠశాలలు 11 నుంచి 54కు, ఆశ్రం పాఠశాలలు 40 నుంచి 69కు పెరిగాయి. రాష్ట్రంలోని 12 యాజమాన్యాల్లోని పాఠశాలల్లో ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలు, ఏపీ బీసీ సంక్షేమ పాఠశాలలు ఏకంగా 98.43% ఉత్తీర్ణత సాధించి మొదటి స్థానంలో నిలిచాయి.

ఇంగ్లిష్‌లో రాసి ఇరగదీశారు

ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో 4,50,304 మంది ఇంగ్లిష్ మీడియంలో రాయగా 4,15,743 (92.32శాతం)మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. వాస్తవానికి ఈ ఏడాది పదో తరగతికి ఇంగ్లిష్ మీడియాన్ని తప్పనిసరి చేయలేదు. కానీ, ప్రభుత్వం సబ్జెక్ట్ టీచర్లతో బోధన, బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ అందించడంతో 2023–24 విద్యా సంవత్సరంలో విద్యార్థులు ఇంగ్లిష్ మీడియం వైపు ఆసక్తి చూపారు. స్వచ్ఛందంగా ఇంగ్లిష్ మీడియంలో చదువుకున్నారు. ఏకంగా 2,23,270 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో టెన్త్ పరీక్షలు రాస్తే 1,96,067 (87.82 శాతం) మంది ఉత్తీర్ణులై రికార్డు సృష్టించారు. తెలుగు మీడియంలో 1,61,881 మంది పరీక్షలు రాస్తే 1,15,060 (71.08 శాతం) పాసయ్యారు.

తల్లిదండ్రులపై భారం లేని విద్య

రాష్ట్రంలో పేదింటి బిడ్డలకు, వారి తల్లిదండ్రులకు ఆర్థిక భారం లేకుండా విద్యను అందించడంలో వైఎస్ జగన్ ప్రభుత్వం విజయం సాధించిందని విద్యా రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం ఈ ఐదేళ్లలో విద్యా రంగం అభివృద్ధికి ఏకంగా రూ.73 వేల కోట్లు ఖర్చు చేయడం, వాటి ఫలితాలు కనిపిస్తుండటం భవిష్యత్తుకు శుభ సూచకంగా చెబుతున్నారు. వాస్తవానికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక ఇవ్వడం వల్ల తల్లిదండ్రులకు పుస్తకాలు, యూనిఫారం వంటి వాటి భారం తప్పింది. ఫలితంగా విద్యార్థులు ప్రశాంతంగా పాఠశాలలకు వెళ్లి చదువుకోగల్గుతున్నారు. సకాలంలో అమ్మ ఒడి అందించడంతో డ్రాపవుట్లు తగ్గిపోయాయి. 'మనబడి నాడు–నేడు' పథకంతో రాష్ట్రంలోని 45 వేల ప్రభుత్వ పాఠశాలలు సమున్నతంగా మారాయి. కొత్త పాఠశాల భవనాలు, డబుల్ డెస్క్ బెంచీలు వంటి 12 రకాల సదుపాయాలు సమకూరాయి. పిల్లలకు మధ్యాహ్న భోజనంలో జగనన్న గోరుముద్ద కింద నాణ్యమైన పోషకాలతో కూడిన రుచికరమైన భోజనం అందుతోంది. దేశంలో ఈ తరహా భోజనం పిల్లలకు అందిస్తున్న రాష్ట్రం మరొకటి లేదని కేంద్ర ప్రభుత్వమే ప్రకటించింది. దేశ చరిత్రలోనే ఎక్కడాలేని విధంగా 45 వేల ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం అమలుతో పేదింటి పిల్లల చదువులు సమున్నత స్థాయికి చేరాయి. ఫలితంగా ప్రభుత్వ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణత శాతం 72.74% నుంచి 86.69 శాతానికి వృద్ధి చెందింది.

వివిధ యాజమాన్యాల్లో ఉత్తీర్ణత పెరుగుదల (శాతంలో)

యాజమాన్యం	2022-23	2023-24
ఏపీ రెసిడెన్షియల్	95.25	98.43
ప్రైవేట్	90.54	96.72
బీసీ వెల్ఫేర్	89.45	98.43
మోడల్ స్కూల్స్	77.94	92.88
సోషల్ వెల్ఫేర్	80.25	94.56
ఆశ్రం	66.61	90.13
కేజీబీవీ	66.41	88.96
ట్రైబల్ వెల్ఫేర్	71.35	89.64
జెడ్పీ	60.45	79.38
ఎయిడెడ్	62.09	80.01
మున్సిపల్	58.49	75.42
ప్రభుత్వ	53.99	74.40

సత్తా చాటిన గురుకులాలు

- బీసీ గురుకులాల్లో 98.43శాతం ఉత్తీర్ణతతో రికార్డు
- రాష్ట్ర ఉత్తీర్ణత 86.69శాతాన్ని మించి గురుకులాల్లో ఉత్తీర్ణత
- ప్రతిభ చూపిన బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యార్థులు



సాక్షి, అమరావతి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ గురుకుల విద్యార్థులు మళ్లీ సత్తా చాటారు. రాష్ట్ర స్థాయిలో వచ్చిన 86.69 శాతం కంటే అత్యధిక ఉత్తీర్ణత శాతాన్ని నమోదు చేసుకుని మరోసారి ప్రతిభ చూపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో సాధించిన ఫలితాలకు సంబంధించిన ప్రకటనలను ఆయా సంస్థల కార్యదర్శులు సోమవారం మీడియాకు విడుదల చేశారు.

బీసీ గురుకులాలు భళా

బీసీ గురుకుల విద్యార్థులు 98.43శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఆ సంస్థ కార్యదర్శి కృష్ణమోహన్ తెలిపారు. 97 బీసీ గురుకులాలకు చెందిన 5,354 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 5,270 మంది ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. 56 గురుకులాలు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్టు పేర్కొన్నారు. గతేడాదితో పోల్చితే 90 శాతం గురుకులాలు మెరుగైన ఫలితాలు సాధించాయన్నారు. గతేడాదికి కంటే 8.4 శాతం అత్యధిక ఉత్తీర్ణత సాధించడం విశేషం. సత్యసాయి జిల్లా గుడిబండ గురుకులానికి చెందిన గోసుల గోపిక 596 మార్కులతో మొదటి స్థానం, తిరుపతి జిల్లా దోరవారిసత్రం గురుకులానికి చెందిన కె.పాంచజన్య 595 మార్కులతో రెండో స్థానంలో నిలిచారు.

అంబేడ్కర్ గురుకులాల్లో 94.56 శాతం ఉత్తీర్ణత

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 94.56శాతం ఉత్తీర్ణత సాధించినట్టు సంస్థ కార్యదర్శి ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. 13,761 మంది విద్యార్థుల్లో 13,012 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 185 గురుకులాల్లో 42 గురుకులాలు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. మదనపల్లి బాలికల గురుకులానికి చెందిన ఎం.ధోనికా 594 మార్కులతో మొదటి స్థానంలో, తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన కె.తులసి 589 మార్కులతో ద్వితీయ స్థానంలో, బాపట్ల జిల్లా సర్నాయపాలెం గురుకులానికి చెందిన ఎ.హారిక 587 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచినట్టు మహేశ్‌కుమార్ తెలిపారు.

గురుకులాల్లో టెన్త్ ఫలితాలపై గెస్ట్ టీచర్స్ హర్షం

మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో అద్భుత ఫలితాలు సాధించడంపై ఏపీ గెస్ట్ టీచర్స్ రాష్ట్ర అధ్యక్షుడు టి.దాసు సోమవారం ఒక ప్రకటన హర్షం వ్యక్తం చేశారు. పదవ తరగతిలో బీసీ గురుకులాల విద్యార్థులు 98.43శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఇందుకు కృషి చేసిన బీసీ గురుకులాల కార్యదర్శి కృష్ణమోహన్‌కు, వాటిలో పనిచేస్తున్న 1,253 మంది గెస్ట్ టీచర్లకు దాసు అభినందనలు తెలిపారు. ఇంతటి మంచి ఫలితాలు రావడానికి దోహదం చేసిన గెస్ట్ టీచర్స్‌ను కాంట్రాక్ట్ టీచర్స్‌గా రెగ్యులర్ చేయాలని దాసు విజ్ఞప్తి చేశారు.

గిరిజన గురుకులాల్లో 89.91 శాతం ఉత్తీర్ణత

ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకులాల(ఏపీటీడబ్ల్యూఐఎస్)కు చెందిన విద్యార్థులు పదో తరగతిలో 89.91శాతం ఉత్తీర్ణత సాధించినట్టు గురుకులాల సంస్థ కార్యదర్శి సదా భార్గవి తెలిపారు. మొత్తం 5,046 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, వారిలో 4,537 మంది ఉత్తీర్ణత సాధించారు. గిరిజన గురుకులాల్లో అత్యధిక మార్కులు సాధించిన వారిలో సత్యసాయి జిల్లా తనకల్లు బాలికల గురుకులానికి చెందిన బి.తులసి 589 మార్కులు, పార్వతీపురం మన్యం జిల్లా జోగంపేట బాలుర గురుకులానికి చెందిన కె.అఖిల్‌అభిరామ్ 580 మార్కులతో మొదటి, రెండో స్థానంలో నిలిచారు. మొత్తం 128 గురుకులాల్లో 27 గురుకులాలు నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం గమనార్హం.

విభిన్న ప్రతిభావంతులు 100 శాతం ఉత్తీర్ణత

ఏపీ విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా సంస్థల్లో పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఆ శాఖ సంచాలకులు బి.రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. బాపట్ల, ఒంగోలు, విశాఖ, హిందూపురంలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో 58 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా వారిలో 20 మంది అంధ విద్యార్థులు, 38 మంది బధిరులున్నారు. వీరు ప్రత్యేక బోధన పద్ధతుల(బ్రెయిలీ, సాంకేతిక భాష) ద్వారా విద్యనభ్యసించినట్టు తెలిపారు. ప్రత్యేక అధ్యాపకుల ప్రత్యేక శ్రద్ధ, బోధన ద్వారా ఉత్తమ ఫలితాలు సాధ్యమైనట్టు రవిప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు.

విద్యా కుసుమం



మనస్వి (599)

ఏలూరు జిల్లా నూజివీడు పట్టణానికి చెందిన ఆకుల వెంకటనాగసాయి మనస్వి పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 600 మార్కులకు గాను 599 మార్కులు సాధించింది. గతంలో ఎన్నడూ పదో తరగతిలో ఇన్ని మార్కులు ఎవరూ సాధించలేదు. తల్లిదండ్రులు ఆకుల నాగశైలజ, నాగవరప్రసాదరావులు ఇద్దరూ ఉపాధ్యాయులే. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే ఈ మార్కులు సాధించినట్టు మనస్వి తెలిపింది.

మెరిసిన ముత్యం



త్రివేణి (593)

కర్నూలు జిల్లా దేవనకొండ మండలంలోని తెర్నెకల్‌కు చెందిన దేవనకొండ త్రివేణి 593 మార్కులు సాధించింది. త్రివేణి ఆరేకల్‌లోని మహాత్మాజ్యోతిరావుపూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతోంది. తండ్రి దేవనకొండ నగేష్ ఆటో నడుపుతూ వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అమ్మ ఒడి రావడంతో చదువుకు ఇబ్బంది పడలేదని తల్లిదండ్రులు చెప్పారు. సివిల్ సర్వీస్‌లో రాణించాలన్నది తన లక్ష్యంగా త్రివేణి చెప్పింది.

రైతు కూలీ ఇంట.. సరస్వతీ కటాక్షం



పి.లిఖిత (597)

కలకడ: సాధారణ రైతు కూలి కుటుంబంలో విద్యా కుసుమం వికసించింది. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఏపీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని పి.లిఖిత 597 మార్కులు సాధించింది. తిరుపతి జిల్లా రామచంద్రారెడ్డి మండలం, కొత్తవేపకుప్పకు చెందిన వాసుదేవరెడ్డి–స్వాతి దంపతుల కుమార్తె లిఖిత అన్నమయ్య జిల్లా కలకడ మండలం, కె.బాటవారిపల్లె పంచాయతీ, గరడప్పగారిపల్లెలోని ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో చేరింది. గురుకుల పాఠశాలల్లో ప్రథమ స్థానం, రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం సాధించింది. డాక్టర్ అవ్వాలన్నది తనకలగా పేర్కొంది.

నిరుపేద కుటుంబంలో విద్యా నిధి



పినపోతు ఈషిత (595)

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు ఉన్నత పాఠశాలకు చెందిన పినపోతు ఈషిత 595 మార్కులు సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన ఈషిత ప్రభుత్వ పాఠశాలలోనే చదివింది. నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి, సివిల్స్ చదువుతానని చెప్పింది.

'ఆదర్శ' విద్యార్థి



ఈశ్వర్ కార్తీక్ (594)

విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలకు చెందిన ఈశ్వర కార్తీక్ పదో తరగతి ఫలితాల్లో 594 మార్కులు సాధించాడు. ఉపాధ్యాయులు ఈశ్వర కార్తీక్‌ను అభినందించారు. తల్లిదండ్రుల ప్రోత్సహం వల్లే ఈ మార్కులు సాధించానన్నాడు.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రతిభా సుమాలు



ధీరజ్ (591)



నాగూర్ వలి (591)

మార్కాపురం మండలం మిట్టమీద పల్లి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి ధీరజ్ 591 మార్కులు, బాపట్ల జిల్లా మార్టూరు మండలం వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి షేక్ నాగూర్ వలి 591 మార్కులు, త్రిపురాంతకం మండలం గణపవరం ఏపీఆర్ స్కూల్ విద్యార్థి ఈ హనుమంతు 589 మార్కులు, బేస్తవారిపేట మండలం గలిజేరుగుళ్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థి నారు భరత్ 589 మార్కులు, యర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్ సుమయ 589 మార్కులు సాధించారు.

మెరిసిన మాణిక్యాలు



గౌతమి (590)

అన్నమయ్య జిల్లా మొలకలచెరువు మండలం దేవుల చెరువుకు చెందిన ఎం.ధోనిక పది ఫలితాల్లో 594 మార్కులు సాధించింది. ఆమె తండ్రి గంగాద్రి కూలీ, తల్లి రాధమ్మ మినీ అంగన్‌వాడీ టీచర్. మదనపల్లెలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోచదివిన ధోనిక.. ఐఏఎస్ కావడమే తన లక్ష్యమని చెప్పింది. మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని జి.గౌతమి 590 మార్కులు సాధించింది. తండ్రి రెడ్డిశేఖర్ చేనేత కార్మికుడు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావడమే తన లక్ష్యంగా పేర్కొంది.

రాణించిన రైతు బిడ్డ



తుమ్మలూరు అజిత (590)

వైఎస్సార్ జిల్లా ముద్దనూరు మండలం, ఉమ్మారెడ్డిపల్లె గ్రామానికి చెందిన తుమ్మలూరు అజిత పది ఫలితాల్లో 590 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. తండ్రి తుమ్మలూరు రాజేశ్వరరెడ్డి రైతు, తల్లి సులోచన గృహిణి. ముద్దనూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో చదివిన అజితను ఉపాధ్యాయులు అభినందించారు.

అన్ని స్థానాలు గెలిచి జగన్‌కు బహుమానంగా ఇస్తాం

- నామినేషన్ దాఖలు సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి
- ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డితో కలిసి ఒంగోలులో భారీ ర్యాలీ



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ప్రకాశం జిల్లాలోని ఒంగోలు ఎంపీతో పాటు 8 శాసనసభ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకొని సీఎం జగన్‌కు బహుమానంగా ఇస్తామని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఒంగోలులో సోమవారం భారీ ర్యాలీతో వచ్చిన బాలినేని..ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో కలిసి ఒంగోలు ఆర్డీవో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి సుబ్బారెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు. నామినేషన్ సందర్భంగా ఒంగోలులోని వల్లూరమ్మ గుడి, లాయరుపేట సాయిబాబా గుడిలో ప్రత్యేక పూజలు చేయించుకున్న బాలినేని దంపతులు కర్నూలు రోడ్డు నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఇతర నేతలు, వేలాది మంది అభిమానులు, కార్యకర్తలు ఇందులో పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ప్రలోభాల ఎర

- జర్నలిస్టులపైకి దూసుకొచ్చిన జనసేన నేతలు

తిరుపతి తుడా: జనసేన పార్టీ నేతలు అంగన్‌వాడీలను ప్రలోభపెట్టేందుకు యత్నించిన ఘటన స్థానిక సప్తగిరి నగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. ఈ విషయం తెలిసి మీడియా ప్రతినిధులు అక్కడకు చేరుకోగా.. జనసేన నేతలు వారిపైకి దూసుకొచ్చి దౌర్జన్యానికి యత్నించారు. సోమవారం సప్తగిరి నగర్‌లోని శివశక్తి కల్యాణ మండపం వద్ద ఓ ఇంట్లో అంగన్‌వాడీలతో జనసేన నేతలు రహస్య సమావేశం ఏర్పాటు చేశారు. బయట ప్రాంతాల నుంచి వచ్చిన కొందరు మహిళలు తమకున్న పరిచయాల ద్వారా కొంతమంది అంగన్‌వాడీలను సమావేశానికి రప్పించారు. డబ్బు, కులం పేరుతో ప్రలోభాలకు గురి చేయడంతో కొంతమంది అంగన్‌వాడీలు సమావేశంలో పాల్గొనేందుకు వచ్చారు. విషయం తెలుసుకున్న మీడియా అక్కడకు చేరుకోవడంతో అంగన్‌వాడీలు పరుగులు పెట్టారు.

మీడియా ప్రతినిధులు వచ్చారన్న సమాచారంతో వాహనాల్లో అక్కడకు వచ్చిన కొంతమంది దుండగులు సాక్షి ఫొటో జర్నలిస్ట్, సాక్షి టీవీ రిపోర్టర్‌పైకి దూసుకొచ్చారు. కెమెరా, మొబైల్ ఫోన్ లాక్కునేందుకు విఫల యత్నం చేశారు.


అర్చకుల సంక్షేమంపై ఇంత విష ప్రచారమా?

పచ్చమీడియా తప్పుడు కథనాలపై ఎమ్మెల్యే మల్లాది విష్ణు మండిపాటు

బ్రాహ్మణ సామాజిక వర్గం అంటే చంద్రబాబుకు చిన్నచూపు

- 14 ఏళ్ల పాలనలో అర్చకుల గోడు ఏమాత్రం పట్టించుకోలేదు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్చకుల సంక్షేమానికి పెద్దపీట
- బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా ఇప్పటి వరకు రూ.780 కోట్లకుపైగా సాయం

సాక్షి, అమరావతి: అర్చక, పురోహితుల సంక్షేమంపై పచ్చ మీడియా తప్పుడు కథనాలు ప్రచురిస్తూ విష ప్రచారం చేస్తోందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మండిపడ్డారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా అర్చక, పురోహిత సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. పద్నాలుగేళ్ల చంద్రబాబు పాలనలో ఏనాడూ అర్చకుల గోడు పట్టించుకోలేదన్నారు. బ్రాహ్మణ సామాజిక వర్గమంటే ఆయనకు మొదటి నుంచి చిన్నచూపేనని, 2019 లోగానీ, 2024లోగానీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ సీటు కూడా కేటాయించలేదని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బ్రాహ్మణ సామాజికవర్గానికి అగ్రతాంబూలం ఇచ్చిందన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు.



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పురోహితుల సంక్షేమం, దేవాలయాల ఉన్నతికి ఎంతగానో కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా ఐదేళ్లలో కేవలం రూ. 216.75 కోట్లు ఖర్చు చేయగా, ఈ ప్రభుత్వం ఇప్పటివరకూ రూ. 780.94 ఖర్చు చేసినట్లు వెల్లడించారు. అర్చకుల న్యాయబద్ధమైన డిమాండ్లను ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరించిందన్నారు. అర్చకులు, పురోహితులపై దాడులు చేసేవారిని కఠినంగా శిక్షించేలా చట్టాన్ని రూపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతిపక్షాలు, పచ్చ మీడియా మాయలో పడొద్దని అర్చకులు ఈ సందర్భంగా కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్చకులకు జరిగిన మేలును ఆయన వివరించారు.


అర్చకుల కష్టాలు తీర్చేలా..

- ప్రజాసంకల్ప పాదయాత్రలో అర్చకుల కష్టాలను, దేవాలయాల దుస్థితిని కళ్లారా చూసిన వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే వారి పదవీ విరమణ రద్దు చేసి, వారికి వంశపారంపర్య హక్కులను పునరుద్ధరించారు.
- 2014–19 మధ్య టీడీపీ హయాంలో అర్చకులకు గౌరవం వేతనం కింద 1,105 మందికి కేవలం రూ. 21,16,62,741 అందజేయగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వేతనాన్ని పెంచి 4,346 మందికి రూ. 67,85,28,802 ఇచ్చింది.
- 2014–19 మధ్యకాలంలో ధూపదీపనైవేద్యం పథకం కింద 1,621 ఆలయాలకుగానూ రూ. 81,05,000 మాత్రమే ఖర్చుచేయగా, 2019–24 మధ్య 5,338 దేవాలయాలకుగానూ రూ. 2,66,90,000లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేసింది.
- టీడీపీ ప్రభుత్వం కనీసం ఒక్క పేద అర్చకుడి సొంతింటి కల నెరవేర్చలేకపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 748 మంది అర్చకుల సొంతింటి కల సాకారం చేసింది. 460 మంది అర్చకులు ఇళ్లు నిర్మించుకునేందుకు గానూ అర్చక వెల్ఫేర్ ఫండ్ ద్వారా రూ. 3,94,15,426 అందించారు.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అర్చకమిత్ర పథకం ద్వారా 411 మందికి రూ. 18.56 కోట్లు., 5,544 మందికి పురోహిత మిత్ర పథకం ద్వారా రూ. 27.17 కోట్లు ఋణాలు మంజూరు చేసింది.
- దేవదాయ ధర్మాదాయ శాఖ ద్వారా 31,017 మంది అర్చకులకు కరోనా సమయంలో ఒక్కొక్కరికి రూ.5,000లు చొప్పున రూ. 15,50,85,000 ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది.
- అర్చక సంక్షేమ నిధి ద్వారా 678 మంది లబ్ధిదారులకు, వేద ఆగమ పాఠశాలల నిర్వహణకు, అర్చకుల వైద్య ఖర్చులు, గ్రాట్యుటీ తదితర పథకాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 14.20 కోట్లు ఖర్చు చేసింది.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

- సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తిగా నీటితో నింపండి
- అధికారులకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం

సాక్షి, అమరావతి: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తిగా నీటితో నింపాలని సీఎస్ డా.కేఎస్.జవహర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పథకం, విద్యుత్ విభాగాలపై ఆయన సమీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. 'ప్రకాశం బ్యారేజీ నుంచి ఈనెల 29 వరకు, సాగర్ కుడి ప్రధాన కాలువ నుంచి ఈ నెల 25 వరకు కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుంది. వీటిని సద్వినియోగం చేసుకోండి. రాష్ట్రంలోని 680కి పైగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నీటితో నింపడం పూర్తయ్యింది. మిగిలిన వాటిని కూడా వేగంగా నింపాలి. నీటి సమస్య గల ఆవాసాలకు జూన్ నెలాఖరు వరకు ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలి. ప్రతి వారం భూగర్భ జలమట్టాలను మానిటర్ చేయాలి. ఆయా వివరాలను కలెక్టర్లకు తెలియ జేయాలి' అని ఆదేశించారు. కాగా, ఉన్నతాధికారి శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో రోజుకు 22.59 లక్షల మందికి ఉపాధి హామీ పనులు కల్పిస్తున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని పనిదినాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.



అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

ఎండల తీవ్రత దృష్ట్యా విద్యుత్ సరఫరాలో ఎక్కడా అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను సీఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. సీఎస్ మాట్లాడుతూ.. 'డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలి. జూన్ వరకు ఎదురయ్యే డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలి' అని ఆదేశించారు. ఈ సమావేశాల్లో ఉన్నతాధికారులు చక్రధరబాబు, జి.శేఖర్‌బాబు, అజయ్ జైన్, నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, ఆనందరావు, చిన తాతయ్య, జాన్ సత్యరాజ్, రవీంద్ర బాబు, సురేంద్ర, కుమార్ రెడ్డి, ఈపీడీసీఎల్, సీపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ సీఎండీలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీభరత్‌కు అమరావతిలో భూములు

- 4,920 గజాలు కొన్న విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థి
- 2019 అఫిడవిట్‌లో వివరాలకు, ఈ అఫిడవిట్‌లో వివరాలకు తేడాలు
- అమరావతిలో రెండు ప్లాట్లు కొన్నట్లు 2019లో వెల్లడి.. వారసత్వంగా వచ్చాయని తాజాగా వెల్లడి
- మొత్తం ఆస్తులు రూ.254.04 కోట్లు



సాక్షి, విశాఖపట్నం : రాజధాని పేరుతో అమరావతిలో చంద్రబాబు అండ్ కో చేసిన భూ పందేరాలు ఎన్నికల అఫిడవిట్లలో ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. బాలకృష్ణ చిన్నల్లుడు, విశాఖ లోక్‌సభ స్థానం టీడీపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ కూడా అమరావతిలో భూములు కొన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అమరావతిలో రెండు ప్లాట్లు ఉన్నాయని, వీటి విస్తీర్ణం 4,920 చదరపు గజాలని తాజా అఫిడవిట్‌లో పేర్కొన్నారు. 2019 ఎన్నికలకు ముందు వీటిని కొన్నారు. అంటే.. ఆ ఎన్నికలకు ముందు చంద్రబాబు బంధుగణం అమరావతి భూముల్ని చుట్టేసినట్లు స్పష్టమవుతోంది. ఈ ప్లాట్ల విషయంలో 2019లో ఇచ్చిన అఫిడవిట్‌లో వివరాలకు, ఈసారి ఇచ్చిన అఫిడవిట్‌లో పేర్కొన్న వివరాలకు తేడాలున్నాయి. 2018 నవంబర్ 23న తుళ్లూరు మండలం శాకమూరులో సర్వే నం.77లో 2040 చదరపు గజాలు, 2019 మార్చి 8న తుళ్లూరులో 1890 చదరపు గజాలు తానే కొన్నట్లు 2019 ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఈ ఎన్నికల అఫిడవిట్‌లో కూడా అమరావతిలో రెండు ప్లాట్లు ఉన్నట్లు చూపినప్పటికీ, ఒక ప్లాటు విస్తీర్ణం 3030 చ.గజాలుగా, రెండో ప్లాటు 1890 చ.గజాలుగా చూపించారు. అయితే.. ఈ రెండూ తాను కొన్నవి కాదని, వారసత్వంగా సంక్రమించినవని తాజా అఫిడవిట్‌లో పేర్కొనడం గమనార్హం. శ్రీభరత్‌కు మొత్తం ఆస్తులు రూ. 254 కోట్లు ఉన్నట్లు చెప్పారు. కానీ.. దాదాపు రూ.36 లక్షల రుణంతో రెండు కార్లని కొన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. శ్రీభరత్ పేరుతో స్థిర, చరాస్తులు రూ.200.84 కోట్లు, ఆయన సతీమణి, బాలకృష్ణ కుమార్తె తేజస్విని పేరుతో రూ.49.89 కోట్ల ఆస్తులు, కుమారుడు ఆర్యవీర్ పేరుతో 3.30 కోట్ల ఆస్తులున్నట్లు తెలిపారు. ఇందులో 12 కిలోల బంగారం, 104 కిలోల వెండి ఆభరణాలు, వస్తువులున్నట్లు తెలిపారు. మొత్తం రూ.1.89 కోట్లు అప్పులున్నట్లు చెప్పారు. శ్రీభరత్‌పై రెండు కేసులు నమోదయ్యాయి. బెంగళూరులోని గీతం క్యాంపస్‌లో విద్యార్థుల భద్రతపై సరైన ప్రమాణాలు పాటించకపోవడం వల్లే తన కుమారుడు బ్రహ్మసాయిరెడ్డి ఆరో అంతస్తుపై నుంచి పడి మృతి చెందారని, దీనికి కారణం గీతం అధినేత భరత్ నిర్లక్ష్యమేనని దాసరి వెంకట శివారెడ్డి ఫిర్యాదు చేశారు. దీనిపై 2024లో బెంగళూరులోని దొడ్డబళ్లాపుర పోలీస్ స్టేషన్‌లో సెక్షన్ 304 (ఏ) కింద భరత్‌పై కేసు నమోదైంది. బెంగళూరు గీతం క్యాంపస్ నిర్మాణం పూర్తయినా డబ్బులు చెల్లించడంలేదంటూ ఎంఎస్ రామయ్య ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ భరత్‌పై దొడ్డబళ్లాపుర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు భరత్‌పై 506, 379, 380, 420,448, 323, 506 (బీ) సెక్షన్ల కింద కేసు నమోదైనట్లు పేర్కొన్నారు.

పవన్, షర్మిలపై ఈసీకి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

- సీఎం జగన్‌ని కించపరుస్తున్న పవన్‌పై చర్యలు తీసుకోవాలని వినతి
- షర్మిల ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నట్లు ఫిర్యాదు
- ప్రజలను తప్పుదోవ పట్టించేలా టీడీపీ పాట : మల్లాది విష్ణు

సాక్షి, అమరావతి: సీఎం జగన్‌ను కించపరిచేలా మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్, ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న షర్మిల, టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఎన్నికల సంఘాన్ని కోరారు. ఆయన సోమవారం వెలగపూడి సచివాలయంలో సీఈవో ముఖేష్ కుమార్ మీనాను కలిసి ఈ మేరకు ఫిర్యాదులు చేసి, వాటికి ఆధారాలను కూడా సమర్పించారు. 'టీడీపీ నేతలు సీఎం జగన్‌ని సైకోగా సంబోధిస్తూ పాటను సోషల్ మీడియా, యూట్యూబ్‌లో ప్రచారం చేస్తున్నారు. ఇది ఎన్నికల నియమావళికి విరుద్ధం. టీడీపీపై మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను అనుసరించి చర్యలు తీసుకోవాలి. జనసేన అధ్యక్షుడు పవన్ నరసాపురం, భీమవరం సభల్లో సీఎం జగన్‌పైన, వైఎస్సార్‌సీపీ నేతలు ప్రసాదరాజు, గ్రంధి శ్రీనివాస్, సజ్జల రామకృష్ణారెడ్డి పైన అనుచిత వ్యాఖ్యలు చేశారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి వివేకానందరెడ్డి హత్య గురించి బహిరంగ సభల్లో పదేపదే తీవ్రంగా ఆరోపణలు చేస్తున్నారు. వారిపై తగిన చర్యలు తీసుకోవాలి' అని ఆ ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. మల్లాది విష్ణు వెంట మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు, గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణమూర్తి, పార్టీ లీగల్ సెల్ నేత కొమ్మసాని శ్రీనివాసరెడ్డి కూడా ఉన్నారు.

పవన్ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం

సీఈవోకి ఫిర్యాదు అనంతరం మల్లాది విష్ణు మీడియాతో మాట్లాడుతూ.. నర్సాపురం, భీమవరం సభల్లో పవన్ మాట్లాడిన మాటలు తీవ్ర అభ్యంతరకరమని చెప్పారు. ఒక సీఎంని పట్టుకుని ఒళ్లు దగ్గర పెట్టుకోమని, నాలుక కత్తిరిస్తామంటూ పవన్ చేసిన వ్యాఖ్యలు దారుణమన్నారు. పవిత్రమైన వివాహ బంధాన్ని అపహాస్యం చేస్తున్న పవన్‌కు సీఎంను విమర్శించే స్థాయి లేదని అన్నారు. పవన్ తక్షణమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, వైఎస్సార్‌సీపీకి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రతిపక్షాలు ఎన్నికల నియమావళిని పదే పదే ఉల్లంఘిస్తున్నాయని మండిపడ్డారు. వివేకానందరెడ్డి హత్య కేసు గురించి మాట్లాడొద్దని కోర్టు చెప్పినప్పటికీ, షర్మిల పదేపదే ప్రస్తావిస్తున్నారన్నారు. అలాగే జాబ్‌లు, కొండలు, రోడ్లపై ప్రజలను తప్పుదోవ పట్టించేలా టీడీపీ సోషల్ మీడియాలో ప్రదర్శిస్తున్న పాటను పోస్టు చేసిన వారితో పాటు రాసిన వారు, కంపోజ్ చేసిన వారు, పాడిన వారిపైనా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరినట్లు చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాలలోని పోలింగ్ స్టేషన్ల వద్ద శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరామన్నారు. సీఎం సభకు లక్షలాది మంది ప్రజలు తరలిరావడం, విజయవాడలో దాడి నేపథ్యంలో సీఎం జగన్ భద్రత పట్ల పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైందని, దానిని కూడా టీడీపీ తప్పు పట్టడం సరికాదని అన్నారు. సీఎంకు కనీస భద్రత లేకుండా చేయాలని టీడీపీ కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. అధికారులను బెదరించే ధోరణిని టీడీపీ నేతలు మానుకోవాలన్నారు. నవరత్నాల పథకాల మీద అబద్ధపు ప్రచారంతో అయోమయం సృష్టించేందుకు టీడీపీ నేతలు, పచ్చ మీడియా ప్రయత్నిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి మండిపడ్డారు.



ఇతరులకు మనం ఇతరులం.
- మార్కస్ అరేలియస్

సాక్షి
మంగళవారం, 23 ఏప్రిల్ 2024

పొరుగున మరో సవాలు

ఆదివారం మాల్దీవుల్లో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల ఫలితాల సరళి చూశాక భారత్‌కు పొరుగున మరో సవాలు తప్పేలా లేదు. చైనా అనుకూల దేశాధ్యక్షుడు మొహమ్మద్ ముయిజుకూ, ఆయన సారథ్యంలోని పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ (పీఎన్‌సీ)కీ అఖండ విజయం అందుతున్నట్టు తొలి వార్తల్లోనే తేలిపోయింది. పార్లమెంట్ 'మజ్లిస్'లోని మొత్తం 93 స్థానాల్లో 90చోట్ల పీఎన్‌సీ పోటీ చేసింది. 72 శాతం పోలింగే నమోదైన ఈ ఎన్నికల్లో సోమవారం ఉదయానికే ఫలితాలు వెల్లడైన 86 సీట్లలో 66 ఆ పార్టీయే గెలిచింది. సభలో మూడింట రెండు వంతులకు మించి మెజారిటీ సాధించింది. ఫలితాల అధికారిక ధ్రువీకరణకు మరో వారం పట్టవచ్చు. మే తొలివారానికి కొత్త సభ కొలువు తీరవచ్చు. అసలే భారత వ్యతిరేకిగా ముద్రపడ్డ ప్రెసిడెంట్ ముయిజు ఇక పార్లమెంట్ సాక్షిగా భారత వ్యతిరేక విధానాలను ముమ్మరం చేసేందుకు వీలు చిక్కింది. ఇదే ఇప్పుడు ఆందోళన రేపుతోంది.

నలభై అయిదేళ్ళ ముయిజు గత సెప్టెంబర్‌లో దేశాధ్యక్షుడిగా ఎన్నికై, నవంబర్‌లో పదవి చేపట్టినప్పటి నుంచి ఈ పొరుగు దేశం చైనా వైపు మొగ్గుతోంది. అయితే, కార్యనిర్వాహక వ్యవస్థకు మించి పార్లమెంట్‌కే పర్యవేక్షక అధికారాలు ఉంటాయి గనక తాజా పార్లమెంటరీ ఎన్నికలకు ముందు వరకు పరిస్థితి కొంత నయం. ముయిజుకు ముందు అధ్యక్షుడైన ఇబ్రహీమ్ మొహమ్మద్ సోలిహ్ సారథ్యంలోని మాల్దీవియన్ డెమోక్రాటిక్ పార్టీ (ఎండీపీ)దే ఇప్పటి దాకా పార్లమెంట్‌లో ఆధిక్యం. ఆ పార్టీకి 41 మంది సభ్యులుండేవారు. ఇక, ముయిజు తాలూకు పార్టీయేమో సభలో మైనారిటీ కూటమిలో భాగం. అందువల్ల నిరుడు ముయిజు అధ్యక్షుడైనా తాననుకున్న విధాన నిర్ణయాల అమలుకు తగిన మెజారిటీ సభలో లేకపోయింది. ప్రాంతీయంగా బలమైన శక్తి, సాంప్రదాయికంగా మాల్దీవుల హితైషి అయిన భారత్ పట్ల ఆయన వ్యతిరేకత తెలిసిందే. ఆ భారత వ్యతిరేక విధానాలకు ఎండీపీ ఆధిక్యంలోని పార్లమెంట్ అడ్డుపడుతూ వచ్చింది. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో ఆయన పార్టీకి మెజారిటీ వచ్చింది. ఇప్పటి దాకా మెజారిటీలో ఉన్న ఎండీపీ డజను సీట్లకే పరిమితమై, ఘోరంగా ఓడింది. ఇక విధాన నిర్ణయాల్లో విశ్వరూపం చూపడానికి ముయిజుకు అడ్డుండదు.

మాల్దీవుల్లో బస చేసిన భారత సైనికులను వెనక్కి పంపిస్తానని వాగ్దానం చేసి, 2023లో ముయిజు అధ్యక్ష పీఠం ఎక్కారు. దేశ పార్లమెంట్ సహకారం లేక ఇప్పటి దాకా అది ఆగింది. ఇకపై ఆయనను ఆపడం కష్టమే. అధ్యక్ష పదవి చేపట్టిన వెంటనే ఆయన చైనా వెళ్ళి, ఆ దేశాధినేతను కలిసొచ్చారు. వస్తూనే, పేరెత్తకుండా పరోక్షంగా భారత్‌పై విమర్శలు సంధించారు. అప్పటి నుంచి ముయిజు కీలకమైన అనేక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కాంట్రాక్టుల్ని చైనా ప్రభుత్వ రంగ సంస్థలకు కట్టబెడుతూ వచ్చారు. అలా చైనాతో ఆర్థిక సహకారాన్ని పెంపొందించుకోవాలన్నది ఆలోచన. దానికి తాజా ఎన్నికలను ఓ పరీక్షగా పరిశీలకులు భావించారు. తాజా విజయంతో ఆయనకు అడ్డంకులన్నీ తొలగిపోయినట్టే. మానవతావాద కార్యకలాపాల నిమిత్తం ద్వీపదేశంలో ఉన్న భారత సైనికులను తిప్పి పంపడమే ఆయన తక్షణ అజెండా అయితే ఆశ్చర్యం లేదు. దీనికి తోడు ఎన్నికల ఫలితాలు వచ్చిందే తడవుగా... మాల్దీవులతో సమగ్ర, వ్యూహాత్మక సహకార భాగస్వామ్యాన్ని నిరంతరం పటిష్ఠం చేసుకోవాలని చూస్తున్నట్టు చైనా సోమవారం ప్రకటించింది. అది గమనార్హం.

భూమధ్యరేఖ వెంట దాదాపు 800 కి.మీలలో ఒకదానికొకటి విసిరేసినట్టుగా ఉన్న 1,192 చిన్న చిన్న పగడపు దీవుల సముదాయం మాల్దీవులు. భూతాపంతో సముద్రమట్టం పెరిగితే, పెను ముప్పులో పడే దేశాల్లో ఒకటి. చిరు ద్వీపదేశమే అయినా, హిందూ మహాసముద్రంలో వ్యూహాత్మక భద్రతా కారణాల రీత్యా భారత్‌కు కీలకమైనది. ఆది నుంచి ఆ దేశంతో మనది స్నేహబంధమే. ఆర్థికంగా, హార్దికంగా ఆ బంధం కాలపరీక్షకూ నిలిచింది. మచ్చుకు గత ఏడాది ఆఖరు నాటికి భారత్‌కు 400.9 మిలియన్ డాలర్ల మేర మాల్దీవులు ఋణపడివుంది. ముయిజు వచ్చాక సంబంధాలు కొంత దెబ్బతిన్నాయి. అయినా, భారత్ ఇప్పటి దాకా సంయమన ధోరణితో వ్యవహరిస్తూ వచ్చింది. ఎన్నికల కోసమో, మరేమో కానీ... ముయిజు సైతం గత నెలలో కొంత తగ్గినట్టు కనిపించారు. మాలేకు ఢిల్లీ ఆర్థిక సహాయాన్ని ప్రస్తావిస్తూ, మాల్దీవులకు అత్యంత సన్నిహిత మిత్రదేశంగా భారత్ కొనసాగుతుందన్నారు. కానీ, పార్లమెంటులో దక్కిన తాజా ఆధిక్యంతో ఆయన రేపు దూకుడుగా వ్యవహరించడం ఖాయమనిపిస్తోంది. అప్పుడు భారత్‌కు సిసలైన సంకటం తప్పదు.

ఇప్పటికే పొరుగున... ఉత్తరాన నేపాల్, దక్షిణాన శ్రీలంక, పశ్చిమాన పాకిస్తాన్... ఇలా అన్నీ చైనా అనుకూల వైఖరిని అనుసరిస్తున్న పరిస్థితి. ఆ జాబితాలో మాల్దీవులూ చేరింది. అవినీతి ఆరోపణలతో... చైనా అనుకూల మాజీ అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్‌కు 11 ఏళ్ళ జైలు శిక్ష పడడంతో ప్రతినిధిగా నిలబడ్డ ముయిజు అధ్యక్షుడయ్యారు. ఈసారి యమీన్ మద్దతు లేకున్నా పార్లమెంటరీ ఎన్నికల్లో కూటమిని గెలిపించారు. ఆదివారం ఎన్నికల్లోనూ ఓట్ల కోసం భౌగోళిక రాజకీయాలే పార్టీలకు చోదకమయ్యాయి. మాల్దీవుల విస్తారమైన సముద్రజల సరిహద్దులను గస్తీ కాయడం కోసం భారత్ గతంలో ఓ విమానం అందించింది. అలాంటి 3 విమానాల్ని నడుపుతున్న భారత సైనికుల్ని ఉపసంహరించుకోవాలన్నది డిమాండ్. కొత్త సర్కార్ డిమాండ్‌ను భారత్ పరిగణించక తప్పదు. ఈ పరిస్థితుల్లో ఢిల్లీ ఇక ఎంత మాత్రమూ అలసత్వం వహించడానికి వీలు లేదు. దౌత్య నైపుణ్యానికి పదునుపెట్టాలి. భౌగోళిక రాజకీయాల్లో కీలకమైన మాలేతో సంబంధాల మెరుగుదలకు ప్రయత్నించాలి. విదేశాంగ విధానంలో గొప్పంటూ జబ్బలు చరుచుకుంటున్న పాలకులు పొరుగు దేశాల్ని ఆకర్షించడంలో చైనా చూపుతున్న చాకచక్యాన్ని చూసి అవసరమైన పాఠాలూ నేర్చుకోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు
చైత్ర మాసం, **తిథి:** పౌర్ణమి తె.4.26 వరకు (తెల్లవారితే బుధవారం), తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** చిత్త రా.9.56 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** తె.4.01 నుండి 5.45 వరకు (తెల్లవారితే బుధవారం), **దుర్ముహూర్తం:** ఉ.8.11 నుండి 8.59 వరకు, తదుపరి రా.10.50 నుండి 11.38 వరకు, **అమృతఘడియలు:** ప.2.49 నుండి 4.35 వరకు.

సూర్యోదయం: 5.43
సూర్యాస్తమయం: 6.13
రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు

అంబేడ్కర్ మాట అనుసరణీయ బాట

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

"వర్ణాశ్రమ వ్యవస్థ స్వార్థపరులైన కొందరు కల్పించినది మాత్రమే. మన హక్కులు వారు తీసుకున్నారు. మనకు దున్నుకోవడానికి భూమి లేదు. చేయడానికి మంచి వృత్తులు లేవు. కర్మ, అదృష్టం అనే మాటలు పక్కకు పెట్టి, మీ స్వశక్తి మీద పైకిరండి'' అన్నారు దళితులను ఉద్దేశించి అంబేడ్కర్. రాజకీయ హక్కుల్ని తేలికగా చూడవద్దనీ, రాజ్యాధికారమే కీలకమనీ బోధించారు. భారతదేశం మొత్తంగా కుల సమీకరణాలతో రాజకీయాలు నడుస్తున్నాయి. రాజ్యాంగ సృష్టికర్తను విస్మరించి రాజ్యాంగాన్ని పొగడటంలో కుల వివక్ష ఉంది. భారతదేశంలో సాంఘిక విప్లవాన్ని, కుల నిర్మూలనను 'ఆర్థిక సమతా వాదులు' విస్మరించినట్లయితే వారికి విప్లవం సుదూరంలో ఉండక తప్పదు. అంబేడ్కర్ ఆలోచనలకు మళ్లాల్సిన చారిత్రక సందర్భం వచ్చింది.

భారతదేశంలో ఈనాడు ఎన్నికలు మతోన్మాదానికీ, లౌకికవాదానికీ మధ్య యుద్ధంగా నడుస్తున్నాయి. భారత రాజ్యాంగం భారత దేశానికి ఊపిరి లాంటిది. భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించడం అంటే లౌకికవాదాన్ని ఉల్లంఘించడమే. ఇపుడున్న పార్టీలన్నీ అంబేడ్కర్ సిద్ధాంతాలకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయి. సెక్యులర్ వ్యతిరేక వాదాన్ని అనుసరిస్తున్నాయి. దళితులకు రిజర్వేషన్ సీట్లు తప్ప దళితుల జనాభా ఎక్కువ వున్న నియోజకవర్గాల్లో కూడా వారికి సీట్లు ఇవ్వటం లేదు. మనువును అంతర్గతంగా కొందరు, బహిర్గతంగా కొందరు అనుసరిస్తున్నారని చెప్పక తప్పదు.

అంబేడ్కర్ మనువునూ, మనువు విశ్లేషించిన వర్ణవ్యవస్థనూ తన తర్క వైదుష్యంతో ప్రశ్నించి అది అభూత కల్పనా వాదమని నిరూపించారు. వర్ణ వ్యవస్థలో వున్న వైరుధ్యాన్ని బయటకీడ్చి చాతుర్ వర్ణ వ్యవస్థ కల్పితమైందని చెప్పారు. ఆర్యులు గూడా మూడు వర్ణాలుగానే వున్నారనీ, శూద్రులు ప్రత్యేక వర్ణం కారనీ, వారూ క్షత్రియులలో ఒక భాగమేననీ అన్నారు. శూద్ర రాజులకు, బ్రాహ్మణులకు నిరంతరంగా సాగిన కలహాలలో ఓడిన బ్రాహ్మణులు శూద్రరాజుల చేత తక్కువగా చూడబడుతూ నిరంకుశంగా అణగద్రొక్కబడే వారని వివరించారు. దీని వలన బ్రాహ్మణులకు ద్వేషం పెరిగి కొంత కాలానికి ద్విజత్వానికి కారణమయ్యే 'జంధ్యాన్ని' శూద్రులకు నిషేధించారు. ఈ జంధ్యం ప్రాచీన భారతంలో అత్యున్నతమైన ఆర్థిక, సాంఘిక హోదాకు గుర్తుగా వుండేది. ఈ జంధ్యధారణ నిషేధంతో శూద్రులు మూడు వర్ణాల నుండి నెట్టబడి నాలుగవ వర్ణంగా రూపొందించబడ్డారని అంబేడ్కర్ తెలిపారు.

కుల వాస్తవాన్ని అంగీకరించాలి!

ఇక పంచములు వర్ణ వ్యవస్థలో భాగస్వాములు కాదని ఆయన నిరూపించారు. రాజకీయ, ఆర్థిక సంస్కరణల వల్ల మాత్రమే కుల నిర్మూలన జరుగుతుందా? అని ప్రశ్నలు అవసరమని వ్యాఖ్యానించారు. భారతదేశంలో సాంఘిక విప్లవాన్ని, కుల నిర్మూలనను 'ఆర్థిక సమతా వాదులు' విస్మరించినట్లయితే వారికి విప్లవం సుదూరంలో వుండక తప్పదు. ఒకవేళ సాంఘిక వ్యవస్థలో వున్న అంతరాల పట్ల నిర్లక్ష్య వైఖరి వహిస్తే చివరకు వారి విప్లవ సాధనలో కూడా కుల వ్యవస్థ తాలూకు దుష్ఫలితాలు ప్రతిఫలించక తప్పదు. ఈ విషయాన్ని ధ్రువీకరిస్తూ అంబేడ్కర్ ఇలా పేర్కొన్నారు: ''ఇండియాలో సాంఘిక వ్యవస్థను సోషలిస్టులు ఎదుర్కొనక తప్పదు. అలా ఎదుర్కొనకుండా విప్లవం సాధ్యం కాదు. ఒకవేళ అది సాధ్యమైనా, వారి ఆశయాలు నెరవేరాలంటే సదరు సాంఘిక వ్యవస్థతో సోషలిస్టులు కుస్తీ పట్టక తప్పదు. ఇది నా దృష్టిలో నిర్వివాదమైన సత్యం.'' ఇక్కడ సోషలిస్టులను ఉద్దేశించి చెప్పిన మాటలు కమ్యూనిస్టులకు కూడా వర్తిస్తాయి.



ఇక అంబేడ్కర్ దళితులను ఉద్దేశించి మాట్లాడుతూ, ''మూఢ నమ్మకాలను వదలిపెట్టి చుట్టూ వున్న పరిస్థితులను గమనించండి. అర్థం చేసుకోండి. మీరు చేసిన నాసిక్ సత్యాగ్రహం, మహద్ ఉద్యమం మీలో ఎంతో మార్పు తెచ్చాయి. మన ఆందోళనను ఇతర దేశాలు కూడా గుర్తించాయి. బ్రిటన్‌లోని లండన్ టైమ్స్ పత్రిక తమ ప్రభుత్వానికీ, ప్రజలకూ ఈ సమస్యను ఎత్తి చూపింది. ఈ విధమైన ఆందోళన ద్వారా మన సమస్యలు నలుగురూ గుర్తించడం జరుగుతుంది. ఈ వర్ణాశ్రమ వ్యవస్థ స్వార్థపరులైన కొందరు కల్పించినది మాత్రమే. మన హక్కులు వారు తీసుకున్నారు. మనకు దున్నుకోవడానికి భూమి లేదు. అంతా వాళ్ళే దున్నుకొంటున్నారు. మనకు చేయడానికి మంచి వృత్తులు లేవు. లాభదాయకమైనవీ, గౌరవప్రదమైనవీ అన్నీ వాళ్ళే చేసుకుంటున్నారు. మనకు హక్కులు లేకుండా చేసి ఇతరులు బాగుపడుతున్నారు. కర్మ, అదృష్టం అనే మాటలు పక్కకు పెట్టి, మీ స్వశక్తి మీద పైకిరండి'' అని చెప్పారు.

రాజ్యాధికారమే కీలకం

''ఒక మనిషిని దేవునిలా కొలవడం మంచిదికాదు. వ్యక్తి పూజ వినాశనానికి దారితీస్తుంది. దానిని మొగ్గలోనే తుంచివేయాలి. మీ సమస్యలన్నీ ఒక్కరి మీద ఉంచడం వల్ల మీకు ఒకరి మీద ఆధారపడటం అలవాటైపోతుంది. మీరు కర్తవ్యం నుండి విముఖులై బాధ్యతారహితంగా ప్రవర్తించడానికి అవకాశముంది. మీరు ఇలాంటి భావాలకూ, ఆలోచనలకూ తావిచ్చినట్లయితే మీ పరిస్థితి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయే కొయ్య దుంగలకంటే ఏ మాత్రమూ మెరుగ్గా ఉండదు. మీరు రాబోతున్న ఈ రాజకీయ హక్కుల్ని తేలికగా చూడకండి'' అని కూడా అన్నారు అంబేడ్కర్. దళితులను గూర్చి మాట్లాడిన ప్రతి సందర్భంలోనూ రాజ్యాధికారం ప్రధానమైన 'కీ' అని ఆయన చెబుతూ వచ్చారు. అగ్రవర్ణాల పార్టీలన్నీ కూడా దళితులను పావులుగా వాడుకున్నాయి. దళిత ఎంపీలు, ఎమ్మెల్యేలు చాలామంది అగ్రవర్ణాల పార్టీలకు తొత్తులుగా వున్నారు. అగ్రవర్ణాల పార్టీలు అంతర్గతంగా వీరిని అస్పృశ్యులుగానే చూస్తున్నాయి. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, విశ్వ హిందూ పరిషత్ మనువాద రాజకీయాన్ని విస్తృతి చేయటంలో భాగంగా రాజ్యాంగ హక్కులపై దాడి చేస్తున్నాయి. కార్పొరేట్ వ్యవస్థలకు కొమ్ము కాస్తున్నాయి. పేదలను మరింత పేదలుగా చేస్తున్నాయి.

భారతదేశం మొత్తంగా కుల సమీకరణాలతో రాజకీయాలు నడుస్తున్నాయి. రాజకీయాల్లో కులతత్వం, అస్పృశ్యత పెరుగుతున్నాయి. ఎన్డీయే తరపున నరేంద్ర మోదీ గానీ, ఇండియా కూటమి తరపున రాహుల్ గాంధీ గానీ రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడుతూ అంబేడ్కర్ పేరు ఎత్తకపోవడం అది రాజకీయాల్లో కుల వివక్షే అవుతుంది. రాజ్యాంగాన్ని ఎంతో శ్రమతో రూపొందించిన అంబేడ్కర్ నామవాచకాన్ని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం యేచూరి ఉచ్చరించకుండానే రాజ్యాంగ వ్యవస్థలను మోదీ ప్రభుత్వం ధ్వంసం చేసిందని అంటున్నారు. అంబేడ్కర్‌ను విస్మరించటం కూడా ఉద్దేశపూర్వకంగానే జరుగుతుంది.

తగని విస్మరణ

రాజ్యాంగ సృష్టికర్తను విస్మరించి రాజ్యాంగాన్ని పొగడటంలో కుల వివక్ష ఉంది. అస్పృశ్యత కూడా దాగి ఉంది. 111 మంది దళిత ఎంపీలు కూడా అంబేడ్కర్ నామవాచకాన్ని విస్మరిస్తున్నారు. ఆయన నిర్మించిన రాజకీయ రిజర్వేషన్‌ల ద్వారా పార్లమెంటుకు వెళ్ళి దళితుల గురించి మాట్లాడలేకపోతున్నారు. అంబేడ్కర్ సిద్ధాంతాలను అర్థం చేసుకోకుండా, సంపదను అందరికి పంచాలనే అంశాన్ని విస్మరించి ఎంపీలందరు కోట్లకు పడగలెత్తి, భూస్వాములై, దోపిడీ దారులై, నల్లడబ్బు స్వాములై నీతీ నిజాయితీ లేనివారిగా ఎక్కువమంది జీవిస్తున్నారు. ఎంపీల్లో బ్యాంకుల్లో డబ్బు ఎగ్గొట్టేవారి సంఖ్య ఎక్కువగా ఉంది. ఐపీసీ 302, 307 కేసుల్లోనే గాక, మహిళలపై అఘాయిత్యాలు చేసినవారు కూడా ఎక్కువమంది ఎన్నికల్లో నిలబడటం ఆశ్చర్యం. ఈ రోజున మేధావులు, ఆలోచనాపరులు, ఉద్యమకారులు, స్త్రీవాదులు, సామాజిక సేవకులు నిశ్శబ్దంగా ఉండడం వల్లే ఇవన్నీ జరుగుతున్నాయి. వీరందరు అంబేడ్కర్ ఆలోచనలకు మళ్లాల్సిన చారిత్రక సందర్భం వచ్చింది. ఇప్పుడున్న పార్టీలు దళిత మేధావులు, స్త్రీ ఉద్యమకారులు, లౌకికవాదులకు సీట్లు ఇవ్వకపోవడాన్ని బట్టి మనకు అర్థం అవుతున్నది ఏమంటే, భారత రాజకీయాల్లో నేడు కూడా వివక్ష, అస్పృశ్యత కొనసాగుతున్నాయి. అందుకే ఈనాడు దళిత బహుజనులు, స్త్రీలు, మైనారిటీలు స్వయంగా రాజ్యాధికారం కోసం పోరాడాలి. దళిత బహుజనుల రాజ్యాధికారమే ధ్యేయం కావాలి. అంబేడ్కర్ విప్లవ మార్గంలో నడుద్దాం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు | 98497 41695

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఉత్తరాదికెందుకు?



ఎక్కువ మంది పిల్లలు ఉన్నవాళ్లకు వనరులు అన్యాయంగా బదిలీ అవుతున్నాయని ప్రధాని మాట్లాడారు. అలాంటప్పుడు దక్షిణ భారత వనరులు ఎందుకు ఎక్కువమంది పిల్లలున్న ఉత్తరప్రదేశ్, బిహార్ లాంటి రాష్ట్రాలకు వెళ్తున్నాయని మనం అడగాలి.

- నితిన్ శేషాద్రి, పౌర యాక్టివిస్ట్

ఎవరు కన్నట్టు?



ముస్లింలు ఎక్కువమందిని కంటారనీ, ప్రతిపక్షానికి ఓటేస్తే హిందువులకు ప్రభుత్వ సహాయం అందకుండా పోతుందనీ ఎన్నికల ర్యాలీలో మోదీ అన్నారు. మోదీకి ఐదుగురు తోబుట్టువులు. అమిత్ షాకు ఆరుగురు అక్కాచెల్లెళ్లు. ఏడుగురు సోదరుల్లో రవిశంకర్ ప్రసాద్ చిన్నవాడు.

- రవి నాయర్, జర్నలిస్ట్

కూడని వ్యాఖ్య



మన్మోహన్ సింగ్ మీద గొప్ప గౌరవం ఉన్నప్పటికీ (నా ఆదిత్య బిర్లా జీవిత చరిత్ర పుస్తకానికి ఆయన ముఖ్య అతిథి), 'భారత వనరుల మీద ముస్లింలకు మొదటి హక్కు ఉంది' అన్న ఆయన వ్యాఖ్య మతతత్వం కలిగినదనీ, అది కాంగ్రెస్‌ను వెంటాడుతుందనీ 2006లో కాలమ్ రాశాను. అలాగే జరిగింది.

- మిన్హాజ్ మర్చంట్, రచయిత

మారిన మైండ్‌సెట్



గత పదేళ్ల మోదీ ప్రభుత్వం ద్వారా వచ్చిన అత్యంత ప్రాథమిక మార్పు - వలసవాదం నుంచి బయటపడటం. భారతీయులుగా ఉండటానికి మేము గర్వపడుతున్నామని భారతీయులు అంటున్నప్పుడు, వాళ్లు చెప్తున్నది సరిగ్గా ఇదే.

- తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

అమ్మకు జేజే



ధరిత్రీ దినోత్సవం (ఏప్రిల్ 22) రోజున భూమాతకు ఉత్సవం చేశాం: ఆమె ఇచ్చిన ఆకులు, పువ్వుల బహుమానాలతో. మనం భూమి. మనం భూసమాజం. మనం భూమిలో భాగం. మనం వేరుగా లేము. పునరుత్పత్తిలో, స్వీయ నిర్మాణంలో, సామరస్యంలో ఉంటూ మనం భిన్నత్వంలో భాగంగా ఉన్నాం.

- వందనా శివ, పర్యావరణవేత్త

మిగిలింది గతమే!



రోమ్ తన 2,777వ వార్షికోత్సవాన్ని జరుపుకొంది. రోమ్‌కు మిగిలివున్నదల్లా పర్యాటక స్థలంగా ఉంటూ, భూమ్మీద ఒకప్పటి గొప్ప సామ్రాజ్యపు ఘనతను నాటకీయంగా ప్రదర్శించుకోవడమే! ఆఖరికి గొప్ప సామ్రాజ్యాలు కూడా బలహీన మనుమల వల్ల ఏదో ఒకరోజున ఎలా మంట గలుస్తాయో అర్థం చేసుకోవడానికి దాని చరిత్ర చదవాలి.

- వెలీనా త్చకరోవా, జియోపొలిటికల్ స్ట్రాటెజిస్ట్

చైనాకు దగ్గరైతే...



మాల్దీవుల పార్లమెంటరీ ఎన్నికల్లో చైనా అనుకూల పార్టీ భారీ విజయం సాధించింది. చైనాకు మరీ దగ్గరైతే దానికి తగిన పర్యవసానమే ఉంటుంది. కావాలంటే, ఆఫ్రికన్ యూనియన్‌ను అడిగితే అది తెలిసిపోతుంది. మారిషస్‌లో కూడా అదే జరిగింది. ఐదేళ్ల క్రితం చైనా నిర్మించిన రోడ్లన్నీ బీటలు వారాయి, అప్పుల కుప్పలు పెరిగాయి.

- ఇంతియాజ్ మహమూద్, థింకర్

ఇన్ బాక్స్

ఆదివాసీల సాధికారతకు పెద్దపీట

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గత ఐదేళ్లుగా ఆదివాసీ వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసింది. విద్య, వైద్య సంరక్షణ అందించడంలో గణనీయమైన పురోగతిని సాధించింది. వారి సంస్కృతిని పరిరక్షించడంతోపాటు అభివృద్ధికి ప్రోత్సాహకాలు అందించింది. అందులో భాగంగా పాడేరులో గిరిజన విశ్వవిద్యాలయం, వైద్య కళాశాల స్థాపించింది. నాలుగున్నరేళ్లలో రూ. 800 కోట్ల కేటాయింపులతో గిరిజన ప్రాంతాలను రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలతో అనుసంధానించడానికి 18 వంతెనల నిర్మాణం చేపట్టింది. ఒకప్పుడు గిరిజనులు సంక్షేమ పథకాలను అందుకోవడానికి వ్యయ ప్రయాసలకు గురికావలసి వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వం వినూత్నమైన గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటివద్దకే సంక్షేమ ఫలాలను చేరుస్తోంది.


రాజ్యాంగ ఆదేశాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గిరిజన ఉప ప్రణాళిక విధానాన్ని స్వీకరించింది. గిరిజనులకు, వారి భూమికి మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తించిన ప్రభుత్వం ఏజెన్సీలోని 39,450 గిరిజన కుటుంబాలకు భూమి పట్టాలను మంజూరు చేసింది. వారి వ్యవసాయ జీవనోపాధికి భద్రత కల్పించింది. పక్కా గృహాల నిర్మాణం, విద్యుత్ సరఫరా, తాగునీరు, పంటలపై అడవి జంతువులు దాడి చేయడం వంటి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించింది.

ప్రభుత్వం 2020-23 సంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక పారిశ్రామిక విధానాన్ని ప్రకటించింది. ఈ విధానంలో ఈ కమ్యూనిటీల్లో వ్యవస్థాపకతను పెంపొందించడానికి ఆర్థిక ప్రోత్సాహకాలు, స్టాంప్ డ్యూటీ మినహాయింపు, పెట్టుబడి రాయితీలు, పారిశ్రామిక జోన్‌లలో భూ కేటాయింపుల్లో రిజర్వేషన్లు వంటి ప్రోత్సాహకాలు వున్నాయి. ప్రత్యేకించి, పారిశ్రామిక పార్కుల్లో అభివృద్ధి చెందిన భూముల్లో 16.2 శాతం ఎస్సీలకు, 6 శాతం ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రిజర్వు చేసి ఆ యా వర్గాల ఆర్థిక సాధికారతకు స్పష్టమైన నిబద్ధతను ప్రదర్శించారు. ఈ విధంగా సంక్షేమ పథకాలు, ఆర్థిక ప్రోత్సాహకాలు, విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయంపై దృష్టి సారించడం ద్వారా, జగన్ ప్రభుత్వం ఈ వర్గాలను సాధికారపరచడంలో గణనీయమైన పురోగతిని సాధించింది. ఈ ప్రగతే భవిష్యత్ పాలనకు ఒక ఉదాహరణగా నిలుస్తుంది.

- ఓరుగంటి సుబ్బారావు,
నేషనల్ వర్కింగ్ ఛైర్మన్, ట్రైబల్ డెవలప్‌మెంట్ మిషన్ | 90001 77777

ఉద్దానమా... ఇక ఊపిరి పీల్చుకో!

అభిప్రాయం



లింగమనేని శివరామ ప్రసాద్

ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల సరిహద్దున ఉన్న శ్రీకాకుళం జిల్లాలోని సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు, పలాస, మందస మండలాలను కలిపి 'ఉద్దానం' ప్రాంతంగా పిలుస్తారు. ఉద్దానం అంటే 'ఉద్యానవనం' అని అర్థం. ఒక వైపున సముద్ర తీరం, మరో పక్క కొబ్బరి, జీడి మామిడి తోటలతో ఈ ప్రాంతం సస్యశ్యామలంగా ఉండటంతో దీనికి ఉద్దానం (ఉద్యానం) అనే పేరొచ్చింది. అయితే ఆ ప్రశాంత అందాల ఉద్దానం వెనుక అంతులేని విషాదం, గుండెలు పిండేసే కిడ్నీ బాధలు ఉన్నాయి.

ఈ ప్రాంతంలోని ఏ గ్రామానికి వెళ్లినా... ప్రతి ఇంటిలోనూ ఎవరో ఒకరు కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారంటే సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సాధారణంగా బీపీ, షుగర్‌వ్యాధులు ఉన్నవారికి కిడ్నీ వ్యాధి వస్తుంది. కానీ ఈ ప్రాంతంలో ఆ రెండు లేనివారికి కూడా రావడం అంతుపట్టని విషయంగా మారింది.

ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఈ ప్రత్యేక వ్యాధికి 'క్రానిక్ కిడ్నీ డిసీజ్' అని పేరు పెట్టింది. 'ఉద్దానం నెఫ్రోపతి' అని కూడా దీనిని పిలుస్తున్నారు. ఈ ప్రాంత జనాభాలో 37 శాతం మందికి కిడ్నీ వ్యాధి ఉందని ఐసీఎమ్ఆర్ లెక్కలు చెబుతున్నాయి. కానీ, పరిశోధకుల అంచనా ప్రకారం ఇప్పుడా సంఖ్య 40 శాతానికి చేరడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం గత రెండు దశాబ్దాలలో ఉద్దానంలో 15,623 మంది ఇలా తీవ్రమైన కిడ్నీ జబ్బుల బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం 13,093 మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారు.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, హార్వర్డ్ యూనివర్సిటీ, ఆంధ్ర మెడికల్ కాలేజీ, బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్, ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ కలసి చేసిన



పరిశోధనల్లో ఆ ప్రాంతంలో తాగునీటిలో ఫినాల్స్, పాదరసం, సిలికా అధిక స్థాయిలో ఉండడం 'ఉద్దానం నెఫ్రోపతి'కి కారణంగా గుర్తించారు. ఇచ్చిన మాట ప్రకారం కిడ్నీ వ్యాధిగ్రస్థులకు మెరుగైన కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించేందుకు, అలాగే అన్ని రకాల కిడ్నీ వ్యాధులపై పరిశోధనలు చేసేందుకు సుమారు రూ. 85 కోట్లతో పలాసలో డా॥ వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్. కిడ్నీ వ్యాధిగ్రస్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన అన్ని రకాల వైద్య సేవలు, డయాలసిస్ యూనిట్లు అందుబాటులోకి వచ్చాయి.

ఉద్దానం ప్రాంతంలో దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధులు (క్రానిక్ కిడ్నీ డిసీజెస్) ప్రబలంగా ఉన్న అన్ని గ్రామాలకు శుద్ధి చేసిన రక్షిత తాగునీటి సరఫరా చేయడం కోసం రూ. 700 కోట్లతో 'వైఎస్సార్ సుజలధార' ప్రాజెక్టును డిసెంబర్ 2023లో జగన్ ప్రారంభించి అందుబాటులోకి తెచ్చారు. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల పరిధిలోని కంచిలి, ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, పలాస, వజ్రపు కొత్తూరు, మందస మండలాల్లోని 807 గ్రామాల ప్రజలకు హీరమండలం రిజర్వాయర్ నుండి శుద్ధి చేసిన నీటిని ఒక్కొక్కరికి రోజుకు 100 లీటర్ల చొప్పున సరఫరా చేసేలా ప్రాజెక్టు రూపకల్పన జరిగింది. కిడ్నీ వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు జిల్లాలోని ఏడు మండలాలలో స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్థులకు గత ప్రభుత్వం ఇచ్చిన రూ. 2,500 పెన్షన్‌ను మానవతా దృక్పథంతో రూ. 10 వేలకు పెంచింది జగన్ ప్రభుత్వం. నాన్ డయాలిసిస్ రోగులకు కూడా రూ. 5 వేలు ఇస్తున్నారు.

దశాబ్దాల పాటు కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న ఉద్దానం ప్రజల పాలిట ఆపద్బాంధవునిగా మారారు జగన్. 785 కోట్లు ఖర్చు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం సాధించి, ఉద్దానానికి ఊపిరిలూదారు.

వ్యాసకర్త రాజకీయ విశ్లేషకులు
మొబైల్: 79813 20543

అన్నదాన మహిమ

'సజ్జనుండు భుజియించుటకా సిరికిన్ ఫలం బిలన్' అని జక్కరాజు వెంకట కవి రచించిన 'ఆంధ్ర కామందకము' గ్రంథంలో ఒక వాక్యం వుంది. 'ఈ భూమి మీద సంపదకు మంచివాడి ఆకలి తీరడమన్నదే సరైన ఫలం!' అని అ మాటల అర్థం. అలా కానప్పుడు ఆ సంపదకు విలువ ఉండదని, ఉండకూడదని మానవుడి అభిలాష!

'అధ్వ పరిశ్రాంతుడగు వింతవానికి, నన్నం బిడిన ఫల మట్టి దిట్టిదన బెద్ద' అని ఆంధ్ర మహాభారతం (అనుశాసనిక పర్వం, ప్రథమాశ్వాసం)లో ఉంది. 'అలసిపోయి ఆకలితో ఉన్న బాటసారికి అన్నం పెట్టడాన్ని మించిన ధర్మం లేదు. దాని వలన కలిగే ఫలం అంత ఇంత అని చెప్పడానికి వీలులేనట్టిది' అని ఆ మాటలకు అర్థం. హరిభట్టు రచించిన 'ఆంధ్ర మత్స్యపురాణం' ద్వితీయాశ్వాసంలోని ఈ కింది తేటగీతి పద్యం కూడా క్షుద్బాధను తీర్చడమనే సత్కర్మ గొప్పదనాన్ని విశదీకరించింది.

జ్యోతిర్మయం

పాదలు సంపదలకు నెల్ల బుట్టినిల్లు
నిబిడ రోగాగ్నులకు నెల్ల నీరదంబు
వైభవాకరమోక్ష నివాసహేతు
వన్నదాన సమాన మన్యంబు గలదె?

ఆకలితో అలమటించేవానికి అన్నం పెట్టడం అనే పుణ్య కర్మ సకల సంపదలకు పుట్టినిల్లు వంటిది. మనిషి దేహంలో నిబిడముగా, అనగా, శరీరంలో ఎన్నాళ్ళనుంచో ఉంటూ సాంద్రమై బాధిస్తూ ఉన్న రోగములనే అగ్నులను సైతం, ఆకలితో ఉన్నవాడికి అన్నం పెట్టడం అనే కర్మ వలన సమకూరే పుణ్యం అనే నీరు ఆర్పివేయగలిగేదై ఉంటుంది. అంతేకాకుండా, పరలోకంలో వైభవంతో కూడిన మోక్షాన్ని దక్కించుకోవడానికి మార్గం చూపేదిగా ఉంటూ, మలిజన్మ అనేది లేకుండా చేసి, ఆపై మోక్షంలోనే చిరస్థాయిగా నివాసముండేలా చేయడానికి హేతువయ్యేటువంటిది అన్నదానమనే సత్కర్మ. అంతటి మహిమగలిగిన దైన అన్నదానానికి మించినది లోకంలో మరొకటి ఉన్నదా? అని ప్రశ్న వేసుకుంటే 'లేదు!' అనే సమాధానమే వస్తుంది. కాబట్టి, అన్నదాన మహిమను గ్రహించి, వీలైనంతలో ఆచరించి, శ్రేయస్సును పొందాలని పై పద్యంలో సూచితార్థంగా గ్రహించవచ్చు.

- భట్టు వెంకటరావు

ఉడుకుతున్న రాష్ట్రం



ప్రధాన నగరాలు, పట్టణాల్లో సోమవారం నమోదైన ఉష్ణోగ్రతలు

నగరం/పట్టణం	గరిష్ఠం	కనిష్ఠం
రెంటచింతల	45.4	27.8
కడప	43.8	27.8
కర్నూలు	43.4	29.0
గుంటూరు	42.0	27.0
రాజమహేంద్రవరం	42.0	25.0
తిరుపతి	42.0	24.0
మార్కాపురం	41.0	27.0
విజయవాడ	41.0	27.0
ఏలూరు	41.0	25.0
నెల్లూరు	40.2	26.7
విజయనగరం	39.0	34.0
విశాఖపట్నం	39.0	27.2

- కొనసాగుతున్న వడగాడ్పులు
- కొన్నిచోట్ల 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు
- నేడు, రేపు తేలికపాటి వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: ఉష్ణతాపంతో రాష్ట్రం ఉడుకెత్తుతోంది. అధిక ఉష్ణోగ్రతలకు వడగాడ్పులు తోడై ఉష్ణ తీవ్రతను మరింత పెంచుతున్నాయి. సోమవారం పలుచోట్ల సాధారణంకంటే 3–5 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఫలితంగా 65 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 98 మండలాల్లో వడగాడ్పులు వీశాయి. మంగళవారం 43 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 104 మండలాల్లో వడగాడ్పులు, బుధవారం 20 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు 100 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశాలున్నాయి. మంగళవారం విజయనగరం జిల్లాలో 22, పార్వతీపురం మన్యం 11, శ్రీకాకుళం 9 మండలాల్లోను, అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలంలోను తీవ్ర వడగాడ్పులు వీస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. తూర్పు గోదావరి 17, కాకినాడ 16, అనకాపల్లి 15, శ్రీకాకుళం 11, అల్లూరి సీతారామరాజు 10, ఏలూరు 9, కోనసీమ 7, విజయనగరం 4, పార్వతీపురం మన్యం 4, విశాఖపట్నం 4, ఎన్టీఆర్ 3, పల్నాడు 2, గుంటూరు జిల్లాలో ఒక మండలంలోను, పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలంలోను వడగాడ్పులు వీస్తాయని పేర్కొంది. సోమవారం గోస్పాడు (నంద్యాల జిల్లా)లో 45.3, వెదురూరు (వైఎస్సార్) 45.2, రావికమతం (అనకాపల్లి) 44.8, జామి (విజయనగరం) 44.6, దరిమడుగు (ప్రకాశం), కోడుమూరు (కర్నూలు), పెద్దకన్నలి (తిరుపతి)ల్లో 44.2, నింద్ర (చిత్తూరు)లో 44 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

ఉత్తర కోస్తాలో తేలికపాటి వర్షాలు

నేడు, రేపు ఉత్తర కోస్తాలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సోమవారం నివేదికలో తెలిపింది. దక్షిణ కోస్తా, రాయలసీమల్లో ఉష్ణతాపం ప్రభావం చూపుతుందని, ఉక్కపోత, అసౌకర్య వాతావరణం నెలకొంటుందని పేర్కొంది.

కమనీయం సీతారాముల కల్యాణం



మంగళ సూత్రాన్ని చూపిస్తున్న అర్చకుడు

- భక్తులతో కిటకిటలాడిన ఒంటిమిట్ట
- పట్టువస్త్రాలు సమర్పించిన స్పెషల్ సీఎస్ కరికాల వలవన్

ఒంటిమిట్ట(రాజంపేట): వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ఒంటిమిట్ట కోదండరామయ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. టీటీడీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. శాశ్వత కల్యాణ వేదికను వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. స్వామి, అమ్మవార్లను వేదికపై కొలువు దీర్చారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తుల రామనామ స్మరణల మధ్య పురోహితులు చంద్రుడు చూస్తుండగా కల్యాణ క్రతువు చేపట్టారు. పురోహితులు అమ్మవారి మహామంగళ సూత్రాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి పక్షాన అమ్మవారి గళసీమలో మంగళ సూత్రాలను అలంకరించారు ఉల్లాసభరితంగా అక్షతారోపణ, లాజహోమం కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు కల్యాణ వేదిక వద్ద ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. సీతారాముల కల్యాణానికి ప్రభుత్వ స్పెషల్ సీఎస్ కరికాల వలవన్ స్వామికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. రాములోరి కల్యాణానికి భక్తజనం పోటెత్తారు. సుమారు 30వేల మంది పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో స్టేట్ ఫైనాన్స్ చీఫ్ సెక్రటరీ ఎస్ ఎస్ రావత్, ఆర్థికశాఖ రాష్ట్ర కార్యదర్శి కె.వి.వి. సత్యనారాయణ, టీటీడీ ఈవో ధర్మారెడ్డి, జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ సిద్ధార్థ కౌశల్ తదితరులు పాల్గొన్నారు. కాగా, శ్రీ కోదండరామయ్య కల్యాణోత్సవం సందర్భంగా తిరుమల శ్రీవారు దాదాపు రూ.31 లక్షల విలువైన 512 గ్రాముల బంగారు ఆభరణాలు, 14 కిలోల వెండి పూజా సామగ్రి, పట్టువస్త్రాలు కానుకగా పంపారు.

కనుల పండువగా స్వర్ణ రథోత్సవం

వైభవంగా శ్రీవారికి స్నపన తిరుమంజనం



తిరుమల: శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి తిరుమాడ వీధుల్లో స్వర్ణరథంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. స్వామివారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తిరుమల వసంతోత్సవ మండపంలో మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామికి స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లు ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమాల్లో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, ఈవో ఏవీ ధర్మారెడ్డి దంపతులు, డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు. కాగా, వసంతోత్సవాలను పురస్కరించుకుని శ్రీవారి ఆలయంలో మంగళవారం పౌర్ణమి గరుడసేవను టీటీడీ రద్దు చేసింది.

ప్రత్యేక కోర్టు తీర్పును రద్దు చేయండి

హైకోర్టులో తోట త్రిమూర్తులు అప్పీల్.. నేడు విచారణ



సాక్షి, అమరావతి: దళిత యువకులకు శిరోముండనం కేసులో తమను దోషిగా నిర్ధారించి ఏడాదిన్నర జైలు శిక్ష విధిస్తూ విశాఖపట్నం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మరో 8 మంది హైకోర్టును ఆశ్రయించారు. విశాఖ ప్రత్యేక కోర్టు తీర్పును రద్దు చేయాలని కోరుతూ వారు హైకోర్టులో వేర్వేరుగా క్రిమినల్ అప్పీళ్లు దాఖలుచేశారు. ఈ అప్పీల్ గురించి తోట త్రిమూర్తులు తరపు న్యాయవాది వి.సాయికుమార్ సోమవారం న్యాయమూర్తి జస్టిస్ అడుసుమిల్లి వెంకట రవీంద్రబాబు ముందు ప్రస్తావించారు. తోట త్రిమూర్తులు మంగళవారం నామినేషన్ దాఖలు చేయనున్నారని, అందువల్ల ఈ అప్పీల్‌పై అత్యవసర విచారణ జరపాలని కోరారు. కేసుల వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపరచాల్సి ఉందన్నారు. ఇందుకు న్యాయమూర్తి స్పందిస్తూ.. అత్యవసర విచారణ అవసరం లేదని చెప్పారు. జైలు శిక్ష తీర్పు అమలును ప్రత్యేక కోర్టు నెల రోజులు నిలుపుదల చేసిందని గుర్తుచేశారు. ఈ అప్పీళ్లపై మంగళవారం విచారణ జరుపుతామని స్పష్టంచేశారు.

హైకోర్టు ఉత్తర్వులు... జస్టిస్ పుట్టుస్వామి నివేదికను పట్టించుకోలేదు

ప్రత్యేక కోర్టు తమ వాదనలను, సాక్ష్యాలను సరైన కోణంలో పరిగణనలోకి తీసుకోలేదని తోట త్రిమూర్తులు తన అప్పీల్‌లో పేర్కొన్నారు. బాధితుల కుల ధ్రువీకరణ విషయంలో కలెక్టర్ జారీచేసిన ఉత్తర్వులను హైకోర్టు సస్పెండ్ చేసిందని తెలిపారు. ఈ విషయాన్ని పట్టించుకోకుండా కలెక్టర్ ఉత్తర్వులపై ఆధారపడి ప్రత్యేక కోర్టు తీర్పునిచ్చిందన్నారు. తాము క్రైస్తవులమని బాధితులు చెప్పిన విషయాన్ని ప్రత్యేక కోర్టు పరిగణనలోకి తీసుకోలేదని, ఈ కేసులో ఇది కీలకమని తెలిపారు. అన్నీ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో దర్యాప్తునకు ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరని, శిరోముండనం కేసును డీఎస్పీలు దర్యాప్తు చేయడానికి ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి అనుమతిలేదని, ఈ విషయం తెలిసి కూడా ప్రత్యేక కోర్టు వారి దర్యాప్తుపై ఆధారపడి తీర్పునిచ్చిందని పేర్కొన్నారు. బాధితులకు శిరోముండనం చేయించినట్లు ప్రజలెవరూ ప్రత్యక్షంగా చూడలేదని, అయినా తగిన సాక్ష్యాధారాలు ఉన్నాయంటూ ప్రత్యేక కోర్టు తమకు శిక్ష విధించిందన్నారు. బాధిత యువకులు ఎస్సీలు కాదంటూ జస్టిస్ పుట్టుస్వామి ఇచ్చిన నివేదికను ప్రత్యేక కోర్టు పరిగణనలోకి తీసుకోవడంలో దారుణంగా విఫలమైందన్నారు. 1996లో నేరం జరిగితే 2016లో వచ్చిన సవరణ చట్టంపై ఆధారపడి ప్రాసిక్యూషన్ వాదనలు వినిపించిందని, 2016 చట్టం పూర్వ నేరాలకు వర్తించదన్న విషయాన్ని ప్రత్యేక కోర్టు పరిగణనలోకి తీసుకోలేదని వివరించారు. కేసు నమోదులో జరిగిన జాప్యానికి ప్రత్యేక కోర్టు చెప్పిన కారణం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక కోర్టు తీర్పును రద్దు చేయాలని కోరారు. ఈ వ్యాజ్యం తేలేంత వరకు ప్రత్యేక కోర్టు తీర్పు అమలును నిలుపుదల చేసి, తమకు బెయిల్ మంజూరు చేయాలని తోట త్రిమూర్తులు కోర్టును అభ్యర్థించారు.

ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఐక్య వేదిక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కేఆర్ సూర్యనారాయణ

కర్నూలు (అగ్రికల్చర్): రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండగా కర్నూలులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ వివిధ ఉద్యోగ సంఘాల నేతలతో సమావేశం నిర్వహించడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. సోమవారం సాయంత్రం నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని దేవి ఫంక్షన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్య వేదిక సమావేశం నిర్వహించారు. కోడ్ అమలులో ఉన్న సమయంలో జిల్లా ఎన్నికల అధికారి నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉన్నా.. పట్టించుకోకుండా ఐక్య వేదిక సమావేశం నిర్వహించడం గమనార్హం. 'సాక్షి'లో సోమవారం ఎన్నికల వేళ నేడు ఉద్యోగుల సంఘం సమావేశం శీర్షికన వార్త ప్రచురితం కావడంతో ఈ సమావేశం విషయం ఎన్నికల యంత్రాంగం దృష్టికి వెళ్లింది. ఎంసీఎంసీ నోడల్ అధికారి, జెడ్పీ సీఈవో నాసరరెడ్డి అనుమతి లేకుండా సమావేశం నిర్వహిస్తున్న విషయాన్ని పాణ్యం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జేసీ నారపురెడ్డి మౌర్య దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గం ఎంసీఎంసీ టీమ్ ప్రతినిధులు ప్రసాద్‌గౌడు సమావేశం ప్రాంతంతో పాటు కేఆర్ సూర్యనారాయణ ప్రసంగాన్ని వీడియో తీశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా సమావేశం నిర్వహించడమే కాకుండా వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యోగులను తీవ్రస్థాయిలో రెచ్చగొట్టడం గమనార్హం. సమావేశంలో రాష్ట్ర కో–చైర్మన్ కరణం హరికృష్ణ, జనరల్ సెక్రటరీ బాబీ పఠాన్, రోడ్లు, భవనాల శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాపారావు, కర్నూలు, నంద్యాల జిల్లాల ఏపీజీఈఏ నేతలు బంగి శ్రీధర్, నాగేంద్రప్ప పాల్గొన్నారు.

ఫలితాల అనంతరం బాబుకు పవన్ విడాకులు

ఏపీ నెడ్‌క్యాప్ కార్పొరేషన్ చైర్మన్ వేల్పుల రవికుమార్



తాడేపల్లిరూరల్: ఈ ఎన్నికల్లో తెలుగుదేశం జనసేన బీజేపీ కూటమి ఘోర పరాజయం పాలవుతుందని, ఎన్నికల ఫలితాల అనంతరం చంద్రబాబుకు పవన్ కళ్యాణ్ విడాకులివ్వడం ఖాయమని ఏపీ నెడ్‌క్యాప్ కార్పొరేషన్ చైర్మన్ వేల్పుల రవికుమార్ అన్నారు. సోమవారం గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరం పవన్ బీజేపీలో విలీనం అవుతారన్నారు. సిద్ధాంతం, పునాది లేని అపవిత్ర కలయిక ఈ కూటమి దని వ్యాఖ్యానించారు. విజయవాడ పార్లమెంట్ సభ్యునిగా కేశినేని నాని అత్యధిక మెజార్టీతో గెలుపొంది హ్యాట్రిక్ సాధిస్తారని చెప్పారు. రాష్ట్రంలో ఓటమి భయంతో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ప్రజల్ని రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని విమర్శించారు.

నారెడ్కో సెంట్రల్ జోన్ అధ్యక్షుడిగా సందీప్

విజయవాడలో బాధ్యతల స్వీకరణ

సాక్షి, అమరావతి: జాతీయ స్థిరాస్తి అభివృద్ధి మండలి (నారెడ్కో) సెంట్రల్ జోన్ అధ్యక్షునిగా మాలక్ష్మి గ్రూపు సీఈవో సందీప్ మండవ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలో జరిగిన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో సందీప్‌తో పాటు 20 మందితో కూడిన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది. ఈ సందర్భంగా నారెడ్కో జాతీయ అధ్యక్షుడు జి.హరిబాబు మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ పరిశ్రమ, ప్రభుత్వానికి మధ్య వారధిగా వ్యవహరిస్తూ రియల్ ఎస్టేట్‌ను ప్రోత్సహించడమే ధ్యేయంగా ముందడుగు వేస్తున్నామన్నారు. నారెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు జి.చక్రధర్ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఆయా ప్రభుత్వాలతో మరింతగా సమన్వయం సాధించాల్సి వుందన్నారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ స్థిరాస్తి రంగం బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రియురాలి కోసం చోరీలు

- ప్రియుడి నుంచి 827 గ్రాముల బంగారు, 300 గ్రాముల వెండి స్వాధీనం
- దొంగ సొమ్ముతో రెండు కార్లలో షికార్లు
- రెండు తెలుగు రాష్ట్రాల్లో 110 చోరీ కేసులు
- ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: ప్రియురాలి కోసం ఓ ప్రియుడు ఇళ్లను కొల్లగొట్టి ఏకంగా 110 చోరీ కేసులతో రికార్డు సృష్టించాడు. చివరికి మూడు అపార్ట్‌మెంట్లలో చోరీ చేసి నంద్యాల జిల్లా పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. కొన్ని రోజులుగా కొల్లగొట్టిన బంగారు, వెండి ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి సోమవారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణకు చెందిన ఆవుల కిరణ్ కుమార్, కృష్ణా జిల్లా మైలవరం గ్రామ సమీపంలోని తండా ప్రాంతానికి చెందిన దుగ్గిరాల రాణిని ప్రేమించాడు. ఇద్దరు కలిసి ప్రస్తుతం హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌లోని ఓ ఇంట్లో సహజీవనం చేస్తున్నారు. కిరణ్‌కుమార్ చిన్నతనం నుంచి ఇళ్లలో చోరీలు చేయడంలో దిట్ట. ఈక్రమంలో ప్రియురాలితో విలాసంగా జీవించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల్లోని అపార్ట్‌మెంట్లలో చోరీలకు పాల్పడ్డాడు. ఈక్రమంలో నంద్యాల పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో ఉన్న తేజ అపార్ట్‌మెంట్, శ్రీకృష్ణా ప్యారడైజ్, సాయి అపార్ట్‌మెంట్‌లలో గడచిన రెండు నెలలుగా వరుసగా చోరీలకు పాల్పడ్డాడు. శ్రావణి అనే మహిళ ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వరుసగా చోరీలు జరగడాన్ని చాలెంజ్‌గా తీసుకున్న జిల్లా పోలీసులు ఎస్పీ ఆదేశాలతో కిరణ్‌కుమార్ కోసం గాలింపు మొదలుపెట్టారు. ఆటో నగర్ సమీపంలోని ఒక కారులో అనుమానాస్పదంగా యువతి, యువకుడు పోలీసులకు తారసపడ్డారు. వారిలో అపార్ట్‌మెంట్లలో చోరీకి పాల్పడిన వ్యక్తి పోలికలు కలిగి ఉండటంతో అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. విచారణలో భాగంగా 7 కేసుల్లో చోరీ చేసిన 827 గ్రాముల బంగారు, 300 గ్రాముల వెండి ఆభరణాలు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ, సీసీఎస్ సీఐ, హెడ్ కానిస్టేబుళ్లు, సిబ్బందిని ఎస్పీ, రఘువీర్‌రెడ్డి, డీఎస్పీ రాజేంద్రనాథ్ రెడ్డి, ఏఎస్పీ ప్రవీణ్ కుమార్ అభినందించారు.

విరిసిన తొలి కమలం

సూరత్‌లో ఏకగ్రీవంగా గెలిచిన బీజేపీ అభ్యర్థి ముకేశ్ దలాల్

ఇద్దరు కాంగ్రెస్ నేతల నామినేషన్ల తిరస్కరణ

మిగతా ఎనిమిది మంది నామినేషన్ల ఉపసంహరణ



గెలుపు సర్టిఫికెట్‌ను స్వీకరిస్తున్న ముకేశ్

సూరత్: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అప్పుడే గెలుపు ఖాతా తెరిచింది. సోమవారం జరిగిన అనూహ్య పరిణామాల అనంతరం సూరత్ ఎంపీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి ముకేశ్ దలాల్ ఒక్కరే పోటీలో నిలిచారు. దీంతో ఆయన ఏకగ్రీవంగా గెలిచినట్లు ఎన్నికల అధికారి సౌరభ్ పార్థీ ప్రకటించారు. ముకేశ్‌కు గెలుపు సర్టిఫికెట్‌ను అందజేశారు. ఆయన గెలుపును ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించిన నేపథ్యంలో సూరత్ స్థానానికి మే ఏడో తేదీన పోలింగ్ జరగదు. సూరత్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి నీలేశ్ కుంభనీ నామినేషన్ల పత్రాలు సక్రమంగా లేవంటూ రిటర్నింగ్ అధికారి ఆదివారం నీలేశ్ నామినేషన్‌ను తిరస్కరించారు. నీలేశ్ అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించిన నేతల సంతకాలు సరిపోలడం లేదని రిటర్నింగ్ అధికారి ప్రకటించడం తెల్సిందే. నీలేశ్‌కు ప్రత్యామ్నాయంగా సురేశ్ పద్సాలాతోనూ కాంగ్రెస్ పార్టీ నామినేషన్ వేయించింది. అయితే అది కూడా ఇతర కారణాలతో తిరస్కరణకు గురైంది. ఇక పోటీలో ఉన్న మిగతా నలుగురు స్వతంత్రులు, ముగ్గురు చిన్న పార్టీల అభ్యర్థులు, బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థి ప్యారేలాల్ భారతి సైతం తమ నామినేషన్ పత్రాలను విత్‌డ్రాకు చివరిరోజైన సోమవారం ఉపసంహరించుకున్నారు. దీంతో ముకేశ్ దలాల్ ఏకగ్రీవంగా గెలిచారు. ''ప్రధాని మోదీకి సూరత్ మొదటి కమలాన్ని అందజేసింది'' అని గుజరాత్ బీజేపీ అధ్యక్షుడు సీఆర్ పాటిల్ 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు. దీనిపై కాంగ్రెస్ స్పందించింది. ''సూరత్‌లో సూక్ష్మ,చిన్న,మధ్యతరహా పరిశ్రమలు, వ్యాపార వర్గాలు బీజేపీపై గుర్రుగా ఉన్నాయి. 1984 తర్వాత తొలిసారిగా సూరత్‌లో ఓడిపోతామన్న భయంతో ఇలా మ్యాచ్‌ఫిక్సింగ్ చేశారు'' అని కాంగ్రెస్ ఆరోపించింది.

ఏడు దశాబ్దాల్లో 35 ఏకగ్రీవాలు

రాజ్యసభకు సభ్యులు నామినేట్ అవడం చూస్తుంటాం. లోక్‌సభలో ఏకగ్రీవం అనేది అరుదైన విషయం. కోట్లు కుమ్మరించి వ్యూహప్రతివ్యూహాలు పన్ని గెలుపు గుర్రాన్ని ఎక్కాలి. అయితే ప్రత్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురికావడం, మిగతా వాళ్ల నామినేషన్లు ఉపసంహరించుకున్న ఘటనల్లో ఏకైక అభ్యర్థి విజయపీఠాన్ని అధిరోహించిన సందర్భాలూ ఉన్నాయి. ముకేశ్ దలాల్ ఏకగ్రీవ ఎన్నికతో ఈ అంశం మరోసారి తెరమీదకొచ్చింది. దలాల్ కన్నా ముందు ఇలా లోక్‌సభకు 1951 నుంచి ఇప్పటిదాకా 35 మంది ఎన్నికయ్యారు. 2012లో సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ భార్య డింపుల్ ఉత్తరప్రదేశ్‌లోని కన్నౌజ్ ఎంపీ స్థానం నుంచి ఏకగ్రీవంగా గెలిచారు. ఆ తర్వాత ఈ 12 ఏళ్లలో ఏకగ్రీవంగా ఎన్నకవడం ఇదే తొలిసారి. 1951లో 10 మంది, 1957లో 11 మంది, 1962లో ముగ్గురు, 1967లో ఐదుగురు, 1971లో ఒక్కరు, 1977లో ఇద్దరు, 1984లో ఒక్కరు, 1989లో ఒక్కరు, 2012లో ఒక్కరు ఏకగ్రీవంగా లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఇలా ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రముఖుల్లో మాజీ ఉపప్రధాని, మాజీ ముఖ్యమంత్రి యశ్వంత్‌రావ్ బల్వంత్‌రావ్ చవాన్, జమ్మూకశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా, ఒడిశా మాజీ సీఎం హరేకృష్ణ మహతాబ్, మాజీ కేంద్ర మంత్రి తిరువెల్లూరు తట్టై కృష్ణమాచారి, నాగాలాండ్ మాజీ సీఎం ఎస్‌సీ జమీర్, పీఎం సయీద్ ఉన్నారు.

ఎలక్షన్ బీట్

'నకలు' నాయకులు

సార్వత్రిక ఎన్నికల వేళ సెలబ్రిటీలుగా మారిన సామాన్యులు

మనిషిని పోలిన మనుషులు ఏడుగురు ఉంటారని ఓ నానుడి. మనిషిని పోలిన మనిషిని చూస్తే ఆశ్చర్యమేస్తుంది. ఇక నచ్చిన రాజకీయ నాయకుడిని పోలికలతో ఉన్న మరో మనిషిని చూస్తే కార్యకర్తలు, పార్టీ శ్రేణుల్లో కనిపించే హుషారు అంతా ఇంతా కాదు. మరో ప్రచారసభలో బిజీగా ఉండి రాలేకపోతున్న ముఖ్య నేతలు ఇంకో సభలో తమ నకలు మనిషిని రంగంలోకి దింపుతూ అక్కడి సభికుల్ని ఆశ్చర్యపరుస్తున్నారు. సభలు, సమావేశాల్లో సాధారణ ప్రజానీకాన్ని కలుస్తూ, వారితో సెల్ఫీలు దిగుతూ అసలు నేతకు జనాల్లో క్రేజ్‌ను మరింత పెంచేస్తున్నారు. దీంతో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఇలాంటి డూప్ నేతలకు డిమాండ్ భారీగా పెరిగింది. ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగి, బెంగాల్ సీఎం మమతా బెనర్జీల డూప్‌లను చూసి ఓటర్లు ఆశ్చర్యం, ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఫలితంగా.. సార్వత్రిక ఎన్నికల వేళ ఈ సామాన్యులు పాపులర్ అయి సెలబ్రిటీలుగా మారారు.


- సాక్షి, న్యూఢిల్లీ

మోదీ డూప్ | వికాస్ మహంతే..



63 ఏళ్ల మహంతే ముంబైలో వ్యాపారం చేస్తుంటారు. ఈయన అచ్చం ప్రధాని మోదీలా ఉంటారు. మహారాష్ట్రలో బీజేపీ–శివసేన మహాకూటమి తరఫున ప్రచారం చేసేందుకు ఒప్పుకున్నారు. రానున్న రెండు నెలలు ఆయన షెడ్యూల్ బిజీగా ఉంది. స్థానిక కూటమి అభ్యర్థికి మద్దతుగా సభలు, సమావేశాలు, ఇంటింటి ప్రచారంలో పాల్గొంటున్నారు. 2013లో మోదీలా గడ్డం పెంచడం ప్రారంభించాక స్నేహితులు, పరిచయస్తులు తరచూ మోదీ అని పిలవడం మొదలెట్టారు. దీంతో మహంతే.. మోదీని అనుకరించడం మొదలు పెట్టా రు. మోదీ ప్రధాని అవడం, జాతీయ రాజకీయాల్లో మోదీ హవా మొదలయ్యాక మహంతే కూడా సెలబ్రిటీ అయ్యారు. ఎన్నికల ప్రచారాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు, వివాహాల్లో స్పెషల్ గెస్ట్‌గా అలరిస్తున్నారు. టీవీ షోలు, వెబ్ సిరీస్‌లు, సినిమాల్లోనూ నటించారు. గుజరాతీ, మరాఠీ చిత్రాలతోపాటు, షారుఖ్ ఖాన్ నటించిన 'హ్యాపీ న్యూ ఇయర్', అక్షయ్ కుమార్ నటించిన 'మిషన్ మంగళ్' చిత్రాలలో మహంతే మెరిశారు.

బట్టతలే | భాగ్యరేఖ



బట్టతల వస్తే భాగ్యరేఖ మారుతుందని పెద్దలు అంటుంటారు. ఉత్తరాఖండ్‌లోని అల్మోడాలో జన్మించిన జగదీశ్ రావత్‌కు మాత్రం ఇది కాస్తంత నిజం అయిందనే చెప్పాలి. 2017లో బట్టతల రావడం మొదలయ్యాక ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను రావత్ అనుకరించడం మొదలెట్టారు. తెలిసినవారంతా ఈయనను 'యోగిజీ' అనే పిలుస్తారు. ఇప్పటికే చిన్నపాటి విందు, వినోదాల్లో సందడి చేసిన రావత్.. గత వారం నుంచి ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో బీజేపీ తరఫున ఎన్నికల ప్రచారంలో సందడి చేస్తున్నారు. ముఖ్యమంత్రి యోగి కుటుంబ సభ్యులు నివసించే ఉత్తరాఖండ్‌లోని పట్టణ వీధుల్లోనూ అందరితో కలియతిరుగుతూ లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని రక్తికట్టించారు. ఇప్పుడు రోడ్ షోలు, ప్రచార కార్యక్రమాలకు రావాలంటూ చాలా రాష్ట్రాల్లోని బీజేపీ నేతలు ఈయనకు ఆహ్వానాలు పలుకుతున్నారు. ''తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రచారం చేయాలని కొందరు జాతీయ నేతలు నన్ను సంప్రదించారు'' అని రావత్ గుర్తుచేసుకున్నారు.

రుమా చక్రవర్తి | మరో మమత



పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి మారురూపం రూమా చక్రవర్తి. కోల్‌కతాకు 70 కిలోమీటర్ల దూరంలోని కోలాఘాట్ నివాసి. ఈమె వృత్తిరీత్యా రంగస్థల నటి, నృత్యకారిణి. జాత్రా ఏక్ చిత్రంలో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ పాత్రను పోషించి శెభాష్ అనిపించుకున్నారు. తెల్లటి చీర, సాధారణ రబ్బరు చెప్పులు ధరించి ఆ పాత్రలో దీదీని మరిపించారు. ''బంగ్లా'ర్ ఖమతా, ఎబర్ మమతా (బెంగాల్ బలం, ఈసారి మమత)' నాటకం సూపర్ డూపర్ హిట్ అయింది. 2019లో వచ్చిన 'బాఘిని: ది బెంగాల్ టైగ్రెస్'లోనూ రూమా నటించారు. బెంగాల్‌లోని పలు నియోజకవర్గాల్లో ఈ రీల్ దీదీ తెగ సందడి చేస్తున్నారు.

ఆస్తులు దోచుకోవడమే కాంగ్రెస్ లక్ష్యం

అందుకే పదేపదే ఆస్తుల పునఃపంపిణీ అంటోంది

- కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే సర్వం లూటీ చేస్తారు
- మన తల్లులు, అక్కచెల్లెమ్మల మంగళసూత్రాలను, బంగారాన్ని కొల్లగొడతారు
- ఉద్యోగుల ఆస్తులను సర్వే చేస్తారు.. ఆపై మింగేస్తారు
- జనం ఆస్తులను కాజేయడం కమ్యూనిస్టులు, మావోయిస్టుల ఆలోచనా ధోరణి
- విపక్ష 'ఇండియా' కూటమి అసలు ఉద్దేశాలపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నా..

అలీగఢ్ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ



అలీగఢ్: అధికారంలోకి వస్తే సంపద పునఃపంపిణీ చేస్తామని కాంగ్రెస్ చెబుతోందని, వాస్తవానికి ప్రజల ఆస్తులను, మన తల్లులు, అక్కచెల్లెమ్మల మంగళసూత్రాలను, బంగారాన్ని దోచుకోవడమే ఆ పార్టీ అసలు లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపడ్డారు. కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే మన ఆస్తులు లూటీ కావడం ఖాయం అంటూ ప్రజలను అప్రమత్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే మొత్తం దేశ సంపదను, ప్రజల ఆస్తులను ముస్లింలకు కట్టబెడతారంటూ ఆదివారం రాజస్తాన్‌లో ఎన్నికల ప్రచారంలో మోదీ చేసిన వ్యాఖ్యలపై వివాదం చెలరేగుతుండగానే మరో సంచలనానికి ఆయన తెరతీశారు. సోమవారం ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌లో ఎన్నికల ప్రచార సభలో మోదీ ప్రసంగించారు. ముస్లిం మైనార్టీలు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో ముస్లింల పేరు ఎత్తకుండా కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్‌తోపాటు విపక్ష 'ఇండియా' కూటమి అసలు ఉద్దేశాలపై తన బాధ్యతగా ప్రజలను అప్రమత్తం చేస్తున్నానని చెప్పారు. ఆయన ఏమన్నారంటే...

రెండు ఇళ్లు ఉంటే.. ఒకటి లాగేసుకుంటారు

''కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. దేశంలో ఎవరు ఎంత సంపాదిస్తున్నారో, వారికి ఎన్ని ఆస్తులు ఉన్నాయో విచారణ జరిపిస్తామని ఆ పార్టీ యువరాజు చెబుతున్నారు. అంతేకాకుండా ఆ ఆస్తులను స్వాధీనం చేసుకొని పునఃపంపిణీ చేస్తామని అంటున్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో కూడా ఇదే విషయం చేర్చారు. ఒక్కసారి ఆలోచించండి. మన తల్లులు, అక్కచెల్లెమ్మల వద్ద ఎంతోకొంత బంగారం ఉంది. అది వారి స్త్రీధనం. ఆ బంగారాన్ని వారు పవిత్రంగా భావిస్తారు. అపురూపంగా దాచుకుంటారు. స్త్రీధనానికి రక్షణ కల్పిస్తూ ఒక చట్టం కూడా అమల్లో ఉంది. మన తల్లుల, అక్కచెల్లెమ్మల బంగారంపై ఇప్పుడు కాంగ్రెస్ నాయకుల కన్ను పడింది. అందుకే చట్టంలో మార్పు చేసి, ఆ బంగారాన్ని స్వాధీనం చేసుకుంటామని స్పష్టంగా చెబుతున్నారు. ఆడపడుచులు పరమ పవిత్రంగా భావించే మంగళసూత్రాలను దోచుకోవాలని చూస్తున్నారు. కేవలం మంగళసూత్రాలే కాదు, మహిళల వద్ద ఉన్న మొత్తం బంగారాన్ని కొల్లగొడతారట! వేతన జీవులపైనా కాంగ్రెస్ నేతలు కన్నేశారు. అధికారంలోకి వచ్చాక ఉద్యోగుల ఆస్తులపై సర్వే చేస్తామంటున్నారు. ఒకవేళ మీకు రెండు ఇళ్లు ఉన్నాయనుకోండి, అందులో ఒకటి లాగేసుకుంటారు. కాంగ్రెస్ ఏమైనా చేయగలదు. ప్రజలంతా ఈ విషయం గుర్తుపెట్టుకోవాలి. ప్రజల ఆస్తులను దోచుకోవడం అనేది ముమ్మాటికీ మావోయిస్టుల ఆలోచనా ధోరణే. కమ్యూనిస్టుల వైఖరి సైతం ఇలాగే ఉంటుంది. కమ్యూనిస్టులు, మావోయిస్టులు జనం ఆస్తులను మింగేసి ఎన్నో దేశాలను సర్వనాశనం చేశారు. ఇప్పుడు సరిగ్గా అదే విధానాన్ని మన దేశంలోనూ అమలు చేయాలని విపక్ష కాంగ్రెస్‌తోపాటు 'ఇండియా' కూటమి పార్టీలు నిర్ణయానికొచ్చాయి'' అని ప్రధాని మోదీ నిప్పులు చెరిగారు.

దోచుకోవడం జన్మహక్కుగా భావిస్తున్నారు

కుటుంబ పార్టీల నేతలు, వారసత్వ రాజకీయ నాయకులు దేశ ప్రజలను విచ్చలవిడిగా లూటీ చేసి, సంపద సామ్రాజ్యాలు నిర్మించుకున్నాయని మోదీ దుయ్యబట్టారు. వారి ఆస్తుల నుంచి పేదలకు చిల్లిగవ్వ కూడా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ప్రజలను దోచుకోవడం జన్మహక్కుగా కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నారని మండిపడ్డారు. వారసత్వ రాజకీయాలకు చరమగీతం పాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అవినీతి, బుజ్జగింపు రాజకీయాలను అంతం చేయాలని చెప్పారు. గతంలో మన దేశ సరిహద్దుల్లో మన జవాన్లు నిత్యం ప్రాణాలు కోల్పోతూ ఉండేవారని, మన నగరాలు, పుణ్యక్షేత్రాలు బాంబుల మోతలతో దద్దరిల్లుతూ ఉండేవని గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారిపోయిందన్నారు. జవాన్ల మరణాలు, బాంబుల మోతలు ఇప్పుడు లేవన్నారు.

ముస్లిం మహిళలకు రక్షణ కల్పించాం..

ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్నాయని ప్రధానమంత్రి ధ్వజమెత్తారు. నిజానికి ముస్లింల ఆర్థిక, సామాజిక ప్రగతి కోసం ఆ పార్టీలు చేసిందేమీ లేదని విమర్శించారు. ట్రిపుల్ తలాఖ్ విధానం వల్ల ఎంతో మంది ముస్లిం ఆడబిడ్డలు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి జీవితాలు అస్తవ్యస్తమయ్యాయని అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ట్రిపుల్ తలాఖ్‌కు వ్యతిరేకంగా చట్టం తీసుకొచ్చామని, ముస్లిం ఆడపడుచుల భవిష్యత్తుకు రక్షణ కల్పించామని వివరించారు.

మోదీ వ్యాఖ్యలపై దుమారం

రాజస్తాన్‌లోని బన్స్వారా జిల్లాలో ప్రధాని మోదీ ఆదివారం చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే ప్రజల ఆస్తులను, వారు కష్టపడి సంపాదించుకున్న డబ్బులను లాక్కొని.. చొరబాటుదారులకు, అధిక సంతానం ఉన్న వారికి కట్టబెడతారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్‌తోపాటు ఇతర పార్టీల నాయకులు తప్పుపడుతున్నారు. 2006లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ చేసిన ప్రకటనను మోదీ ప్రస్తావించారు. దేశంలోని వనరులపై, సంపదపై ముస్లింలకే మొదటి హక్కు ఉందంటూ మన్మోహన్ సింగ్ చెప్పారని మోదీ తెలిపారు. అయితే, మన్మోహన్ సింగ్ అలా చెప్పినట్లు నిరూపించాలని మోదీకి కాంగ్రెస్ నేతలు సవాలు విసురుతున్నారు.

తక్షణమే చర్యలు తీసుకోండి

ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని, సుప్రీంకోర్టు తీర్పులను మోదీ ఉల్లంఘించారు ● ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజల్లో విభజన తీసుకొచ్చేలా విద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని, ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారని, ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ప్రధానిపై చర్యలు తీసుకోవాలంటూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. సీనియర్ నేత అభిషేక్ మనూ సింఘ్వీ నేతృత్వంలో కాంగ్రెస్ నాయకుల బృందం సోమవారం ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్, ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధూను కలిసింది. రాజస్తాన్‌లో ఆదివారం ఎన్నికల ప్రచారంలో మోదీ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను వారి దృష్టికి తీసుకొచ్చింది.

స్పందించేందుకు ఈసీ నిరాకరణ

కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై స్పందించేందుకు ఎన్నికల సంఘం సోమవారం నిరాకరించింది.

మోదీ కొత్త ఎత్తుగడలు

''దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం తారస్థాయికి చేరాయి. అయినా అంతా బాగుందంటూ ప్రధాని నరేంద్ర మోదీ నమ్మబలుకుతున్నారు. సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి కొత్తకొత్త ఎత్తుగడలు వేస్తున్నారు''.

- 'ఎక్స్'లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

విషపూరిత భాష

''ప్రధాని మోదీ విషపూరితమైన భాష వాడుతున్నారు. 2021లో జరగాల్సిన జనగణన ఇంకా జరగలేదు. ఆ ఊసే వినిపించడం లేదు.''

- జైరామ్ రమేశ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి

మోదీ వ్యాఖ్యలు సిగ్గుచేటు

''హిందువులు, ముస్లింల మధ్య.. దళితులు, ఇతర కులాల మధ్య ప్రధాని మోదీ విద్వేషాలు సృష్టిస్తున్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ముస్లిం లీగ్ విధానాల తరహాలో ఉందని మోదీ చెబుతున్నారు. మా మేనిఫెస్టోపై మోదీతో చర్చకు నేను సిద్ధంగా ఉన్నాను. యువతకు ఉద్యోగాలు ఇస్తామని చెబుతున్నాం. ఇది ముస్లిం లీగ్ విధానమా? నారీ న్యాయం, పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత ముస్లిం లీగ్ విధానాలా? కాంగ్రెస్ గెలిస్తే ప్రజల ఆస్తులను ముస్లింలకు ఇచ్చేస్తారని మోదీ చెప్పడం సిగ్గుచేటు''.

ఖర్గే, ఏఐసీసీ అధ్యక్షుడు

సుమోటోగా స్వీకరించాలి

''నరేంద్ర మోదీ చాలా దారుణంగా మాట్లాడారు. సమాజంలో ప్రజల మధ్య చిచ్చుపెట్టి విద్వేషాలు రగిల్చేలా వ్యాఖ్యలు చేశారు. మోదీ ప్రసంగాన్ని సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టాలి''

- సీతారాం ఏచూరి, సీపీఎం

మోదీకి 6గురు తోబుట్టువులు లేరా?

నాకు ఆరుగురు పిల్లలు ఉన్నారని అవహేళన చేయొచ్చు. మరి మోదీ మాటేమిటి? ఆయనకు ఆరుగురు తోబుట్టువులు ఉన్నారు. బీజేపీ నేతలు అమిత్ షా, రవిశంకర్ ప్రసాద్‌కు పెద్ద కుటుంబాలు ఉన్నాయి. ముస్లింలను చొరబాటుదారులు అనడం వారిని కించపర్చడమే అవుతుంది''

- అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం అధ్యక్షుడు

ముస్లింలు చొరబాటుదారులా?

''ప్రధాని మోదీ దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారు. దేశ చరిత్రలో ఎవరూ ఈ స్థాయికి దిగజారలేదు. ఆయనపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి. మైనార్టీలు మనదేశంలో ఎన్నో దశాబ్దాలుగా ఉంటున్నారు. వారిని చొరబాటుదారులు అనడం ఏమిటి? 1950 నుంచి ఏ ప్రధానమంత్రి కూడా ఇలా మాట్లాడలేదు. ఆ పదవిలో ఉన్న వ్యక్తి అనుచితంగా మాట్లాడడం నాకు నచ్చలేదు. కాంగ్రెస్ వస్తే దేశ సంపదను ముస్లింలకు అప్పగిస్తారంటూ మోదీ చేసిన ప్రకటనపై ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ ఎందుకు మౌనంగా ఉంటున్నారో చెప్పాలి''

- కపిల్ సిబల్, కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు

మతపరమైన భావోద్వేగాలు రెచ్చగొడుతున్నారు

ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయంతోనే ప్రధాని మోదీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్నారు. పరిపాలనలో మోదీ ఘోరంగా విఫలమయ్యారు. ప్రజలు ఆయన పట్ల ఆగ్రహంతో ఉన్నారు. అందుకే మోదీ మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొడుతున్నారు''. **- ఎం.కె.స్టాలిన్, తమిళనాడు సీఎం**

జాతి వ్యతిరేక వ్యాఖ్యలు చేశారు

''ముస్లింలకు వ్యతిరేకంగా నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ జాతి వ్యతిరేక వ్యాఖ్యలే. ముస్లిం సమాజాన్ని కించపర్చారు. దేశ ప్రజల్లో ముస్లింల పట్ల వ్యతిరేకత పెంచాలన్నదే మోదీ కుట్ర. దేశంలో ఓ వర్గాన్ని అవమానిస్తూ మాట్లాడడం దారుణం. దేశంలో అంతర్భాగమైన పౌరులను చొరబాటుదారులు అనడం ఎక్కడైనా ఉందా?''

- పినరయి విజయన్, కేరళ సీఎం

24,640 నియామకాలు రద్దు

నియామక నోటిఫికేషన్‌ను కొట్టేసిన కలకత్తా హైకోర్టు

కోల్‌కతా: సార్వత్రిక ఎన్నికల సమరం వేళ పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ సర్కార్‌కు కలకత్తా హైకోర్టులో సోమవారం గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రభుత్వ ప్రాయోజిత, ఎయిడెడ్ పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలకు టీఎంసీ సర్కార్ ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దుచేస్తూ కలకత్తా హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు ఇచ్చింది. రాష్ట్రంలో నిర్వహించిన స్టేట్ లెవల్ సెలక్షన్ టెస్ట్(ఎస్ఎల్ఎస్‌టీ)–2016 రిక్రూట్‌మెంట్ పరీక్ష ద్వారా చేపట్టిన 24,640 నియమకాలన్నీ రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. నియామకాల్లో అవకతవలకు దర్యాప్తు జరిపి 3నెలల్లోగా నివేదిక ఇవ్వాలని సీబీఐను ఆదేశించింది. ఈ పోస్టుల భర్తీ కోసం కొత్తగా నియామక ప్రక్రియను చేపట్టాలని పశ్చిమబెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్‌కు ఆదేశాలిచ్చింది. తప్పుడు మార్గంలో ఉద్యోగాలు పొందిన వారంతా ఈ ఎనిమిదేళ్లలో పొందిన జీతభత్యాలను ఏడాదికి 12 శాతం వడ్డీతోసహా కలిపి నాలుగువారాల్లోపు తిరిగి చెల్లించాలని కోర్టు ఆదేశించింది. ఈ ఉపాధ్యాయ కుంభకోణం కేసులో నాటి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పార్థ ఛటర్జీ తదితరులను దర్యాప్తు సంస్థ అరెస్ట్‌చేసింది.

తీర్పును సవాల్ చేస్తామన్న మమతా బెనర్జీ

హైకోర్టు తీర్పును రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ తప్పుబట్టారు. ''తీర్పు చట్టవ్యతిరేకం. ఈ తీర్పును పై కోర్టులో సవాల్‌చేస్తాం. ఉద్యోగాలు కోల్పోతున్న వారికి అండగా ఉంటా. ఎనిమిదేళ్ల జీతాలను నెలరోజుల్లోగా ఎలా చెల్లించగలరు?'' అని మమత ఆగ్రహం వ్యక్తంచేశారు. తీర్పు ద్వారా కుంభకోణాన్ని కోర్టు బయటపెట్టిన నేపథ్యంలో నైతిక బాధ్యతగా మమత సీఎం పదవికి రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్‌చేసింది.

ముయిజ్జుకు పూర్తి మెజారిటీ

మాలె: మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు సారథ్యంలోని అధికార కూటమి పార్లమెంట్‌లో మెజారిటీ సాధించింది. మొత్తం 93 సీట్లకు ఆదివారం జరిగిన పోలింగ్‌లో కూటమి 71 సీట్లు గెలుచుకుంది. ముయిజ్జు అమలు చేస్తున్న చైనా అనుకూల విధానాలకు ప్రజలిచ్చిన సానుకూల తీర్పే ఈ ఫలితాలను అధికారపక్షం అంటోంది. ముయిజ్జుకు చెందిన పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్(పీఎన్‌సీ)కు 68 సీట్లు రాగా, మిత్రపక్షాలు 3 సీట్లు గెలుచుకున్నాయి.

రెబల్ నేత ఈశ్వరప్పపై బీజేపీ బహిష్కరణ వేటు

బెంగళూరు: పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించడంతోపాటు లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన రెబల్ నేత కేఎస్ ఈశ్వరప్ప(75)ను బీజేపీ ఆరేళ్లపాటు బహిష్కరించింది. గతంలో ఆయన రాష్ట్ర డిప్యూటీ సీఎంగాను, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో హావేరి నుంచి పోటీకి తనకు అవకాశం దక్కలేదనే కోపంతో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర, యడియూరప్పపై విమర్శలు చేసిన సంగతి తెలిసిందే.

అత్యాచార బాధిత బాలిక.. 30 వారాల గర్భ విచ్ఛిత్తికి అనుమతి

ప్రత్యేక పరిస్థితుల్లో ప్రత్యేక అధికారాన్ని వాడుతున్నట్లు సుప్రీం వెల్లడి

న్యూఢిల్లీ: అత్యాచారానికి గురై గర్భం దాల్చిన 14 ఏళ్ల బాలిక 30 వారాల గర్భ విచ్ఛిత్తికి సుప్రీంకోర్టు అసాధారణ అనుమతి మంజూరు చేసింది. మైనర్ సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ, ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, ఏప్రిల్ 4న బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును పక్కన పెడుతున్నట్లు వివరించింది. మహారాష్ట్రకు చెందిన బాలిక అత్యాచారానికి గురై గర్భం దాల్చింది. విషయం ఆలస్యంగా తెలుసుకున్న ఆమె తల్లి ఈ నెలారంభంలో బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ దశలో గర్భ విచ్ఛిత్తితో బాలిక ప్రాణాలకు ప్రమాదం ఉందంటూ కోర్టు ఆమె వినతిని తిరస్కరించింది. ఈ నిర్ణయంపై బాధిత బాలిక తల్లి సుప్రీంకోర్టు తలుపు తట్టారు. గత వారం విచారణ జరిపిన న్యాయస్థానం బాలిక ఆరోగ్య పరిస్థితిపై నివేదిక ఇవ్వాలంటూ ముంబైలోని లోక్‌మాన్య తిలక్ మున్సిపల్ మెడికల్ కాలేజ్, ప్రభుత్వ ఆస్పత్రి(ఎల్టీఎంజీహెచ్) డీన్‌ను ఆదేశించింది. కేవలం 14 ఏళ్ల వయస్కురాలైన బాధితురాలి ఇష్టానికి విరుద్ధంగా గర్భాన్ని కొనసాగిస్తే ఆమె శారీరక మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందంటూ నివేదిక పేర్కొంది. ఈ దశలో గర్భ విచ్ఛిత్తి చేస్తే బాధితురాలి జీవితానికి వాటిల్లే ముప్పు, ప్రసవించే సమయంలో కలిగే ప్రమాదం కంటే ఎక్కువేమీ ఉండదని కూడా అభిప్రాయపడింది. పరిగణనలోకి తీసుకున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలాల ధర్మాసనం సోమవారం మధ్యంతర తీర్పు వెలువరించింది. బాలిక కడుపులో పెరుగుతున్న పిండాన్ని తొలగించేందుకు తక్షణమే వైద్యుల బృందాన్ని ఏర్పాటు చేయాలని ఎల్టీఎంజీహెచ్ డీన్‌ను ఆదేశించింది. ఇందుకయ్యే ఖర్చును మహారాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని స్పష్టం చేసింది.

మణిపూర్‌లో రీపోలింగ్.. 81.6% ఓటింగ్

ఇంఫాల్: మణిపూర్ (ఇన్నర్)లోక్‌సభ నియోజకవర్గంలోని 11 పోలింగ్ స్టేషన్ల పరిధిలో సోమవారం జరిగిన రీపోలింగ్‌లో 81.6% ఓటింగ్ నమోదైంది. ఇక్కడ శుక్రవారం జరిగిన పోలింగ్ సందర్భంగా కాల్పుల ఘటనలు, ఈవీఎం ధ్వంసం వంటి ఘటనలు చోటుచేసుకోవడంతో ఎన్నికల సంఘం మళ్లీ పోలింగ్ నిర్వహించింది. ఈనెల 19వ తేదీన అరుణాచల్ ప్రదేశ్‌లోని లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఈవీఎంల ధ్వంసం, హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న 8 పోలింగ్ స్టేషన్ల పరిధిలో రీపోలింగ్ త్వరలోనే నిర్వహించనున్నట్లు అధికారులు చెప్పారు.

అలీగఢ్ ముస్లిం వర్శిటీ వీసీగా మహిళ

న్యూఢిల్లీ: అలీగఢ్ ముస్లిం యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్‌గా నైమా ఖాటూన్ సోమవారం నియమితులయ్యారు. ఐదేళ్ల పాటు ఆమె ఈ పదవిలో కొనసాగుతారు. వందేళ్లలో వర్శిటీ చరిత్రలో అత్యున్నత పదవిని చేపట్టిన తొలి మహిళగా నైమా చరిత్ర సృష్టించారు. ఆమె నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు.

ఇన్సులిన్ కోసం అడుగుతూనే ఉన్నా


జైలు సూపరింటెండెంట్‌కు కేజ్రీవాల్ లేఖ

న్యూఢిల్లీ: కేజ్రీవాల్‌కు ఇన్సులిన్ అక్కర్లేదని, డయాబెటిక్‌తో పెద్ద ఇబ్బంది లేదని ఎయిమ్స్ వైద్యులు ఆయనకు సూచించారని తిహార్ జైలు యంత్రాంగం విడుదల చేసిన ఒక ప్రకటనపై కేజ్రీవాల్ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆ ప్రకటన పూర్తిగా అబద్ధాలతో నిండిపోయిందని ఆరోపించారు. తన నిరసన తెలియజేస్తూ ఈ మేరకు జైలు సూపరింటెండెంట్‌కు కేజ్రీవాల్ లేఖ రాశారు. లేఖను ఢిల్లీ రాష్ట్ర మహిళా మంత్రి అతిశి 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు. 'జైలు యంత్రాంగం చెబుతున్నదంతా అబద్ధం. రోజూ 250–320 స్థాయిలో షుగర్ లెవల్స్ ఉంటున్నాయి. ప్రతి రోజు పరగడుపున 160–200 స్థాయిలో చక్కెరస్థాయిలు ఉంటున్న విషయాన్ని ప్రస్తావించా. గత పది రోజులుగా ఇన్సులిన్ కావాలని రోజు అడుగుతున్నా. అలాంటప్పుడు ఇన్సులిన్ అడగలేదు అని ఎలా అంటారు?' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ''20వ తేదీన ఎయిమ్స్ వైద్యులు వీడియోకాల్‌లో మాట్లాడారు. షుగర్ లెవల్స్‌తో భయపడాల్సిన పనిలేదని వైద్యులు నాతో చెప్పారని జైలు యంత్రాంగం చెబుతోంది. ఇది అబద్ధం. అలాంటి భరోసా వైద్యులు నాకు ఇవ్వలేదు. మీ మెడికల్ రికార్డులు అన్నీ క్షుణ్ణంగా పరిశీలించాకే ఏదైనా సలహా ఇవ్వగలం అని మాత్రమే వైద్యులు నాతో చెప్పారు' అని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. జైలు యంత్రాంగం లేఖపై కేజ్రీవాల్ ప్రతిస్పందన నేపథ్యంలో ఆయనకు ఇన్సులిన్ అవసరమా లేదా అనేది తేల్చేందుకు మెడికల్ బోర్డ్‌ను ఏర్పాటుచేయాలని సీబీఐ, ఈడీ స్పెషల్ జడ్జి కావేరీ బవేజీ ఢిల్లీ ఎయిమ్స్‌ను ఆదేశించారు.



సర్వ రోగాలకు చికిత్స యోగా

గాంధీనగర్: విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో వేసవి ప్రత్యేక యోగా తరగతులను సోమవారం కలెక్టర్ ఢిల్లీరావు ప్రారంభించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 506.80 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,598, ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



	కనిష్టం	గరిష్టం
నందిగామ	26.8	41.8
జగ్గయ్యపేట	26	43
మచిలీపట్నం	28	36
గుడివాడ	27	41

న్యూస్‌రీల్

నంది వాహనంపై దుర్గా మల్లేశ్వరస్వామి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): చైత్రమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆది దంపతులకు సోమవారం నంది వాహనంపై నగరోత్సవ సేవ నిర్వహించారు. నాలుగోరోజు ఆలయం వద్ద పలు వైదిక కార్యక్రమాలను అర్చకులు చేశారు. సాయంత్రం మహా మండపం వద్ద నంది వాహనంపై కొలువు తీరిన దుర్గామల్లేశ్వరస్వామి వార్లకు ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి, ఇతర అర్చకులు పూజలు నిర్వహించగా ఆలయ ఈవో కేఎస్ రామరావు కొబ్బరికాయ కొట్టి ఊరేగింపు ప్రారంభించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్త జనుల కోలాట నృత్యాల మధ్య ఊరేగింపు కనకదుర్గనగర్, రథం సెంటర్, బ్రాహ్మణ వీధి, శ్రీనివాస మహల్, కోమలవిలాస్, సామారంగం చౌక్, మెయిన్‌రోడ్డు, ఐరన్ సెంటర్, రథం మీదగా తిరిగి మహా మండపానికి చేరింది. దేవస్థానానికి చెందిన పలువురు అధికారులు, సిబ్బంది కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీలో నేతలకు చోటు

విజయవాడస్పోర్ట్స్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీల్లో రాష్ట్ర ఎస్సీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శులుగా మేదర సురేష్‌కుమార్, దాసి జయప్రకాష్‌కెనడి, మేడా శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శులుగా బోను దుర్గానరేష్, బెజవాడ గణేష్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎస్. ప్రవీణ్ సజ్జన్‌ప్రసాద్‌ను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

ఎన్నికల విధులకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ కళాశాలల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మే 13న నిర్వహించే సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొంటారని ఎన్టీఆర్ జిల్లా మీడియా కో ఆర్డినేటర్ డాక్టర్ వెలగా జోషి అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎన్నికల విధులకు హాజరుకావాలని కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఎన్ఎస్ఎస్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎలక్షన్ డ్యూటీలకు హాజరవుతారని చెప్పారు. సీఐలు కాశీ విశ్వనాథ్, సహేరా బేగం, జిల్లా యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు పాల్గొని మాట్లాడారు.

డబ్బు అహంకారంతో ఓటర్లను వెధవలంటారా?

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి

జి.కొండూరు: డబ్బు అహంకారంతో టీడీపీకి ఓటు వేయని ఓటర్లను వెధవలంటూ ఎన్ఆర్ఐ టీడీపీ సీనియర్ నాయకుడు కోమటి జయరామ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, మైలవరం నియోజకవర్గ పరిశీలకుడు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఎన్ఆర్ఐ టీడీపీ మీట్‌లో మైలవరం మండల పరిధి వెల్వడంకు చెందిన కోమటి జయరామ్ ఓటర్లను కించపరుస్తూ మాట్లాడిన అనుచిత వ్యాఖ్యలను ఆయన ఖండించారు. కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీకి ఓటు వేయని వెధవలకు డబ్బు ఇచ్చి లొంగదీసుకోవాలని జయరామ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ పార్టీలను రెచ్చగొట్టేలా ఉన్నాయన్నారు. అంతే కాకుండా ఒక్కొక్క ఎన్ఆర్ఐ సభ్యుడు కొన్ని లక్షల వరకు ఖర్చు పెట్టి అయినా ప్రతి నియోజకవర్గంలో వేయి ఓట్లు టీడీపీకి వేయించాలని పిలుపునివ్వడం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిపారు. జయరామ్ పై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఎవరెన్ని కుట్రలు చేసినా, ఎంతమంది కలిసి గుంపులుగా వచ్చినా, ఎన్ని కోట్ల డబ్బుతో వచ్చినా ప్రజలంతా వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారన్నారు. మైలవరం నియోజకవర్గంతో పాటు రాష్ట్ర మంతా మరోసారి వైఎస్సార్ సీపీ జెండానే ఎగురుతుందన్నారు.

అదరగొట్టారు!

పది ఫలితాల్లో సత్తా చాటిన ఎన్టీఆర్ జిల్లా విద్యార్థులు

- గత ఏడాది కంటే పెరిగిన ఉత్తీర్ణత శాతం
- జిల్లాలో ఈ ఏడాది 88.76 శాతం ఫలితాలు సాధన
- గత ఏడాది 73.07 శాతం ఫలితాలు
- మే 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు
- రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు నేటి నుంచి దరఖాస్తులు



భవానీశంకర్‌తో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సూర్యప్రభ, ఇతర ఉపాధ్యాయులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమం): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన విద్యార్థులు 88.76 శాతం ఫలితాలు సాధించి విజయ పతాకాన్ని ఎగురువేశారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి తమ సత్తా చాటుకున్నారు. ఈ ఏడాది జిల్లా నుంచి 27899 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 14401 మంది బాలురు, 13,498 మంది బాలికలు ఉన్నారు. 24,763 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అందులో బాలురు 12420 మంది బాలురు, 12,343 మంది బాలికలు ఉన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 20 మండలాలు ఉండగా అందులో వత్సవాయి మండలం 96.95 శాతం ఉత్తీర్ణతతో ప్రథమ స్థానంలో నిలిచింది. 525 మంది పరీక్షలకు హాజరుకాగా 509 మంది ఉత్తీర్ణతను సాధించారు. జికొండూరు మండలం 80.23 శాతం ఫలితాలతో చివరి స్థానంలో నిలిచింది. ఈ మండలంలో 602 మంది పరీక్షకు హాజరుకాగా అందులో 483 మంది ఉత్తీర్ణతను సాధించారు.



జి.సువర్షిత (594 మార్కులు)



హెచ్ఎంకు కేక్ తినిపిస్తున్న తిరువూరు జెడ్పీ విద్యార్థినులు

ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు అత్యధిక మార్కులు...

విజయవాడ నగరం పటమటలోని జీడీఈటీఎంసీ హైస్కూల్‌కు చెందిన జి.సువర్షిత, దుర్గాపురంలోని ఎస్‌టీవీఆర్ఎంపీఎల్ కార్పొరేషన్ హైస్కూల్‌కు చెందిన డి.భవానీ శంకర్‌లు 594 మార్కులు సాధించారు. బాలురు 86.24 శాతం ఉత్తీర్ణతను సాధించగా, బాలికలు 91.44 శాతం సాధించి తమ సత్తా చాటారు. జిల్లాలో ఉత్తీర్ణత శాతం పెరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ ఏడాది పరీక్ష ఫలితాలను పరిశీలిస్తే 88.76 శాతం ఉండగా గత ఏడాది 73.07 శాతం మంది ఉత్తీర్ణతను సాధించారు. జిల్లాలో 108 విద్యాసంస్థలు నూరు శాతం ఫలితాలను సాధించాయి. అందులో ప్రభుత్వ విద్యాసంస్థలు 17 కాగా ప్రైవేట్ విద్యాసంస్థలు 91 ఉన్నాయి. ప్రభుత్వ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు 12243 మంది పరీక్షకు హాజరుకాగా అందులో 9851 మంది ఉత్తీర్ణతను సాధించి 80.46 శాతంగా నిలిచారు. బీసీ వెల్ఫేర్ విద్యా సంస్థల్లో వంద శాతం, మోడల్ స్కూల్స్‌లో 99.33 శాతం, ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఎస్ విద్యాసంస్థల్లో 95.07 శాతం, మున్సిపల్ విద్యాసంస్థలు 80.92 శాతం, జెడ్పీలో 78.26 శాతం, ఉత్తీర్ణతను సాధించాయి.

మే 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు....

పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ మూడో తేదీ వరకూ నిర్వహించనున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకూ ఫీజు చెల్లించవచ్చు.

సంక్షేమ పాఠశాలల విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉత్తీర్ణత సాధించిన పదో తరగతి విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. జిల్లాలో ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు 84.56 శాతం ఫలితాలను సాధించటం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఆయా ట్రైబల్ వెల్ఫేర్ విద్యాసంస్థల నుంచి 259 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా అందులో 219 మంది ఉత్తీర్ణతను సాధించారని పేర్కొన్నారు. ఏ కొండూరు, జగ్గయ్యపేట, విసన్నపేటలలోని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల విద్యార్థులు పరీక్షలకు హాజరై ఈ విజయాలను సాధించారన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరికీ కలెక్టర్ అభినందనలు తెలిపారు.

365 రోజులు అఖండ పారాయణం

లబ్బీపేట(విజయవాడతూర్పు): గుంటూరు జిల్లా పెనుమాకలోని శ్రీ వైష్ణవ మహా దివ్య క్షేత్రం ప్రాంగణంలో మంగళవారం నుంచి ఏడాది పాటు (365 రోజులు) అఖండ శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆ క్షేత్రం కార్యదర్శి దూపుగుంట్ల శ్రీనివాసరావు తెలిపారు. లోక కళ్యాణార్థం నిర్వహించే ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు. విజయవాడ ఎంజీరోడ్డులోని ఓ హోటల్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాజేటి వెంకట దుర్గాప్రసాద్, దూపుగుంట్ల శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ నెల 23 చైత్ర మాస పౌర్ణమి నుంచి 365 రోజుల పాటు తమ దివ్యక్షేత్ర ప్రాంగణంలో శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందన్నారు. మందిర నిర్వహణ కమిటీ చైర్మన్ తాడికొండ శ్రీనివాసరావు, ఘట్టా ధనప్రసాదరావు, ఉమామహేశ్వరగుప్తా, సూర్యప్రకాశరావు, మురళీరావు, భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూంలో ఎన్నికల ఫిర్యాదుల కేంద్రం ఏర్పాటు

పోలీస్ కమిషనర్ టీకే రాణా

విజయవాడస్పోర్ట్స్:సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విజయవాడ పోలీస్ కంట్రోల్ రూంలో రాష్ట్ర వ్యాప్త సెంట్రల్ ఎలక్షన్స్ కంప్లైంట్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ టీకే రాణా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసులు స్పందించదగిన ఫిర్యాదులను సేకరించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగినా, నగదు, మద్యం అక్రమ రవాణాలకు పాల్పడుతున్నట్లు గుర్తించినా, ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు ఉచిత వస్తువుల పంపిణీ, ఇతర నేరాలను గుర్తిస్తే.. వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1800–425–5049ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

వైభవంగా ఆది దంపతుల కల్యాణోత్సవం



కల్యాణోత్సవం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. చైత్రమాస బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ధర్మపథం వేదికపై ఆది దంపతుల కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈవో కెఎస్.రామరావు దంపతులు స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఏఈవో చంద్రశేఖర్, ఎస్. రమేష్‌బాబు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కోలాహలంగా నామినేషన్ల పర్వం

- ఎన్టీఆర్ జిల్లాలో నాలుగో రోజు 38 నామినేషన్ల దాఖలు
- విజయవాడ పార్లమెంటుకు ఆరుగురు నామినేషన్
- ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 32 మంది నామినేషన్లు
- విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్, సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాస్ నామినేషన్



నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వస్తున్న ఎంపీ కేశినేని నాని, వేదికపై పశ్చిమం, తిరువూరు, మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థులు ఆసిఫ్, నల్లగట్ల స్వామిదాసు, తిరుపతిరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల పర్వం ఎన్టీఆర్ జిల్లాలో సోమవారం కోలాహలంగా కొనసాగింది. నాలుగో రోజు జిల్లాలో మొత్తం 38 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. విజయవాడ పార్లమెంట్‌కు సంబంధించి ఆరుగురు, అసెంబ్లీ స్థానాలకు 32 మంది నామినేషన్లు వేశారు. ప్రధాన రాజకీయ పార్టీలతోపాటు స్వతంత్ర అభ్యర్థులు సైతం నామినేషన్లు వేసిన వారిలో ఉన్నారు. వైఎస్సార్ సీపీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థిగా కేశినేని నాని, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా వెలంపల్లి శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేశారు. కేశినేని నాని వన్‌టౌన్ కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లి నామినేషన్ వేశారు. సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు సత్యనారాయణపురంలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి వీఎంసీకి వెళ్లి నామినేషన్ వేశారు. తూర్పు నియోజకవర్గానికి సంబంధించి దేవినేని అవినాష్ సతీమణి కోగంటి సుధీర నామినేషన్ దాఖలు చేశారు.



కేశినేని ర్యాలీలో భారీ జన సందోహం



సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లిని గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

ఎంపీ కేశినేని నాని స్థిర, చరాస్తులు రూ.64.51 కోట్లు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని) తన పేర స్థిర, చరాస్తులు మొత్తం రూ. 64.51 కోట్లు ఉన్నట్లు ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన భార్య కేశినేని పావని పేర స్థిర, చరాస్తులు రూ. 12.81 కోట్లుగా అఫిడవిట్‌లో ప్రకటించారు.

వెలంపల్లి ఆస్తి రూ.16.32 కోట్లు

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా వెలంపల్లి శ్రీనివాసరావు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా తన ఆస్తుల వివరాలు తెలియజేస్తూ ఎన్నికల కమిషన్‌కు అఫిడవిట్ దాఖలు చేశారు. తన పేర చరాస్తులు రూ. 9.13 కోట్లు, స్థిరాస్తులు రూ. 7.19 కోట్లు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన భార్య శ్రావణి పేరుతో చరాస్తులు రూ. 81. 69 లక్షలు, స్థిరాస్తులు రూ. 5.52 కోట్లుగా ప్రకటించారు.

దుర్గమ్మకు కేశినేని నాని ప్రత్యేక పూజలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని కుటుంబ సమేతంగా సోమవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. నాని దంపతులతో పాటు కుమార్తెలు శ్వేత, హైమ, అల్లుళ్లు పృథ్వీ, రఘులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఎంపీ నామినేషన్ పత్రాలను అమ్మవారి పాదాల చెంత ఉంచి పూజలు చేసిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందుకున్నారు. కొండ దిగువకు చేరుకుని భారీ ర్యాలీగా నామినేషన్ వేసేందుకు బయలుదేరారు.



ఆశీర్వచన మండపంలో కేశినేని నాని కుటుంబం

వచ్చిన నామినేషన్లు ఇవే..

- విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వైఎస్సార్ సీపీకి సంబంధించి కేశినేని శ్రీనివాస్ (నాని), కేశినేని శ్వేత, నవరంగ్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా సయ్యద్ కమురున్నీసా, ఆలిండియా జైహింద్ పార్టీ అభ్యర్థిగా ఎస్. దశరథరామిరెడ్డి, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా సీహెచ్ గంగాధర్ గాంధీ, స్వతంత్ర అభ్యర్థిగా డి. మల్లికార్జునరావు నామినేషన్లు వేశారు. పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో ఆర్వో , జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావుకు నామినేషన్లు సమర్పించారు.
- విజయవాడ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గంలో ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా షేక్ ఆసిఫ్ కుమార్తె రేష్మ మహమూద్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా మోహన డి ప్రసాద్, బీఎస్పీ అభ్యర్థిగా మద్దిరాల వినోద్ కుమార్, స్వతంత్ర అభ్యర్థులుగా శ్రీరామ్, నాగమల్లేశ్వరరావు, ఈట్ల భవాని, పొప్పూరి అశోక్ నామినేషన్లు వేశారు.
- విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా వెలంపల్లి శ్రీనివాసరావు, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా కె. శివశంకర్, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా శ్రీధర దక్షిణామూర్తి, ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి అభ్యర్థిగా జి. ఫణిరాజ్, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా యం. ప్రశాంత్ కుమార్, స్వతంత్ర అభ్యర్థులుగా బొప్పన రాఘవేంద్రరావు, డి.సుభాషిణి నామినేషన్ వేశారు.
- విజయవాడ తూర్పులో ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా దేవినేని అవినాష్ సతీమణి కోగంటి సుధీర, స్టూడెంట్ యునైటెడ్ ఫర్ నేషన్ అభ్యర్థిగా జి. వెంకటరెడ్డి, టీడీపీ అభ్యర్థులుగా గద్దె రామోహన్, గద్దె అనూరాధ, తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ అభ్యర్థిగా వై. వినయ్ కుమార్ తంబి, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా జె.అనిల్‌కుమార్ నామినేషన్లు దాఖలు చేశారు.
- మైలవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ (ఐఎన్‌సి) అభ్యర్థులుగా బొర్రా కిరణ్, అక్కల నాగేంద్ర ప్రసాద్, టీడీపీ అభ్యర్థులుగా వసంత వెంకట కృష్ణ ప్రసాద్ రెండు సెట్లు, ఆయన సతీమణి వసంత శిరీష ,వేముల పల్లి పృథ్వీ నామినేషన్ వేశారు.
- నందిగామ అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థిగా తంగిరాల సౌమ్య నామినేషన్ వేశారు.
- తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు నామినేషన్లు దాఖలు అయ్యాయి. జనవాహిని అభ్యర్థిగా బి. నాగరాజు, టీడీపీ అభ్యర్థి కొలికలపూడి శ్రీనివాసరావు నామినేషన్ వేశారు.
- జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వీరిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా సామినేని ఉదయభాను సతీమణి సామినేని విమల, స్వతంత్ర అభ్యర్థులుగా జె. అహరోన్, యం. ఫ్రాన్సిస్, ఐ. వెంకటేశ్వర్లు, జై భీమ్ రావ్ భారత్ పార్టీ అభ్యర్థిగా కె. మధు నామినేషన్లు వేశారు.

సౌమ్యత తగ్గి.. ఆస్తులు పెరిగాయి!

- టీడీపీ అభ్యర్థి తంగిరాల సౌమ్యపై 23 కేసులు
- స్థిర, చరాస్తుల్లో గణనీయమైన వృద్ధి
- బెంగళూరులో రూ.75 లక్షలు విలువైన స్థలం కొనుగోలు
- పెద్ద మొత్తంలో అప్పులు కూడా తీర్చేశారు



టీడీపీ అభ్యర్థి తంగిరాల సౌమ్య

నందిగామ:ఎన్టీఆర్ జిల్లా నందిగామ టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆస్తులు ఈ ఐదేళ్లలో పెరిగినట్లు ఆమె సోమవారం అందజేసిన అఫిడవిట్ ద్వారా తెలుస్తోంది. 2019 లో అందజేసిన అఫిడవిట్ , ప్రస్తుతం అందజేసిన అఫిడవిట్‌లు పరిశీలిస్తే.. సౌమ్య స్థిర చరాస్తుల విలువ దాదాపు రెట్టింపయింది. అధికారంలో లేకపోయినా ఈ ఐదేళ్లలో ఆమె బెంగళూరులో 2400 చ.అడుగుల నివేశన స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ స్థలం మార్కెట్ విలువే రూ.75 లక్షలుండగా, వాస్తవ విలువ అంతకు రెండు మూడు రెట్లు ఉండొచ్చని తెలుస్తోంది. ఐదేళ్లలో తన ఆస్తులను కూడగట్టుకున్న సౌమ్య.. గతంలో ఉన్న అప్పులను కూడా చాలా వరకు తీర్చేశారు. అంతేకాకుండా, ఫిక్స్‌డు డిపాజిట్ల రూపంలో మరో ఏడు లక్షల రూపాయలను బ్యాంకుల్లో పొదుపు చేశారు. సౌమ్యపై ఈ ఐదు సంవత్సరాల్లో 23 కేసులు నమోదయ్యాయని, ఆస్తులు సైతం కొంతమేర పెరిగినట్లు అఫిడవిట్ ద్వారా వెల్లడయింది.

తిరువూరు టీడీపీ అభ్యర్థి కొలికపూడిపై 22 కేసులు

తిరువూరు: తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొలికపూడి శ్రీనివాసరావుపై పలు పోలీసు స్టేషన్లలో 22 కేసులు నమోదయ్యాయి. సోమవారం ఆయన నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా సమర్పించిన అఫిడవిట్‌లో తనపై ఉన్న కేసులు, ఆస్తులు, అప్పుల వివరాలను వెల్లడించారు. గుంటూరు జిల్లా మంగళగిరి, విజయవాడ–1 టౌన్, అజిత్‌సింగ్ నగర్, నున్న, సత్యనారాయణపురం, మాచవరం, పటమట, తిరువూరు పోలీసుస్టేషన్లలో వివిధ సెక్షన్ల కింద నమోదైన కేసుల వివరాలను ఈ అఫిడవిట్‌లో తెలియజేశారు. తన కుటుంబసభ్యుల స్థిరాస్తి విలువ రూ.90 లక్షలు, బంగారం, వెండి, ఇతర వాహనాల విలువ రూ.75.78 లక్షలు ఉన్నట్లు ప్రకటించారు. వ్యక్తిగత రుణాలు రూ.11 లక్షలున్నాయని, కుటుంబ వార్షికాదాయం తనకు రూ.9.86 లక్షలు, భార్యకు రూ.7.11 లక్షలు ఉన్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

నెట్‌బాల్ పోటీల్లో సత్తాచాటిన ఎస్ఆర్ఆర్ కాలేజీ జట్టు



మధురానగర్(విజయవాడసెంట్రల్): కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల నెట్ బాల్ ఉమెన్ టోర్నమెంట్‌లో ఎస్ఆర్ఆర్ అండ్ సీవీ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల టీమ్ ద్వితీయ స్థానంలో నిలిచింది. అత్యుత్తమ ప్రదర్శనతో ముగ్గురు క్రీడాకారులు ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైన క్రీడాకారుల అభినందన కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి, వ్యాయామ అధ్యాపకులు మండవ కోటేశ్వరరావు, డి.యుగంధర్ క్రీడాకారులను సత్కరించారు. ఆలిండియా పోటీల్లో సత్తాచాటి కళాశాల పేరు ప్రఖ్యాతులు ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కవితల పోటీలకు ఆహ్వానం

విజయవాడ కల్చరల్: తమ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కవితల పోటీ నిర్వహిస్తున్నామని జాతీయ కవితా వేదిక నిర్వాహకులు జింకా చక్రధర్, రామ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో నివసించే కవులు, రచయితలు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. 'ఓటు మన విధి - మన అధికారం' అంశంగా పోటీలు జరుగుతాయని వివరించారు. ఈ నెల 30వ తేదీ లోపు కవితలను పంపించాలని సూచించారు. ఎంపికైన కవితలను మే ఐదో తేదీన వర్చువల్‌గా జరిగే సమావేశంలో స్వయంగా చదవాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 92464 71593, 984 80 35573 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బాలికను లైంగికంగా వేధించిన యువకుడిపై కేసు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాలికను ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తూ, అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై హనుమాన్ జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.అర్జమ్మ కథనం మేరకు.. బాపులపాడు మండలం కొత్తపల్లికి చెందిన యువకుడు రామిశెట్టి బాలు అదే గ్రామానికి 17 బాలికను కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. అంతేకాక పెళ్లి చేసుకోవాలని వెంటపడుతూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. భయపడిన బాలిక అతడి వ్యవహారాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. వారు హనుమాన్‌జంక్షన్ పోలీసులను ఆశ్రయించారు. బాలిక తల్లిదండ్రులను కూడా చంపుతానని రామిశెట్టి బాలు బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి.అర్జమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వైఎస్సార్ సీపీలోకి 35 టీడీపీ కుటుంబాల చేరిక



పేటలోని దుర్గాపురం, ధనంబోడు కాలనీ నుంచి పార్టీలోకి చేరిన వారిని ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అవుతారని, సంక్షేమ పాలన వస్తుందన్న ఆశతో పలువురు పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. సోమవారం రాత్రి పట్టణంలోని దుర్గాపురం, ధనంబోడు కాలనీకి చెందిన 30 కుటుంబాలు టీడీపీని వీడి ఉదయభాను సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. షేక్ ఫక్రుద్దీన్, షేక్ ఇబ్రహీం, షేక్ తాజుద్దీన్, షేక్ బాషా, షేక్ అల్లావుద్దీన్, షేక్ రఫీ, షేక్ నాగుల్, షేక్ షాదర్, షేక్ యూనస్, షేక్ ఆలీ, షేక్ షోయబ్, కె.శ్రీకాంత్, కె.మరివాజు, ప్రసాద్, కృష్ణ, గోపి, షేక్ జానీ, సురేష్, ఎం.అనిల్, కె.ప్రసన్న, కె.గోపిరెడ్డి, సీహెచ్.సాయిగోపి, జి.నితిన్ తదితరులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. చంద్రబాబు హయాంలో ఇన్ని సంక్షేమ పథకాలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.

తొర్రగుంటపాలెం నుంచి 5 కుటుంబాలు..

పట్టణంలోని తొర్రగుంటపాలెంనకు చెందిన మార్కపూడి ప్రసన్న, బలవంతపు రాజు, బలవంతపు స్వప్న, షేక్ కబీర్, గౌరవరం గ్రామానికి చెందిన ఆదూరి గోపి టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరారు. పార్టీ యువనేత సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రొయ్యూరులో టీడీపీకి షాక్

తోట్లవల్లూరు: మండలంలోని రొయ్యూరు గ్రామంలో టీడీపీకి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన 30 మంది కార్యకర్తలు పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సమక్షంలో సోమవారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీకి చెందిన వీరంకి బాలకృష్ణ, లుక్కా హర్షవర్ధన్, లుక్కా పృథ్వీ, పామర్తి అంకస్వామి, లుక్కా వెంకటస్వామి, వనమాల రామకృష్ణ తదితరులకు ఎమ్మెల్యే అనిల్‌కుమార్ వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీరాజ్ జిల్లా కన్వీనర్ మోర్ల రామచంద్రరావు, సర్పంచ్ నిమ్మగడ్డ ప్రభుదాస్, జిల్లా యూత్ ప్రధానకార్యదర్శి మోర్ల పూర్ణప్రసాద్, గ్రామ కన్వీనర్‌లు లుక్కా భరత్‌గౌడ్, మాత్రపు నాగరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు లుక్కా విజయ్ తదితరులు పాల్గొన్నారు.



బందారు దుర్గారావుతో పాటు పలువురికి పార్టీ జెండా కప్పి ఆహ్వానిస్తున్న ఉప్పాల రమేష్(రాము)



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

వైఎస్సార్ సీపీలో చేరిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు

పెడన: గూడూరు మండలానికి చెందిన టీడీపీ నాయకుడు, మల్లవోలు-2 ఎంపీటీసీ మాజీ సభ్యుడు బందారు దుర్గారావుతో పాటు యువత పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీలో చేరారు. పెడనలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము) సోమవారం టీడీపీ నుంచి వచ్చిన దుర్గారావుతో పాటు యువతకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ పాలన చాలా బాగుందని, ప్రతి పేదవాడికి న్యాయం జరిగిందని గుర్తించి వైఎస్సార్ సీపీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, బూరగడ్డ శ్రీకుమార్, మండల కన్వీనర్ పర్ణం పెదబాబు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, మోటేపల్లి రత్నారావు తదితరులు పాల్గొన్నారు.

పుట్టింది బందరులో.. పెరిగింది అవనిగడ్డలో..

- నేను స్థానికుడిని కాబట్టే రాజకీయాల్లోకి వచ్చా
- విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తాం
- వైఎస్సార్ సీపీ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు
- డాక్టర్ చంద్రశేఖరరావు అభ్యర్థిత్వం జిల్లా ప్రజల అదృష్టం : పేర్ని నాని



విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు. చిత్రంలో పేర్ని నాని, సింహాద్రి రమేష్‌బాబు, కైలే అనిల్, ఉప్పాల రాము

మచిలీపట్నంటౌన్: 'నేను స్థానికుడిని. బందరులో పుట్టాను. అవనిగడ్డలో పెరిగాను. ప్రజా సేవ చేయాలనే రాజకీయాల్లోకి వచ్చాను' అని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు అన్నారు. కలెక్టరేట్‌లో ఆయన సోమవారం నామినేషన్ పత్రాన్ని దాఖలు చేసిన అనంతరం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. క్యాన్సర్ వైద్యుడినైన తాను స్థానికుడిని కాబట్టే ప్రజాసేవకుడిగా పనిచేయాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని కొనియాడారు. కులం, మతం, పార్టీలకు అతీతంగా బడుగు, బలహీనవర్గాల వారికి, అగ్రవర్ణాల పేదలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని క్షేత్రస్థాయి పర్యటనలో తనకు తెలిసిందన్నారు. మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు పోటీ చేయడం జిల్లావాసుల అదృష్టమన్నారు. ఆయన 35 ఏళ్లుగా క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్‌గా వైద్యసేవలు అందించి ఎంతో మంది మన్ననలు పొందారన్నారు. క్యాన్సర్ స్పెషలిస్ట్‌గా విశేష అనుభవం కలిగిన ఆయన ప్రజాసేవకుడిగా ప్రజల్లోకి రావటం మంచి పరిణామమని అన్నారు. డాక్టర్ చంద్రశేఖరరావు ఎన్నికల ప్రచారంలో నిత్యం పదుల సంఖ్యలో పేషెంట్లు తమ ఆస్పత్రి ఫైల్స్‌తో వచ్చి వైద్యసహాయం కోరుతున్నారని తెలిపారు. ఆయన చేతనైన సాయం చేస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ తిరిగి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో క్యాన్సర్‌పై స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో సంక్షేమం, అభివృద్ధి, విద్య, వైద్యం పరుగులు తీయాలంటే ప్రజలు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ సమావేశంలో అవనిగడ్డ, పామర్రు, పెడన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు సింహాద్రి రమేష్‌బాబు, కైలే అనిల్‌కుమార్, ఉప్పాల రాము పాల్గొన్నారు.

సర్వ రోగాలకు ఖర్చులేని చికిత్స యోగా



యోగా సాధనచేస్తున్న ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యోగా సర్వ రోగాలకు ఖర్చులేని చికిత్స అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో అమరావతి యోగా, ఏరోబిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవి ప్రత్యేక యోగా తరగతులను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రాచీన కాలం నుంచే యోగాకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఆరోగ్యకర జీవితానికి, శరీరం మనసు మధ్య సమతుల్యానికి యోగా దోహద పడుతుందన్నారు. మన దేశం ప్రపంచ మానవాళికి ఇచ్చిన గొప్ప కానుక యోగ అని వివరించారు. ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యోగా ద్వారా హైపర్ టెన్షన్, థైరాయిడ్, మధుమేహం వంటి వ్యాధులను అరికట్టొచ్చని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను యోగా సాధన చేసేలా కృషి చేయాలని కోరారు. అమరావతి యోగా, ఏరోబిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మిరియాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. 2017 నుంచి తమ అసోసియేషన్ ఎటువంటి లాభాపేక్ష లేకుండా ఏటా రెండు వేల మందికి పైగా ఉచితంగా యోగా శిక్షణ ఇస్తోందని తెలిపారు. అంతార్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక యోగా శిక్షణ తరగతులు నిర్వహించి సర్టిఫికెట్లు, మెడల్స్, యోగా దుస్తులను విద్యార్థులకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనతరం యోగా గురువు అంకాల సత్యానారాయణ పర్యవేక్షణలో విద్యార్థులతో కలిసి కలెక్టర్ ఢిల్లీరావు యోగా చేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ టి.హరికృష్ణ, సీఐ కాశీవిశ్వనాథ్, అమరావతి యోగా, ఏరోబిక్స్ అసోసియేషన్ కోశాధికారి ఎ.లావణ్య కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.ప్రశాంత్ కుమార్, కార్యవర్గ సభ్యులు కె.బాజి, ఎ.ప్రసాద్, ఎస్.వి.ఆర్. నాయుడు, లీల, శ్రీనివాసరావు, సిరాజ్ పాల్గొన్నారు.

భారత మహిళామండలి సభ్యులకు ఆత్మీయ సత్కారం



సత్కారం అందుకున్న భారత మహిళామండలి కార్యవర్గ సభ్యులు

విజయవాడ కల్చరల్: తెలుగు కళావాహిని, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ, శ్రీ కళాభారతి, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సమితి ఆధ్వర్యంలో భారత మహిళా మండలి విజయవాడ శాఖ నూతన కార్యవర్గ సభ్యుల ఆత్మీయ సత్కారం, సినీ సంగీత విభావరి కార్యక్రమం సోమవారం జరిగాయి. గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక ఇందుకు వేదికైంది. ముఖ్య అతిథిగా హాజరైన పారిశ్రామికవేత్త చెట్టుపల్లి మారుతీప్రసన్న మాట్లాడుతూ.. మహిళా విజయాన్ని స్వాగతించాల్సిన అవసరం ఉందన్నారు. నిర్వాహకుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ.. మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. భారత మహిళామండలి విజయవాడ శాఖ కార్యవర్గ అధ్యక్షురాలు రుత్తుల శ్రీలక్ష్మీదేవి, ఉపాధ్యక్షురాలు తాడువాయి శశిరేఖ, కార్యదర్శి వడ్డాది కామేశ్వరి, కోశాధికారి కె.సచిదేవి, సహాయ కార్యదర్శి ఆర్.ఉషామాధవి, కమిటీ సభ్యులు బి.వి.ఎల్. కుమారి, పి.దివ్యవాణి, పూర్వ అధ్యక్షురాలు వి.ఉమాదేవి, సలహా కమిటీ సభ్యులు ఎ.రత్నలక్ష్మి, టి.సాయిలక్ష్మిని సత్కరించారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు బోడి ఆంజనేయరాజు, బి.వి.వీరభద్రరావు, పరచూరి విజయలక్ష్మి, జ్ఞాన కిషోర్ పాల్గొన్నారు. గాయనీ గాయకులు పలు గీతాలను ఆలపించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



ఘటనా స్థలంలో కిషోర్‌బాబు మృతదేహం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ ఫ్లై ఓవర్‌పై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు.. కేదారేశ్వరపేటకు చెందిన రౌతు కిషోర్ బాబు(21) అవివాహితుడు. ఫుడ్‌కోర్ట్‌లో బిర్యానీ పాయింట్ నడుపుతున్నాడు. సోమవారం రాత్రి 12 గంటల సమయంలో తన పనులు ముగించుకున్న అతను బైక్‌పై సింగ్‌నగర్ పైపులరోడ్డులోని అలంకార్ బేకరీ వద్దకు వెళ్లి తన బావను ఎక్కించుకుని, ఇందిరానాయక్‌నగర్‌లో అతడిని దింపాడు. తిరిగి ఒక్కడే సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ ఎక్కుతుండగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ బంపర్‌ను ప్రమాదవశాత్తు ఢీకొని కిందపడిపోయాడు. ఈ ఘటనలో కిషోర్‌బాబు తలకు తీవ్రగాయమైంది. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొన్నారు. అయితే అప్పటికే కిషోర్‌బాబు మృతిచెందాడని నిర్ధారించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కిషోర్‌బాబు మృతిచెందాడని తెలుసుకున్న కుటుంబ సభ్యులు భోరున విలపించారు.

బైక్‌ను ఢీకొన్న స్కూల్ బస్సు

- ఇద్దరు మృతి, మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- చనిపోయిన వ్యక్తిని చూసేందుకు వెళ్తుండగా ప్రమాదం



ఘటనాస్థలం



ఆదిలక్ష్మి మృతదేహం, రక్తమోడుతున్న సురేష్

పెనుగంచిప్రోలు: ద్విచక్ర వాహనాన్ని ప్రైవేటు స్కూల్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన పెనుగంచిప్రోలు మండలం నవాబుపేట గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. చందర్లపాడు మండలం కోనాయపాలెం గ్రామానికి చెందిన వనపర్తి సురేష్, అంజమ్మ దంపతులు. వత్సవాయి మండలం మంగొల్లు గ్రామంలో నివసించే తన మామ మృతి చెందాడని తెలియడంతో సురేష్ సోమవారం ఉదయం భార్యతో పాటు తల్లి ఆదిలక్ష్మి, ఐదేళ్ల కుమార్తె లాస్యతో కలిసి ద్విచక్ర వాహనంపై ఆ గ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో నవాబుపేట గ్రామంలో శివాలయం పక్క నుంచి రహదారిపైకి వస్తున్న శ్రీ చైతన్య స్కూల్ బస్సు ఎదురుగా వస్తున్న వారి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్నవారు ఎగిరి రోడ్డుపై పడ్డారు. తలకు తీవ్ర గాయమైన ఆదిలక్ష్మి(65) ఘటనా స్థలంలోనే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన సురేష్, అంజమ్మ, లాస్యను 108 వాహనంలో తొలుత నందిగామ ప్రభుత్వాస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సురేష్(40) మృతి చెందాడు. అంజమ్మ, లాస్య చికిత్స పొందుతున్నారు. లాస్య పరిస్థితి విషమంగా ఉంది. సురేష్ సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.రాంబాబు తెలిపారు.

చాగంటి ప్రవచనం వాయిదా

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై వేంచేసిన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఈ నెల 24, 25వ తేదీల్లో నిర్వహించాల్సిన చాగంటి కోటేశ్వరరావు ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం అనివార్య కారణాలతో వాయిదా పడిందని ఆలయ ఈఓ కె.ఎస్. రామరావు సోమవారం తెలిపారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించతలపెట్టిన ఈ కార్యక్రమం వాయిదా పడిందని పేర్కొన్నారు. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించే తేదీని ప్రకటిస్తామని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

రాంగ్‌రూట్‌లో వెళ్లి నామినేషన్ వేసిన వసంత



సెక్యూరిటీ జోన్‌లో సిబ్బందిని తోసుకుని బైకుపై వెళ్తున్న వసంత వెంకటకృష్ణప్రసాద్

జి.కొండూరు: తెలుగుదేశం మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి వసంత వెంకటకృష్ణప్రసాద్ రూట్ మ్యాప్ నకు భిన్నంగా రాంగ్‌రూట్‌లో వెళ్లి నామినేషన్ వేశారు. స్వచ్ఛందంగా తరలివచ్చిన వేలాది మంది పార్టీ కార్యకర్తలు, అభిమానులతో కలిసి వైఎస్సార్ సీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు ఇటీవల నామినేషన్ దాఖాలు చేశారు. దీంతో తానూ బల ప్రదర్శనగా వెళ్లి నామినేషన్ వేయాలని వసంత కృష్ణప్రసాద్ భావించారు. పార్టీ శ్రేణులకు రకరకాల తాయిలాలు ప్రకటించి ఆహ్వానించారు. అయితే పార్టీ శ్రేణుల కన్నా వాహనాలే ర్యాలీలో అధికంగా ఉన్నాయి. వాహనాల రద్దీతో ట్రాఫిక్ జామ్ ఏర్పడి మైలవరం పట్టణంలోకి కూడా ర్యాలీ చేరుకోని పరిస్థితి నెలకొంది. దీంతో రూట్ మ్యాప్‌లో లేని బైపాస్‌రోడ్డు మీదుగా వసంత బైకుపై వెళ్లి నామినేషన్ వేశారు. రూట్ మ్యాప్‌లో బైపాస్‌పై వెళ్లేందుకు పోలీసులు అనుమతించకపోవడంతో వారితో వాగ్వాదానికి దిగి తోసుకొని వెళ్లారు. పార్టీ విజయం కోసం కలిసి పనిచేస్తామంటూ వసంత వెంకటకృష్ణప్రసాద్‌తో ఆదివారం చేయి కలిపిన దేవినేని ఉమామహేశ్వరరావు నామినేషన్ కార్యక్రమానికి హాజరవకుండా ర్యాలీ మధ్యలోనే వెళ్లిపోవడం గమనార్హం. వసంత వెంకటకృష్ణప్రసాద్ అభ్యర్థిత్వాన్ని దేవినేని ఉమా పరోక్షంగా తిరస్కరించినట్లు ఈ ఘటనతో తేటతెల్లమైందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

క్లుప్తంగా

నగరంలో నామినేషన్ల జోష్



లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో సోమవారం వైఎస్సార్ సీపీ అభ్యర్థుల నామినేషన్లు కార్యకర్తల్లో జోష్ నింపింది. విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్, సెంట్రల్ అసెంబ్లీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావులు నామినేషన్లు దాఖలు చేయగా, నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి కార్యకర్తలు తరలివెళ్లారు. పెద్ద సంఖ్యలో ముస్లిం మైనార్టీ నాయకులు వెళ్లారు. పార్టీ జెండాలు పట్టుకుని జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. కేశినేని శ్రీనివాస్ నామినేషన్ కార్యక్రమంలో మైనార్టీ నేతలు డాక్టర్ మెహబూబ్ షేక్, మునీర్ అహ్మద్, ఇతర మత పెద్దలు పాల్గొన్నారు.

తూర్పులో పలువురు నామినేషన్ల దాఖలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గంలో సోమవారం టీడీపీ అభ్యర్థి గద్దె రామ్మోహన్‌తో పాటు పలువురు నామినేషన్లు దాఖలు చేశారు. వారిలో వైఎస్సార్ సీపీ తరఫున కోగంటి సు. దీర రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, స్టూడెంట్ యునైటెడ్ ఫర్ నేషన్ అభ్యర్థిగా జి.వెంకటరెడ్డి నామినేషన్లు సమర్పించారు. టీడీపీ తరఫున గద్దె అనురాధ, తెలుగు రాజాధికార పార్టీ అభ్యర్థిగా వై.వినయ్‌కుమార్ తంబి, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా జె.అనీల్‌కుమార్‌లు ఒక్కో సెట్ నామినేషన్లను ఆర్వోకు అందజేశారు. అంతకు ముందు నియోజకవర్గ పరిధిలో తమ అనుచరులతో కలిసి ర్యాలీగా తరలివెళ్లారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రింగ్ రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేపీనగర్, నిర్మలా కాన్వెంట్ రోడ్డు, ఓల్డ్ పీఅండ్‌టీ కాలనీ, భద్రయ్య నగర్, వర్కు మెన్ పేట, వాసవ్య నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

పదిలో మెరిసిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నగరంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరిశారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు అధిక సంఖ్యలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. కృష్ణలంకలోని శ్రీపొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ పాఠశాల(ఏపీఎస్ఆర్ఎంసీ హైస్కూల్), వంగవీటి మోహనరంగా(వీఎం రంగా) బాలికోన్నత పాఠశాల, సంగం వెంకటరెడ్డి(ఎస్వీ రెడ్డి) నగర పాలక సంస్థ పాఠశాలలకు చెందిన 163 మంది విద్యార్థులు పదో తనగతి పరీక్షలు రాయగా 143 మంది ఉత్తీర్ణత సాధించారు. ఏపీఎస్ఆర్ఎంసీ హైస్కూల్‌లో 71 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 62 మంది(87 శాతం) ఉత్తీర్ణత సాధించారు. వారిలో టి.నాగయశ్వంత్ 554 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచాడు. జి.జాహ్నవి 535 మార్కులు, ఎస్.రామ్‌ధినేష్ 534 మార్కులు సాధించారు. 9 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు. వీఎం రంగా పాఠశాలలో 55 మంది బాలికలు పరీక్ష రాయగా 52 మంది(95 శాతం) ఉత్తీర్ణత సాధించారు. భానావతు భావన 565 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచింది. నాగకృష్ణిక 546 మార్కులు, డి.శ్రీగాయత్రి 543 మార్కులు సాధించారు. 500 పైగా మార్కులు 17 మంది బాలికలు సాధించారు. ఎస్వీ రెడ్డి పాఠశాలలో 37 మంది పరీక్ష రాయగా 29 మంది(78 శాతం) ఉత్తీర్ణత సాధించారు. వి.కుమారిలక్ష్మి 562 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచింది. బి.జయశ్రీ 561 మార్కులు, ఎం.మధురమీనాక్షి 531 మార్కులు సాధించారు. 500 పైగా మార్కులు ఐదుగురు సాధించారు.

బీఎస్ఆర్‌కే విద్యార్థుల ప్రతిభ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మొగల్రాజపురం జమ్మిచెట్టు సెంటర్‌లో ఉన్న బోయపాటి శివరామకృష్ణయ్య మున్సిపల్ హైస్కూల్ (బీఎస్ఆర్‌కే)స్కూల్‌లో 136 మంది పరీక్ష రాయగా 112 మంది ఉత్తీర్ణులయ్యారు. 82 శాతం ఉత్తీర్ణత సాధించారని స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.నాగరాజు తెలిపారు. స్కూల్‌లో పి. మహిమ-554 మార్కులు, ఎస్.కె.జాస్మిన్-551, కె.డీ.శశీధర్-549, వెంకట రాజ్యలక్ష్మి-547,జీ.పవన్ కుమార్-543,పి.హర్షిత-539, కె.పూర్ణ-538, పి.దుర్గా రమణి-533, సీహెచ్.డిల్లీశ్వరి-527, ఈ.అక్షయ్‌కుమార్-526, పి.డీ.ఎస్.రాణి-521,



భవ్యశ్రీ(588, కోనేరు బసవయ్య జెడ్పీ స్కూల్)



కె. నాగలక్ష్మణరావు (584, గోవింద రాజులు స్కూల్)



కె. నాగతేజ (583, గోవింద రాజులు స్కూల్)



భానావతు భావన (565, వీఎం రంగా పాఠశాల)



వి.కుమారిలక్ష్మి (562, ఎస్వీ రెడ్డి పాఠశాల)



పరిమి మహిమ (554, బీఎస్ఆర్‌కే హైస్కూల్)



టి.నాగయశ్వంత్ (554 ఏపీఎస్ఆర్ ఎంసీ హైస్కూల్)



ఎస్.కె.జాస్మిన్ (551, బీఎస్ఆర్‌కే హైస్కూల్)

ఎ.మేఘశ్యామ్ అభిలాష్-518, ఎస్.బిందు వరలక్ష్మి-514 మార్కులు పొందారన్నారు. టాపర్ పరిమి మహిమ మాట్లాడుతూ తాను డాక్టర్ కావాలనుకుంటున్నానని చెప్పింది. సెకండ్ టాపర్ ఎస్.కె.జాస్మిన్ మాట్లాడుతూ తాను ఇంజినీర్ అయి తల్లిదండ్రులకు, విజయవాడ నగరానికి మంచి పేరు తెస్తానని చెప్పారు. అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులను ప్రిన్సిపాల్ కె.నాగరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

మున్సిపల్ విద్యార్థుల రాణింపు

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లోని 29 మున్సిపల్ స్కూల్ నుంచి మొత్తం 2,621 మంది విద్యార్థులు హాజరవ్వగా అందులో 2,121(80 శాతం)మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పటమట వించిపేటలోని ఎస్ఎస్ఎంసీ బాలికల ఉర్దూ పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఐదు పాఠశాలల్లో 90కు పైగా ఉత్తీర్ణత సాధించారు. పది పాఠశాలల్లో 80, 11 పాఠశాలల్లో 70, రెండు పాఠశాలల్లో 60, ఒక పాఠశాలలో 50 శాతాలకు పైగా ఉత్తీర్ణత సాధించారు.

మెరిసిన ముత్యాలు

పటమట(విజయవాడతూర్పు): ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా నాడు-నేడు ద్వారా పాఠశాలల్లో పాఠశాలల రూపురేఖలను మార్చిన రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన మార్కులు వచ్చేలా కృషి చేసిందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. పటమటలోని కోనేరు బసవయ్య జిల్లా పరిషత్ బాలుర పాఠశాల్లో మొత్తం 290 మందికి 201 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పటమటలంక కొమ్మా సీతారామయ్య జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల్లో మొత్తం 170 మంది విద్యార్థులు హాజవ్వగా అందులో 147 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 84 శాతం ఉత్తీర్ణతను నమోదు చేశారు. పటమటలోని గోవిందరాజులు ఈనాం ట్రస్ట్ మున్సిపల్ హైస్కూల్లో 217 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా వారిలో 209 మంది విద్యార్థులు ఉత్తీర్ణతై 96.3 శాతం ఉత్తీర్ణతను నమోదుచేశారు.

- పటమట గోవిందరాజులు పాఠశాలలో అత్యధికంగా గాడెల్లి సువర్షిత 594 మార్కులు సాధించింది. ఆదే పాఠశాల్లో ఏ.నాగలక్ష్మణరావు 584, కె.రామ్‌వెంకట శివసాయి, కె.నాగ తేజ 583 మార్కులు సాధించారు.
- పటమట కోనేరు బసవయ్య జిల్లా పరిషత్ పాఠశాల్లో కె.భవ్యశ్రీ 588 మార్కులు సాధించగా, ఎం.దుర్గాభవానీ 563, కె.హేమంత్ కుమార్ 550 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌లుగా నిలిచారు.
- పటమటలంక కొమ్మా సీతారామయ్య జిల్లా పరిషత్ పాఠశాల్లో కె.కృష్ణచైత్ర 586, టి.అనన్య 576 మార్కులు సాధించింది.
- పటమట లంక శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థిని టి. సంహిత 590, బిందులాస్య 582, జె.వినీల్ వాసవ్ 572 మార్కులు సాధించారు.
- పటమట పోస్టల్ కాలనీ ఎస్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో చదువుతున్న టి.స్నేహప్రియ 590 మార్కులు సాధించింది.

లిటిల్ బ్రెయిన్స్ విద్యార్థుల సత్తా

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తమ విద్యాసంస్థకు చెందిన జి.లక్ష్మి రామ్-583 మార్కులు, పి.సాయి రాఘవ్, కె.శ్రీవల్లి-578 మార్కులు పొంది ప్రతిభ చూపారని లిటిల్ బ్రెయిన్స్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఫణి ప్రసాద్ ముక్తేవి తెలిపారు. సిద్ధార్థనగర్‌లోని స్కూల్ ఆవరణలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను సోమవారం సత్కరించారు. తమ పాఠశాలలో చదువుతున్న 550 పైగా మార్కులు పొందిన వారు 10 మంది, 500 మార్కులకు పైగా 14 మంది విద్యార్థులు పొందారని స్కూల్ ప్రిన్సిపాల్ సుధా ప్రవీణ చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను స్కూల్ ఉపాధ్యాయులు అభినందించారు.

చైతన్య జయకేతనం



పి.కమిలినిరాజ్ (597)



డీఆర్.గుణ సాత్విక్ (596)

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విజయవాడ జోన్‌కు చెందిన తమ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించడం తమకెంతో గర్వకారణంగా ఉందని శ్రీచైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ జనరల్ మేనేజర్ మద్దినేని మురళీకృష్ణ తెలిపారు. విజయవాడ జోన్‌లో పి.కమిలినీ రాజ్ అనే విద్యార్థిని 600లకు గాను 597 మార్కులు సాధించిందని తెలిపారు. ఆరుగురు విద్యార్థులు 595 మార్కులకు పైగా, 66 మంది విద్యార్థులు 590కుపైగా మార్కులు, 194 మంది విద్యార్థులు 585 మార్కులుపైగా, 389 మంది విద్యార్థులు 580పైగా మార్కులు, 1407 మంది విద్యార్థులు 550కు పైగా మార్కులు 2594 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారన్నారు. విద్యాసంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు అభినందించారు.

భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మనం నివశిస్తున్న భూమి కాలుష్యం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సి.కృష్ణ చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఎర్త్ డే సెలబ్రేషన్స్ కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాల్‌లో జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సుకు కృష్ణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సకల జీవరాసుల మనుగడకు భూమే ఆధారమని చెప్పారు. ఉదయం నిద్ర లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు భూమిపై కాలుష్యం పెరిగే విధంగానే వ్యవహరిస్తున్నామన్నారు. మన నిత్య జీవితంలో కాలుష్య రహితమైన వాటికి ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల, డైరెక్టర్ వేమూరి బాబూరావు, ప్రిన్సిపాల్ ఎం.రమేష్, భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టీఎస్ కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎర్త్ డే సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు అధ్యాపకులు బహుమతులను అందజేశారు.

విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా తాళ్లూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా అల్లూరి శ్రీధర్ రెడ్డి, మిక్కిలి యేషయ్య బాబు, నిక్కు రవికుమార్, సహాయ కార్యదర్శిగా వి.శ్రీనివాసరావు, బోని సురేష్‌కుమార్, అక్కి సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా ఈశ్వరరావు ఎన్నికయ్యారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షురాలు వెనిగళ్ల అమ్మాజీ అధ్యక్షతన అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు దేవినేని కిషోర్‌కుమార్ నూతన కార్యవర్గం సభ్యుల చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బడ్జెట్ పాఠశాలల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వర్తిస్తామని చెప్పారు.

14వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం



ఆటోనగర్(విజయవాడతూర్పు): ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. గతంలో లేని విధంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ స్థానికులను కోరారు. సోమవారం 14వ డివిజన్ దర్శిపేటలో ఆయన ప్రచారం నిర్వహించారు. అవినాష్ వెళ్లిన ప్రతి ఇంటి నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు ఇంటి గడప వద్దకే చేరవేశామన్నారు. రోడ్లు, డ్రైయినేజీతో పాటు పలు అభివృద్ధి చేశామని చెప్పారు. ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీకి పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు అందుకున్న ప్రతి కుటుంబం ఆనందం వ్యక్తం చేస్తుందని చెప్పారు. 10 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్న గద్దె విజయవాడ తూర్పునియోజకవర్గాన్ని వదిలేశారని దుయ్యబట్టారు. ఎన్నికలు దగ్గర పడటంతో ప్రజల వద్దకు వస్తున్నారన్నారు. గద్దె పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకత చూపుతున్నారన్నారు. ఆయన మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరలా రావాలని ప్రజలు కోరుతున్నారన్నారు. కరోనా సమయంలో మా ఇళ్లకు వచ్చి మీరు చేసిన మేలు మరులేమన్నారు. మీ వెంటే మేమంతా నడుస్తామని అభయం ఇచ్చారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్ చింతల సాంబయ్య, దుర్గాప్రసాద్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

జోనల్ కార్యాలయం ప్రారంభం



జోనల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ

ఆటోనగర్(విజయవాడతూర్పు): పటమటలోని పంటకాలువ రోడ్డులో వైఎస్సార్ సీపీ జోనల్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. ఎన్నికల సమావేశాలకు కార్యాలయం ఉపయోగపడుతుందన్నారు. ఈ ప్రాంతానికి చెందిన ప్రతి కార్యకర్తలు నిత్యం ఇక్కడకు రావాలని ఆయన సూచించారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఎన్నికల పరిశీలకులు అన్నె చిట్టిబాబు, డివిజన్ ఇన్‌చార్జి పవన్, రామకోటేశ్వరరావు, రిజ్వాన్, ఉదయ్ పాల్గొన్నారు.



జనమే సైన్యంగా సంక్షేమసారథి యాత్ర

సార్వత్రిక ఎన్నికల తొలి విడత ప్రచారంలో భాగంగా సీఎం జగన్ గత నెల 27న వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో దివంగత వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులు అర్పించి బస్సు యాత్రను ఆరంభించారు. 43 నుంచి 45 డిగ్రీల మండుటెండల్లోనూ.. రాత్రి పొద్దుపోయినా సీఎం జగన్‌ను చూసేందుకు ప్రజలు ఆరాటపడుతున్నారు. సీఎం జగన్‌ను దగ్గరి నుంచి చూసేందుకు.. మాట కలిపేందుకు.. వీలైతే ఫోటో దిగేందుకు బస్సు వెంట పరుగులు తీస్తున్నారు. అడుగడుగునా జనంతో మమేకమవుతూ.. బాధితులకు భరోసా ఇస్తూ సీఎం జగన్ ముందుకు సాగుతున్నారు. జనమే సైన్యంగా సంక్షేమ రథసారథి ప్రారంభించిన బస్సు యాత్ర జైత్రయాత్రలా కొనసాగుతోంది. మంగళవారం విజయనగరం జిల్లాలో యాత్ర కొనసాగనుంది. బుధవారం శ్రీకాకుళం జిల్లాలో బస్సు యాత్ర ముగియనుంది. ఇప్పటిదాకా 20 రోజులు పాటు 21 జిల్లాల్లో యాత్ర సాగింది. బస్సు యాత్రలో భాగంగా రోడ్ షోలు.. ఐదు చోట్ల వివిధ వర్గాల ప్రజలతో సమావేశాలు నిర్వహించిన సీఎం జగన్ 14 భారీ బహిరంగ సభల్లో పాల్గొని ప్రసంగించారు.

ఓ విజేత జైత్రయాత్ర

రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసిన సీఎం జగన్ 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర

రేపు శ్రీకాకుళం జిల్లాలో బస్సు యాత్ర ముగింపు

ఇప్పటిదాకా 20 రోజుల పాటు 21 జిల్లాల్లో సాగిన యాత్ర

- తమ బతుకుల్లో వెలుగులు నింపిన నేతకు అడుగడుగునా జన నీరాజనం
- రాయలసీమ.. దక్షిణ కోస్తా.. ఉత్తర కోస్తా.. ఉత్తరాంధ్ర.. ప్రాంతం ఏదైనా అదే ప్రభంజనం
- 43 నుంచి 45 డిగ్రీల మండుటెండల్లోనూ పిల్లల నుంచి పండుటాకుల దాకా జగన్ వెంటే..
- బస్సు యాత్రలో భాగంగా నిర్వహించిన 14 సభలు జనసంద్రాలను తలపించిన వైనం
- కూటమి వెన్నులో వణుకు పుట్టించిన విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖ రోడ్ షోలు
- అపూర్వ ఆదరణ చూసి ఓర్వలేక సీఎం జగన్‌పై విజయవాడలో హత్యాయత్నానికి తెగబడ్డ టీడీపీ మూక
- కార్యకర్తల మనోభావాల మేరకు నేతలను పార్టీలోకి చేర్చుకుంటున్న సీఎం జగన్
- బస్సు యాత్ర ప్రభంజనంతో పోటీ ఏకపక్షంగా మారిందంటూ రాజకీయ పరిశీలకుల విశ్లేషణ
- ఘోర పరాభవం తప్పదనే నిరాశ, నిస్పృహలతో సీఎం జగన్‌పై దాడులకు పురిగొల్పుతున్న చంద్రబాబు
- ఓటుకు కోట్లు ఎరగా వేసేందుకు తన సామాజిక వర్గానికి చెందిన ఎన్నారైలను బరిలోకి దించిన టీడీపీ

స్కూలు పిల్లల నుంచి పండుటాకుల దాకా ఆత్మీయ స్వాగతాలు..
మామయ్యా.. జగనన్నా.. మనవడా అంటూ అప్యాయంగా పలకరింపులు..
మాకు మంచి చేసిన మిమ్మల్నే మళ్లీ గెలిపించుకుంటామంటూ యువత కదనోత్సాహం
గుమ్మడి కాయలతో దిష్టి తీసి.. హారతులు పడుతూ అక్కచెల్లెమ్మల దీవెనలు..

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో అడగడుగునా కనిపించే దృశ్యాలివీ. ఎన్నికల హామీలను అమలు చేసి పాలనకు మానవీయత జోడించి సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్‌ను ప్రజలు తమ గుండెల్లో పెట్టుకున్నారు. మీ బిడ్డ ప్రభుత్వం వల్ల మీకు మంచి జరిగి ఉంటే సైనికులుగా అండగా నిలవాలంటూ సీఎం జగన్ ఇస్తున్న పిలుపుతో కెరటాల్లా కదలి వస్తున్నారు. తమ బతుకుల్లో వెలుగులు నింపి, గుండెల్లో కొలువైన జననేతకు అడుగడుగునా నీరాజనాలు పలుకుతున్నారు. పేదింటి భవిష్యత్తు, రాష్ట్రం రూపురేఖలను మరింత గొప్పగా మార్చేందుకు మరో చారిత్రక విజయంతో వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు 'మేమంతా సిద్ధం' అని నినదిస్తూ సెల్‌ఫోన్ టార్చ్‌లైట్లను వెలిగించి బస్సు యాత్ర సాగినంత దూరం సంఘీభావం తెలుపుతున్నారు. చెదరని చిరునవ్వుతో జనంతో మమేకమవుతూ.. భవితపై భరోసా ఇస్తూ ముందుకు సాగుతున్న సీఎం జగన్‌ను మళ్లీ సీఎంగా చేసుకుంటామని హామీ ఇస్తున్నారు. రాయలసీమ.. దక్షిణ కోస్తా.. ఉత్తర కోస్తా.. ఉత్తరాంధ్ర.. ప్రాంతమేదైనా అదే జనస్పందన. గత 58 నెలల సుపరిపాలనతో సీఎం జగన్ ప్రజల హృదయాలను గెలుచుకున్నారన్నది బస్సు యాత్రతో ప్రస్ఫుటితమైందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. బస్సు యాత్రను ఓ విజేత జైత్రయాత్రగా అభివర్ణిస్తున్నారు.

చివరి అవకాశం చేజారిపోతుండటంతో..

ప్రజాక్షేత్రంలో సీఎం జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోవడం అసాధ్యమని గ్రహించిన చంద్రబాబు 2014 తరహాలోనే జనసేన, బీజేపీలతో మళ్లీ జట్టు కట్టారు. నాడు కూటమి పేరుతో 650కిపైగా హామీలిచ్చిన చంద్రబాబు అనంతరం దారుణంగా వంచించటాన్ని సీఎం జగన్ ఎండగడుతుండటంతో అవకాశవాద పొత్తులను జనం ఛీకొడుతున్నారు. దీంతో నన్ను చూడొద్దు.. ఎన్డీఏను చూసి ఓటేసి చివరి అవకాశం ఇవ్వాలంటూ చంద్రబాబు ప్రాథేయపడుతున్నా జనం పట్టించుకోవడం లేదు. ఇచ్చిన మాటపై నిలబడి సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్‌కు ప్రజల్లో విశ్వసనీయత రోజురోజుకు పెరుగుతుండటం.. జాతీయ మీడియా సంస్థల సర్వేలన్నీ మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయమని తేల్చిచెబుతుండటం.. ఇది బస్సు యాత్రలో ప్రస్ఫుటితమవుతుండటంతో చంద్రబాబు పేట్రేగిపోతున్నారు. సీఎం జగన్, వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులకు తెగబడాలంటూ టీడీపీ, జనసేన కార్యకర్తలను రెచ్చగొడుతున్నారు. ఉనికి చాటుకోవడానికి యథాప్రకారం ఓటుకు కోట్లు ఎర వేసేందుకు టీడీపీ ఎన్నారై విభాగాన్ని, తన సామాజిక వర్గానికి చెందిన వారిని చంద్రబాబు రంగంలోకి దించారు.

కూటమి వెన్నులో వణుకు..

కృష్ణమ్మ తరంగాలతో పోటీ పడుతూ విజయవాడ రోడ్ షోకు జనవాహిని తరలిరాగా రాజమహేంద్రవరం రోడ్ షోలో అఖండ గోదావరిని తలపిస్తూ ప్రజలు పోటెత్తారు. సాగరంతో పోటీపడుతూ విశాఖపట్నం రోడ్ షో ఉప్పొంగింది. బస్సు యాత్ర సాగిన 21 జిల్లాల్లో జరిగిన రోడ్ షోలకూ ఇదే రీతిలో జనం పోటెత్తారు. బస్సు యాత్రలో భాగంగా పొద్దుటూరు, నంద్యాల, ఎమ్మిగనూరు, మదనపల్లె, పూతలపట్టు, నాయుడుపేట, కావలి, కొనకనమెట్ల, పిడుగురాళ్ల, ఏటుకూరు(గుంటూరు శివారు), గుడివాడ, భీమవరం, అచ్చంపేట జంక్షన్ (కాకినాడ సమీపంలో), చింతపాలెం (అనకాపల్లి సమీపంలో) నిర్వహించిన బహిరంగ సభలకు లక్షల సంఖ్యలో జనం తరలి వచ్చారు. పెత్తందారులపై పోరుకు సిద్ధమంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదిస్తూ లక్షలాది మంది చేతులు పైకెత్తి సెల్‌ఫోన్‌లలో టార్చ్‌లైట్లు వెలిగించడంతో బహిరంగ సభల ప్రాంగణాలు ఆకాశంలో చుక్కలను తలపించాయి. ఉమ్మడి రాష్ట్రం.. తెలుగు రాష్ట్రాల చరిత్రలో సీఎం జగన్ బస్సు యాత్ర అతి పెద్ద ప్రజాయాత్రగా నిలిచిపోతుందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. సామాన్యులతో కలిసి అసమాన్యుడు చేస్తున్న ఈ యుద్ధ కవాతు టీడీపీ–జనసేన–బీజేపీ వెన్నులో వణుకు పుట్టిస్తోంది. బస్సు యాత్రకు వస్తున్న స్పందనను చూసి ఓర్వలేని టీడీపీ నేతలు తమ పార్టీ మూకతో సీఎం జగన్‌పై విజయవాడ రోడ్ షోలో హత్యాయత్నానికి తెగబడ్డారు. పదునైన సిమెంట్ రాయితో గురిపెట్టి కొట్టడంతో నుదుటిపై తీవ్ర గాయమైనా వెరవకుండా సీఎం జగన్ బస్సు యాత్రను కొనసాగిస్తున్నారు.

ఫలితాలు ఏకపక్షమే..

బస్సు యాత్రతో సీఎం జగన్ రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేశారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఎన్నికల్లో పోటీ ఏకపక్షమేనని.. వైఎస్సార్‌సీపీ విజయం లాంఛనమేనని స్పష్టం చేస్తున్నారు. మాటపై నిలబడే నాయకుడి సారథ్యంలో పనిచేసేందుకు కూటమి పార్టీల నేతలు ఆరాట పడుతున్నారు. పార్టీ కార్యకర్తల మనోభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఆచితూచి జనసేన, టీడీపీ, బీజేపీ నేతలను వైఎస్సార్‌సీపీలోకి చేర్చుకుంటున్నారు. ఇవేవీ లేకుండా సీఎం జగన్ గేట్లు ఎత్తేసి ఉంటే.. ఈ పాటికి కూటమి పార్టీలు ఖాళీ అయ్యేవని చెబుతున్నారు. ఇప్పటిదాకా టీడీపీ, జనసేన, బీజేపీల నుంచి 2019 ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు రాష్ట్ర స్థాయి నేతలు 250 మందికిపైగా వైఎస్సార్‌సీపీలో చేరారు. మూడు పార్టీలకు చెందిన వేలాది మంది క్రియాశీలక నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు.

–సాక్షి, అమరావతి


నేడు 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఇలా..



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర 21వ రోజైన మంగళవారం(ఏప్రిల్ 23) షెడ్యూల్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం సోమవారం విడుదల చేశారు. ఈ యాత్రలో భాగంగా సీఎం జగన్ ఎండాడ ఎంవీవీ సిటీ నుంచి మంగళవారం ఉదయం 9 గంటలకు బయలుదేరుతారు. మధురవాడ మీదుగా ఆనందపురం చేరుకుని చెన్నాస్ కన్వెన్షన్ హాల్ వద్ద సోషల్ మీడియా కార్యకర్తలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడ నుంచి తగరపువలస మీదుగా జొన్నాడ చేరుకుంటారు. జొన్నాడ దాటిన తర్వాత సీఎం జగన్ భోజన విరామం తీసుకుంటారు. అనంతరం బొద్దవలస మీదుగా సాయంత్రం 3.30 గంటలకు చెల్లూరు వద్దకు చేరుకొని బహిరంగ సభలో సీఎం ప్రసంగిస్తారు. ఆ తర్వాత చింతలవలస, భోగాపురం, రణస్థలం మీదుగా అక్కివలసలో ఏర్పాటు చేసిన రాత్రి బస శిబిరానికి ముఖ్యమంత్రి జగన్ చేరుకుంటారు.

విశాఖలో రెండు సముద్రాలు

- జలసముద్రం.. సీఎం యాత్రలో జనసముద్రం
- మీడియా సమావేశంలో బొత్స సత్యనారాయణ



సాక్షి, విశాఖపట్నం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర సందర్భంగా విశాఖ నగరంలో రెండు సముద్రాలు కనిపించాయని మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. ఒకటి బంగాళఖాతం జలసముద్రం అయితే.. మరొకటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమాన జనసముద్రం అని తెలిపారు. వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థిగా సోమవారం బొత్స ఝాన్సీ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. విశాఖలో ఆదివారం సీఎం వైఎస్ జగన్ మేమంతా సిద్ధం బస్సుయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. నగరవాసులంతా స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి మరీ అభిమాన నేతకు అపూర్వ స్వాగతం పలికారని చెప్పారు. ఆదివారం కనిపించిన జనసునామీతో ప్రతిపక్ష పార్టీలకు మరింత భయం పట్టుకుందని తెలిపారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు సరికొత్త సంక్షేమ పథకాలను కూడా పేద ప్రజలకు సీఎం జగన్ పారదర్శకంగా అందించారని చెప్పారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కాలంలో రాష్ట్రంలో ఆదాయం పెరిగి, పేదరికం తగ్గిందని కేంద్రప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయన్నారు. సీఎం జగన్ సంక్షేమ పథకాలు పేదోడి కుటుంబానికి ఆర్థిక పరిపుష్టి కల్పించాయని చెప్పారు.

అమ్మ ఒడి.. సర్కారు బడి

జగన్ ఇచ్చిన నమ్మకం



దారుణమైన అబద్ధాలు చెబుతున్నామనే సిగ్గెగ్గులు లేవు!.
పత్రిక పేరుతో పచ్చి విషాన్ని గుమ్మరిస్తున్నామన్న సోయ లేదు!.
చంద్రబాబు కోసం పూర్తి దిగంబరంగా మారిపోయామన్న ధ్యాసే.. లేదు!

ఇదీ... 'ఈనాడు' పత్రిక, దాని యజమాని రామోజీ రావు తీరు. ఎన్నికల ముంగిట చంద్రబాబును జాకీలు పెట్టి లేపడమే లక్ష్యంగా... వైఎస్ జగన్ ప్రభుత్వంపై పచ్చి అబద్ధాలతో చెలరేగిపోతున్నారు రామోజీరావు. తన రాతల్ని జనం 'ఛీ' కొడుతున్నారని తెలిసినా లైట్ తీస్కుంటూ పూర్తిగా దిగజారిపోయారు ఈ నారా వారి కూలీ!. సోమవారం అచ్చేసిన 'అమ్మ ఒడికి.. మామ కత్తెర' కూడా ఇలాంటిదే. దీని వెనుక నిజానిజాలివిగో...

'అమ్మ ఒడి' పథకాన్ని ఇద్దరు పిల్లలకు ఇస్తామని వైఎస్ జగన్ మీకెప్పుడు చెప్పారు రామోజీరావు గారూ? ఎన్నికలకు ముందు విడుదల చేసిన మేనిఫెస్టోలో ఏముందో కాస్తయినా చూశారా? మేనిఫెస్టోని చూసే కదా.. జనం ఓట్లేసి అఖండ విజయాన్ని అందించారు. మరి ఆ మేనిఫెస్టోలో చెప్పింది చెప్పినట్టుగా చేస్తుంటే లేనిపోని అబద్ధాలతో ఎందుకీ పెడబొబ్బలు? 'పిల్లల చదువులకు ఏ పేదింటి తల్లీ భయపడకూడదు. పిల్లలను బడికి పంపితే చాలు. ఆ తల్లికి సంవత్సరానికి రూ.15,000 ఇస్తాం.' అనే హామీని మేనిఫెస్టోలో పొందుపరిచారు వైఎస్ జగన్. ముఖ్యమంత్రి అయ్యాక దాన్ని తు.చ. తప్పకుండా తొలి ఏడాది నుంచే అమల్లోకి తెచ్చారు. 2019 జూన్‌లో అధికారం చేపట్టడంతో... అప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయి... స్కూళ్లు తెరిచే సమయం కనక... ఆ ఏడాది జనవరిలో తొలిసారి అమ్మ ఒడిని అందించారు.

కోతలు పెట్టిందెక్కడ?

మూడేళ్లలో 1.86లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారంటూ మరో దారుణమైన అబద్ధాన్ని అలవోకగా వండేశారు ఈ ఎల్లో జర్నలిస్టు. నిజానికి 2019లో అధికారం చేపట్టిన జగన్... ఆ ఏడాది అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం అందేట్లు చూశారు. దీంతో 2019–20లో ఏకంగా 42.33 లక్షల మంది తల్లులకు ఈ పథకం కింద రూ.6,349 కోట్లు అందాయి. ఇక తాజాగా గతేడాది... అంటే 2022–23లో 42.62 లక్షల మందికి ఈ పథకం కింద రూ.6,393 కోట్లు జమయ్యాయి. అంటే తొలి ఏడాదితో పోల్చినప్పుడు దాదాపు 29 వేల మంది పెరిగారు తప్ప.. ఒక్కరంటే ఒక్కరు కూడా తగ్గలేదు. ఇదీ... వాస్తవం.

కోవిడ్ కష్ట కాలంలోనూ... సంఖ్య పెరిగినా సరే..

జగన్ గురించి ఒక్క మాటలో చెప్పాలంటే...'కేరాఫ్ కమిట్‌మెంట్' అనాలి. ఎందుకంటే 2020–21లో కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని వణికించేసినప్పుడు అందరి ఆదాయాలూ పడిపోయాయి. కేంద్రంతో సహా దాదాపు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ సంక్షేమ పథకాలను నిలిపేశాయి. కానీ జగన్ మాత్రం సంక్షేమ పథకాల అవసరం ఆ సమయంలోనే ఎక్కువ ఉందని భావించారు. పేదలకు భరోసా ఇస్తూ... మరింత మందికి పథకాలను చేరువ చేశారు. చాలామంది వ్యాపారాలు లేక, వృత్తిపనులు పోయి పేదరికంలోకి జారిపోయారు. వారంతా కొత్తగా నమోదు చేసుకోవటంతో ఆ ఏడాది అమ్మ ఒడి లబ్ధిదారుల సంఖ్య విపరీతంగా పెరిగింది. 2019–20లో 42.33 లక్షలుగా ఉన్న సంఖ్య 2020–21లో కోవిడ్ వల్ల ఏకంగా 44.48 లక్షలకు పెరిగింది. ప్రభుత్వం పెద్ద మనసుతో ఏకంగా రూ.6,673 కోట్లను లబ్ధిదారులకు జమ చేసింది. కానీ తర్వాత ఏడాది నుంచీ మళ్లీ పరిస్థితులు చక్కబడటం మొదలెట్టాయి. వృత్తి పనులు, చిరు వ్యాపారాలు మళ్లీ పుంజుకుని 2022–23 నాటికి ఆదాయాలు యథాపూర్వ స్థితికి వచ్చాయి. దీంతో వారి వారి ఆదాయ పరిమితులకు లోబడి లబ్ధిదారులూ తగ్గి... పూర్వం కన్నా కాస్త ఎక్కువగా... అంటే 42.62 లక్షలకు చేరుకున్నారు. ఇదీ జరిగింది. దీన్నెవరైనా కోత పెట్టడం అంటారా? నిబంధనలు విధించి ఆ మేరకు లబ్ధిదారుల్ని తగ్గించేశారన్న ఆరోపణలో ఏ కొంచెమైనా వాస్తవం ఉందా? ఎందుకు రామోజీరావ్ ఇంత దారుణమైన రాతలు? ఎవరు నమ్ముతారు ఇవన్నీ!!.



మేనిఫెస్టోలో ఏం చెప్పారో తెలియదా రామోజీ

ఓ భగవద్గీత, ఓ ఖురాన్, ఓ బైబిల్‌లా మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావిస్తూ చిత్తశుద్ధితో అమలు చేస్తున్న జగన్... దాన్ని ఎప్పటికీ అందుబాటులో ఉండేలా పార్టీ వెబ్‌సైట్ సహా ఇంటర్‌నెట్‌లో అందుబాటులో ఉంచారు. ఎప్పుడు కావాలన్నా చూడొచ్చు. దాన్నిబట్టి ప్రభుత్వాన్ని ప్రశ్నించవచ్చు. దీనికి భిన్నంగా 2014లో పవన్ కళ్యాణ్, మోదీ ఫొటోలను కూడా వేసి భారీ మేనిఫెస్టోను ప్రకటించిన టీడీపీ... గెలిచాక దాన్ని ఎక్కడా కనిపించనీయకుండా చేసింది. పార్టీ వెబ్‌సైట్ నుంచి సైతం దాన్ని తొలగించారు. అప్పట్లో ఈ రామోజీరావు దాన్ని ప్రశ్నిస్తే ఒట్టు. జగన్ మాత్రం మేనిఫెస్టోను అమలు చేసిన ధైర్యంతో... తన ప్రచారంలో సైతం మీకు మంచి జరిగిందని భావిస్తేనే ఓటు వెయ్యండని ధైర్యంగా జనాన్ని అడుగుతున్నారు. మరింత మంచి చేస్తామని హామీ ఇస్తున్నారు. బహుశా! దేశంలో ఇప్పటిదాకా ఏ నాయకుడూ ఇంత నిజాయితీగా ఓట్లు అడిగిన సందర్భం లేదేమో!. ఇది నచ్చని రామోజీ రావు టన్నుల కొద్దీ అబద్ధాలు గుమ్మరిస్తున్నారు.

ఐదేళ్లలో నాలుగుసార్లే.. అంటే ఎలా?

వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పడింది 2019 జూన్‌లో. అప్పటికే అడ్మిషన్లు పూర్తయి, స్కూళ్లు మొదలవుతున్నాయి. ప్రభుత్వం కుదురుకుని, డేటాను సమీక్షించడానికి కొంత సమయం పడుతుంది. అయినా సరే... ఇచ్చిన మాట ప్రకారం ఆ ఏడాది మొత్తాన్ని జనవరిలో తల్లుల ఖాతాల్లో జమ చేశారు జగన్. తరువాతి ఏడాది కూడా జనవరిలోనే ఇచ్చినా... మరుసటి ఏడాది నుంచీ అనుకున్నట్టే జూన్‌లో అడ్మిషన్లకు ముందు జమచేయటం ప్రారంభించారు. ఇప్పటికి నాలుగేళ్లుగా నగదు జమచేస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా జూన్‌లో జమ చేస్తారు. కానీ రామోజీరావు మాత్రం... ఈ ఏడాది ఇంకా జమ చేయలేదంటూ నాలుగేళ్లపాటే ఇచ్చారంటూ చేతికొచ్చిన రాతలు రాయటం దివాలాకోరు తనం కాక మరేమిటి?

ల్యాప్‌టాప్‌లపైనా... దౌర్భాగ్యపు రాతలే

'లబ్ధిదారులు కోరుకుంటే 9–12 తరగతుల పిల్లలకు అమ్మ ఒడికి బదులుగా ల్యాప్‌టాప్‌లు ఇస్తామని చెప్పిన జగన్... ఆ తరువాత మాట తప్పారన్నది రామోజీరావు చేసిన మరో పనికి మాలిన ఆరోపణ. లబ్ధిదారులు కోరుకుంటే... అమ్మ ఒడికి బదులుగా 9–12 తరగతుల పిల్లలకు ల్యాప్‌టాప్‌లు ఇవ్వాలన్నది ప్రభుత్వం ఒకదశలో చేసిన ఆలోచన. కానీ ఈ ఆలోచన ఆచరణలోకి రాకుండానే.. ప్రభుత్వం చౌకబారు ల్యాప్‌టాప్‌లను విద్యార్థులకు అంటగట్టాలని చూస్తోందంటూ... ఇదో పెద్ద కుంభకోణమంటూ 'ఈనాడు' విషాన్ని కక్కింది. లబ్ధిదారుల స్పందన చూశాక ప్రభుత్వం తన ఆలోచనను సమీక్షించి... అంతకన్నా మెరుగైన నిర్ణయాన్ని ప్రకటించింది. అమ్మ ఒడిని యథాతథంగా కొనసాగిస్తూనే 8వ తరగతి పిల్లలకు ఏటా ఉచితంగా ట్యాబ్‌లు ఇవ్వాలనేది ఈ నిర్ణయం. ఇలా ఇచ్చే ట్యాబ్‌లు వీరికి ఇంటర్ వరకూ పనికొస్తాయనే ఉద్దేశంతో అంతర్జాతీయ ఎడ్యుటెక్ దిగ్గజం బైజూస్‌తో కంటెంట్ ఒప్పందం చేసుకుని ట్యాబ్‌ల పంపిణీ ఆరంభించింది. అన్ని తరగతుల పిల్లలకూ బైజూస్ కంటెంట్‌ను ఉచితంగా అందుబాటులోకి తెచ్చింది. కానీ రామోజీరావు మాత్రం అమ్మ ఒడికి బదులుగా ఇస్తానన్న ల్యాప్‌టాప్‌లు ఇవ్వలేదనే పిచ్చి వాదనే వినిపిస్తున్నారు. అమ్మ ఒడిని కొనసాగిస్తున్నప్పుడు దానికి బదులుగా అనే మాటెక్కడుంటుంది?

ట్యాబ్‌లపైనా పెత్తందారీ పోడక..

ఉచితంగా ట్యాబ్‌లివ్వటం కూడా రామోజీరావుకు సుతరామూ నచ్చలేదు. ఎందుకంటే తాను నడిపిస్తున్న రమాదేవి స్కూల్లో పిల్లలకో, తన మనవలు చదువుతున్న ఇంటర్నేషనల్ స్కూల్లోని పిల్లలకో ట్యాబ్‌లు ఉండాలి తప్ప ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకెందుకన్నది ఆయన ఆలోచన. దీంతో ట్యాబ్‌లలో పిల్లలు చూడకూడనివన్నీ చూస్తున్నారని, వాటి వల్ల చెడిపోతున్నారు కాబట్టి ట్యాబ్‌లు వద్దంటూ పెత్తందార్ల తరఫున కొత్త పల్లవి ఎత్తుకున్నారు. దీనిపై పేద విద్యార్థులంతా మండిపడటమే కాక.. 'ఈనాడు'పై రాష్ట్ర వ్యాప్తంగా విరుచుకుపడటంతో వెనక్కి తగ్గారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం బోధనను ఇలాగే వ్యతిరేకించారు రామోజీ. దానికోసం తెలుగు భాషా ఉద్యమం కూడా నడిపించారు. తాను, తన టీడీపీ సన్నిహితులు నడిపిస్తున్న స్కూళ్లన్నిట్లోనూ ఇంగ్లిష్ మీడియాన్నే అందిస్తూ... ప్రభుత్వ స్కూళ్లలో మాత్రం అది వద్దనటం ఆయన పెత్తందారీ దురహంకారానికి పరాకాష్ట కాక మరేమిటి? చివరకు ఈ విషయంలో కూడా ఆయన తోక ముడవక తప్పలేదు.

ఆ మొత్తం స్కూల్ కమిటీ ఖాతాలకే జమ...

ఎగురుతున్నప్పుడు ఎత్తుకు గానీ... జారిపోతున్నప్పుడు లోతులకు గానీ హద్దులుండవు. రామోజీ రావుదీ అదే పరిస్థితి. ఆయనిప్పుడు లోతెంతో తెలియనంతగా దిగజారిపోతున్నారు. 'ఈనాడు' మరో ఆరోపణ ఏంటంటే.. పాఠశాల, మరుగుదొడ్ల నిర్వహణ పేరుతో రూ.2 వేలు చొప్పన కోత వేశారనేది. నిజానికి 'అమ్మ ఒడి' ఆరంభించేనాటికి 'నాడు–నేడు' కింద స్కూళ్లను బాగు చేయటం మొదలుకాలేదు. బాగు చేశాక... అవన్నీ సక్రమంగా ఉండాలి కనుక 2021లో పాఠశాల నిర్వహణ నిధిని, 2022లో టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్‌ను ఏర్పాటు చేశారు. డబ్బులు చెల్లిస్తున్నారు కనుక నిర్వహణపై నిలదీసే హక్కు తల్లిదండ్రులకు ఉంటుందనే ఉద్దేశంతోనే ప్రభుత్వం దీన్ని ఆరంభించింది. అమ్మ ఒడి నుంచి మినహాయించిన ఈ నిధులు రూ.2 వేలు నేరుగా స్కూల్/కాలేజీ కమిటీల ఖాతాలకే జమవుతున్నాయి. తక్షణ మరమ్మతుల కోసం ఈ ఖాతాల నుంచే ఖర్చు చేస్తున్నారు. ఇది పేరెంట్స్ కమిటీలకు, ప్రజలకు తెలుసు. తెలియనిది రామోజీకే!!.

టాయిలెట్ల నిర్వహణతో తగ్గిన డ్రాప్ అవుట్లు

నాడు–నేడుతో ప్రతి ప్రభుత్వ బడిలో టాయిలెట్లు నిర్మించారు. అక్కడే దుస్తులు మార్చుకునే గది, వాష్ బేసిన్లు, టాయిలెట్లు శుభ్రం చేసే వస్తువులు అందుబాటులో ఉంచారు. దాంతో రాష్ట్ర వ్యాప్తంగా బాలికల డ్రాప్ అవుట్లు తగ్గిపోయాయి. రాష్ట్రంలోని 44,800 పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 46,661 మంది ఆయాలను నియమించి వారికి నెలకు రూ.6వేలు గౌరవ వేతనం చెల్లిస్తున్నారు. గత మూడేళ్లలో వీరికి రూ.882 కోట్లు వేతనాలను స్కూలు కమిటీల ఖాతా నుంచే చెల్లించారు. ప్రభుత్వ చదువులంటే గిట్టని రామోజీకి ఇవన్నీ కాస్త అర్థమయ్యేలా చెప్పండ్రా!!. ఆయన్నలా వదిలేయకండ్రా!!.

–సాక్షి, ప్రత్యేక ప్రతినిధి

చీరాల టీడీపీ, జనసేన సమావేశం రసాభాస

చీరాల: బాపట్ల జిల్లా చీరాల టీడీపీ, జనసైనికుల సమన్వయ సమావేశం రసాభాసగా మారింది. కార్యకర్తలు ఒకరిపై ఒకరు పిడిగుద్దులు గుద్దుకునే వరకు వెళ్లింది. స్థానిక బైపాస్‌లోని టీడీపీ కార్యాలయంలో పార్టీ అభ్యర్థి మద్దులూరి మాలకొండయ్య అధ్యక్షతన సోమవారం జనసేన, టీడీపీ నాయకుల సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జనసేన పార్టీ నాయకులు కిరణ్, నాయుడు, బాషాల మధ్య మాటా మాటా పెరగడంతో తన్నుకున్నారు. టీడీపీ నాయకులు మధ్యలో వచ్చి సర్దిచెప్పే ప్రయత్నం చేయగా 'మీ పార్టీ వలనే మా పార్టీకి మనుగడ లేకుండా పోయింది.. మీ వలనే మేము ఇలా అయ్యాం..' అనడంతో అటు టీడీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. ఒక దశలో ఇరు వర్గాలు బాహాబాహీకి దిగారు. కొద్దిసేపటి తర్వాత అభ్యర్థి కొండయ్య ఇరుపార్టీల నాయకులకు నచ్చజెప్పినా వినకుండా వీరంగం సృష్టించారు. పరిస్థితి అదుపు తప్పుతుండడంతో మీటింగ్‌ను వాయిదా చేసి కొండయ్య బయటకు వెళ్లిపోవడంతో సమన్వయ కమిటీ సమావేశాన్ని రద్దు చేశారు.

కిరణ్ అరెస్ట్ చేయించాడని జగన్ అనలేదు

• మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి



పుంగనూరు (చిత్తూరు జిల్లా): వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని అరెస్ట్ చేయించింది సీబీఐ కోర్టు అని మాజీ ముఖ్యమంత్రి ఎన్.కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం పుంగనూరు గోకుల్ సర్కిల్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి అరెస్టుకు, తనకు సంబంధం లేదన్నారు. గడచిన 12 ఏళ్లలో తాను ఆయనను అరెస్ట్ చేయించినట్టు జగన్‌మోహన్‌రెడ్డి కూడా అనలేదన్నారు. జగన్ అరెస్టుకు తనకు సంబంధం లేదన్నారు. రాష్ట్ర విభజన చేయడం వల్లే ముఖ్యమంత్రి పదవిని వదిలేశానన్నారు. పుట్టపర్తి సాయిబాబా ట్రస్ట్ నుంచి టన్నుల కొద్దీ బంగారం తాను తీసుకెళ్లలేదని.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.



నేడు నామినేషన్ వేస్తా: పరిపూర్ణానంద



ఇక బీజేపీ తరఫున హిందూపురం ఎంపీ సీటు ఆశించి భంగపడ్డ పరిపూర్ణానంద స్వామీజీ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతానని స్పష్టంచేశారు. ఎంపీ సీటుతో పాటు హిందూపురం అసెంబ్లీ స్థానానికి కూడా నామినేషన్ వేయనున్నట్లు సోమవారం ఆయన మీడియాకు తెలిపారు. ఈనెల 23న అసెంబ్లీకి నామినేషన్ దాఖలు చేస్తానన్నారు. ఇక కూటమిపై ఆయన మాట్లాడుతూ.. అది పేరుకు మాత్రమే కూటమి అని, అక్కడంతా చంద్రబాబు, పురందేశ్వరి రాజకీయమే నడుస్తోందని మండిపడ్డారు. ముస్లిం ఓట్లు పడవనే ఉద్దేశంతోనే తనకు టికెట్ రాకుండా చంద్రబాబు అడ్డుపడ్డారని పరిపూర్ణానంద ఆరోపించారు. టీడీపీకి ఓటేస్తే సైకిల్ హైదరాబాదులో తిరుగుతుందని, ఇక్కడ ఉండదన్న విషయాన్ని హిందూపురం ప్రజలు గుర్తించాలని ఆయన కోరారు.

కూటమికి రెబల్స్ బెడద

హిందూపురం లోక్‌సభ పరిధిలో 3 పార్టీల మధ్య లేని సఖ్యత

- పుట్టపర్తిలో జతకట్టిన అసమ్మతి నేతలు.. అడ్రస్‌లేని జనసేన
- ధర్మవరంలో బీజేపీ సైలెంట్
- పెనుకొండలో బీకే పార్థసారథి వర్గం సవితమ్మకు దూరం
- స్వతంత్ర అభ్యర్థిగా పరిపూర్ణానంద బరిలోకి
- కూటమిలో బాబు, పురందేశ్వరి రాజకీయమే నడుస్తోందని ఫైర్
- మడకశిరలో ఇండిపెండెంట్‌గా డాక్టర్ సునీల్ నామినేషన్

బాబు-లోకేశ్‌పై కార్యకర్తల కారాలు..

హిందూపురం అసెంబ్లీ సీటును స్థానికులను కాదని ప్రతిసారీ నందమూరి కుటుంబ సభ్యులకే ఇవ్వడం, పెనుకొండ అసెంబ్లీ సీటు రాలేదని అసమ్మతిగా ఉన్న బీకే పార్థసారథికి ఎంపీ సీటు ఇవ్వడం, డాక్టరు సునీల్‌కుమార్‌కు వ్యతిరేకంగా ఉన్న గుండుమల తిప్పేస్వామి చెప్పినట్లుగా ఎంఎస్ రాజుకు బీఫాం ఇవ్వడంతో చంద్రబాబు-లోకేశ్ తీరుపై కార్యకర్తలు మండిపడుతున్నారు.



తెలుగుదేశం పార్టీ అసమ్మతి కార్యకర్తల దాడిలో ధ్వంసమైన కార్ల అద్దాలు

సాక్షి, పుట్టపర్తి/మడకశిర: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఒంటరిగా ఢీకొట్టే సత్తాలేక కూటమిగా ఏర్పడ్డ టీడీపీ-బీజేపీ-జనసేనకు హిందూపురం లోక్‌సభ పరిధిలో దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. ఉమ్మడి అభ్యర్థులకు ఆయా పక్షాల నుంచి సహకారం కరువైంది. ఏ ఒక్క నియోజకవర్గంలోనూ మూడు పార్టీల కార్యకర్తల మధ్య సఖ్యతలేదు. హిందూపురం పార్లమెంటు సీటుతో పాటు హిందూపురం అసెంబ్లీ, మడకశిర అసెంబ్లీ స్థానాల్లో రెబల్స్ బెడద వెంటాడుతోంది. అలాగే, పుట్టపర్తిలో అసమ్మతి నేతలు జతకట్టారు. ధర్మవరంలో స్థానిక బీజేపీ నేతలు మౌనంగా ఉన్నారు. కదిరిలో ముస్లింలందరూ ఏకతాటిపైకి వచ్చి టీడీపీకి ఓటుతో బుద్ధిచెప్పేందుకు సిద్ధమయ్యారు. నామినేషన్ల ప్రారంభం నాటి నుంచే ఇలా రోజుకో రకంగా సమీకరణాలు మారుతున్నాయి. పుట్టపర్తిలో జనసేన నాయకులు అడ్రస్ లేకుండాపోయారు. కదిరి కూటమిలో బీజేపీ జెండాలు కనిపించడం లేదు. పెనుకొండలో బీకే పార్థసారథి వర్గం సవితమ్మకు దూరంగా ఉంటోంది. ధర్మవరంలో వరదాపురం సూరి కనిపించడంలేదు. రాప్తాడులో పరిటాల సునీత వెంట బీసీ నాయకులు వెళ్లడంలేదు.

మడకశిరలో అసమ్మతి నేతల దాడులు

టీడీపీ టికెట్ మార్పుపై శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో సోమవారం కూడా టీడీపీ అసమ్మతి వర్గీయులు దాడులకు తెగబడ్డారు. ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గమైన ఈ అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా తొలుత డాక్టర్ సునీల్‌కుమార్‌ను చంద్రబాబు ప్రకటించారు. ఆ తర్వాత సునీల్ స్థానంలో ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజుకు కేటాయించారు. దీంతో సునీల్ వర్గీయులు ఆగ్రహించి ఆదివారం మడకశిరలోని పార్టీ కార్యాలయం ఎదుట ప్రచార సామగ్రిని దగ్ధం చేశారు. చంద్రబాబు ఫ్లెక్సీలను చెప్పులతో కొట్టారు. ఈ నిరసనలు సోమవారం కూడా పెల్లుబుకడంతో మడకశిర అట్టుడికిపోయింది. మరోవైపు.. మడకశిర టీడీపీ రెబల్ అభ్యర్థిగా సునీల్‌కుమార్ సోమవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పూర్తయిన తర్వాత సునీల్ వర్గీయులు స్థానిక ఏరియా ఆస్పత్రి వద్దకు చేరుకోగానే.. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఇంటి ఆవరణలో ఏర్పాటుచేసిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొనడానికి ఆ పార్టీ నాయకులు పలువురు కార్లలో వచ్చారు. టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజు ఈ కార్లలో ఉన్నారని భావించిన సునీల్ వర్గీయులు వాటిపై రాళ్లతో దాడిచేసి అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. తర్వాత సునీల్ వర్గీయులు పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో హిందూపురం పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి పెనుకొండ వైపు నుంచి రాగా.. ఆయన కారుపైనా సునీల్ వర్గీయులు దాడిచేశారు. దీంతో పోలీసులు లాఠీచార్జ్ చేసి టీడీపీ అసమ్మతి కార్యకర్తలను చెదరగొట్టారు.

ఎవడ్రా ఆపేది!?

యథేచ్ఛగా టీడీపీ, జనసేన కోడ్ ఉల్లంఘన

అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ సెంట్రల్)/పూతలపట్టు/కాణిపాకం/పుంగనూరు/చిత్తూరు అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు ఎన్నికల ప్రవర్తన నియమావళిని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. ప్రలోభాలకు తెరతీసి ఓటర్లకు ఎరలు వేయాలని చూస్తున్నారు. అనుమతికి మించి వాహనాల్లో ప్రచారం చేస్తున్నారు. మద్యం పంపిణీ విచ్చలవిడిగా సాగుతోంది. మనల్ని ఎవడ్రా ఆపేది.. అంటూ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఎన్నికల అధికారులు ఈ ఉల్లంఘనలపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు. విజయవాడ సెంట్రల్ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొండా ఉమా, సింగ్‌నగర్, వాంబేకాలనీ, రాజీవ్‌నగర్ ప్రాంతాలకు చెందిన కొందరు ఆటోడ్రైవర్లు ఇష్టానుసారం కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు. తమ వాహనాలపై



పవన్‌కళ్యాణ్ ఫొటోలతో ఉన్న ఆటోలు

తమ పార్టీ అధినేతల ఫొటోలు, తమ ఫొటోలను వేసుకుని ప్రయాణిస్తున్నారు. బొండా ఉమా తనయులు ఉపయోగిస్తున్న రెండు జీపులపై బొండా ఉమా ఫొటోలను తొలగించలేదు. పలువురు ఆటో డ్రైవర్లు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఫొటోలను తొలగించకుండా మనల్ని ఎవడ్రా ఆపేదంటూ తిరుగుతున్నారు.

పుంగనూరులో బాణసంచా హోరు

చిత్తూరు జిల్లా పుంగనూరులో సోమవారం నిర్వహించిన సభలో నిబంధనలు బేఖాతరయ్యాయి. రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి పుంగనూరులో బహిరంగసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. డీజే పాటలు పెట్టి డ్యాన్సులు చేశారు. మద్యాన్ని విచ్చలవిడిగా పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి రూ.300 నగదు, క్వార్టర్ బాటిల్, బిర్యానీ ఇచ్చినట్లు ఆయా పార్టీ వర్గాలే చెబుతున్నాయి. మద్యం షాపుల వద్ద టీడీపీ జెండాలు పట్టుకున్న కార్యకర్తలు కిక్కిరిసిపోయారు.

మద్యం మత్తులో తమ్ముళ్ల తన్నులాట

చిత్తూరు నగరంలో టీడీపీ తమ్ముళ్లు మద్యం మత్తులో రోడ్డుపైకి వచ్చి తన్నుకున్నారు. రోడ్డుపై వెళుతున్న వాహనాలవారు, పాదచారులు భయభ్రాంతులయ్యారు. కొంగారెడ్డిపల్లెలో ఎస్‌పీఎస్ మద్యం బార్‌లో టీడీపీ కార్యకర్తలు కొందరు బాగా మద్యం తాగారు. పక్క టేబుల్‌పై కూర్చున్న ఓ వ్యక్తిని అగ్గిపెట్టె అడిగారు. అతడు లేదనడంతో వాగ్వాదం జరిగింది. దీంతో రెచ్చిపోయిన టీడీపీ కార్యకర్తలు కనిపించిన వారిపై కనిపించినట్లు దాడులకు తెగబడ్డారు. బారు లోపల తన్నుకోవడంతో లోపల సామగ్రి కూడా ధ్వంసమైంది. కొద్దిసేపటి తరువాత రోడ్డుపైకి వచ్చి మళ్లీ కొట్టుకున్నారు. 'రేయ్, రాబోయేది మా రూలింగ్ రా, లోకేశ్ అన్న గెలవనీ ఒక్కొక్కడి కథ చూస్తా..' అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ ఘటనపై చిత్తూరు వన్ టౌన్ పోలీసులు ఆరా తీస్తున్నారు.

పూతలపట్టులో మద్యం దుకాణాలకు పరుగులు

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మురళీమోహన్ సోమవారం నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా ఆ పార్టీ కోడ్ ఉల్లంఘించింది. ప్రలోభాల పర్వానికి తెరతీసింది. 40కి పైగా బస్సులు, 20కి పైగా ట్రాక్టర్లు, 50 ఆటోలు, కార్లు, లారీలు, ఇతర వాహనాలు, మోటారు సైకిళ్లతో జనాన్ని మండల కేంద్రమైన పూతలపట్టుకు తీసుకొచ్చారు. ఇందుకోసం రూ.5 లక్షలకుపైగా ఖర్చుపెట్టినట్లు తెలుగు తమ్ముళ్లే బహిరంగంగా చెప్పుకొంటున్నారు. నామినేషన్‌కు వచ్చిన జనం నాయకుల వద్ద డబ్బు తీసుకుని మద్యం షాపులకు పరుగులు పెట్టారు. ఇటీవల జరిగిన ఓ పెళ్లి జంట బ్యానర్ వేసి.. ఆ పేరుతో టీడీపీ నాయకులు నామినేషన్‌కు వచ్చిన వారికి భోజనాలు పెట్టారు.



పూతలపట్టులో మద్యంషాపు వద్ద గుమికూడిన తెలుగు తమ్ముళ్లు

జగన్‌ను జైల్లో పెట్టిస్తానని సోనియాకు హామీ ఇవ్వలేదా?

మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డిపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధ్వజం

పీలేరు/కలికిరి/గుర్రంకొండ/వాల్మీకిపురం: రాష్ట్రాన్ని అడ్డగోలుగా విడగొట్టేందుకు సహకరించడమే కాకుండా.. జగన్‌ను జైల్లో పెట్టిస్తానని సోనియాగాంధీకి ముందే హామీ ఇచ్చింది నువ్వు కాదా అని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డిని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. కిరణ్‌కుమార్‌రెడ్డి వల్లనే రాష్ట్రం విడిపోయిందన్నారు. అన్నమయ్య జిల్లాలోని పీలేరు, గుర్రంకొండ, కలికిరి, వాల్మీకిపురం ప్రాంతాల్లో సోమవారం జరిగిన సభలు, సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ముస్లిం మైనారిటీలకు వైఎస్సార్ ప్రవేశపెట్టిన నాలుగు శాతం రిజర్వేషన్లు రద్దు చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, జాతీయ నాయకులు అమిత్‌షా, కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించడం ముస్లిం మైనారిటీల హక్కులను కాలరాయడమేనన్నారు. అలాంటి మతతత్వ పార్టీ తరఫున ఎలా పోటీ చేస్తున్నావని కిరణ్‌పై ధ్వజమెత్తారు. చంద్రబాబునాయుడు, కిరణ్‌కుమార్‌రెడ్డి ఇద్దరూ తోడు దొంగలేనని.. 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విడగొట్టి ప్రజలకు నీడలేకుండా కిరణ్‌కుమార్‌రెడ్డి చేస్తే.. హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా పదేళ్ల పాటు అవకాశం ఉన్నా.. ఓటుకు కోట్లు కేసులో చిక్కుకుని చంద్రబాబు



రాత్రికి రాత్రే ఏపీకి పారిపోయి వచ్చి రాజధాని లేకుండా చేశారని మండిపడ్డారు. ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు రాష్ట్రానికి, ప్రజలకు తీవ్రంగా ద్రోహం చేసిన వారేనని ధ్వజమెత్తారు. రాష్ట్ర విభజన తర్వాత ఐదేళ్ల టీడీపీ పాలనలో అమరావతి పేరు చెప్పి రియల్‌ఎస్టేట్ వ్యాపారంతో నాయకులంతా దోచుకున్నారని విమర్శించారు. మరోసారి మోసం చేయడానికి చంద్రబాబు 'సూపర్ సిక్స్' హామీలిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు బూటకపు హామీలు రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితి లేదని మంత్రి అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కులమతాలు, పార్టీలకతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వివరించారు. రైతుల కోసం ఆర్బీకేలు ఏర్పాటు చేసి అన్ని సేవలు అందిస్తున్న ఘనత జగన్‌కే దక్కిందన్నారు. 2014 ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి సోదరుడు కిషోర్ కుమార్‌రెడ్డిని ఎర్రచందనం స్మగ్లర్, మరో వీరప్పన్ అని విమర్శించిన చంద్రబాబు నేడు అదే వ్యక్తికి పీలేరు అభ్యర్థిగా ఎలా టికెట్ ఇచ్చారని ప్రశ్నించారు.

కుక్కలు చింపిన విస్తరిలా కూటమి

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అతుకుల బొంతకంటే దారుణంగా కుక్కలు చింపిన విస్తరిలా తయారైందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. ఆయన సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. సీట్ల సర్దుబాటులో కూటమి ఇప్పటికీ తికమకపడుతోందన్నారు. పవన్ కళ్యాణ్‌కు కనీసం రెండేళ్లైనా సీఎం పదవి ఇవ్వాలని జనసేన కార్యకర్తలు కోరుకున్నారని, కానీ.. పొత్తులో భాగంగా జనసేనకు తొలుత చంద్రబాబు 24 సీట్లు ఇచ్చి ఆ తర్వాత 3 సీట్లు కోత వేసి 21 స్థానాలకే పరిమితం చేశారని చెప్పారు. జనసేన లోకి టీడీపీ, ఇతర పార్టీల నేతలను పంపిన చంద్రబాబు.. 12 మందికి టికెట్లు ఇప్పించుకొన్నారని తెలిపారు. అంటే..



కనీసం 10 స్థానాల్లో కూడా పవన్ తన పార్టీ వారికి సీట్లు ఇప్పించుకోలేకపోయారన్నారు. ఇప్పుడు వీటిలో కూడా కోత పడుతుందని, చివరికి పిఠాపురం బరి నుంచి పవన్‌ను కూడా తప్పించే అవకాశాలున్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేయాలనే సాకుతో పిఠాపురం నుంచి పవన్‌ను తప్పించి, ఆ స్థానంలో తన మనిషైన వర్మను పోటీకి దింపాలని చంద్రబాబు చూస్తున్నారనారు. చంద్రబాబు బీజేపీలోకి కూడా టీడీపీ నేతలను పంపి, టికెట్లు ఇప్పిస్తున్నారన్నారు. అనపర్తిలో బీజేపీ అభ్యర్థిని మార్చి టీడీపీ నేతను బరిలోకి దించేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఇలా మొత్తం సీట్లపై తన పట్టు ఉండాలన్నదే చంద్రబాబు ఆలోచన అని తెలిపారు.

ధర్మయుద్ధానికి మేం సిద్ధం

2014 ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో జట్టుకట్టి, 650కిపైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఒక్క హామీనీ అమలు చేయలేదని, ప్రజల్ని మోసం చేశారన్నారు. ఇప్పుడు మళ్లీ అదే కూటమి కట్టిన చంద్రబాబుకు ప్రజల్లోకి వెళ్లేందుకు మొహం చాలడం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన సీఎం జగన్.. చెప్పని ప్రయోజనాలు కూడా ప్రజలకు కల్పించారని చెప్పారు. ప్రజలకు కావాల్సిన ప్రభుత్వం ఎలా ఉండాలో సీఎం జగన్ చేసి చూపించారన్నారు.

కబ్జా నాయకుడు చంద్రబాబు

చంద్రబాబు జనం నుంచి వచ్చిన నాయకుడు కాదని, టీడీపీని కబ్జా చేసి వచ్చిన నాయకుడని అన్నారు. బీజేపీ, జనసేనతో జట్టుకట్టి మరో చేత్తో కాంగ్రెస్‌ను ఆడిస్తున్నప్పటికీ తనకు లాస్ట్ ఛాన్స్ కూడా చేజారిపోతోందన్నది చంద్రబాబుకు అర్థమైందన్నారు. అందుకే సీఎం జగన్‌పై దూషణలకు దిగుతున్నారని, వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ, జనసేన కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులకు పురిగొల్పుతున్నారని చెప్పారు. ఎన్నికలను అపహాస్యం చేస్తూ చివరి ప్రయత్నంగా ఓటుకు నోట్లను ఎరగా వేసేందుకు టీడీపీ ఎన్నారై విభాగాన్ని రంగంలోకి దించారన్నారు. టీడీపీ ఎన్నారై విభాగం అధ్యక్షుడు కోమటి జయరాం ఓటర్లను వెధవలని సంబోధిస్తూ.. ఒక్కో కుటుంబానికి రూ. 2 నుంచి రూ.3 లక్షలు ఇచ్చైనా టీడీపీ వైపునకు తిప్పాలని పిలుపునిచ్చిన వీడియో వెలుగులోకి వచ్చిందని తెలిపారు. టీడీపీ ఎన్నారైలు మందలు మందలుగా గ్రామాల్లో తిరుగుతున్నప్పుడు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, ఓట్లు కొనుగోలు చేసే టీడీపీ ఎన్నారైల మందపై పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేయాలని పిలుపునిచ్చారు.

చిరంజీవిని ఎవరూ అవమానించలేదు

చిరంజీవి మంచి నటుడని, ఆయన్ని ఎవరూ అవమానించలేదని సజ్జల చెప్పారు. బ్యాంకులను మోసం చేసిన వారిని పక్కన కూర్చోబెట్టుకుని చిరంజీవి మాట్లాడారని, వారికి మద్దతు ప్రకటించారని.. దీనిపై మీ స్పందన ఏమిటని మీడియా ప్రశ్నిస్తే.. 'శుభం. రాష్ట్ర రాజకీయ తెరపై స్పష్టత వచ్చింది. తమను వంచించిన కూటమి ఓ వైపు... మంచి చేసిన సీఎం జగన్ మరో వైపు ఉన్నారన్నది ప్రజలకు తెలుస్తుంది' అంటూ స్పందించామన్నారు. అంతే తప్ప చిరంజీవిని అవమానించలేదని, ఆయన మళ్లీ రాజకీయాల్లోకి రావాలనుకుంటే రావొచ్చని చెప్పారు.

'పెమ్మసాని'.. చాలా ధనికస్వామి

▶ మొదటి పేజీ తరువాయి

ఆస్తులు కలిగి ఉన్నారు.

ఎవరి పేరు మీద ఎంతెంతంటే..

ఇక పెమ్మసాని చంద్రశేఖర్ తన పేరుతో రూ.23,16,54,45,165లు (రూ.2,316 కోట్ల 54 లక్షల, 45 వేల 165లు).. తన భార్య శ్రీరత్న కోనేరు పేరుతో రూ.22,89,35,36,539లు (రూ.2,289 కోట్ల 35 లక్షల 36 వేల 539లు).. కుమారుడు అభినవ్ పేరుతో రూ.4,96,27,61,094లు (రూ.496 కోట్ల 27 లక్షల 61 వేల 094లు).. కుమార్తె సహస్ర పేరుతో రూ.4,96,47,37,988లు (496 కోట్ల 47 లక్షల 37 వేల 988 రూపాయల ఆస్తులున్నట్లు ఆయన అఫిడవిట్‌లో చూపించారు. ఇవికాక.. తన పేరుతో రూ.72 కోట్ల విలువైన భూములు, భవనాలు, తన భార్య పేరుతో రూ.34 కోట్ల 82 లక్షల విలువైన భూములు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే, చేతిలో నగదు రూ.2,06,400లు.. భార్య దగ్గర రూ.1,51,800లు.. కుమారుడి దగ్గర రూ.16,500, కుమార్తె వద్ద రూ.15,900 నగదు ఉన్నట్లు చూపించారు.

రూ.2.36కోట్ల విలువైన ఆభరణాలు..

తన పేరుతో 181 గ్రాముల బంగారం, భార్య పేరుతో 2,567 గ్రాములు.. కుమారుడి పేరుతో 190 గ్రాములు.. కుమార్తె పేరుతో 498 గ్రాములు కలిపి మొత్తం రూ.2,36,40,500ల విలువైన అభరణాలున్నట్లు చంద్రశేఖర్ తన అఫిడవిట్‌లో పొందుపరిచారు. ఇక అప్పుల విషయానికి వస్తే తన పేరుతో రూ.519 కోట్లు, తన భార్య పేరుతో రూ.519 కోట్ల రుణాలున్నట్లు ఆయన పేర్కొన్నారు. తనపై అరండల్‌పేట పోలీసుస్టేషన్‌లో సెక్షన్ 143, 341, 188, 171-హెచ్, 171-ఈ రెడ్‌విత్ 149 ఐపీసీ కింద కేసు నమోదైనట్లు ఆయన చూపారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలంలోని మణిమేశ్వరం గ్రామానికి చెందిన జనసేన సీనియర్ నేత రాయపురెడ్డి కుటుంబరావు సోమవారం తన అనుచరులు 30 మందితో కలిసి పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉప్పాల రాము సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. గుడివాడ 22, 26 వార్డుల పరిధిలోని రైలుపేట, చెంచుపేట, కార్మిక నగర్‌కు చెందిన టీడీపీ నేతలు, యువత 100 మందికిపైగా గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని సమక్షంలో పార్టీలో చేరారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్, పట్టణ ప్రముఖుడు యెగ్గిన నాగబాబు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సమక్షంలో పార్టీలో చేరారు. ఉండి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు సమక్షంలో కలిసిపూడి గ్రామానికి చెందిన 30 మందికి పైగా టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు.

– బంటుమిల్లి/గుడివాడ టౌన్/ తాడేపల్లిగూడెం అర్బన్/కాళ్ల



కలిసిపూడి టీడీపీ నాయకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న పీవీఎల్





గుడివాడలో ఎమ్మెల్యే కొడాలి నాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కార్మిక నగర్, రైలుపేట, చెంచుపేట యువత



కృష్ణా జిల్లా మణిమేశ్వరంలో జనసేన నేత కుటుంబరావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉప్పాల రాము



వైఎస్సార్‌సీపీలో చేరిన తాడేపల్లిగూడెం మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ యెగ్గిన నాగబాబుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



వైఎస్సార్‌సీపీ చీరాల ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ సమక్షంలో పార్టీలో చేరిన వాడరేవుకు చెందిన మత్స్యకారులు

క్లుప్తంగా...

నాలుగు రోజుల్లో 1,944 నామినేషన్లు

సాక్షి, అమరావతి: నామినేషన్లు దాఖలు చేయడానికి మూడు రోజులే గడువు ఉండటంతో ఈ ప్రక్రియ ఊపందుకుంది. సోమవారం ఒక్కరోజే భారీస్థాయిలో నామినేషన్లు వేశారు. సోమవారం అసెంబ్లీకి 610 మంది 743 సెట్ల నామినేషన్లను, లోక్‌సభకు 112 మంది 142 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఇప్పటి వరకు అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకు కలిపి మొత్తం 1,944 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో అసెంబ్లీకి 1,651, లోక్‌సభకు 293 ఉన్నాయి. సోమవారం లోక్‌సభకు నామినేషన్లు దాఖలు చేసిన ప్రముఖుల్లో వైఎస్సార్‌సీపీ తరఫున బొత్స ఝాన్సీ (విశాఖ), కేశినేని నాని (విజయవాడ), పి.వి.మిథున్‌రెడ్డి (రాజంపేట), బూడి ముత్యాలనాయుడు (అనకాపల్లి), బెల్లాన చంద్రశేఖర్ (విజయనగరం), జె.శాంత (హిందూపురం), డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ (మచిలీపట్నం), ఎం.శంకరనారాయణ (అనంతపురం), టీడీపీ తరఫున పెమ్మసాని చంద్రశేఖర్, లావు కృష్ణదేవరాయులు, పుట్టా రవికుమార్, బి.నాగరాజు ఉన్నారు.

హెలికాప్టర్ మరమ్మతులతో ఆగిన పవన్ పర్యటన

పిఠాపురం/తాడేపల్లిగూడెం: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వెళ్లాల్సిన హెలికాప్టర్ మరమ్మతులకు గురికావడంతో సోమవారం సాయంత్రం తాడేపల్లిగూడెం, ఉంగుటూరుల్లో నిర్వహించాల్సిన ఎన్నికల ప్రచార సభలు వాయిదా పడ్డాయి. సోమవారం మధ్యాహ్నం తాడేపల్లిగూడెం సభకు బయలుదేరిన ఆయన గొల్లప్రోలులోని హెలిప్యాడ్ వద్దకు చేరుకోగానే హెలికాప్టర్ మొరాయించింది. దీంతో తాడేపల్లిగూడెం, ఉంగుటూరు ఎన్నికల ప్రచార సభలు వాయిదా వేసుకుని చేబ్రోలు వెళ్లిపోయారు.

ముస్లింలపై బీజేపీ, టీడీపీ, జనసేన విషం

వైఎస్సార్‌సీపీ స్టేట్ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి దస్తగిరి



సాక్షి, అమరావతి: ముస్లింలపై బీజేపీ, టీడీపీ, జనసేన విషం కక్కుతున్నాయని, ముస్లింలపై బీజేపీ వ్యతిరేక వైఖరికి చంద్రబాబు, పవన్ కూడా బాధ్యత వహించాలని వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ దస్తగిరి మండిపడ్డారు. ఎక్కువ మంది పిల్లలున్న ముస్లింలకు ఈ దేశ సంపదను ఎందుకు పంచాలంటూ మోదీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం దస్తగిరి ఓ ప్రకటన విడుదల చేశారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ముస్లిం సమాజాన్ని దెబ్బతీసేందుకు కూటమిగా ఒప్పందం చేసుకున్నట్లుందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి వైఖరిపై ముస్లిం సంఘాలు స్పందించాలని, ముస్లిం నేతలు టీడీపీని వీడి బయటకు రావాలని దస్తగిరి విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ ఎలక్షన్ కో-ఆర్డినేటర్ల నియామకం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ క్రిస్టియన్ మైనార్టీ వ్యవహారాల ఎలక్షన్ కో-ఆర్డినేటర్లను నియమించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. డాక్టర్ ఇమ్మానుయేల్ రెబ్బా బాపట్ల జిల్లాకు, గేరా హానోక్ ఎన్టీఆర్ జిల్లాకు, ఎస్.జయ్‌కాంత్ క్రిస్టియన్ కర్నూలు జిల్లాకు, పల్లిపాముల జీవన్‌కుమార్ ఏలూరు జిల్లాకు, శామ్యూల్ అరుణ్‌కుమార్ శ్రీకాకుళం జిల్లాకు క్రిస్టియన్ మైనార్టీ వ్యవహారాల ఎన్నికల కో-ఆర్డినేటర్లుగా నియమితులయ్యారు.

38 మందితో కాంగ్రెస్ జాబితా విడుదల

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సంబంధించి 38మంది అభ్యర్థులతో కాంగ్రెస్ పార్టీ సోమవారం ఒక జాబితాను విడుదల చేసింది. గతంలో సీట్లు ప్రకటించిన పది మంది అభ్యర్థులను మార్పుచేసి వారి స్థానంలో కొత్తవారిని ఎంపిక చేసింది. తాజాగా విడుదల చేసిన జాబితాలో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి సుంకర పద్మశ్రీ, చీరాల నుంచి ఆమంచి కృష్ణమోహన్‌కు చోటు లభించింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు.

సీఎం జగన్ కుటుంబ స్థిరాస్తులు రూ.106.96 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

సీఎం జగన్ పేరున రూ.483.08 కోట్లు, భారతిరెడ్డి పేరిట రూ.119.38 కోట్లు, కుమార్తెలు హర్షిణీ రెడ్డి పేరిట రూ.24.26 కోట్లు, వర్షా రెడ్డి పేరిట రూ.23.94 కోట్ల చరాస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. తాజాగా 2022–23లో వైఎస్ భారతి రెడ్డి వ్యక్తిగత ఆదాయం రూ.10.96 కోట్లుగా పేర్కొనగా ఆమె ఇతరులకిచ్చిన రుణాలు రూ.30.91 లక్షల మేర ఉన్నాయి. రూ.1.57 కోట్లు ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లించగా అడ్వాన్సు ట్యాక్స్ రూ.2.48 కోట్లు చెల్లించారు. ఆమె ఇతరుల నుంచి తీసుకున్న అడ్వాన్సులు, రుణాలు రూ.7,41,79,353 వరకూ ఉన్నాయి. ఇక 2022–23 సంవత్సరానికి సీఎం జగన్ వ్యక్తిగత ఆదాయం రూ.57.74 కోట్లు కాగా ఇతరులకు ఇచ్చిన రుణాలు రూ.179.74 కోట్ల వరకూ ఉన్నాయి. రూ.4.66 కోట్లు ఇన్‌కమ్ ట్యాక్స్‌గా చెల్లించగా, ఈ ఏడాది అడ్వాన్సు ట్యాక్స్ రూ.13.95 కోట్ల మేర చెల్లించారు. ఇతరుల నుంచి తీసుకున్న అడ్వాన్సులు, రుణాలు రూ.1,1078,350 వరకూ ఉన్నాయి. తనపై వివిధ కోర్టుల్లో 26 కేసులు విచారణలో ఉన్నట్లు అఫిడవిట్‌లో జగన్ వెల్లడించారు.

సీఎం జగన్ హత్యకు కుట్రలు పన్నకండి చంద్రబాబూ..!

ప్రజల మనిషి సీఎం జగన్‌పై ఇలాంటి కుట్రలు వద్దు

- బాబుకు మనిషిని చంపడమంటే గడ్డిపోచతో సమానం?
- పవన్‌కు నాలుగో పెళ్లాం లేదా? అయిదో పెళ్లాం వెయిటింగ్ కదా?
- వైఎస్సార్‌సీపీ నేత పోసాని కృష్ణ మురళి సంచలన వ్యాఖ్యలు



సాక్షి, అమరావతి: అధికారం కోసం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎంతకైనా తెగిస్తారని, అలాంటి వ్యక్తి ఈ సమాజానికి ప్రమాదకారి అని వైఎస్సార్‌సీపీ నేత పోసాని కృష్ణమురళి చెప్పారు. చంద్రబాబూ.. దయచేసి మంచి ముఖ్యమంత్రి అయిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హత్యకు కుట్రలు పన్నకండి అని అన్నారు. 'నన్ను చంపినా పరవా లేదు. ప్రజల మనిషి సీఎం జగన్‌ను మాత్రం హత్య చేయకండి. ఆయన జోలికి మాత్రం రావొద్దు. ఆయన్ని చంపితే ఐదు కోట్ల మంది రాష్ట్ర ప్రజలను చంపినట్టే. ఎందుకంటే రాష్ట్ర ప్రజల జీవితాలు, భవిష్యత్తు నాశనం అవుతాయి' అని చెప్పారు. పోసాని సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు, మెగా బ్రదర్స్ చిరంజీవి, పవన్ కళ్యాణ్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బాబుకు మనిషిని చంపడమంటే గడ్డిపోచతో సమానం. ఆయనకి తెలియకుండా ఏపీలో హత్యలు జరగవు అని ఆరోపించారు.

రాంగోపాల్‌వర్మను మర్డర్ చేయడానికి ప్లాన్

'సీఎం జగన్‌కు మద్దతు తెలిపిన రాంగోపాల్‌వర్మను మర్డర్ చేయడానికి ప్లాన్ చేసి, ఆ తర్వాత ఆగారు. ఈ విషయం నేను రాంగోపాల్ వర్మకు కూడా చెప్పలేదు. మంచి చేసిన పాలకులకు మద్దతు పలికితే చంపేస్తారా? ప్రముఖ జర్నలిస్టు ఐ.వెంకట్రావు కుమారుడు అనిల్ దీనిలో ముఖ్యుడు. నా తల్లి సాక్షిగా చెప్తున్నా. నీ పేరే చెప్పారు. మన కమ్మ వాళ్లే చెప్పారు. అనిల్ ప్లాన్ చేస్తే.. రాజేశ్ కిలారుకు చెప్పారు. దీనికి నారా లోకేశ్ కూడా ఒకే అన్నారు. చంద్రబాబు దానికి నో అన్నారు. అతను పిచ్చోడు, అతన్ని చంపితే మన కొచ్చేదేముంది. వదిలేయండి అని అన్నారు. రాంగోపాల్ వర్మ స్థానంలో నేను కావచ్చు. అయినా నేను లెక్కచేయను. ఓడిపోతే మనిషికి లక్ష రూపాయలు ఇచ్చి మళ్లీ గెలవండి. కానీ, హత్యలు చేయకండి' అని అన్నారు.

జగన్ వద్ద రాజకీయ పాఠాలు నేర్చుకో పవన్

'మీ అమ్మను తిడితే ఎప్పుడైనా లోకేశ్ చొక్కా పట్టుకున్నావా పవన్? నీకు నాలుగో పెళ్లాం లేదా? అయిదో పెళ్లాం కూడా వెయిటింగ్ లిస్ట్ కదా? వలంటీర్ ఆడపడుచులను ట్రాఫికింగ్ చేస్తారన్నప్పుడు తప్పు అనిపించలేదా? డెడికేషన్ అంటే సీఎం జగన్‌ది. పెద్ద పెద్ద వారిని ఎదుర్కొన్నారు. పవన్ ఆయన వద్ద రాజకీయ పాఠాలు నేర్చుకోవాలి. తనని చంద్రబాబు బచ్చా అన్నా సీఎం జగన్ తొణకలేదు. చంద్రబాబు నన్ను ఇలా అంటున్నారు అంటూ నింపాదిగా ప్రజలకు చెప్పారు. పవన్‌లా గెంతులేసి కొట్టేస్తా.. తిట్టేస్తా.. అనడంలేదు. చంద్రబాబు దగ్గర నేర్చుకోడానికి ఏమీ లేదు. రాంగ్ రూట్‌లో సీఎం ఎలా అవ్వాలి, డబ్బెలా సంపాదించాలి, వెన్నుపోటు ఎలా పొడవాలన్నదే చంద్రబాబుకు తెలుసు. చంద్రబాబు జనంలో నుంచి పుట్టిన నాయకుడు కాదు. మామను వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన మళ్లీ జనంలోకి వెళ్లరు, జనాన్ని నమ్మరు. చంద్రబాబు ఓటర్లను ఎలా బురిడీ కొట్టించాలా, ఎలా కొనుగోలు చేయాలా అని అనుకుంటారు. సీఎం జగన్ ప్రజలను నమ్ముకుంటారు. ప్రజలకు మంచి చేయాలనుకుంటారు. ప్రజలంటే ఆయనకు ప్రేమ. ఇదే వారిద్దరి మధ్య తేడా' అని పోసాని చెప్పారు.

కోమటి జయరామ్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

- టీడీపీ ఎన్‌ఆర్‌ఐ యూఎస్ కో–ఆర్డినేటర్ జయరామ్ ఓటర్లను వెధవలు అనడం సిగ్గుచేటు
- ఆయన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే
- టీడీపీ ఎన్‌ఆర్‌ఐ కోర్డినేటర్‌గా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి
- ప్రజలలో తిరిగి ఓట్లు అడగాలి
- తానా ఫౌండేషన్ మాజీ చైర్మన్ యార్లగడ్డ వెంకటరమణ



సాక్షి, అమరావతి: ఓటర్లను కొనుగోలు చేయవచ్చనే టీడీపీ ఎన్‌ఆర్‌ఐ యూఎస్ కోఆర్డినేటర్ కోమటి జయరామ్ వ్యాఖ్యలు ఎన్‌ఆర్‌ఐలందర్నీ ప్రజల దృష్టిలో చులకన చేయడమే అవుతుందని తానా ఫౌండేషన్ మాజీ చైర్మన్ యార్లగడ్డ వెంకటరమణ అన్నారు. ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవడంతో పాటు కోమటి జయరామ్ ప్రజలకు, ఓటర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కోమటి జయరామ్ చేసిన వ్యాఖ్యల్ని విని షాక్ అయ్యానన్నారు. తానా వంటి గొప్ప సంస్థకు అధ్యక్షునిగా పనిచేసిన వ్యక్తి ఇలా మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు. సేవ చేయాలంటే ఎవరికి నచ్చిన పార్టీలో వారు చేరవచ్చని, కానీ.. ఓటర్లను వెధవలు అని అవమానకర రీతిలో మాట్లాడటం బాగాలేదని ఖండించారు. అమెరికా లాంటి దేశాల నుంచి వచ్చి రూ.కోట్లు పెట్టి ఓట్లు కొంటామనడం గర్హనీయమన్నారు. ఓటర్లను కొనుగోలు చేయవచ్చనే ఆలోచనలు ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నాన్ని అంతా ఖండిస్తుంటే.. కోమటి జయరామ్ వ్యాఖ్యలను టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఎలా ఉపేక్షిస్తున్నారని ప్రశ్నించారు. జయరామ్ దగ్గర డబ్బులు ఉంటే.. ప్రజలకు సేవచేసి అభిమానం పొందాలే తప్ప ఓటర్లను అమ్ముడుపోయే వారనే రీతిలో వ్యాఖ్యలు చేయవద్దని హితవు పలికారు.

పేదల జీవితాల్ని మార్చిన సంక్షేమ పథకాలు

తానాలో తాను పనిచేసినప్పుడు మన దేశంతో పాటు రాష్ట్రంలో అనేక మారుమూల గ్రామాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేశామని యార్లగడ్డ వెంకటరమణ గుర్తు చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నారని, ఆయన ఆశయాలకు స్ఫూర్తి పొందానని చెప్పారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి 1.30 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించడంతో పాటు లక్షలాది మందిని సేవాభావంతో పనిచేసేలా వలంటీర్లను తీర్చిదిద్దారన్నారు. సీఎం జగన్ పెట్టిన వలంటీర్ల వ్యవస్థ ఎంతో బాగా పనిచేస్తోందని.. సంక్షేమ పథకాలను ప్రజల గడప వద్దకే తీసుకువెళ్లారని అభినందించారు. ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లను సైతం వారి ఇంటికే తీసుకెళ్లి వలంటీర్లు అందిస్తున్నారని, 65 లక్షల మంది వృద్ధులు, వితంతువులకు పింఛన్ల అందించడం, కోవిడ్ లాంటి సంక్షోభంలోనూ ప్రజలకు ధైర్యం కల్పించడం గొప్ప విషయమన్నారు. ఒక దేశం బాగుపడాలంటే పేదలకు ప్రభుత్వాలు అండగా నిలబడాలని, సీఎం జగన్ అదే చేస్తున్నారని అన్నారు. ఉపాధి కల్పించడంతోపాటు పేదలకు విద్య, వైద్యం విషయంలో మెరుగైన పథకాలు అందిస్తున్నారని వివరించారు. రేపల్లె సమీపంలోని ఓ గ్రామాన్ని తాను ప్రత్యక్షంగా చూశానని, సీఎం జగన్ పథకాలు పేదవారిలో ధైర్యం నింపుతున్నాయని స్పష్టం చేశారు. ప్రజలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం అన్నివిధాలా వృద్ధి సాధిస్తుందనే వాస్తవాన్ని తాను నమ్ముతానని.. అందుకే తాను వైఎస్సార్‌సీపీలో భాగస్వామి అయ్యానని చెప్పారు. మా ప్రభుత్వ పథకాలు అందితేనే నాకు, నా పార్టీకి ఓటు వేయండని అడుగుతున్న దమ్మున్న నేత సీఎం జగన్ అని కొనియాడారు.

పవన్‌కళ్యాణ్ పిచ్చి ప్రేలాపనలు

ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



భీమవరం: సినీ గ్లామర్‌తో కార్లను మార్చినట్లు భార్యలను మార్చుతున్న జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ హిందూ వివాహ వ్యవస్థను భ్రష్టుపట్టిస్తూ పిచ్చిప్రేలాపనలు పేలుతున్నాడని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ విమర్శించారు. నిలకడలేని పవన్ మానసిక స్థితి సరిగా లేదని, తక్షణం మెరుగైన వైద్యం కోసం వైజాగ్‌లోని పిచ్చాస్పత్రిలో చేర్చాలని చిరంజీవి కుటుంబ సభ్యులకు ఆయన సూచించారు. సోమవారం భీమవరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పదేళ్ల పాటు శాసనసభ్యుడిగా పనిచేసి భీమవరం నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి పనులూ చేపట్టని 'తెలుగు జనసేన' అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)ను పక్కన పెట్టుకుని తనపై ఆరోపణలు చేస్తున్న పవన్ పిచ్చి పరాకాష్టకు చేరిందని ధ్వజమెత్తారు. ప్రముఖ కాపు నేత రంగాను హత్య చేయించిన గూండాలతో జత కట్టిన పవన్ భీమవరంలో గూండాలు, రౌడీలు, బాంబుల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఊగిపోతూ, రెచ్చిపోతూ పవన్ వాడుతున్న భాషను చూస్తే రౌడీ ఎవరో ప్రజలు ఇప్పటికే గుర్తించారని చెప్పారు. అందువల్లనే గత ఎన్నికల్లో భీమవరంలో పవన్‌ను చిత్తు చిత్తుగా ఓడించి ఇంటికి పంపించారన్నారు. తాను ఎమ్మెల్యేగా అనేక గుర్తుండిపోయే ల్యాండ్‌మార్క్ అభివృద్ధి పనులు పూర్తిచేయించానని చెప్పారు. గతంలో రాష్ట్రానికి పాచిపోయిన లడ్డూలిచ్చారంటూ ప్రధాని నరేంద్ర మోదీని తిట్టిన పవన్ బీజేపీతో ఎలా జతకట్టాడని ప్రశ్నించారు. కరోనా వైరస్ సమయంలో ప్రజలు అల్లాడిపోతుంటే.. పక్క రాష్ట్రానికి పారిపోయిన పవన్.. నేడు ఏముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నాడని శ్రీనివాస్ దుయ్యబట్టారు. చిరంజీవి స్వార్థంతో తనకు పదవి రావడం కోసం ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్ పార్టీకి అమ్ముకుంటే.. నేడు రోజువారీ ప్యాకేజీ కోసం తన తల్లిని దూషించిన చంద్రబాబు, లోకేశ్‌తోనే పవన్ జత కట్టారని గ్రంధి శ్రీనివాస్ విమర్శించారు.

రిజర్వేషన్లపై అబద్ధాలు ఎందుకు పవన్

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లను వైఎస్సార్‌సీపీ తగ్గించలేదు
- సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌కు అనుగుణంగానే ఏపీ, తెలంగాణాల్లో రిజర్వేషన్లు
- పవన్‌కళ్యాణ్‌కు సామాజిక న్యాయ వేదిక బహిరంగ లేఖ

సాక్షి, అమరావతి: 'రిజర్వేషన్ల అంశంపై అబద్ధాలు ఎందుకు చెబుతారు పవన్..' అని సామాజిక న్యాయవేదిక(ఎస్‌జేఎఫ్) ప్రశ్నించింది. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం, భీమవరంలో ఆదివారం రాత్రి నిర్వహించిన బహిరంగ సభల్లో పవన్ అబద్ధాలు, సహేతుకం కాని అంశాలను మాట్లాడటం సరికాదని ఎస్‌జేఎఫ్ పేర్కొంది. ఈ మేరకు ఎస్‌జేఎఫ్ సోమవారం ఒక బహిరంగా లేఖ రాసింది. ఆ లేఖను ఎస్‌జేఎఫ్ రాష్ట్ర చైర్మన్ యర్రాకుల తులసీరామ్ యాదవ్, కో–చైర్మన్ కోటిపల్లి అయ్యప్ప, కన్వీనర్ పంచాది రంగారావు, కో–కన్వీనర్లు పెద్దిరెడ్డి మహేష్, వంగా ఆంజనేయులు మీడియాకు విడుదల చేశారు. పవన్ చెప్పిన అబద్ధాలపై రాష్ట్ర ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలనే ఈ ప్రకటన విడుదల చేసినట్లు వారు తెలిపారు. 'స్థానిక సంస్థల్లో బీసీలకు గతంలో ఉన్న 34శాతం రిజర్వేషన్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 24శాతానికి తగ్గించేసిందంటూ పవన్ చేసిన ఆరోపణలో నిజం లేదు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని వివిధ వర్గాలవారి రిజర్వేషన్లు అన్నీ కలిపి 50శాతానికి మించకూడదని మీకు తెలియదా..? సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌కు లోబడే అప్పట్లో టీఆర్‌ఎస్, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాలు వ్యవహరించాయి. సున్నితమైన అంశాలపై వాస్తవాల ఆధారంగా మాత్రమే మాట్లాడాలి. ఆ దిశగానే హామీలు ఇవ్వాలి. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించిన పవన్ విద్యా, ఉద్యోగాల్లో కూడా కల్పిస్తామని ఎందుకు హామీ ఇవ్వలేదు? ఇది ఓట్ల రాజకీయాల కోసం పవన్ ప్రదర్శిస్తున్న ద్వంద్వ నీతికి నిదర్శనం. పవన్‌కు చిత్తశుద్ధి ఉంటే బీసీలకు విద్యా, ఉద్యోగాల్లో 34 శాతం రిజర్వేషన్లు ఇస్తామని, స్థానిక సంస్థల్లోను ఏ, బీ, సీ, డీ, ఈ వర్గీకరణను అమలు చేస్తామని ప్రకటించాలి. జనాభా ప్రాతిపదికన 50శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేస్తామనేది కూటమి విధానమని ప్రకటించకుండా పవన్ మభ్యపెట్టేలా మాట్లాడడం సరికాదు' అని ఎస్‌జేఎఫ్ పేర్కొంది.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50శాతం సీట్లు ఇచ్చిన వైఎస్సార్‌సీపీ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి స్థానిక సంస్థల్లో బీసీలకు 33.3శాతం రిజర్వేషన్‌ను ప్రభుత్వ విధానపరంగా అమలుచేశారు. టీడీపీ మాత్రమే బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్లను వైఎస్సార్‌సీపీ తొలగించినట్లు పవన్ అవాస్తవాలు చెప్పడం సరికాదు. వాస్తవానికి వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50శాతం సీట్లు ఇచ్చి రిజర్వేషన్ కన్నా ఎక్కువ మేలు చేసింది. అదే విధానానికి కట్టుబడి ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో సైతం 175 అసెంబ్లీ, 25 ఎంపీ(మొత్తం 200)సీట్లలో 100సీట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు వైఎస్సార్‌సీపీ కేటాయించింది' అని ఎస్‌జేఎఫ్ నేతలు వివరించారు.

రైతులకు జగన్ చేసిందేమీ లేదు

- వెలిగొండ పూర్తి చేయకుండా ఐదేళ్లూ గాడిదలు కాశారా?
- ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల విమర్శలు



యర్రగొండపాలెం సభలో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ షర్మిల

యర్రగొండపాలెం/పెద్దదోర్నాల/చీమకుర్తి/అద్దంకి: వైఎస్సార్ ఆశయాలు నిలబెట్టాల్సిన జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం ఏమీ చేయలేదని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. సోమవారం ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల, యర్రగొండపాలెం, చీమకుర్తి, అద్దంకి సభల్లో ఆమె మాట్లాడారు. 'రైతులకు మద్దతు ధర ఇస్తానన్న జగన్.. ఆ విషయాన్ని పట్టించుకోలేదు. ధరల స్థిరీకరణ నిధిని ఉపయోగించలేదు. వైఎస్సార్ బతికుంటే వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తయ్యేది. సిగ్గులేదా చంద్రబాబు ఎందుకు వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేయలేదని ప్రతిపక్ష నాయకుడిగా తిట్టిపోసిన జగన్.. అధికారంలోకి వచ్చి ఐదేళ్లయినా ప్రాజెక్టును పూర్తి చేయలేదు. ఐదేళ్ల పాటు ఏం చేశారు? గుడ్డి గుర్రాలకు పళ్లు తోమారా, గాడిదలు కాశారా? రాష్ట్రంలో ట్రయాంగిల్ స్టోరీ నడుస్తోంది. బీజేపీతో టీడీపీ బహిరంగ పొత్తు పెట్టుకుంటే.. వైఎస్సార్‌సీపీ అక్రమ పొత్తు పెట్టుకుంది. దీనిని ట్రయాంగిల్ స్టోరీ అనక ఏమనాలి. మెగా డీఎస్సీ అంటూ దగా డీఎస్సీ ఇచ్చిన వీళ్లా వైఎస్ రాజశేఖరరెడ్డి వారసులు? చిన్నాన్నను హత్య చేసిన వాళ్లకు ఎంపీ టికెట్ ఇచ్చి హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న వీళ్లా రాజశేఖరరెడ్డి వారసులు. మద్యం షాపులను కూడా ప్రభుత్వమే నిర్వహిస్తోంది' అంటూ షర్మిల విమర్శలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు.

దొంగను తరిమికొట్టడానికి సిద్ధమా?

జగ్గంపేట, ఎస్.కోట సభల్లో చంద్రబాబు



జగ్గంపేటలో మాట్లాడుతున్న చంద్రబాబు

గోకవరం/ఎస్.కోట: దొంగ, దోపిడీదారుడు మీ ఇంటి మీదకి వస్తే ఏం చేస్తారు? మనిషికి ఏం దొరికితే దానితో రోడ్డు మీదకి వస్తారా లేదా? బందిపోటు దొంగ, దోపిడీదారుడు వచ్చాడు. తరిమికొట్టడానికి సిద్ధమా? అని చంద్రబాబు ప్రజల్ని ప్రశ్నించారు. కాకినాడ జిల్లా జగ్గంపేట, విజయనగరం జిల్లా ఎస్.కోటలో సోమవారం నిర్వహించిన ప్రజాగళం సభల్లో ఆయన ప్రసంగించారు. ప్రజల్లో మార్పు కనిపిస్తోందని, వైఎస్సార్‌సీపీ కొట్టుకుపోతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలపై ఢిల్లీలో ప్రధాని, రాష్ట్రపతి, ప్రధాన న్యాయమూర్తికి చెప్పడానికి వెళ్లిన గుంటూరుకు చెందిన కొవూరి లక్ష్మి అక్కడ చేతి బొటనవేలు తెగకొట్టుకుని నిరసన తెలిపిందన్నారు. ఈ రాక్షసులతో ఆమె ఎంత ఇబ్బంది పడిందో అన్నారు. ఈ దుర్మార్గులు మళ్లీ వస్తే ఏమవుతుందో ప్రజలంతా ఆలోచించుకోవాలన్నారు. చిరంజీవి, రాజమౌళి, ప్రభాస్ వంటి సినిమా వాళ్లని పిలిపించి జగన్‌మోహన్‌రెడ్డి అవమానించారని విమర్శించారు. చివరికి సాక్షిలో గుమాస్తాగా పనిచేసిన సజ్జల వంటి వ్యక్తి చిరంజీవిని విమర్శించే పరిస్థితికి వచ్చారంటే రోషం రావడం లేదా అని అడుగుతున్నానన్నారు. పవన్‌కళ్యాణ్‌ను బూతులు తిడుతున్నారని, ఆయన భరించలేక జగన్ నువ్వు కూడా రా.. కాపురం చెయ్యి అనే పరిస్థితికి వచ్చాడని చెప్పారు. మీ భార్య, కుటుంబం విషయం మేం మాట్లాడామా అని ప్రశ్నించారు. పవన్‌కళ్యాణ్ ఎక్కడ.. సైకో జగన్ ఎక్కడ.. ఒకసారి ఆలోచించాలన్నారు. పవన్‌కు రాజకీయాలు అవసరం లేదని, ఏ సినిమాలో యాక్ట్‌చేసినా రూ.50 కోట్లు సునాయాసంగా తీసుకోగలరని చెప్పారు. అలాంటి వ్యక్తి కాలిగోటికి కూడా సరితూగని జగన్ ఇష్టానుసారం మాట్లాడుతున్నాడని విమర్శించారు. తనను కూడా వదిలిపెట్టలేదన్నారు. బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా చేస్తామన్నారు. ఈ రోజు సూపర్ సిక్స్ తీసుకొచ్చామని, పవన్‌కళ్యాణ్ మరో రెండు చెప్పారని, వాటితో కలిపి టాప్ 10 తీసుకుని మేనిఫెస్టో ఇస్తామని ఆయన చెప్పారు. ఈ సభల్లో టీడీపీ, జనసేన మినహా బీజేపీ జెండా ఒక్కటి కూడా కనిపించలేదు. ప్రజాస్పందన కరువైన ఈ సభకు టీడీపీ కార్యకర్తలే నామమాత్రంగా హాజరయ్యారు.

మల్లన్నను దర్శించుకున్న చంద్రబాబు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లను సోమవారం చంద్రబాబు దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. మల్లికార్జున స్వామికి అభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన చేశారు. వారిని వేదపండితులు ఆశీర్వదించగా ఆలయ ఏఈవో హరిదాసు ప్రసాదాలను అందజేశారు. భ్రమరాంబ అతిథిగృహంలో అభ్యర్థులకు పార్టీ బీ–ఫామ్‌లను చంద్రబాబు అందజేశారు.

ఓటర్లను దూషించిన కోమటి జయరామ్‌ను కఠినంగా శిక్షించాలి



విజయవాడలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎపిక్ ఫోరం చైర్మన్ పి.విజయబాబు

- టీడీపీ ఎన్నారై విభాగంపై ఈసీ చర్యలు తీసుకోవాలి
- ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేసే వ్యాఖ్యలివి
- రౌండ్ టేబుల్ సమావేశంలో మేధావుల డిమాండ్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఓటర్లను వెధవలంటూ అవమానకరంగా మాట్లాడిన టీడీపీ ఎన్నారై విభాగం కోఆర్డినేటర్ కోమటి జయరామ్‌పై పలువురు ఎన్నారైలు, పౌర సంఘాల ప్రతినిధులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. డబ్బుతో ఓటర్లను కొనాలంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. జయరామ్ చేసిన వ్యాఖ్యలు ప్రవాస భారతీయులకు తలవంపులు తెచ్చేవిగా ఉన్నాయన్నారు. ఆయన పాస్‌పోర్టు సీజ్ చేయాలని, కఠినంగా శిక్షించాలి డిమాండ్ చేశారు. ఆయనపై భారత ఎన్నికల సంఘం సుమోటోగా కేసు నమోదు చేయాలని కోరారు. 'ఎన్నికల్లో ప్రవాసాంధ్రుల పాత్ర' అనే అంశంపై ఏపీ ఇంటెలెక్చువల్ అండ్ సిటిజన్ ఫోరం (ఎపిక్ ఫోరం), ఎడిటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో మేధావులతో జరిపిన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.

కోమటి జయరామ్‌ను అరెస్టు చేయాలి

పల్లె జనాన్ని హేయంగా, అమానవీయంగా మాట్లాడిన జయరామ్ పుట్టింది కూడా పల్లెలోనే అని ఎపిక్ ఫోరం అధ్యక్షుడు పి.విజయబాబు అన్నారు. తెలుగు పల్లెల్లో పుట్టి అడ్డదారుల్లో అమెరికా వెళ్ళి అక్రమంగా సంపాదించిన జయరామ్ లాంటి కొందరు చంద్రబాబు కనుసన్నల్లో పనిచేస్తున్నారని చెప్పారు. తానా ముసుగులో ఆయన చేసిన అరాచకం అంతా ఇంతా కాదన్నారు. చంద్రబాబుకి ఊడిగం చేస్తూ వచ్చే ఎన్నికల్లో కోట్లు కుమ్మరించి ఫలితాలను తారుమారు చేయాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఒక్కో కుటుంబాన్ని రెండు, మూడు లక్షల రూపాయలతో కొనాలని పిలుపునిచ్చిన కోమటి జయరామ్‌ను వెంటనే అరెస్ట్ చేసి పాస్‌పోర్టు సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. విదేశాల నుంచి వచ్చిన అసాంఘిక శక్తులు ఓటర్లను కొనాలంటూ వ్యాఖ్యలు చేయడం ఎంసీసీ పరిధిలోకి వస్తుందని, ఈసీఐ, కేంద్ర ప్రభుత్వం సుమోటోగా తీసుకున్ని చర్యలు చేపట్టాలని కోరారు. ఎన్నికల వేళ దేశంలోకి ఏ ఉద్దేశంతో వచ్చారో, వారికి ఎవరు ఆశ్రయం ఇచ్చారో విచారించి చర్యలు చేపట్టాలన్నారు. తమ సంఘం తరపున ఈడీకి ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

టీడీపీ ఎన్నారై విభాగంపై దర్యాప్తు చేయాలి

ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు మాట్లాడుతూ.. టీడీపీ ఎన్నారై విభాగం ఎన్నికల సమయంలో డబ్బు మూటలతో రాష్ట్రంలో దిగిందని అన్నారు. జిల్లాకు రూ. 20 కోట్లు చొప్పున 26 జిల్లాల్లో ఓట్లు కొనుగోలుకు ప్రణాళిక రచించారని చెప్పారు. ఇందులో భాగమే కోమటి జయరామ్ వ్యాఖ్యలని చెప్పారు. టీడీపీ ఎన్నారై కార్యకలాపాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. ఎన్నారై వెంకట్ మేడపాటి మాట్లాడుతూ లోకేశ్ సహా టీడీపీ నాయకులు విదేశాలకు వచ్చినపుడు ఒక్కొక్కరికి టార్గెట్‌లు పెట్టారని తెలిపారు. కోటి ఇస్తే రూ. 4 కోట్లు లబ్ధి చేకూరుస్తానని ఎన్నారైలకు లోకేశ్ చెబుతున్నారన్నారు. ఎన్నారైలంటే ప్రజల్లో మంచి భావన ఉందని, జయరామ్ వ్యాఖ్యలు ఎన్నారైలకు తలవొంపులు తెచ్చేవిగా ఉన్నాయని అన్నారు. అతన్ని దేశం నుంచి బహిష్కరించాలని ఎన్నారైలు తురక సుజాత, కొమ్మారెడ్డి కోటిరెడ్డి కోరారు. ఈ సమావేశంలో మారుతీ మహిళా సొసైటీ అధ్యక్షురాలు సునీతా లఖంరాజు, ఐటీ నిపుణులు నానిరెడ్డి, ఎం విఠల్ రావు, ఆంధ్రా అడ్వకేట్స్ ఫోరం అధ్యక్షుడు అశోక్ కుమార్, నాయిబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి తుళ్ళూరు సూరిబాబు పాల్గొన్నారు.

పవన్ పిచ్చి పరాకాష్టకు

వైఎస్సార్‌సీపీ నేత వాసిరెడ్డి పద్మ



సాక్షి, అమరావతి: ఎన్నికలు దగ్గర పడే కొద్దీ పవన్ పిచ్చి పరాకాష్టకు చేరుకుంటోందని వైఎస్సార్‌సీపీ నాయకురాలు వాసిరెడ్డి పద్మ ధ్వజమెత్తారు. ప్రజల ముందు, బహిరంగసభల్లో ఈ రకమైన తీరు ప్రదర్శిస్తున్న పవన్ రాజకీయాల్లో పోటీకే అనర్హుడని చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. పవన్ ఉచ్ఛంనీచం లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇంకా ఆమె ఏమన్నారంటే.. పవన్‌కు ఒళ్లంతా ఓటమి భయం పట్టుకుంది. ఆ భయంతో పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారు. పవన్ ప్యాకేజీ రాజకీయాల కోసం చిరంజీవిని కూడా రాజకీయాల్లోకి తెస్తున్నారు. ఏపీలో రాజకీయాల్లో పవన్ సినిమా ఫ్లాప్ అయింది. సినీస్టార్‌గా చిరంజీవి అంటే అందరికీ గౌరవం ఉంటుంది. చంద్రబాబు కోసమే పవన్ పార్టీ పెట్టారు. జాతీయ పార్టీ దగ్గర ప్యాకేజీ కోసం నాటకాలు చేశారు. జనసేనలో ఎవరికి టికెట్లు ఇచ్చావో గుర్తుందా పవన్?. టీడీపీ నుంచి వచ్చిన వారికి చంద్రబాబు చెప్పాడని టికెట్లు ఇచ్చారు. పార్టీని నమ్ముకున్న వారిని మోసం చేశారు. రేపు ఓటమి తర్వాత ఇతర దేశాలకు పారిపోయేందుకు పవన్ సిద్ధంగా ఉన్నారు. సీఎం జగన్ ఏనాడూ పవన్‌లాగా బూతులు మాట్లాడలేదు. అసహ్యకరమైన భాష మాట్లాడేది పవన్, చంద్రబాబే. పవన్ జనసేనను భజనసేనగా మార్చారు. అసలు జనసేన పెట్టిందే చంద్రబాబు కోసం. పార్టీ పెట్టి ఇన్నేళ్లయినా ప్రజలు గుర్తించలేదంటే, పార్టీ బలోపేతం పట్ల పవన్‌కు చిత్తశుద్ధి లేదు. మీరు ఎన్ని కూటములు కట్టినా, ఎంతమంది కలిసొచ్చినా.. ప్రజలంతా మా జగనన్న పక్షాన ఉన్నారనేది వైఎస్సార్‌సీపీ సిద్ధం సభల ద్వారా, మేమంతా సిద్ధం బస్సుయాత్ర ద్వారా నిరూపితమవుతోంది.

రాజంపేట లోక్‌సభ అభ్యర్థిగా మిథున్‌రెడ్డి నామినేషన్

రాయచోటి: రాజంపేట లోక్‌సభ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎంపీ పి.వి.మిథున్‌రెడ్డి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. సంబంధిత పత్రాలను అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి అభిషిక్త్ కిషోర్‌కు అందజేశారు. తొలుత మిథున్‌రెడ్డి తరఫున ఒక సెట్ నామినేషన్ పత్రాలను ఆయన సతీమణి పి.లక్ష్మీదివ్యారెడ్డి దాఖలు చేశారు. అనంతరం మిథున్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. వీరి వెంట మిథున్‌రెడ్డి నాయనమ్మ పద్మావతమ్మ ఉన్నారు. ఇప్పటికే మిథున్‌రెడ్డి తరఫున తల్లి పి.స్వర్ణలత, మైనార్టీ నాయకులు ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేసిన విషయం తెలిసిందే.



శభాష్ గుకేశ్...

క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో విజేతగా నిలిచిన భారత యువ గ్రాండ్‌మాస్టర్

విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారతీయ ప్లేయర్‌గా గుర్తింపు	ఈ టైటిల్ సాధించిన పిన్న వయస్కుడిగా కొత్త రికార్డు	త్వరలో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్‌తో పోరు	రూ. 78 లక్షల 50 వేల ప్రైజ్‌మనీ సొంతం

భారత చెస్‌లో నవయువ శకం ఆరంభమైంది. ఐదుసార్లు ప్రపంచ చాంపియన్, భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఎవరు అనే ప్రశ్నకు సాధికారిక సమాధానం దొరికింది. ప్రతిష్టాత్మక క్యాండిడేట్స్ క్లాసికల్ చెస్ టోర్నమెంట్ ఓపెన్ విభాగంలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ చాంపియన్‌గా నిలిచాడు. అంతా అనుకున్నట్లు జరిగితే త్వరలోనే క్రీడాభిమానులు 17 ఏళ్ల గుకేశ్ రూపంలో విశ్వనాథన్ ఆనంద్ తర్వాత భారత్ నుంచి రెండో ప్రపంచ చాంపియన్‌ను చూడవచ్చు. ప్రపంచ కిరీటం కోసం డిఫెండింగ్ ప్రపంచ చాంపియన్‌కు ప్రత్యర్థిని నిర్ణయించే క్యాండిడేట్స్ టోర్నీలో భారత్ నుంచి ఓపెన్ విభాగంలో ఏకంగా ముగ్గురు క్రీడాకారులు ప్రజ్ఞానంద, విదిత్ సంతోష్ గుజరాతీ, గుకేశ్ అర్హత సాధించడం... చివరకు తనకంటే ఎంతో మెరుగైన రేటింగ్ ఉన్న మేటి గ్రాండ్‌మాస్టర్లకు దీటుగా ఆడి గుకేశ్ విజేతగా అవతరించడం విశేషం.

టొరంటో: అంచనాలకు మించి రాణించి భారత చెస్ యువ గ్రాండ్‌మాస్టర్, తమిళనాడు కుర్రాడు దొమ్మరాజు గుకేశ్ కొత్త చరిత్ర సృష్టించాడు. ప్రతిష్టాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీ ఓపెన్ విభాగంలో టైటిల్ సాధించిన పిన్న వయస్కుడిగా గుకేశ్ రికార్డు నెలకొల్పాడు. 8 మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ ఫార్మాట్‌లో 14 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో 17 ఏళ్ల గుకేశ్ 9 పాయింట్లతో విజేతగా నిలిచాడు. 40 ఏళ్లుగా గ్యారీ కాస్పరోవ్ (1984లో 22 ఏళ్లు) పేరిట ఉన్న ఈ రికార్డును గుకేశ్ బద్దలు కొట్టాడు.

- 13వ రౌండ్ తర్వాత గుకేశ్ 8.5 పాయింట్లతో ఒంటరిగా ఆధిక్యంలో ఉన్నాడు. హికారు నకమురా (అమెరికా), నిపోమ్‌నిషి (రష్యా), ఫాబియానో కరువానా (అమెరికా) 8 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచారు. దాంతో చివరిదైన 14వ రౌండ్ ఈ నలుగురికీ కీలకంగా మారింది. నకమురతో జరిగిన గేమ్‌ను నల్లపావులతో ఆడిన గుకేశ్ 71 ఎత్తుల్లో 'డ్రా' చేసుకొని 9 పాయింట్లతో అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నాడు. మరోవైపు నిపోమ్‌నిషి-కరువానా మధ్య జరిగిన గేమ్‌లో ఫలితం వచ్చి ఉంటే ఈ ఇద్దరిలో ఒకరు గుకేశ్‌తో 9 పాయింట్లతో సమఉజ్జీగా నిలిచేవారు. ఇలా జరిగి ఉంటే సమఉజ్జీల మధ్య ప్లే ఆఫ్ గేమ్‌లను వేరుగా నిర్వహించి విజేతను నిర్ణయించేవారు.
- అయితే 109 ఎత్తులపాటు సుదీర్ఘంగా సాగిన నిపోమ్‌నిషి-కరువానా మధ్య గేమ్ చివరకు 'డ్రా'గా ముగియడంతో గుకేశ్ ఎదురులేని విజేతగా అవతరించాడు. ఈ క్రమంలో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో పోటీపడేందుకు గుకేశ్ అర్హత సంపాదించాడు. ఈ టోర్నీలో గుకేశ్ 5 గేముల్లో గెలిచి, 8 గేమ్‌లను 'డ్రా' చేసుకొని, ఒక గేమ్‌లో మాత్రమే డో ఓడిపోయాడు. నకమురా, నిపోమ్‌నిషి, కరువానా 8.5 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంతో సరిపెట్టుకున్నారు.

ఓపెన్ విభాగం ఫైనల్ ర్యాంకింగ్

ర్యాంక్	ప్లేయర్	దేశం	పాయింట్లు
1	గుకేశ్	భారత్	9
2	నకముర	అమెరికా	8.5
3	నిపోమ్‌నిషి	రష్యా	8.5
4	కరువానా	అమెరికా	8.5
5	ప్రజ్ఞానంద	భారత్	7
6	విదిత్ సంతోష్	భారత్	6
7	ఫిరూజా	ఫ్రాన్స్	5
8	అబసోవ్	అజర్‌బైజాన్	3.5

నోట్: స్కోరు సమమైనచోట మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించారు

- భారత్‌కే చెందిన మరో ఇద్దరు గ్రాండ్‌మాస్టర్లు విదిత్ తన చివరి గేమ్‌ను అలీరెజా ఫిరూజాతో 14 ఎత్తుల్లో 'డ్రా' చేసుకోగా... అబసోవ్‌తో జరిగిన గేమ్‌ను ప్రజ్ఞానంద 53 ఎత్తుల్లో గెలిచాడు. విజేతగా నిలిచిన గుకేశ్‌కు 88,500 యూరోల (రూ. 78 లక్షల 50 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.
- డింగ్ లిరెన్‌తో 14 గేమ్‌లపాటు జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్ మ్యాచ్ ఈ ఏడాది చివర్లో జరిగే అవకాశముంది. వేదికను, తేదీలను అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) త్వరలోనే ప్రకటిస్తుంది. 2014లో విశ్వనాథన్ ఆనంద్ తర్వాత క్యాండిడేట్స్ చెస్ టోర్నీ టైటిల్ గెలిచిన రెండో భారతీయ ప్లేయర్‌గా గుకేశ్ గుర్తింపు పొందాడు. క్లాసికల్ విభాగంలో విశ్వనాథన్ ఆనంద్ ఐదుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచాడు.

"నాకు చాలా సంతోషకరమైన క్షణమిది. టోర్నీ ఆరంభం నుంచి ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా ఆడేందుకు ప్రయత్నించా. చివరి రౌండ్ గేమ్ ఆడిన తర్వాత టైబ్రేక్ కోసం సిద్ధమవుతూనే ఉన్నా. కానీ అదృష్టవశాత్తూ అలాంటి అవసరం రాలేదు. గెలుపు తర్వాత నా తల్లిదండ్రులతో మాట్లాడా. వారు చాలా ఆనందంగా ఉన్నారు. వరల్డ్ చాంపియన్‌షిప్ ఫైనల్ గురించి ఆలోచించే సమయం లభించలేదు. కొద్ది రోజులు ఆటకు విరామం ఇచ్చి ఆపై అన్ని రకాలుగా సన్నద్ధమవుతా. ఆ మ్యాచ్ కోసం ఎంతో ఎదురు చూస్తున్నా. -గుకేశ్


యంగెస్ట్ చాలెంజర్ గుకేశ్‌కు అభినందనలు. ప్రతికూల పరిస్థితుల్లోనూ నువు చూపించిన ఆటతో మేమంతా గర్వంగా ఉన్నాం. ఈ క్షణాలను ఆస్వాదించు. -విశ్వనాథన్ ఆనంద్



17 ఏళ్లకే ఎంత గొప్ప విజయం. నీ ఈ ప్రయాణం వరల్డ్ చాంపియన్‌గా మారే వరకు సాగాలి. -సచిన్ టెండూల్కర్

గుకేశ్ ఘనత చూసి దేశం గర్విస్తోంది. అతని ప్రతిభ, అంకిత భావాన్ని ఈ ఫలితం చూపించింది. ఎంతో మందికి ఇది స్ఫూర్తిగా నిలుస్తుంది. -నరేంద్ర మోదీ, ప్రధాని"

హంపికి రెండో స్థానం





వైశాలి

క్యాండిడేట్స్ టోర్నీ మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి 7.5 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకోగా, వైశాలి 7.5 పాయింట్లతో నాలుగో స్థానాన్ని సంపాదించింది. 8 మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య 14 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో చైనా ప్లేయర్ టాన్ జోంగి 9 పాయింట్లతో విజేతగా నిలిచింది. మహిళల వరల్డ్ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)తో ప్రపంచ టైటిల్ కోసం టాన్ జోంగి తలపడుతుంది. చివరిదైన 14వ రౌండ్‌లో హంపి 62 ఎత్తుల్లో టింగ్‌జి లెపై... వైశాలి 45 ఎత్తుల్లో కాటరీనా లాగ్నోపై గెలుపొందారు. ఈ టోర్నీలో హంపి 3 గేముల్లో నెగ్గి, 9 గేమ్‌లను 'డ్రా' చేసుకొని, 2 గేముల్లో ఓడిపోయింది. వైశాలి 6 గేముల్లో గెలిచి, 5 గేముల్లో ఓడిపోయి, 3 గేమ్‌లను 'డ్రా'గా ముగించింది. హంపి, టింగ్‌జి లె, వైశాలి 7.5 పాయింట్లతో సమఉజ్జీగా నిలిచినా మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించారు.



ఇంతింతై...

అనతికాలంలోనే అద్భుత ఫలితాలు సాధించిన గుకేశ్

దాదాపు ఐదేళ్ల క్రితం... గుకేశ్ 12 ఏళ్ల 7 నెలల 17 రోజుల వయసులో గ్రాండ్‌మాస్టర్ అయ్యాడు. ప్రపంచ చెస్‌లో ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కుడిగా నిలిచే రికార్డును అతను 17 రోజుల తేడాతో కోల్పోయాడు. దీనిపై స్పందిస్తూ...'ఇలాంటి ఘనతను సాధించకపోయినా మాగ్నస్ కార్ల్‌సన్ ఏ స్థాయికి వెళ్లాడో తెలుసు కదా. నాకు అతనే స్ఫూర్తి. ఈ పిన్న వయస్కుడి రికార్డులు పెద్ద విషయం కాదు. నా లక్ష్యాలు చాలా పెద్దవి' అంటూ అతను ఆత్మవిశ్వాసంతో బదులిచ్చాడు. ఇదే దృక్పథం అతడిని ఇప్పుడు ఈ స్థాయికి చేర్చింది. 17 ఏళ్ల వయసులో క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలిచి వరల్డ్ చాంపియన్‌కు అతను సవాల్ విసరబోతున్నాడు. తాజా టోర్నీలో కూడా తన విజయంపై ఎప్పుడు ధీమా వచ్చిందంటే 'ఏడో రౌండ్' తర్వాత అని సమాధానమిచ్చాడు. సాధారణంగా టర్నింగ్ పాయింట్‌గా ఎవరైనా ఫలానా గెలుపు గురించి చెబుతారు. కానీ ఈ ఏడో రౌండ్‌లో అతను అలీరెజా ఫిరూజా చేతిలో ఓడిపోయాడు. 'నేను ఓడినా సరే ఆ గేమ్‌లో చాలా బాగా ఆడాను. ఆ పరాజయం నాలో మరింత పట్టుదలను పెంచింది. అప్పుడే నేను టైటిల్ గెలవగలననే నమ్మకం కలిగింది' అని చెప్పడం గుకేశ్ ఆత్మవిశ్వాసాన్ని చూపిస్తోంది.

అమ్మా, నాన్న అండతో...



చదరంగం బోర్డుపై ఎత్తుకు పైఎత్తులు వేసేందుకు గుకేశ్ ప్రయాణం ఏడేళ్ల వయసులో మొదలైంది. గోదావరి జిల్లా నుంచి చెన్నైకి వెళ్లి స్థిరపడిన తెలుగు కుటుంబం వారిది. తండ్రి రజినీకాంత్ ఈఎన్‌టీ వైద్యుడు కాగా తల్లి పద్మా కుమారి మైక్రోబయాలజిస్ట్. మదరాసులో చెస్ చాంపియన్ల ఫ్యాక్టరీ వంటి వేలమ్మల్ స్కూల్‌లో అతను ఓనమాలు నేర్చుకున్నాడు. గత రెండు దశాబ్దాల్లో ఇక్కడి నుంచే సేతురామన్, ఆదిబన్, ప్రజ్ఞానంద, వైశాలి తదితర గ్రాండ్‌మాస్టర్లు వచ్చారు. ఇలాంటి ఆటగాళ్ల వల్లే వరల్డ్ స్కూల్ గేమ్స్‌లో వేలమ్మల్ విద్యాసంస్థలు వరుసగా ఐదేళ్లు చాంపియన్‌గా నిలిచాయి. మరోవైపు తల్లిదండ్రుల మద్దతు, ప్రోత్సాహం గుకేశ్ సరైన దిశలో నడిపించాయి. కెరీర్ ఆరంభంలో కొడుకుతో టోర్నీలకు వెళ్లేందుకు రజినీకాంత్ చాలా సార్లు తన వైద్య బాధ్యతలు దూరం కావాల్సి వచ్చింది. తర్వాతి రోజుల్లో అతనితో పాటు తల్లి ప్రయాణించడం మొదలైంది. గుకేశ్ ఒక్కసారి చెస్‌లో అడుగు పెట్టాక పూర్తిగా దానిపైనే దృష్టి పెడుతూ పగలు రాత్రి కష్టపడ్డాడు. నాలుగో తరగతి తర్వాత స్కూల్‌కు రెగ్యులర్‌గా వెళ్లడం ఆపేసిన ఈ అబ్బాయి తన పట్టుదల, సాధనతో పూర్తిగా చెస్‌పైనే దృష్టి పెట్టాడు. అతని శ్రమకు ఫలితం దక్కుతూ వేగంగా దూసుకుపోయాడు. ఆసియా స్కూల్ చాంపియన్‌షిప్‌లో, ఆసియా యూత్, వరల్డ్ యూత్ చాంపియన్‌షిప్‌లలో టైటిల్స్ సాధించి అతను అందరి దృష్టిలో పడ్డాడు. ఢిల్లీ ఇంటర్నేషనల్ ఓపెన్‌లో 2019 సంక్రాంతి పండగ రోజున గుకేశ్ భారత 60వ గ్రాండ్‌మాస్టర్‌గా మారిన క్షణాన తల్లిదండ్రులు ఎంతో భావోద్వేగానికి గురయ్యారు.

వరుస విజయాలతో...



2017 అక్టోబరులో ఒక 11 ఏళ్ల ప్రతిభావంతుడైన ఆటగాడు, ఎలాంటి ఐఎం లేదా జీఎం నార్మ్‌లు లేని కుర్రాడిగా గుకేశ్ ఉన్నాడు. అయితే తర్వాతి 16 నెలలు తిరిగేసరికి అంతా మారిపోయింది. ఈ సమయంలో అతను మూడు ఐఎం నార్మ్‌లు, మూడు జీఎం నార్మ్‌లు సాధించడంతో పాటు 2500 ఎలో రేటింగ్ దాటేశాడు. ఈ 16 నెలల కాలంలో గుకేశ్ అసాధారణ రీతిలో 276 గేమ్‌లు ఆడాడు! ఆ తర్వాత పోటీల స్థాయి పెరిగిన కొద్దీ అతని ఆట మరింత రాటుదేలింది. ప్రతిష్టాత్మక జూలియస్ బేర్ టోర్నీ గెలుచుకున్న తర్వాత భారత జట్టు చెస్ ఒలింపియాడ్‌లో కాంస్యం సాధించడంలో అతను కీలక పాత్ర పోషించాడు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం 2700 రేటింగ్‌ను కూడా దాటడంతో పాటు ర్యాపిడ్ టోర్నీలో కార్ల్‌సన్‌నూ ఓడించాడు. గత ఏడాది సెప్టెంబరులో అతని 'ఆనందం' రెట్టింపైంది. లైవ్ రేటింగ్‌లో విశ్వనాథన్ ఆనంద్‌ను దాటి అతను ర్యాంకింగ్స్‌లో భారత అత్యుత్తమ ఆటగాడిగా నిలిచాడు.

అదే శైలి...అదే తత్వం

12 ఏళ్ల వయసులోనే ఎంతో పరిపక్వతతో మాట్లాడిన గుకేశ్ ఇప్పుడు టీనేజర్‌గా కూడా అతని ఆటలాగే అంతే ప్రశాంతతను చూపిస్తాడు. గెలుపు, ఓటమి ఎదురైనా అతను భావోద్వేగాలు ప్రదర్శించడు. కఠిన పరిస్థితుల్లోనూ ఒత్తిడికి లోను కాకుండా ఆడటం అతని శైలి. క్యాండిడేట్స్ విజేతగా నిలిచిన తర్వాత అతని గురించి నార్వే దిగ్గజం, ప్రపంచ మాజీ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ వ్యాఖ్యానిస్తూ 'నేను అతడిని తక్కువగా అంచనా వేశాను. నాతో పాటు చాలా మంది అనుకున్నదానికంటే గుకేశ్ చాలా బలమైన ఆటగాడు' అని ప్రశంసించడం విశేషం. ఇప్పుడు 17 ఏళ్లకే వరల్డ్ చాంపియన్‌కు చాలెంజ్ విసిరే స్థాయికి చేరిన ఈ చెన్నై చిచ్చరపిడుగు త్వరలోనే విశ్వ విజేతగా నిలవడం కష్టం కాకపోవచ్చు.

-సాక్షి క్రీడా విభాగం

'పద్మశ్రీ' బోపన్న...



రాష్ట్రపతి భవన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా 'పద్మశ్రీ' పురస్కారాన్ని స్వీకరిస్తున్న భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న

కోహ్లికి జరిమానా



న్యూఢిల్లీ: బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లికి జరిమానా విధించారు. ఆదివారం కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా ఫీల్డ్ అంపైర్ కోహ్లిని క్యాచ్ అవుట్‌గా ప్రకటించారు. దీనిపై కోహ్లి తీవ్రస్థాయిలో అసహనాన్ని ప్రదర్శించాడు. హర్షిత్ రాణా వేసిన బంతి ఫుల్‌టాస్ కావడంతో నోబాల్‌గా ప్రకటించాలని రివ్యూకు వెళ్లాడు. అయితే అతను క్రీజ్ వెలుపలకి వచ్చి షాట్ ఆడటంతో టీవీ అంపైర్ కోహ్లి అప్పీల్‌ను తిరస్కరించారు. అయినా సరే కోహ్లి అంపైర్‌పై ఆగ్రహంతో పెవిలియన్ చేరాడు. ఈ నేపథ్యంలో మ్యాచ్ రిఫరీ ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని అతిక్రమించిన కోహ్లి మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత విధించారు.



యశస్వి జైస్వాల్

'శత'క్కొట్టిన యశస్వి

- రాజస్తాన్ రాయల్స్ ఘనవిజయం
- సందీప్ శర్మకు 5 వికెట్లు
- ముంబై జట్టుకు ఐదో ఓటమి

జైపూర్: మరో ధనాధన్ 'షో'తో రాజస్తాన్ రాయల్స్ ఐపీఎల్‌లో ఏడో విజయాన్ని సాధించింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో రాయల్స్ 9 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. మొదట ముంబై 9 వికెట్ల నష్టానికి 179 పరుగులు చేసింది. తిలక్ వర్మ (45 బంతుల్లో 65; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రాజస్తాన్ సీమర్ సందీప్ శర్మ (4-0-18-5) ముంబైను దెబ్బ కొట్టాడు. అనంతరం రాజస్తాన్ రాయల్స్ 18.4 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 183 పరుగులు చేసి గెలిచింది. ముంబై బౌలర్ల భరతం పట్టి ఓపెనర్ యశస్వి జైస్వాల్ (60 బంతుల్లో 104 నాటౌట్; 9 ఫోర్లు, 7 సిక్స్‌లు) అజేయ శతకం సాధించి జట్టును గెలిపించాడు.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) సామ్సన్ (బి) బౌల్ట్ 6; ఇషాన్ (సి) సామ్సన్ (బి) సందీప్ 0; సూర్యకుమార్ (సి) పావెల్ (బి) సందీప్ 10; తిలక్ వర్మ (సి) పావెల్ (బి) సందీప్ 65; నబీ (సి అండ్ బి) చహల్ 23; నేహల్ (సి) సందీప్ (బి) బౌల్ట్ 49; హార్దిక్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అవేశ్ ఖాన్ 10; డేవిడ్ (సి) పరాగ్ (బి) సందీప్ 3; కొయెట్జీ (సి) హెట్‌మైర్ (బి) సందీప్ 0; చావ్లా (నాటౌట్) 1; బుమ్రా (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 179. వికెట్ల పతనం:** 1-6, 2-6, 3-20, 4-52, 5-151, 6-170, 7-176, 8-176, 9-177. **బౌలింగ్:** బౌల్ట్ 4-0-32-2, సందీప్ 4-0-18-5, అవేశ్ 4-0-49-1, అశ్విన్ 4-0-31-0, చహల్ 4-0-48-1. **రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్:** యశస్వి (నాటౌట్) 104; బట్లర్ (బి) చావ్లా 35; సామ్సన్ (నాటౌట్) 38; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (18.4 ఓవర్లలో వికెట్ నష్టానికి) 183. వికెట్ల పతనం:** 1-74. **బౌలింగ్:** పాండ్యా 2-0-21-0, బుమ్రా 4-0-37-0, తుషార 3-0-28-0, కొయెట్జీ 2-0-25-0, నబీ 3-0-30-0, పియూశ్ చావ్లా 4-0-33-1, తిలక్ 0.4-0-8-0.

ఐపీఎల్‌లో నేడు

చెన్నై × లక్నో
వేదిక: చెన్నై

రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	8	7	1	14	0.698
కోల్‌కతా	7	5	2	10	1.206
హైదరాబాద్	7	5	2	10	0.914
చెన్నై	7	4	3	8	0.529
లక్నో	7	4	3	8	0.123
గుజరాత్	8	4	4	8	-1.055
ముంబై	8	3	5	6	-0.227
ఢిల్లీ	8	3	5	6	-0.477
పంజాబ్	8	2	6	4	-0.292
బెంగళూరు	8	1	7	2	-1.046

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

సినిమా



● చిరంజీవి

ఒక్క ఫైట్... ఇరవైఆరు రోజులు

చిరంజీవి ఇరవైఆరు రోజుల పాటు ఇరగదీశారట. రౌడీ గ్యాంగ్‌ని రఫ్ఫాడించారట. ఇదంతా ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర' కోసమే. వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారు. యూవీ క్రియేషన్స్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమా కోసం 26 రోజులుగా తీస్తున్న ఓ భారీ యాక్షన్ షెడ్యూల్ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ- ''ఫ్యాంటసీ యాక్షన్ అడ్వెంచర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. ఈ చిత్రం కోసం ప్రొడక్షన్ డిజైనర్ ప్రకాశ్ నిర్మించిన 54 అడుగుల హనుమాన్ విగ్రహంతో కూడిన సెట్‌లో రామ్-లక్ష్మణ్ మాస్టర్స్ పర్యవేక్షణలో ఓ ఫైట్‌ని చిత్రీకరించాం. చిరంజీవి, ఫైటర్స్ మధ్య ఉత్కంఠభరితంగా సాగే ఈ ఫైట్ ఇంటర్వెల్‌లో వస్తుంది. ఒక్క ఫైట్ సీక్వెన్స్ కోసం చిరంజీవి 26 రోజులు కేటాయించడం ఇదే తొలిసారి. ఈ హై ఓల్టేజ్ యునిక్ యాక్షన్ బ్లాక్ అటు అభిమానులను ఇటు ప్రేక్షకులను థ్రిల్‌కి గురి చేసే విధంగా ఉంటుంది'' అన్నారు. కాగా 2025 సంక్రాంతి సందర్భంగా జనవరి 10న 'విశ్వంభర' విడుదల కానుంది.

ఇక నాన్‌స్టాప్‌గా...



● కమల్‌హాసన్

తమిళనాడు లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో 'థగ్ లైఫ్' చిత్ర యూనిట్ షూటింగ్‌కి కాస్త బ్రేక్ ఇచ్చింది. ఎన్నికలు ముగియడంతో మళ్లీ షూటింగ్ ఆరంభించింది. కమల్‌హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన 'నాయగన్' (నాయకుడు) తర్వాత 37 ఏళ్లకు మళ్లీ ఈ కలయికలో రూపొందుతోన్న చిత్రం 'థగ్ లైఫ్'. ఈ చిత్రం తాజా షెడ్యూల్ ఢిల్లీలో ఆరంభమైంది. ఈ విషయాన్ని చిత్ర ఛాయాగ్రాహకుడు రవి కె. చంద్రన్ సామాజిక మాధ్యమం ద్వారా స్పష్టం చేశారు. కమల్‌హాసన్, ఈ చిత్రంలో కీలక పాత్ర చేస్తున్న శింబు పాల్గొనగా ఢిల్లీలో ముఖ్య సన్నివేశాల చిత్రీకరణ ప్లాన్ చేశారట. కొన్ని రోజుల పాటు ఢిల్లీలో షూట్ చేసి, అనంతరం క్లైమాక్స్‌లో వచ్చే ఫైట్ చిత్రీకరణకు యూనిట్ సెర్బియా వెళుతుందని సమాచారం. నాన్‌స్టాప్‌గా షూటింగ్ జరిపేలా షెడ్యూల్స్ ప్లాన్ చేశారట మణిరత్నం. కాగా ఈ చిత్రంలో రంగరాయ శక్తివేల్ నాయకర్ అనే గ్యాంగ్‌స్టర్ పాత్రతో పాటు కమల్ మరో రెండు పాత్రల్లో కనిపించనున్నారని కోలీవుడ్ టాక్.

సత్యభామ డేట్ ఫిక్స్



● కాజల్

కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించిన 'సత్యభామ' సినిమా విడుదల తేదీ ఫిక్స్ అయింది. మే 17న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. సుమన్ చిక్కాల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నవీన్ చంద్ర, ప్రకాశ్ రాజ్ కీలక పాత్రలు పోషించారు. డైరెక్టర్ శశికిరణ్ తిక్క సమర్పణలో బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి ఈ మూవీ నిర్మించారు. ''క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'సత్యభామ'. ఇందులో కాజల్ పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్రలో నటించారు'' అని చిత్రబృందం పేర్కొంది.



● రాజీవ్ చిలక, ఫరియా అబ్దుల్లా, 'అల్లరి' నరేశ్, నాని, మల్లి అంకం

కామెడీ మిస్ అయ్యాననిపించింది - నాని

''నరేశ్ అద్భుతమైన నటుడు. తను బ్యాక్ టు బ్యాక్ కామెడీ సినిమాలు చేస్తుంటే వాటికి కొంచెం బ్రేక్ ఇవ్వమని చెప్పాను. కానీ, 'ఆ ఒక్కటీ అడక్కు' ట్రైలర్ చూస్తుంటే.. ఈ బ్రేక్‌లో తన కామెడీ మిస్ అయ్యాననిపించింది'' అని హీరో నాని అన్నారు. 'అల్లరి' నరేశ్, ఫరియా అబ్దుల్లా జంటగా మల్లి అంకం దర్శకత్వం వహించిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. చిలకా ప్రొడక్షన్స్‌పై రాజీవ్ చిలక నిర్మించారు. భరత్ లక్ష్మీపతి సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమా మే 3న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ని హీరో నాని రిలీజ్ చేసి, మాట్లాడుతూ-''ఆ ఒక్కటీ అడక్కు' ట్రైలర్ చూస్తుంటే అందరూ హాయిగా ఎంజాయ్ చేసే సినిమా అనిపిస్తోంది. ఈ మూవీ తప్పకుండా బ్లాక్ బస్టర్ అవుతుంది'' అన్నారు. ''చాలా ఏళ్ల తర్వాత మళ్లీ కామెడీ మూవీతో వస్తున్నాను. ఈ వేసవిలో ప్రేక్షకుల్ని బాగా నవ్విస్తాను'' అన్నారు 'అల్లరి' నరేశ్. ''మా సినిమా చాలా అద్భుతంగా వచ్చింది'' అన్నారు రాజీవ్ చిలక. ఫరియా అబ్దుల్లా, రచయిత అబ్బూరి రవి మాట్లాడారు.

క్లుప్తంగా...

గిరిజన కాలేజీల్లో సీట్లకు దరఖాస్తు చేసుకోండి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 33 గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కాలేజీల్లో 2024–25 విద్యా సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవాలని సంస్థ కార్యదర్శి సదా భార్గవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ గ్రూపులకు, ఒకేషనల్ గ్రూప్స్ (ఏఅండ్‌టీ, సీజీఏ)కు ఇంటర్ మొదటి ఏడాది ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 2023–24లో పదోతరగతి పాసైన గిరిజన, గిరిజనేతర విద్యార్థులు ఈనెల 24 నుంచి మే 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు www.aptwgurukulam.ap.gov.in ను, ఆయా జిల్లాల్లోని గిరిజన కాలేజీల ప్రిన్సిపాల్స్‌ను కూడా సంప్రదించవచ్చని సదా భార్గవి తెలిపారు.

హాజరు మినహాయింపునకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రైవేటు ఇంటర్మీడియట్ విద్యార్థులకు సూచన

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రైవేటు విద్యార్థులు హాజరు మినహాయింపునకు దరఖాస్తు చేసుకోవాలని ఇంటర్మీడియట్ విద్యా మండలి సోమవారం ప్రకటనలో సూచించింది. ఈ నెల 24వ తేదీలోగా రూ.1500 రుసుముతో కళాశాలల ప్రిన్సిపాల్స్ ద్వారా ఆన్‌లైన్‌లో హాజరు మినహాయింపు, ఆప్షనల్ సబ్జెక్ట్ మార్పునకు దరఖాస్తులు సమర్పించాలని తెలిపింది.

యూజర్ మాన్యువల్ విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వాస్పత్రుల్లో హెల్త్ రికార్డులను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్(ఏబీడీఎం)తో అనుసంధానించడానికి కసరత్తు చేస్తున్నామని ఏబీడీఎం నోడల్ ఆఫీసర్ బి.వి.రావు తెలిపారు. దీనికి సంబంధించిన యూజర్ మాన్యువల్‌ను మంగళగిరిలో సోమవారం ఆయన విడుదల చేశారు. అదే విధంగా ఏబీడీఎం, ఎన్‌ఐసీ సమన్వయంతో డీఎంఈ పరిధిలోని బోధనాస్పత్రుల్లోని డాక్టర్లు, నర్సులు, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లకు డిస్ట్రిక్ట్ మాస్టర్ ట్రైనర్లుగా రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా బి.వి.రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 4.13 కోట్ల మంది పౌరులకు డిజిటల్ హెల్త్ అకౌంట్‌లను సృష్టించామన్నారు. ప్రజారోగ్యానికి సంబంధించిన పూర్తి వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరిచే విషయంలో ఏపీ వైద్య శాఖ ముందంజలో ఉందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంఈ డాక్టర్ సూర్యశ్రీ, నర్సింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ డీడీ వల్లీ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామాలను ఆమోదించకుండా ఆదేశాలివ్వండి

హైకోర్టులో బోడే రామచంద్ర యాదవ్ పిటిషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు ముగిసేవరకు వలంటీర్ల రాజీనామాలను ఆమోదించకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ భారత చైతన్య యువజన పార్టీ (బీసీవైపీ) అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గురించి రామచంద్ర యాదవ్ తరఫు న్యాయవాది పీవీజీ ఉమేష్ సోమవారం న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ ముందు ప్రస్తావించి అత్యవసర విచారణ జరపాలని కోరారు. ఇందుకు న్యాయమూర్తి తిరస్కరిస్తూ మంగళవారం విచారణ జరుపుతామని స్పష్టంచేశారు. వలంటీర్లు రాజీనామాలు చేయడం ద్వారా ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించనున్నారని రామచంద్ర యాదవ్ తన పిటిషన్‌లో తెలిపారు. అదే జరిగితే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలకు సమానంగా పోటీ పడే అవకాశాలు లేకుండా పోతాయన్నారు. అందువల్ల ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

బీజేపీలో అనపర్తి భగభగలు

కొత్తగా ఎవరినైనా ప్రకటించే వరకు శివకృష్ణంరాజే అభ్యర్థి అన్న అధిష్టానం

- కానీ, పురందేశ్వరి సొంత మనుషులు బీజేపీ పేరుతో రాజకీయ డ్రామాలు
- ఆమె వద్దే తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేసిన రాజమండ్రి జిల్లా పార్టీ అధ్యక్షుడు
- పార్టీకి సంబంధమేలేని సర్వారాయుడు, టీడీపీ ఇన్‌చార్జి 'నల్లమిల్లి' భేటీలేంటి?
- మరోవైపు.. బీజేపీ అభ్యర్థి నామినేషన్ దాఖలు



బీజేపీ అభ్యర్థి శివరామ కృష్ణంరాజు తరపున నామినేషన్ వేస్తున్న ఆయన భార్య దుర్గా దేవిక

సాక్షి, అమరావతి: చంద్రబాబు నాయుడు–పురందేశ్వరి ఇద్దరూ కలిసి అనపర్తి సీటు విషయంలో ఆడుతున్న డ్రామాలపై రాష్ట్రంలో బీజేపీ శ్రేణులు మండిపడుతున్నాయి. జిల్లా పార్టీగానీ, పార్టీలో ఇతర ముఖ్య నాయకులకుగానీ సంబంధంలేకుండా పురందేశ్వరి సొంత మనుషులు బీజేపీ నేతల పేరుతో ఆదివారం అక్కడి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జితో చర్చలు జరిపి.. పొత్తులో బీజేపీకి కేటాయించిన స్థానానికి పార్టీ ప్రకటించిన అభ్యర్థి కాకుండా టీడీపీ నాయకుడే అభ్యర్థిగా పేర్కొంటూ ప్రకటన చేయడం ఏమిటంటూ వారు తప్పుపడుతున్నారు. ఈ విషయంలో పార్టీ రాష్ట్ర ముఖ్య నాయకులు కొందరు రాజమండ్రి జిల్లా అధ్యక్షుడు దత్తును పురందేశ్వరి వద్దకు తీసుకువెళ్లి తమ అసంతృప్తిని వ్యక్తంచేసినట్లు పార్టీలో చర్చ జరుగుతోంది.

సర్వారాయుడు తీరుపై ఆగ్రహావేశాలు..

పొత్తులో బీజేపీకి కేటాయించిన అనపర్తి సీటు విషయంలో ఇప్పటికే జాతీయ నాయకత్వం మాజీ సైనికుడు శివకృష్ణంరాజు అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సీటు మార్పిడి లేదంటే అక్కడ అభ్యర్థి మార్పుపై బీజేపీ రాష్ట్ర నాయకత్వంతో పాటు టీడీపీ అధినేత చంద్రబాబు ప్రతిపాదన మేరకు స్థానిక నాయకుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు జాతీయ పార్టీ సహ సంఘటనా కార్యదర్శి శివప్రకాష్ రెండ్రోజుల క్రితం విజయవాడకు వచ్చివెళ్లారు. అయితే, ఆయన పార్టీ నాయకులతో సమావేశమైనప్పుడు.. కొత్తగా ఎవరినీ ప్రకటించనంత వరకు శివకృష్ణంరాజే అభ్యర్థి అని స్పష్టంచేసి వెళ్లినట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే, 20 ఏళ్లుగా బీజేపీకి పూర్తిగా దూరంగా ఉంటూ ప్రస్తుతం పార్టీలో సభ్యత్వం కూడాలేని సర్వారాయుడు ఆదివారం అనపర్తి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో బీజేపీ తరపున చర్చలు జరపడంపై పార్టీ శ్రేణులు మండిపడుతున్నాయి. గతంలో వెంకయ్యనాయుడు ప్రధాన అనుచరుడిగా పనిచేసిన సర్వారాయుడి ఇంటికెళ్లి పురందేశ్వరి ఇటీవలే ఆయన్ను కలిశారని.. దీంతో ఆయన పార్టీతో సంబంధంలేకుండా పార్టీ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు.

అనపర్తి మినహా అందరికీ బీ-ఫారాలు..

ఇక పురందేశ్వరి పోటీచేస్తున్న రాజమండ్రి లోక్‌సభ స్థానం పరిధిలోనే అనపర్తి అసెంబ్లీ స్థానం కూడా ఉంది. ఇక్కడ బీజేపీ అభ్యర్థి శివకృష్ణంరాజు కంటే టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పోటీచేస్తే తనకు ప్రయోజనం ఉంటుందని ఆమె అనపర్తి సీటు విషయంలో చంద్రబాబుతో కలిసి కొత్త డ్రామాలు ఆడుతున్నారని పార్టీ నేతల ఆరోపణ. ఈ నేపథ్యంలో.. పురందేశ్వరి రాష్ట్రంలో బీజేపీకి కేటాయించిన ఆరు లోక్‌సభ, పది అసెంబ్లీ స్థానాల్లో అనపర్తి అభ్యర్థికి మినహా మిగిలిన అందరికీ బీ-ఫారాలిచ్చారు.

స్థానిక బీజేపీ నేతలను అవమానిస్తూ..

అనపర్తి టీడీపీ ఇన్‌ఛార్జి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బీజేపీ అభ్యర్థి శివకృష్ణంరాజును టీడీపీ జెండాతో ప్రచారం కూడా చేసుకోనివ్వకుండా అవమానపరిచారని కమలనాథులు ఆరోపిస్తున్నారు. మరోవైపు.. బీజేపీలో చేరితే తనకు సీటు దక్కుతుందన్న చంద్రబాబు సూచనతో నల్లమిల్లి ఆ దిశగా ప్రయత్నాలు చేసుకుంటూనే బీజేపీనే తనపై ఒత్తిడి తెస్తున్నట్లు ప్రచారం చేసుకోవడంపై బీజేపీ నేతలు గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో.. ఏపీ బీజేపీ దశ, దిశ లేకుండా సాగుతుందనడానికి అనపర్తి సీటు వ్యవహారం ఓ ఉదాహరణ అంటూ బీజేపీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు 'ఎక్స్'లో పేర్కొనడం గమనార్హం.

బీజేపీ అభ్యర్థి నామినేషన్ దాఖలు..

అనపర్తి బీజేపీ అభ్యర్థిగా శివకృష్ణంరాజు సోమవారం నామినేషన్ దాఖలు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తమకు మంచి ముహూర్తం కావడంతో శివకృష్ణంరాజు లేకుండానే ఆయన సతీమణి, స్థానిక పార్టీ నాయకులతో కలిసి తన భర్త తరపున నామినేషను దాఖలు చేసినట్లు వెల్లడించాయి.

పుడమి పరిరక్షణ మనందరి బాధ్యత

- 'ఏపీపీసీబీ' చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ భాస్కర్‌రావు
- హయత్ ప్లేస్ ఆధ్వర్యంలో వరల్డ్ ఎర్త్ డే వేడుక



సాక్షి, అమరావతి: భూమిని కాపాడుకోవాల్సిన అవసరం, పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (ఏపీపీసీబీ) చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ఎస్.వి.భాస్కర్‌రావు పేర్కొన్నారు. ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని హయత్ ప్లేస్ హోటల్‌లో సోమవారం జరిగిన ఎర్త్‌డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా హోటల్ నిర్వాహకులు అభివృద్ధి చేసిన 'వెర్టికల్ హెర్బల్ గార్డెన్'ను ఆయన ప్రారంభించారు. అనంతరం భాస్కర్‌రావు మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టు కాలుష్యం కూడా పెరుగుతోందని, అయితే అభివృద్ధి ఆపలేనందున కాలుష్య నివారణ చర్యలు పాటించాలని ఆయన తెలిపారు. క్లైమెట్ ఛేంజ్‌పై ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నందున పౌరులు పర్యావరణంపై దృష్టి సారించాలన్నారు. తమ ఇళ్లు, కార్యాలయాల్లో వేస్ట్ మేనేజ్‌మెంట్ పాటిస్తూ, సాధ్యమైనన్ని ఎక్కువ మొక్కలు నాటాలని సూచించారు. కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ, దానికి అనుగుణంగా ఉన్న నిబంధనలను కఠినంగా అమలు చేస్తోందని ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఆర్‌వీఎస్ కన్వెన్షన్స్ ఎండీ రామిశెట్టి వీరస్వామి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హయత్ ప్లేస్ ఎండీ కమల్ దీప్ శర్మ, చీఫ్ ఇంజనీర్ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

సర్టిఫికెట్లలో తప్పుల సవరణను సులభతరం చేయండి

- ఎస్ఎస్‌సీ, ఇంటర్ సర్టిఫికెట్లలో తప్పుల సవరణను తిరస్కరించడానికి వీల్లేదు
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ కీలక తీర్పు

సాక్షి, అమరావతి: ఎస్ఎస్‌సీ, ఇంటర్ సర్టిఫికెట్లలో విద్యార్థుల పేర్లు, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ తదితర వివరాల విషయంలో దొర్లిన తప్పులను సవరించే ప్రక్రియను సులభతరం చేయాలని హైకోర్టు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తప్పులను సవరించే విషయంలో కాలపరిమితి దాటిపోయిందని, రికార్డులు కనిపించడం లేదన్న కారణాలతో తప్పుల సవరణను తిరస్కరించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఇప్పటికే జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టంచేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ ఇటీవల కీలక తీర్పు వెలువరించారు. విద్యా సంబంధిత ధ్రువీకరణపత్రాల్లో తప్పులను సరిదిద్దుకునే అవకాశం ఇస్తే అంతిమంగా అది దుర్వినియోగం అవుతుందన్న కారణంతో పౌరుల చట్టబద్ధ హక్కులను తిరస్కరించడానికి వీల్లేదని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు. ధ్రువీకరణపత్రాల్లో దొర్లిన తప్పులవల్ల విద్యార్థులు ఎక్కువగా నష్టపోతారని, అందువల్ల వారి అభ్యర్థనలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్ ధ్రువీకరణపత్రాలను కేవలం విద్యా సంబంధిత విషయాల్లోనే కాక ప్రభుత్వ గుర్తింపు పత్రాల కోసం, ఉద్యోగాల దరఖాస్తులో కూడా ఉపయోగిస్తున్నారని తెలిపారు. పాఠశాల రికార్డుల్లో పేర్లు, పుట్టిన తేదీ, ఇంటి పేరు, తల్లిదండ్రుల పేర్లు, కులం, మతం తదితర వివరాల సవరణకు సంబంధించి గతంలో రూపొందించిన నిబంధనలను, ఉత్తర్వులను సుప్రీంకోర్టు 'జిగ్యా యాదవ్ కేసు'లో ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా మార్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌ను ఆదేశించారు. పిటిషనర్ ధ్రువీకరణపత్రంలో తప్పుగా నమోదైన వివరాలను సవరించాలని ఆదేశించారు.

రికార్డుల్లో తప్పుగా నమోదైన పేర్లు...

ఉమ్మడి కృష్ణా జిల్లా కలిదిండి గ్రామానికి చెందిన కుందేటి వెంకట నరసయ్య, అతని తల్లిదండ్రుల పేర్లు పాఠశాల రికార్డుల్లో తప్పుగా నమోదయ్యాయి. ఈ తప్పులను సవరించాలని కోరుతూ నరసయ్య దరఖాస్తు చేసుకున్నారు. గుడివాడ డిప్యూటీ విద్యాశాఖ అధికారి సానుకూలంగా స్పందించి సవరణ కోసం ఉన్నతాధికారులకు సిఫారసు చేశారు. ఈ సిఫారసును జిల్లా విద్యాధికారి తిరస్కరిస్తూ 2016లో ఉత్తర్వులిచ్చారు. వివరాలు తప్పుగా నమోదు కావడానికి కుటుంబ సభ్యులే కారణమని, పాఠశాల అధికారులకు ఇందులో ఎలాంటి పాత్ర లేదన్నారు. తప్పు జరిగిన నాటి నుంచి మూడేళ్లలోపే రికార్డులను సవరించుకోవాలని స్పష్టంచేశారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సైతం డీఈవో ఉత్తర్వులనే సమర్థించారు. దీనిపై వెంకట నరసయ్య 2022లో హైకోర్టును ఆశ్రయించారు. తప్పులను సవరించేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎంఆర్‌కే చక్రవర్తి వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ తల్లిదండ్రుల నిరక్షరాస్యత కారణంగా రికార్డుల్లో పేర్లు తప్పుగా నమోదయ్యాయన్నారు. కోవిడ్ కారణంగా మూడేళ్లలోపు అధికారులను ఆశ్రయించలేకపోయారన్నారు. నిర్దిష్ట కాలపరిమితిలోపు రాలేదన్న కారణంతో తప్పుల సవరణను తిరస్కరించడం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమన్నారు. ఆయన వాదనలు విన్న న్యాయమూర్తి, రికార్డుల్లో పిటిషనర్ కోరిన విధంగా సవరణలు చేయాలని అధికారులను ఆదేశించారు.

సీఎం జగన్‌పై హత్యాయత్నం కేసులో నిందితుడు సతీష్‌ను

పోలీస్ కస్టడీకి కోరుతూ పిటిషన్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: సీఎం జగన్‌పై హత్యాయత్నం చేసిన కేసులో ఏ1 నిందితుడు వేముల సతీష్‌కుమార్‌ను పోలీస్ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఎన్టీఆర్ జిల్లా పోలీసులు సోమవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్, మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నెల 13వ తేదీన మేమంతా సిద్ధం బస్సుయాత్ర నిర్వహిస్తున్న సీఎం జగన్‌పై అజిత్‌సింగ్‌నగర్‌లో నిందితుడు సతీష్ పదునైన సిమెంటు రాయితో దాడిచేశాడని, అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామని తెలిపారు. న్యాయాధికారి ఆదేశాలతో సతీష్ నెల్లూరు సబ్‌జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడని పేర్కొన్నారు. ఈ కేసు ఇంకా అసంపూర్తిగానే ఉందని తెలిపారు. మరిన్ని సాంకేతిక ఆధారాలను సేకరించాల్సి ఉందని, సంఘటన నిజమైన క్రమాన్ని నిర్ధారించాల్సి ఉందని, బహిర్గతంగాని వాస్తవాలను వెలికితీయాల్సి ఉందని పేర్కొన్నారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం నిందితుడు సతీష్‌ను ఏడురోజులు తమ కస్టడీకి ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌పై మంగళవారం కౌంటర్ దాఖలు చేయాలని నిందితుడి న్యాయవాది కునుకు రాజశేఖర్‌ను న్యాయాధికారి ఆదేశించారు.

వాంగ్మూలం రికార్డ్ చేసేందుకు అనుమతి ఇవ్వండి

ఈ కేసులో ప్రధాన నిందితుడు సతీష్ వాంగ్మూలాన్ని న్యాయమూర్తి సమక్షంలో రికార్డ్ చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ విజయవాడ నాలుగో అదనపు ముఖ్య మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో పోలీసులు సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఇరువర్గాల న్యాయవాదుల వాదనలు విన్న న్యాయాధికారి కేసును 29వ తేదీకి వాయిదా వేశారు.

చింతమనేనికి చుక్కలు చూపిస్తున్న చంద్రబాబు

- బీఫాం ఇంకా పెండింగ్‌లోనే
- బీఫాం లేకుండానే తొలిసారి దెందులూరులో నామినేషన్ దాఖలు
- డోలాయమానంలో చింతమనేని అభ్యర్థిత్వం



సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఎప్పుడూ పచ్చకండువా వేసుకుని 'నేనే టీడీపీ.. నాదే టీడీపీ..'' అంటూ హడావుడి చేసే టీడీపీ నేత చింతమనేని ప్రభాకర్‌కి బీఫాం ఇవ్వకుండా చంద్రబాబు చుక్కలు చూపిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు టీడీపీ అభ్యర్థులందరికీ బీఫారాలు ఇచ్చినా, చింతమనేనికి మాత్రం బీజేపీ లింక్ పెట్టి బీఫాం పెండింగ్‌లో పెట్టారు. దీంతో మొట్టమొదటిసారిగా చింతమనేని బీఫాం లేకుండానే నామినేషన్ దాఖలు చేశారు. 20 ఏళ్లుగా క్రియాశీల రాజకీయాల్లో ఉన్న చింతమనేని బీఫాం లేకుండా నామినేషన్ వేయడం ఇదే తొలిసారి. 2009, 2014, 2019 ఎన్నికల్లో మొదటి జాబితాలోనే చింతమనేని పేరు ఉండేది. రాష్ట్రంలోనే అత్యంత వివాదాస్పద నేతగా పేరు పడ్డ చింతమనేనిపై 93 కేసులు ఉన్నాయి. టీడీపీ హయాంలోనే ఆయనపై రౌడీషీట్ తెరిచారు. ఆయన ఎంత వివాదాస్పదుడైనప్పటికీ, చంద్రబాబు తొలి జాబితాలోనే దెందులూరు అభ్యర్థిగా ప్రకటిస్తున్నారు. ఈసారి మాత్రం సొంత సామాజికవర్గ నేతలు టిక్కెట్ ఇవ్వవద్దని చంద్రబాబుపై తీవ్రంగా ఒత్తిడి తేవడంతో మొదటి జాబితాలో ఆయనకు టిక్కెట్ ఇవ్వలేదు. చింతమనేని పలుమార్లు చంద్రబాబును కలిసిన తర్వాత రెండో జాబితాలో పేరు ఖరారు చేశారు. ఆ తర్వాత బీజేపీకి కేటాయించిన అనపర్తి స్థానంతో దెందులూరుకు లింకు పెట్టి, చింతమనేని అభ్యర్థిత్వాన్ని డోలాయమానంలో పెట్టారు. ఇప్పుడు అనపర్తి నుంచి బీజేపీ అభ్యర్థిగా చంద్రబాబు తన పార్టీ నేతనే ఖరారు చేశారు. అయినప్పటికీ చింతమనేనికి బీఫాం ఇవ్వకుండా పెండింగ్‌లోనే ఉంచడంతో ఆయన అభ్యర్థిత్వంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్ర, దేశాభివృద్ధికి యువత దోహద పడాలి

ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి



ఇంటర్న్‌షిప్ ప్రాజెక్ట్ కింద సర్టిఫికెట్స్ అందజేస్తున్న చైర్ పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి

సాక్షి, అమరావతి: పటిష్టవంతమైన యువతను తయారుచేయడం ద్వారా రాష్ట్ర, దేశాభివృద్ధికి దోహద పడాలని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి పిలుపునిచ్చారు. 'మార్పు' (మనోరమ, అర్జునరావు పబ్లిక్ యుటిలిటీ ట్రస్ట్) స్వచ్ఛంద సంస్థ ద్వారా మారిస్‌స్టెల్లా కాలేజ్‌కు చెందిన 25మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రాజెక్ట్ సర్టిఫికెట్లను సోమవారం ఆమె అందజేశారు. మంగళగిరిలోని మహిళా కమిషన్ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వెంకటలక్ష్మి మాట్లాడుతూ మహిళాభ్యున్నతిని, గౌరవాన్ని పెంచే దిశగా విద్యార్థులు ఉండాలని సూచించారు. 'మార్పు' సంస్థ వ్యవస్థాపకులు రావూరి సూయాజ్ మాట్లాడుతూ ఇప్పటివరకు 42 మంది విద్యార్థులను ఇంటర్న్‌షిప్ ప్రాజెక్టులకు తీసుకున్నామని, మూడో బ్యాచ్‌లో మరికొంతమంది విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఆహారం, పోషణ, పెద్దవారి మీద ప్రభావం, మానవ హక్కులు, మహిళల ఆర్థిక స్వావలంబన ప్రభావం, వృద్ధాశ్రమ పనితీరు వంటి అనేక అంశాలపై అధ్యయనం చేస్తారని తెలిపారు. రెండు నుంచి ఆరు నెలలపాటు క్షేత్ర స్థాయిలో పరిశీలించి వారి అభిప్రాయాలను నివేదిస్తారని వివరించారు.

లోకేశ్ ఆస్తులు రూ.542 కోట్లు

- ఆయనపై కేసులు 23.. బ్రాహ్మణికి కారు కూడా లేదంట
- లోకేశ్ తన తల్లి భువనేశ్వరికి ఇచ్చిన అప్పు రూ.1,27,69,969లు
- అచ్చెన్నపై 24 క్రిమినల్ కేసులు
- కొత్తపల్లి గీతవి రూ.2,87 కోట్లు
- పుట్టా మహేష్‌వి రూ.71.63 కోట్లు..
- చింతమనేని ఆస్తులు రూ.50 కోట్లు మొత్తం కేసులు 93

సాక్షి ప్రతినిధి, గుంటూరు/టెక్కలి/సాక్షి, పార్వతీపురం మన్యం/సాక్షి ప్రతినిధి, ఏలూరు/జి.కొండూరు: చంద్రబాబునాయుడు తనయుడు, తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ తన కుటుంబం మొత్తం ఆస్తులు రూ.5,42,17,67,034లుగా పేర్కొన్నారు. ఇవి గత ఎన్నికల అఫిడవిట్‌తో పోలిస్తే రూ.168,51,13,333లు పెరిగాయి. సోమవారం ఆయన నామినేషన్ సందర్భంగా అఫిడవిట్ దాఖలు చేశారు. ఇందులో.. హెరిటేజ్‌లో 1,00,37,453 షేర్లు ఉన్నాయని వాటి విలువ రూ.3,39,11,53,496లుగా చూపించారు. అలాగే, తన భార్య పేరుతో హెరిటేజ్ ఫుడ్స్‌లో 4,30,952 షేర్ల విలువ రూ.14,55,97,133 గాను.. కుమారుడు దేవాన్ష్ పేరుతో 56,075 షేర్లు మొత్తం విలువ రూ.1,89,44,939లు గా చూపించారు. అలాగే, తన వద్ద చేతిలో ఉన్న నగదు కేవలం అక్షరాల 16,600 రూపాయలు మాత్రమేనని.. బ్రాహ్మణి వద్ద రూ.2,248లు మాత్రమే ఉన్నాయని లోకేశ్ వెల్లడించారు. అంతేకాక.. లోకేశ్ ఇక తన తల్లి భువనేశ్వరికి రూ.1,27,69,969లు అప్పుగా ఇచ్చినట్లు పేర్కొన్నారు. తనకు 2007లో కొన్న రూ.8,44,750లు విలువైన ఫోర్డ్ ఫియస్టా కారు ఉందని చూపగా, బ్రాహ్మణి పేరుతో కారు కూడా లేదని వివరించారు. అలాగే..

- ➤ గత ఎన్నికల సమయంలో ఆయనకు రెండు ఫార్చ్యూనర్లు ఉన్నట్లు చూపించారు. 2,500.338 గ్రాముల బంగారం, 97.441 కిలోల వెండి, కోటీ 48 లక్షలు విలువ చేసే వజ్రాలు, ఆభరణాలు బ్రాహ్మణి పేరు మీద ఉండగా, కుమారుడు దేవాన్ష్ వద్ద 7.5 కిలోల వెండి మాత్రమే ఉంది.



- ➤ ఇక వీరికి అంధ్రాలో సొంత ఇల్లులేదు. హైదరాబాద్‌లో తన తండ్రితో పాటు 50 శాతం వాటా ఉన్న ఇంటి విలువ రూ.35 కోట్లుగా చూపించారు.
- ➤ మొత్తం చరాస్తులు లోకేశ్ పేరు మీద రూ.3,41,68,22,459లు కాగా.. బ్రాహ్మణి పేరు మీద రూ.45,06,30,277లు.. దేవాన్ష్ పేరు మీద రూ.7,35,12,607గా ఉన్నాయి.
- ➤ స్థిరాస్తుల విషయానికొస్తే లోకేశ్‌కు రూ.92,31,09,544లు, బ్రాహ్మణికి రూ.35,59,21,125లు, దేవాన్ష్‌కు రూ.20,17,71,025ల విలువైన ఆస్తులున్నాయి.
- ➤ అప్పుల విషయానికి వస్తే లోకేశ్ పేరుతో రూ.3,48,81,937లు, బ్రాహ్మణి పేరుతో రూ.14,34,37,042లు, దేవాన్ష్ పేరుతో రూ.61,08,018లు ఉన్నాయి.
- ➤ తనపై మొత్తం 23 కేసులు ఉన్నట్లు కూడా లోకేశ్ తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

24 క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం జిల్లా టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి అచ్చెన్నాయుడు అఫిడవిట్‌లో తనపై రాష్ట్రవ్యాప్తంగా 24 క్రిమినల్ కేసులున్నట్లు వెల్లడించారు. ఇందులో ప్రధానంగా స్కిల్ డెవలప్‌మెంట్, ఈఎస్ఐ కుంభకోణాలకు సంబంధించి ఏసీబీ, సీఐడీ కోర్టుల్లో కేసులున్నాయి. ఆస్తుల విషయానికొస్తే.. అచ్చెన్న పేరుతో స్థిరాస్తులు రూ.2,31,48,500లు, చరాస్తులు రూ.1,32,05,511లు ఉన్నాయి. ఆయన భార్య విజయమాధవి పేరిట స్థిరాస్తులు రూ.6,13,56,000 చరాస్తులు రూ.4,68,27,569 వరకు ఉన్నాయి.

భర్తకే రూ.5.45 కోట్ల అప్పిచ్చిన కొత్తపల్లి గీత..

ఇక అరకు పార్లమెంట్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కొత్తపల్లి గీత సోమవారం నామినేషన్ సందర్భంగా సమర్పించిన అఫిడవిట్‌లో నగదు, బంగారం, షేర్ల రూపంలో ఆమెకు రూ.2,87,77,247 విలువైన ఆస్తి ఉండగా.. భర్త పేరిట రూ.6,86,89,706 ఉన్నట్లు వెల్లడించారు. భూములు, ఇతర ఆస్తుల రూపంలో ఆమెకు రూ.6,97,00,000 ఆస్తులుండగా.. భర్త పేరిట ఏమీలేవు. ఆమెకు అప్పు మొత్తం రూ.5,64,23,356లు ఉండగా.. అందులో భర్త పరుచూరి రామకోటేశ్వరరావుకు ఇవ్వాల్సిన మొత్తం రూ.5,45,00,000గా పేర్కొనడం గమనార్హం. ఆమె పేరిట చీటింగ్, ఫోర్జరీ వంటి పలు కేసులూ ఉన్నాయి. తెలంగాణలోని రంగారెడ్డి అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులోనూ, సీబీఐ కోర్టులోనూ కేసులున్నట్లు.. అందుకు శిక్ష కూడా పడినట్లు ఆమె ప్రస్తావించారు.

పుట్టా మహేష్ ఆస్తులు రూ.71.63 కోట్లు..

టీడీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌కు స్థిరచరాస్తులు అన్నీ కలిపి రూ.71.63 కోట్లు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఏలూరు ఎంపీ అభ్యర్థిగా ఆయన సోమవారం నామినేషన్ వేశారు. కడప జిల్లాలో 103/2014 నంబరుతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైందని పేర్కొన్నారు. కడప, తుని, విజయవాడ, తెలంగాణ, కర్ణాటకలో భారీగా స్థిరాస్తులు, హైదరాబాద్‌లో విల్లాలు, పెద్ద సంఖ్యలో స్థలాలు ఉన్నట్లు అఫిడవిట్‌లో చూపించారు. ఆయన వద్ద రూ.47.22 కోట్లు, ఆయన భార్య కృష్ణ సాహిత్య వద్ద రూ.1.25 కోట్లు, కుమార్తె వైష్ణవి పేరుతో రూ.13.73 లక్షల చరాస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే, ఆయన పేరుతో రూ.16.70 కోట్లు, ఆయన భార్య పేరుతో రూ.6.76 కోట్ల ఆస్తులు ఉన్నట్లు వెల్లడించారు.

'వసంత' ఆస్తులు రూ.188.88 కోట్లు

గత సార్వత్రిక ఎన్నికలలో ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వసంత వెంకటకృష్ణప్రసాద్ ఎన్నికల అఫిడవిట్‌లో తన ఆస్తులు రూ.81.18 కోట్లుగా పేర్కొన్నారు. అదేవిధంగా తన పేరుతో ఉన్న స్థిరాస్తులను రూ.91.94కోట్లుగా చూపెట్టారు. తన భార్య వసంత శిరీష పేరుతో చరాస్తులను రూ.6.70 కోట్లుగా చూపారు. స్థిరాస్తులను రూ.9.87లక్షలుగా చేర్చారు. అప్పులు రూ.48.34 కోట్లుగా చూపెట్టారు. అలాగే, తనపై ఆరు కేసులున్నట్లు వసంత వెంకటకృష్ణప్రసాద్ వెల్లడించారు.

సెంచరీకి చేరువలో చింతమనేని కేసులు

సుమారు రూ.50 కోట్ల మేర స్థిరచరాస్తులు

ఏలూరు జిల్లా దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్‌పై కేసుల చిట్టా భారీగా ఉంది. బహుశా రాష్ట్రంలో ఏ పార్టీ అభ్యర్థిపైనా లేనన్ని కేసులు చింతమనేనిపై ఉన్నాయి. రౌడీషీట్‌తో పాటు 93 కేసులు తనపై నమోదయ్యాయని చింతమనేని సోమవారం తన నామినేషన్ సందర్భంగా సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. స్థిరచరాస్తులన్నీ కలిపి సుమారు రూ.50 కోట్లు పైచిలుకు ఉన్నట్లు ఆయన చూపించారు. తహశీల్దార్ వనజాక్షి ఉదంతం సహా తనపై నమోదైన కేసుల వివరాలను ఆయన పొందుపరిచారు. అలాగే, మాజీమంత్రి వట్టి వసంత్‌కుమార్‌పై దాడిచేసిన కేసులో చింతమనేని ప్రభాకర్‌కు రెండేళ్ల జైలు శిక్ష పడింది. ఇక చింతమనేని, ఆయన కుటుంబ సభ్యుల పేరుతో సుమారు రూ.50 కోట్ల స్థిరచరాస్తులున్నాయి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి 2024

జైత్రయాత్ర

మంగళవారం
ఏప్రిల్, 23





గుసగుస

'చిరు'బరానంద!



హరోం హర.. అత్తిలి చిరబరా.. వాస్తు చెబుతాం.. నిధులు చెబుతాం.. అంటూ విక్రమార్కుడులో రవితేజ బయల్దేరినట్లు మెగాస్టార్ చిరంజీవి కూడా మొహమాటానికి పోయి బీజేపీ ఎంపీ అభ్యర్థి కోసం మాటసాయం చేశారు. దీంతో పాత యవ్వారాలన్నీ సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్నాయి. 2004లో టీడీపీ అభ్యర్థి అశ్వనీదత్ కోసం ముఖాన్ని అరువిచ్చి భంగపడ్డారు. 2009లో తనే ప్రజారాజ్యం పార్టీని పెట్టి, తనను, అభ్యర్థుల్ని గెలిపించాలని కోరితే.. రెండింట ఓ చోట ఆయన్ని, అధిక సీట్లలో ఆ పార్టీ అభ్యర్థుల్ని ఈడ్చి కొట్టారు. దీంతో రాజకీయాలు తన ఒంటికి సరిపడవంటూ సైడైపోయిన అన్నయ్య పద్ధతిగా సినిమాలు చేసుకోక.. 'పద్మ'రుణం తీర్చుకునేందుకు మాట సాయం చేస్తున్నారేమోనని ఫ్యాన్స్ డౌటనుమానం..!

తోక పార్టీ



పులికి తోకలా ఉండటం కన్నా.. పిల్లికి తలగానే ఉంటాను.. వీఐపీ2 సినిమాలో హీరో ధనుష్ డైలాగ్ ఇది. ఏపీలో బీజేపీ పరిస్థితి దీనికి పూర్తి రివర్స్. టీడీపీకి తోకపార్టీ కంటే హీనంగా మారింది. దీనికి పార్టీ రాష్ట్ర నాయకత్వం చంద్రబాబుకు అమ్ముడుపోవడమే కారణమన్న ఆరోపణలున్నాయి. పంపకాల్లో బీజేపీకి బలం లేని గ్రామీణ ప్రాంత సీట్లను కేటాయించారు. అర్బన్‌లో నాలుగిచ్చినా.. అందులో ముస్లిం ప్రాబల్యమున్న స్థానాలున్నాయి. ఆశలు పెట్టుకున్న ఒకటీ అరా స్థానాల్లో కూడా బీజేపీ నేతల్ని కాకుండా టీడీపీ నుంచి అరువు తెచ్చుకుని బీజేపీ తరఫున బరిలో నిలిపారు. దీంతో కేంద్ర నాయకత్వం బాబు మెడలు వంచి దక్కించుకున్న స్థానాలకు విలువ లేకుండా పోతోందని బీజేపీ సీనియర్ నేతలు, స్థానిక నాయకులు గగ్గోలు పెడుతున్నారు.

రె'బెల్స్'



పొత్తులతో ఒక్కటైన పార్టీలకు స్వపక్ష నేతలే చెమటలు పట్టిస్తున్నారు. చంద్రబాబు వెన్నుపోట్లకు బలైనవారు రెబల్స్‌గా మారి ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. పొత్తులు కట్టిన ప్రతిసారీ బాబు చేతిలో బలైపోవడం బీజేపీకి అలవాటైన పని. ఈసారి వదినమ్మ పురందేశ్వరి పుణ్యమా అని కాస్త ఎక్కువగా బీజేపీకి నష్టం కలిగించగలిగారట. దీనికి తోడు కష్ట కాలంలో పార్టీ కోసం పనిచేసినవారిని కాదని, పార్టీ ఫండ్ కోసం కొత్తవారికి సీట్లు కట్టబెట్టడంపై టీడీపీ నేతలే ఎదురుతిరుగుతున్నారు. పాడేరు, మడకశిర, ఉండి తదితర చోట్ల టీడీపీ నేతలు, గన్నవరంలో బీజేపీ నేత రెబల్‌గా నామినేషన్లు దాఖలు చేశారు. రెండు రోజుల్లో రెబల్స్ నామినేషన్లు డబుల్ డిజిట్‌కు చేరుకుంటాయని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు చెవులు కొరుక్కుంటున్నాయి.

తెంటూ.. తంటా

విజయనగరం జిల్లా తెర్లాం(ప్రస్తుత బొబ్బిలి) నియోజకవర్గంలో ఒకప్పుడు తెంటు లక్ష్మునాయుడు బొబ్బిలి రాజులకు ఎదురొడ్డి నాగలి గుర్తుపై పోటీ చేశారు. నియోజకవర్గంలో అత్యధికులుగా ఉన్న బీసీలపై రాజుల పెత్తనమేంటని ప్రశ్నిస్తూ ప్రచారంలో ఊదరగొట్టారట! తర్వాతి తరంలో ఆయన కుమారుడు జయప్రకాష్ కూడా రాజులకు వ్యతిరేకంగానే ఉండేవారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. పరిస్థితి మారింది. తాత పేరే పెట్టుకున్న జయప్రకాష్ తనయుడు లక్ష్మునాయుడు(రాజా)మాత్రం బొబ్బిలి రాజులకు దాసోహమయ్యారు. బేబి నాయన వెంట ప్రచారంలో పాల్గొనడాన్ని చూసిన జనం తాత పరువు తీసేశావు కదయ్యా.. అంటూ గుసగుసలు పోతున్నారు.

• జిత్తులమారి బాబు కోసం...

గ్రామాల్లోకి గుంట నక్కలు



బాబు కోసం సిద్ధమైన టీడీపీ ఎన్‌ఆర్ఐల మంద

- ➤ గుంపులు గుంపులుగా రాష్ట్రంలోకి ప్రవేశించి ఎన్నికల అక్రమాలు
- ➤ కులోన్మాదం, డబ్బు మదంతో ప్రజలను ఏమార్చేందుకు ప్రయత్నాలు
- ➤ గ్రామాల్లోకి వెళ్లి ఓటర్లను ప్రలోభ పెట్టడంపై దిశా నిర్దేశం
- ➤ కోమటి జయరాం నేతృత్వంలో శిక్షణ
- ➤ వైఎస్సార్‌సీపీ ఓటర్లను ప్రభావితం చేయడమే లక్ష్యం
- ➤ ఇప్పుడు డబ్బు వెదజల్లి అధికారంలోకి వస్తే పిండుకుందామంటూ మార్గ నిర్దేశం
- ➤ సోషల్ మీడియాలో వీర విహారం చేస్తున్న ప్రత్యేక ఎన్‌ఆర్ఐ బ్యాచ్‌లు
- ➤ విరాళాల సేకరణ నుంచి ఓట్లు వేయించే వరకు కీలక బాధ్యతలు
- ➤ ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదమంటున్న విశ్లేషకులు.. ఈసీ దృష్టి పెట్టాలని సూచన

కులోన్మాదం, డబ్బు, మదంతో బలుపెక్కడం వల్ల వచ్చే నోటి దురుసుతో టీడీపీ ఎన్‌ఆర్ఐ గుంట నక్కలు రెచ్చిపోతున్నాయి. ఒకడు వైసీపీ వెధవలంటాడు.. మరొకడు చేసేద్దాం, ఏసేద్దాం.. అంటాడు. ఇంకొకడు అందరినీ కొనేద్దామంటాడు.. ఆ నాకొ.. ఈ నాకొ.. అంటూ దొమ్మ పొగరుతో మాట్లాడుతున్నారు.. ఇప్పుడు రూపాయి ఖర్చు పెడితే రేపు మన బాబు వంద రూపాయలిస్తారు.. సుడిగాలిలా పని చేయాలంటూ గాలిలో వచ్చిన కొలెస్ట్రాల్ గాళ్లనంతా పోగేస్తున్నారు.

ఏమైనా చేసేద్దాం.. జగన్ పిచ్చోళ్లను డబ్బులిచ్చి కొందాం.. కొన్ని ఓట్లు ఉన్న వెధవలకు రెండు మూడు లక్షలు పడేద్దాం.. జగన్‌పై ఇప్పుడు చేస్తున్న దుష్ప్రచారం సరిపోదు.. ఇంకా.. ఇంకా పెంచేద్దాం.. అందరూ నమ్మేలా కొన్ని సంఘటనలకు మనం మరికొంత కల్పించి చెబుదాం.. జగన్ వస్తే ఆస్తులు లాక్కుంటారని ప్రచారం చేద్దాం.. ఎన్నికల ప్రచారంలో మన బాబు గారు కొంచెం వెనుకబడ్డారు.. కొన్ని ప్రాంతాల్లో జనం జగన్‌ను బాగా నమ్ముతున్నారు.. దానిని మనం ఎలాగైనా సరే రివర్స్ చేయాలి' అని టీడీపీ ఎన్‌ఆర్ఐ గుంట నక్కలు గుంపులు గుంపులుగా ఊళ్ల మీద పడ్డాయి.

ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఒంటరిగా ఎదుర్కోలేక అపవిత్ర పొత్తులు.. రకరకాల కుయుక్తులు.. తెర వెనుక ఎందరో సాయం తీసుకుంటున్న చంద్రబాబు తాజాగా తనకు అనుకూలంగా ఉండే ఎన్‌ఆర్ఐ గుంట నక్కల్ని గుంపులు గుంపులుగా రంగంలోకి దించారు. సొంత గ్రామాలకు సేవ చేసే ముసుగులో వేలాది మందిని రాష్ట్రంలోకి తీసుకువచ్చి టీడీపీ శ్రేణులతో కలిపి వారిని తన కోసం పని చేయిస్తున్నారు. వీరంతా ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ఓటర్లను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు రకరకాల గిమ్మిక్కులు ప్రదర్శిస్తున్నారు. చంద్రబాబు కోసం ఇప్పుడు ఎంత డబ్బయినా ఖర్చు చేసి, ఆ తర్వాత అధికారంలోకి వస్తే అంతకు పదింతలు దండుకోవాలనే లక్ష్యంతో ఈ గుంట నక్కలు రాష్ట్రంలో విచ్చలవిడిగా స్వైర విహారం చేస్తున్నాయి.

సాక్షి, అమరావతి : చంద్రబాబును మళ్లీ సీఎంగా చేసుకోవాలని, అందుకోసం ఎంతకైనా తెగించాలని, ఏమైనా చేయాలని టీడీపీ అనుకూల ఎన్‌ఆర్ఐ గుంపులు పరితపించిపోతున్నాయి. టీడీపీ ఎన్‌ఆర్ఐ విభాగం సమన్వయకర్త కోమటి జయరాం నేతృత్వంలో నిస్సిగ్గుగా రంగంలోకి దిగాయి. ఈ గుంపులన్నింటితో ఇటీవల మంగళగిరి టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సదస్సే ఇందుకు నిదర్శనం. టీడీపీ ఎన్‌ఆర్ఐ విభాగం ద్వారా వివిధ దేశాల్లో ఆ పార్టీకి మద్దతుగా ఉన్న వారు ఈ సదస్సుకు హాజరయ్యారు. సుమారు ఐదు వేల మందిని ఈ ఎన్నికల్లో ప్రత్యక్షంగా పని చేయించేందుకు ప్రణాళిక రూపొందించగా, ఇప్పటికే నాలుగు వేల మంది పచ్చ ఎన్‌ఆర్ఐలు రాష్ట్రానికి వచ్చారు. మిగిలిన వారు త్వరలో వచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. ఇక్కడికి వచ్చిన వారితో ఇటీవలే ఒక వర్క్‌షాప్ నిర్వహించి వారు చేయాల్సిన పనుల గురించి వివరించారు.

భారీగా విరాళాల సేకరణ

పచ్చ ఎన్‌ఆర్ఐలు మొన్నటి వరకు టీడీపీకి విరాళాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఇక్కడికి వచ్చే ముందే ఆయా దేశాల్లో ఉన్న వారి నుంచి భారీగా విరాళాలు సేకరించి చంద్రబాబు, లోకేశ్‌కు పంపారు. ఇక్కడికి వచ్చాక మళ్లీ ఇప్పుడు విరాళాలు సేకరించే పని మొదలు పెట్టారు. అందుకోసం ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్‌ను చంద్రబాబు ఇటీవలే ప్రారంభించారు. భారీగా విరాళాలు ఇచ్చిన వారిని కోమటి జయరాం, సతీష్ వేమన వంటి వారు చంద్రబాబు వద్దకు తీసుకెళ్లి పరిచయం చేస్తున్నారు. కొంత మందిని లోకేశ్, బ్రాహ్మణిల వద్దకు తీసుకెళుతున్నారు. కోమటి జయరాం నేతృత్వంలో ఇప్పటికే రూ.500 కోట్ల విరాళాలను టీడీపీకి సమకూర్చినట్లు తెలుస్తోంది. పది రోజుల్లో ఇంకా భారీగా విరాళాలు సేకరించి చంద్రబాబుకు ఇచ్చేందుకు ఆయన

-మిగతా IIIలో

సర్వనాశనం నిజమే!



ఊరూ, వాడ వాడ బాబు తెరిపించిన బెల్ట్ షాపులు సర్వనాశనం	నాడు లబ్ధిదారుల కడుపుకొట్టిన కాలకేయులంతా సర్వనాశనం	అదిగో, ఇదిగో రాజధాని అంటూ మోసం చేసిన రియల్టర్‌లు సర్వనాశనం
ప్రజలను పీల్చి పిప్పి చేసిన జన్మభూమి కమిటీలు సర్వనాశనం	ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసిన దందా సర్వనాశనం	పేదలనోటికాడి రేషన్‌ను పక్కదారి పట్టించిన మాఫియా సర్వనాశనం
ప్రతి పనికీ వెల కట్టి.. లంచాలు వసూలు చేసిన వ్యవస్థ సర్వనాశనం	నీకింత, నాకింత అంటూ దోచుకుతిన్న దుర్మార్గ వ్యవస్థ సర్వనాశనం	ఈ ఐదేళ్లలో ఇవన్నీ సర్వనాశనం అయ్యాయి కాబట్టే చంద్రబాబు అరుపులు
కాల్ మనీ సెక్స్ రాకెట్‌తో వేధించుకుతిన్న కేటుగాళ్లంతా సర్వనాశనం	బంగారం పండే భూములను బీడుగా మార్చిన బ్యాచ్ సర్వనాశనం	మళ్లీ ఆ వ్యవస్థలను తేవాలన్నదే దుష్టచతుష్టయం, దత్తపుత్రుడి లక్ష్యం

బాబు దోపిడీతో కుదేలైన రాష్ట్రాన్ని సంస్కరణలతో పునర్నిర్మిస్తున్న సీఎం జగన్

రాష్ట్రంలో 2014 నుంచి 2019 వరకు తను కష్టపడి నిర్మించిన అవినీతి సామ్రాజ్యం అంతా సర్వనాశనం అయిపోయిందని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఊరూరా రంకెలేస్తున్నారు. అక్రమంగా సంపాదించడం, దుష్టచతుష్టయం అంతా కలిసి పంచుకోవడమే ధ్యేయంగా బాబు ఐదేళ్ల పాలన సాగింది. 2019లో వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కాగానే ఆ అవినీతి సామ్రాజ్యం బీటలువారింది. ఒక్కో అక్రమ వ్యవస్థ కుప్ప కూలుతూ వచ్చింది. ఆ దుర్మార్గ వ్యవస్థలన్నింటినీ సీఎం వైఎస్ జగన్ సర్వనాశనం చేసింది వాస్తవమే. వాటన్నింటినీ కూకటివేళ్లతో పెకిలించి వేయడంతో చంద్రబాబుతో కూడిన దుష్టచతుష్టయం, ఆయన దత్తపుత్రుడు గావుకేకలు పెడుతున్నారు. ఏ వ్యవస్థలు నాశనం అయ్యాయో.. ఏ వ్యవస్థలు బాగుపడ్డాయో ఐదేళ్లుగా జనం చూస్తూనే ఉన్నారు.

సాక్షి, అమరావతి : అందినకాడికి దోచుకోవడం.. వారంతా కలిసి పంచుకోవడమే లక్ష్యంగా సాగిన దందాకు రాష్ట్రంలో బ్రేక్ పడటంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అంతా సర్వనాశనం చేశారంటూ చంద్రబాబు గగ్గోలు పెడుతున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు సృష్టించిన ప్రజాకంటక వ్యవస్థలను సీఎం వైఎస్ జగన్ సర్వనాశనం చేసింది వాస్తవమే. బెల్ట్ షాపులు, కాల్ మనీ సెక్స్ రాకెట్లు, ప్రైవేటు విద్యా సంస్థల దోపిడీ మొదలు.. అమరావతి రియల్ ఎస్టేట్ వ్యాపారం వరకు చంద్రబాబు సృష్టించిన ఆ వ్యవస్థలకు రూపు లేకుండా చేశారు. చంద్రబాబు దోపిడీ మార్గాలకు పూర్తిగా అడ్డుకట్ట పడింది. కమీషన్ల కోసం తాను ఏర్పాటు చేసుకున్న వ్యవస్థలను సీఎం వైఎస్ జగన్ చావుదెబ్బ తీయడంతో చంద్రబాబు బెంబేలెత్తిపోతున్నారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి 1995లో అధికారాన్ని చేజిక్కించుకున్న చంద్రబాబు.. మద్యపాన నిషేధాన్ని ఎత్తేయడం ద్వారా 1994 ఎన్నికల్లో టీడీపీ ఇచ్చిన హామీని తుంగలో తొక్కి ప్రజలను మోసం చేశారు. మద్యం షాపులకు అనుబంధంగా వాడవాడన బెల్ట్‌షాపులు తెరిపించి 1995 నుంచి 2004 వరకు మద్యాన్ని ఏరులై పారించి, కమీషన్లు దండుకున్నారు. విభజన తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. మద్యం షాపులకు అనుబంధంగా 43 వేల బెల్ట్ షాపులు తెరిపించారు. తద్వారా భారీ ఎత్తున కమీషన్లు పుచ్చుకున్నారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక ఆ బెల్ట్ షాపులన్నింటినీ లేకుండా చేశారు. చంద్రబాబు కమీషన్లకు చిహ్నమైన బెల్ట్ షాపులను సర్వనాశనం చేశారు.

కాలకేయుల దాష్టీకాలకు అడ్డుకట్ట

ప్రభుత్వ సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం 2014లో జన్మభూమి కమిటీలనే రాజ్యాంగేతర వ్యవస్థను చంద్రబాబు తెరపైకి తెచ్చారు. ఆ కమిటీలను టీడీపీ నేతలతో నింపేశారు. పెన్షన్ దగ్గర నుంచి ఆదరణ పథకం కింద పని ముట్లు దాకా ఏ పథకం కింద లబ్ధి పొందాలన్నా ఆ కమిటీల ఆమోదం తప్పనిసరి. వాటిని పొందడానికి అర్హత ఉన్నా సరే.. ఆ కమిటీల్లోని పచ్చ కాలకేయుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి.. అడిగినంత మేర లంచాలు ఇచ్చుకున్నా పథకాల ద్వారా లబ్ధి చేకూర్చేవారు కాదు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక అర్హతే ప్రామాణికంగా.. వివక్ష, లంచాలకు తావులేకుండా అందరికీ సంక్షేమ పథకాల ఫలాలను అందిస్తున్నారు. పచ్చ కాలకేయులతో చంద్రబాబు ఏర్పాటు చేసిన రాజ్యాంగేతర వ్యవస్థ అయిన ప్రజాకంటక జన్మభూమి కమిటీలను సర్వనాశనం చేశారు.

బినామీల విద్యా వ్యాపారానికి చెక్

నారాయణ విద్యా సంస్థల అధినేత పొంగూరు నారాయణ.. చంద్రబాబుల మధ్య అవినాభావ సంబంధం ఉంది. చంద్రబాబు బినామీ నారాయణ. ప్రభుత్వ బడులను నాశనం చేసి.. ప్రజలను ప్రైవేటు స్కూళ్ల వైపు మళ్లించి.. నారాయణ వంటి విద్యా వ్యాపారిని ముందుపెట్టి, భారీ ఎత్తున ఫీజులు పెంచేసి ఆకాశమే హద్దుగా దోపిడీకి పాల్పడ్డారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేశారు. ఇంగ్లిష్ మీడియంలో సీబీఎస్‌ఈ సిలబస్ బోధిస్తున్నారు.అమ్మ ఒడి కింద


-మిగతా IIIలో

భూ రీసర్వే చట్టం.. ఊరూరికీ చుట్టం

దేశంలో వందేళ్ల తర్వాత ఏపీలో భూముల రీ సర్వే

- చరిత్రలో తొలిసారిగా గ్రామ కంఠాల సర్వే
- ల్యాండ్ టైట్లింగ్ చట్టం, కొత్త కౌలు చట్టం దేశానికే ఆదర్శం
- ఈ చట్టాలతో గ్రామ స్థాయిలో భూ పరిపాలన
- భూ సంస్కరణలు అమలైతే దేశవ్యాప్తంగా ప్రయోజనం
- 'సాక్షి'తో భూ చట్టాల నిపుణుడు, నల్సార్ వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్





భూముల రీ సర్వే... ఇందుకోసం ఊరికో సర్వేయర్.. నవ్యాంధ్రలో ఇదో వినూత్న ప్రయోగం.. వందేళ్లుగా భూముల సర్వే మాటే లేదు.. ఇప్పుడు రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా గ్రామ కంఠాల స్థాయిలో ప్రభుత్వం సర్వే చేయిస్తోంది.. భూ క్రయవిక్రయాలు, వాటిపై రుణాలు పొందడం ఐదేళ్ల వెనక్కి వెళ్తే అది పెద్ద ప్రహసనమే.. రికార్డులు సరిగా లేవని భూములు, ఇంటి స్థలాలపై రుణాలివ్వడానికి బ్యాంకులు సవాలక్ష కొర్రీలు వేసేవి.. ఇక ముందు ఇలాంటి ఇబ్బంది ఉండబోదు.. ఆంధ్రప్రదేశ్‌లో భూ రికార్డుల తయారీ నవశకానికి నాంది పలుకుతోంది.. భూముల రీ సర్వే, ల్యాండ్ టైట్లింగ్ చట్టం, కొత్త కౌలు చట్టాలను ప్రభుత్వం తెచ్చింది.. ఇవి ప్రతి ఊరికీ ప్రయోజనకరమే.. ఈ చట్టాల వల్ల భూముల విలువలూ పెరుగుతాయి. వీటిని చూసిన తర్వాత దేశంలో ఇతర రాష్ట్రాలూ ముమ్ముందు ఏపీనే అనుసరిస్తాయి.. రాష్ట్రంలో ఇదొక విప్లవాత్మక పరిణామమని భూ చట్టాల నిపుణుడు, నల్సార్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్ అభివర్ణిస్తూ.. ఈ మూడు ప్రక్రియలు, రాష్ట్ర ప్రజానీకానికి వీటి వల్ల ఒనగూరే ప్రయోజనాలను సాక్షికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన విశ్లేషణాత్మకంగా వివరించారు.

పూర్తి వివరాలు IIIలో

'గంటా' పథంగా అక్రమార్కుడే



పూర్తి వివరాలు IIIలో

సర్కారు దిద్దిన చదువులు

సీఎం జగన్ విద్యా సంస్కరణలతో ప్రభుత్వ స్కూళ్లలో అద్భుతమైన ఫలితాలు

-వివరాలు IVలో

రెండో విడతలో... నువ్వా నేనా!?

రాజస్తాన్‌లో ఆసక్తికరంగా ఎన్నికల పోరు

- 13 లోక్‌సభ స్థానాలకు 26న పోలింగ్
- బరిలో గహ్లోత్, వసుంధర కుమారులు
- గెలుపు మాజీ సీఎంలిద్దరికీ ప్రతిష్టాత్మకమే

రాజస్తాన్‌లో ఎన్నికల క్రతువు ముగింపునకు చేరుకుంటోంది. మొత్తం 25 లోక్‌సభ స్థానాలకు గాను 12 చోట్ల ఏప్రిల్ 19న తొలి విడతలో పోలింగ్ పూర్తయింది. మిగతా 13 స్థానాలకు 26న రెండో విడతలో పోలింగ్ జరగనుంది. వీటిలో పలు స్థానాల్లో బీజేపీతో కాంగ్రెస్ హోరాహోరీ తలపడుతోంది. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో ఒక్క సీటు కూడా నెగ్గలేకపోయిన హస్తం పార్టీ ఈసారి రికార్డును ఎలాగైనా మెరుగుపరుచుకోవాలని పట్టుదలగా ఉంది. ఈ నేపథ్యంలో రాజస్తాన్‌లో రెండో విడతలో పోలింగ్ జరగనున్న కీలక స్థానాలపై ఫోకస్...

\- సాక్షి, నేషనల్ డెస్క్

రాజ్‌సమంద్


మహిమా సింగ్

ఇక్కడ బీజేపీ అనూహ్యంగా కొత్త ముఖమైన మేవాడ్ రాజవంశీకుడు, ఎమ్మెల్యే విశ్వజిత్‌సింగ్ భార్య మహిమా సింగ్‌కు టికెటిచ్చింది. రాజస్తాన్‌లో రాజ్‌పుత్‌లు నిర్ణాయక శక్తి. గుజరాత్ బీజేపీ నేత పురుషోత్తం రూపాలా ఇటీవల రాజ్‌పుత్‌లపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో పార్టీపై వారంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో రాజ్‌పుత్‌లను ఆకట్టుకునేందుకు మహారాణా ప్రతాప్ వంశీకుడైన విశ్వజిత్ భార్యకు బీజేపీ వ్యూహాత్మకంగా టికెటిచ్చింది. కాంగ్రెస్ తొలుత సుదర్శన్‌సింగ్ రావత్‌కు టికెటివ్వగా ఆయన అనూహ్యంగా వైదొలగి షాకిచ్చారు. దాంతో తొలుత బిల్వారా అభ్యర్థిగా ప్రకటించిన దామోదర్ గుర్జర్‌ను హడావుడిగా రాజ్‌సమంద్ నుంచి బరిలో దించింది. మహిమ తమ కుటుంబపు మేవాడ్ రాజవంశ వారసత్వాన్నే ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

టోంక్-సవాయ్ మధోపూర్


సుఖ్‌బీర్‌సింగ్

ఈ లోక్‌సభ స్థానంలో గుర్జర్లు, మీనాలతో పాటు ముస్లింల ప్రాబల్యం ఎక్కువ. మీనా సామాజికవర్గానికి 4 లక్షలు, గుర్జర్లకు 3.5 లక్షల పై చిలుకు ఓట్లున్నాయి. 1.8 లక్షల మంది ముస్లిం ఓటర్లున్నారు. మొత్తమ్మీద ఇక్కడ గ్రామీణ ఓటర్ల సంఖ్య ఎక్కువ. బీజేపీ సిటింగ్ ఎంపీ సుఖ్‌బీర్‌సింగ్ జౌన్‌పురియాది గుర్జర్ సామాజికవర్గమే. 2014, 2019 ఎన్నికల్లో సునాయాసంగా నెగ్గిన ఆయన ఈసారి హ్యాట్రిక్ కోసం ప్రయత్నిస్తున్నారు. 2019లో కేంద్ర మాజీ మంత్రి అయిన కాంగ్రెస్ నేత నమోనారాయణ్ మీనాను జౌన్‌పురియా ఓడించారు. ఈసారి కాంగ్రెస్ నుంచి మీనా సోదరుడు, ఎమ్మెల్యే హరీశ్ మీనా బరిలో ఉన్నారు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని 8 అసెంబ్లీ స్థానాల్లో ఇటీవలి ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ చెరో సగం గెలుచుకున్నాయి. దాంతో లోక్‌సభ పోరు హోరాహోరీ సాగుతుందని భావిస్తున్నారు.


హరీశ్ మీనా

జాలోర్


వైభవ్ గహ్లోత్

కాంగ్రెస్ తరఫున మాజీ సీఎం అశోక్ గహ్లోత్ కుమారుడు వైభవ్ పోటీ చేస్తున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఆయన జోధ్‌పూర్ నుంచి పోటీ చేసి కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ చేతిలో ఘోర ఓటమి చవిచూశారు. దాంతో గహ్లోత్ ఈసారి వ్యూహాత్మకంగా తమ సామాజికవర్గం ఓట్లు ఎక్కువగా ఉన్న జాలోర్‌ను కుమారుని కోసం ఎంచుకున్నారు. ఈసారి కూడా వైభవ్ ఓటమి చవిచూస్తే ఆయన రాజకీయ జీవితం దాదాపుగా ముగిసినట్టేనని భావిస్తున్నారు. దాంతో అశోక్ గహ్లోత్ కాలికి బలపం కట్టుకుని నియోజకవర్గమంతా స్వయంగా కలియదిరుగుతూ కుమారుని విజయం కోసం చెమటోడుస్తున్నారు. తనను గెలిపిస్తే నియోజకవర్గంలో చేపట్టబోయే సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఏకరువు పెడుతూ 'వాగ్దానపత్రం' పేరిట వైభవ్ ప్రత్యేకంగా మేనిఫెస్టోనే విడుదల చేయడం విశేషం! ఇక్కడ బీజేపీ సిట్టింగ్ ఎంపీ దేవ్‌జీ పటేల్‌ను పక్కనపెట్టి లుంబారాం చౌదరి అనే కొత్త ముఖానికి అవకాశమిచ్చింది.

బన్స్‌వారా


మహేంద్రజీత్‌సింగ్

ఇది దక్షిణ రాజస్తాన్‌లోని గిరిజన ప్రాబల్య నియోజకవర్గం. ఎస్టీ రిజర్వుడు స్థానం. బీజేపీ ఇక్కడ ప్రముఖ గిరిజన నేత మహేంద్రజీత్‌సింగ్ మాల్వియాను కాంగ్రెస్ నుంచి చేర్చుకుని మరీ టికెటిచ్చింది. దాంతో గిరిజన ఓట్ల కోసం కాంగ్రెస్ చివరి నిమిషంలో భారత్ ఆదివాసీ పార్టీ (బీఏపీ)తో పొత్తు పెట్టుకుంది. ఈ స్థానాన్ని తమకే కేటాయిస్తుందని ఆ పార్టీ భావించింది. కానీ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అర్వింద్ దామోర్‌ను హస్తం పార్టీ బరిలో దించింది. ఈ చర్యతో ఆగ్రహించిన బీఏపీ కూడా తన అభ్యర్థిని ప్రకటించింది. దాంతో ఇక్కడ ముక్కోణపు పోరు నెలకొంది! ఇక్కడ కూడా కాంగ్రెస్ తొలుత మాజీ మంత్రి అర్జున్‌సింగ్ బామనియాకు టికెటివ్వగా ఆయన పోటీకి నిరాకరించడం విశేషం!

బార్మేర్


రవీంద్రసింగ్ భాటీ

పశ్చిమ రాజస్తాన్‌లోని ఈ స్థానంలో సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మంత్రి కైలాశ్ చౌదరి మరోసారి బీజేపీ తరఫున బరిలో ఉన్నారు. కానీ ఆయన పనితీరుపై స్థానికుల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. దాంతో ఆయన మోదీ మేజిక్‌నే నమ్ముకున్నారు. తనను కాకుండా మోదీని చూసి ఓటేయాల్సిందిగా ప్రతిచోటా ప్రజలను వేడుకుంటున్నారు! ఇక్కడ జాట్లు, రాజ్‌పుత్‌ల ఓట్లు నిర్ణాయకం. కాంగ్రెస్ ఇటీవలే హనుమాన్ బెనీవాల్‌కు చెందిన ఆరెల్పీని వీడిన ఉమ్మేదా రాంకు టికెటిచ్చింది. కానీ బీజేపీ రెబెల్, ఎమ్మెల్యే రవీంద్రసింగ్ భాటీ వారిద్దరికీ ముచ్చెమటలు పట్టిస్తున్నారు. మంచి కరిష్మా ఉన్న ఈ యువ నేత సభలకు జనం విరగబడుతున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గానే నెగ్గిన భాటీ లోక్‌సభకు కూడా స్వతంత్ర అభ్యర్థిగానే పోటీ చేస్తుండటం విశేషం.


కైలాశ్ చౌదరి

కోటా


ఓం బిర్లా

ఇక్కడ బీజేపీ తరఫున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా బరిలో ఉన్నారు. వసుంధర రాజేకు సన్నిహితుడైన బీజేపీ మాజీ ఎమ్మెల్యే ప్రహ్లాద్ గుంజల్ కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ తరఫున బరిలో నిలిచారు. మరో స్థానిక బీజేపీ ప్రముఖుడు హదోతీ చేరిక తన అవకాశాలను మరింత మెరుగుపరుస్తుందని కాంగ్రెస్ ఆశ పడుతోంది. ఈ నేపథ్యంలో బిర్లాను గెలిపించుకోవడాన్ని బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రధాని మోదీ ఇక్కడ ఇప్పటికే ఎన్నికల ర్యాలీలో పాల్గొని జోష్ తెచ్చారు.

ఝులావర్-బరన్


దుష్యంత్‌సింగ్

బీజేపీ నుంచి మాజీ ముఖ్యమంత్రి వసుంధరా రాజె సింధియా కుమారుడు దుష్యంత్‌సింగ్ బరిలో ఉన్నారు. ఆయన విజయం కోసం వసుంధర చెమటోడుస్తున్నారు. నియోజకవర్గానికే పరిమితమై సుడిగాలి ప్రచారం చేస్తున్నారు. ఇప్పటిదాకా నాలుగుసార్లు లోక్‌సభ ఎన్నికల్లో నెగ్గిన దుష్యంత్ తన పనితీరు చూసి ఓటేయాల్సిందిగా ప్రజలను అభ్యర్థిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఊర్మిలా జైన్ భయా నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు.

చితోడ్‌గఢ్


సీపీ జోషి

ఈ రాజ్‌పుత్ ప్రాబల్య స్థానం నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సీపీ జోషి బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి రాష్ట్ర మాజీ మంత్రి ఉదయ్‌లాల్ అంజనా పోటీ చేస్తున్నారు. బీజేపీ పట్ల రాజ్‌పుత్‌ల్లో నెలకొన్న గట్టి అసంతృప్తి నేపథ్యంలో ఇక్కడ కూడా మోదీ ఫ్యాక్టర్‌నే పార్టీ నమ్ముకుంది. 2014, 2019ల్లో వరుసగా నెగ్గిన జోషి ఈ నియోజకవర్గ చరిత్రలో తొలిసారి హ్యాట్రిక్ కొడతానని ధీమాతో ఉన్నారు. 2019లో ఆయన చేతిలో ఓడిన కాంగ్రెస్ అభ్యర్థి గోపాల్‌సింగ్ ఎద్వా ఇటీవలే బీజేపీలో చేరడం ఆ పార్టీకి కలిసొస్తుందని భావిస్తున్నారు. ఇక అంజనా తాను రైతుబిడ్డనని చెప్పుకుంటూ ఓట్లడుగుతున్నారు. తనను గెలిపిస్తే ఓపియం సాగు చేసే స్థానికుల సమస్యను పార్లమెంటులో లేవనెత్తుతానని హామీ ఇవ్వడం విశేషం!

ప్రచారాస్త్రాలు

బీజేపీ
- మోదీ కరిష్మా
- బీజేపీ ప్రభుత్వ అభివృద్ధి అజెండా
- అయోధ్య రామమందిర నిర్మాణం
- ఆర్టికల్ 370 రద్దు
- రాజ్‌పుత్, జాట్, గిరిజనులపై ప్రత్యేక దృష్టి
- రాష్ట్రంలో గహ్లోత్ సారథ్యంలోని గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేపర్ లీకేజీ, అక్రమ మైనింగ్‌పై చర్యల దిశగా అడుగులు

కాంగ్రెస్
- బీజేపీకి గట్టి పోటీ ఇవ్వగల స్థానాలపై ప్రత్యేక దృష్టి
- ఎన్నికల బాండ్ల పథకం
- దర్యాప్తు సంస్థల దుర్వినియోగం
- గహ్లోత్ సర్కారు సంక్షేమ పథకాలు
- 100 రోజుల హామీ అమలులో రాష్ట్ర బీజేపీ ప్రభుత్వ వైఫల్యం

కురువృద్ధుల ఓటోత్సాహం

వందేళ్లకు పైబడ్డ ఓటర్లు 2 లక్షల పైనే

ఈ లోక్‌సభ ఎన్నికల్లో వందేళ్ల పై బడిన ఓటర్లు ఏకంగా 2,18,442 మంది ఉన్నారు. వీరిలో యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో పలువురు 110 ఏళ్లు దాటిన ఓటర్లూ ఉన్నారు! 1951–52లో జరిగిన తొలి లోక్‌సభ ఎన్నికల నుంచి 2019 దాకా మొత్తం 17 సాధారణ ఎన్నికల్లోనూ ఓటేసిన అరుదైన రికార్డు వీరిది! తాజాగా 18వ లోక్‌సభ ఎన్నికల్లోనూ ఓటేసేందుకు కూడా వీరంతా ఉత్సాహంగా ఉన్నారు. శతాధిక ఓటర్లలో మహారాష్ట్రలో అత్యధికంగా 52,908 మంది ఉన్నారు.

బాధ్యతగా ఓటు..

వందేళ్లు దాటిన వయసులో సొంత పనులు చేసుకోవడం దేవుడెరుగు, నడవడమే కనాకష్టం. అయినా ఈ వయసులోనూ ఓటేసి మ సామాజిక బాధ్యతను నెరవేర్చి తీరతానంటున్నారు 103 ఏళ్ల భగవతి ప్రసాద్. ఆయనది ప్రయాగ్‌రాజ్ జిల్లా హనుమాన్‌గంజ్ తహసీల్‌లోని కరణ్‌పూర్ గ్రామం. ''నేను, నా భార్య 1952 నుంచీ ఓటేస్తున్నాం. పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటేస్తే సంతోషంతో పాటు కాస్త గర్వం కూడా కలుగుతుంటుంది'' అన్నారు. అయితే గతంలో ఉండే హడావుడి ఇప్పటి ఎన్నికల్లో లోపించిందంటూ పెదవి విరిచారాయన. ''నాలాంటి వారికి ఏ ఎన్నిక చివరిదో చెప్పలేం. కనుక ఈసారి ఓటేసేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నా'' అన్నారు ప్రయాగ్‌రాజ్‌లోని గోహాని గ్రామానికి చెందిన 101 ఏళ్ల కేసరి దేవి.

శతాధిక ఓటర్లు అధికంగా ఉన్న రాష్ట్రాలు..

మహారాష్ట్ర	52,908
రాజస్థాన్	20,000
కర్ణాటక	17,000
హరియాణా	10,759
గుజరాత్	10,322

\- సాక్షి, నేషనల్ డెస్క్


కింగ్ వర్సెస్ సిద్ధు

మైసూరు లోక్‌సభ స్థానంలో ఆసక్తికర పోరు

- బీజేపీ నుంచి మైసూర్ రాజ కుటుంబ వారసుడు
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఎం సిద్ధరామయ్య
- కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం తీవ్రంగా కృషి

మైసూరు–కొడగు లోక్‌సభ స్థానంలో ఎన్నిక కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మైసూరు రాజకుటుంబ వారసుని మధ్య యుద్ధంగా మారింది. బీజేపీ ఇక్కడ సిట్టింగ్ ఎంపీ ప్రతాప్ సింహ బదులు యదువీర్ కృష్ణదత్త చామరాజ వడయార్‌ను రంగంలోకి దింపింది. కాంగ్రెస్ తరఫున పీసీసీ అధికార ప్రతినిధి ఎం.లక్ష్మణ పోటీలో ఉన్నారు. ఇది సిద్ధరామయ్య సొంత జిల్లా కావడంతో ఈ ఎన్నిక ఆయనకు ప్రతిష్టాత్మక అంశంగా మారింది. దాంతో లక్ష్మణ గెలుపు కోసం సర్వశక్తులూ ఒడ్డుతున్నారు...

\- సాక్షి, నేషనల్ డెస్క్


సిద్ధరామయ్య

మైసూరులో సిద్ధరామయ్యకు ఎంత బలముందో, రాజకుటుంబానికి అంతకన్నా ఎక్కువ ప్రభావం చూపగల సత్తా ఉంది. యదువీర్ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. సిద్ధూ కూడా మైసూరులో విడిది చేసి మరీ కాంగ్రెస్ ప్రచార సరళిని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని 8 అసెంబ్లీ స్థానాల ఆఫీస్ బేరర్లలో నిత్యం భేటీ అవుతూ దిశానిర్దేశం చేస్తున్నారు. లక్ష్మణ గెలుపు బాధ్యతలను స్థానిక ఎమ్మెల్యేలు, నాయకులకు అప్పగించారు. మొత్తమ్మీద 2.5 లక్షల ఓట్ల మెజారిటీని లక్ష్యంగా నిర్దేశించారు! బీజేపీకి చెక్ పెట్టేందుకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను ఇంటింటికీ మరింతగా ప్రచారం చేయాలని ఆదేశించారు.


కృష్ణదత్త చామరాజ వడయార్

రెండు దశాబ్దాల తరువాత..

మైసూరు రాజకుటుంబం రెండు దశాబ్దాల తరువాత ఎన్నికల బరిలో దిగుతోంది. గతంలో మైసూరు రాజు శ్రీకాంతదత్త నరసింహరాజ వడయార్ నాలుగుసార్లు ఎంపీగా గెలిచారు. 2004లో ఓడాక ఆయన మళ్లీ పోటీ చేయలేదు. మైసూరులో పటిష్ఠమైన ఓటుబ్యాంకున్న జేడీ(ఎస్)తో పొత్తు ఈసారి మరింత కలిసొస్తుందని బీజేపీ ఆశలు పెట్టుకుంది. కాంగ్రెస్ చేస్తున్న 'సామాన్యుడు వర్సెస్ రాజు' ప్రచారాన్ని యదువీర్ తోసిపుచ్చుతున్నారు. ''ప్రజాస్వామ్య భారతంలో ఎవరూ రాజు కాదు. అందరూ సమానులే'' అని ప్రచారంలో పదేపదే చెబుతున్నారు.

వొక్కలిగ కార్డు..

మైసూరు ప్రాంతంలో వొక్కలిగల ఆధిపత్యం ఎక్కువ. దాంతో అదే సామాజికవర్గానికి చెందిన లక్ష్మణను గెలిపించుకోవాలంటూ వారికి కాంగ్రెస్ పిలుపునిస్తోంది. ఇక్కడ కాంగ్రెస్ వొక్కలిగలకు టికెటివ్వడం 1977 తర్వాత ఇదే తొలిసారి! ఈ సామాజిక వర్గానికి చెందిన సిట్టింగ్ ఎంపీ ప్రతాప్ సింహకు బీజేపీ టికెట్ నిరాకరించడాన్ని కాంగ్రెస్ తన ప్రచారంలో ప్రముఖంగా ప్రస్తావిస్తోంది. అయితే సిద్ధరామయ్య పక్కా వొక్కలిగల వ్యతిరేకి అంటూ బీజేపీ దీటుగా ప్రచారం చేస్తోంది. దాంతో సిద్ధరామయ్య మరింత జాగ్రత్త పడుతున్నారు. వడియార్‌పై ఎలాంటి అభ్యంతరకర విమర్శలూ చేయొద్దని నేతలకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. మైసూర్ లోక్‌సభ స్థానంలో మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువ. విజేతను నిర్ణయించడంలో వారే కీలకం. దాంతో రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రధాన లబ్ధిదారులైన మహిళేనంటూ కాంగ్రెస్ ఇక్కడ జోరుగా ప్రచారం చేస్తోంది.

సంకీర్ణ వైఫల్యం


- 11వ లోక్‌సభలో హంగ్
- రెండేళ్లలో ముగ్గురు ప్రధానులు
- 13 రోజులకే వాజ్‌పేయి రాజీనామా
- దేవెగౌడ, గుజ్రాల్ చెరో 11 నెలలే

గతం

1996లో తొలిసారిగా పీవీ నరసింహారావు రూపంలో నెహ్రూ కుటుంబేతర నేత సారథ్యంలో కాంగ్రెస్ ఎన్నికలకు వెళ్లింది. చిరస్థాయిగా గుర్తుండే పనులు చేసినా పీవీ ప్రజల మనసు గెలవలేకపోయారు. అవినీతి ఆరోపణలకు తోడు పార్టీలో వర్గపోరు తారాస్థాయికి చేరింది. అర్జున్ సింగ్, నారాయణ్‌దత్ తివారీ బయటికొచ్చి ఆలిండియా ఇందిరా కాంగ్రెస్ (తివారీ) పేరిట వేరుకుంపటి పెట్టుకున్నారు. జమ్మూ కశ్మీర్, పంజాబ్ హింస మరింత మైనసయ్యాయి. బాబ్రీ మసీదు విధ్వంసం కాంగ్రెస్ అవకాశాలను బాగా దెబ్బ తీసింది.


కూటముల కష్టాలు

దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీలతో కలసి బలమైన కూటమి కోసం కాంగ్రెస్, బీజేపీ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. వాటికి ప్రత్యామ్నాయంగా సీపీఐ, సీపీఎం, జనతాదళ్, టీడీపీలతో నేషనల్ ఫ్రంట్ కూటమి ఏర్పాటైంది. అయితే కనీస ఉమ్మడి కార్యక్రమాలపై వాటి మధ్యా ఏకాభిప్రాయం కుదరలేదు. 1996 ఏప్రిల్ 27, మే 2, 7 తేదీల్లో లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ ఓటు బ్యాంకు 28.8 శాతానికి తగ్గి 140 స్థానాలకు పరిమితమైంది. 1991లో ఆదుకున్న దక్షిణాదిలో ఈ దఫా పార్టీ తీవ్రంగా నష్టపోయింది. ఏపీలో 22 సీట్లు రావడమే కాస్త ఊరట. బీజేపీ 20.29 శాతం ఓట్లతో 161 సీట్లు గెలిచి ఏకైక పెద్ద పార్టీగా నిలిచింది. జనతాదళ్ 46 స్థానాలతో కుదేలైంది.



పార్టీలను చీలిస్తేనే మా ప్రభుత్వం నిలబడుతుందంటే, అలాంటి నైచ్యానికి దిగజారే బదులు విపక్షంలో కూర్చోవడానికే ఇష్టపడతాం. నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇప్పటిదాకా ఎన్నో ప్రభుత్వాలు కొలువుదీరడం, కుప్పకూలడం చూశాను. కానీ ఆ పరిణామాలన్నీ అంతిమంగా భారత ప్రజాస్వామ్యాన్ని బలోపేతమే చేశాయి. నేనిప్పుడు చేయబోయే రాజీనామా కూడా అదే కోవకు చెందుతుందని పూర్తి నమ్మకముంది.

\- 1996 మే 27న ప్రధాని పదవికి రాజీనామా సందర్భంగా పార్లమెంటులో చేసిన చిరస్మరణీయ ప్రసంగంలో వాజ్‌పేయి


గుజ్రాల్


దేవెగౌడ

11వ లోక్‌సభలో పార్టీల బలాబలాలు

(మొత్తం స్థానాలు 545)

పార్టీ	స్థానాలు
బీజేపీ	161
కాంగ్రెస్	140
జనతాదళ్	46
సీపీఎం	32
తమిళ మానిల కాంగ్రెస్	20
ఎస్పీ	17
డీఎంకే	17
టీడీపీ	16
శివసేన	15
బీఎస్పీ	11
సీపీఐ	12
ఇతరులు	58

సాహసోపేత నిర్ణయాలతో దేశానికి నూతన దిశానిర్దేశం చేసినా 1996లో ప్రజా తీర్పు పీవీ సర్కారుకు వ్యతిరేకంగా వచ్చింది. ఏ పార్టీకీ సొంతంగా మెజారిటీ రాలేదు. బీజేపీ తన బలాన్ని మరింత పెంచుకుని 161 స్థానాలతో అతి పెద్ద పార్టీగా అవతరించింది. వాజ్‌పేయి తొలిసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా అది 13 రోజుల ముచ్చటే అయింది. ప్రాంతీయ పార్టీలతో కూడిన నేషనల్ ఫ్రంట్, కాంగ్రెస్ సంకీర్ణ ప్రయోగమూ 11 నెలలకే కొండెక్కింది. గుజ్రాల్ సర్కారు కూడా అంతకుమించి సాగకపోవడంతో 11వ లోక్‌సభ రెండేళ్లకే చరిత్రలో కలిసిపోయింది...

\- సాక్షి, నేషనల్ డెస్క్

కుర్చీలాట

ఏకైక పెద్ద పార్టీగా నిలిచిన బీజేపీని ప్రభుత్వ ఏర్పాటుకు రాష్ట్రపతి శంకర్‌దయాళ్ శర్మ ఆహ్వానించారు. 1996 మే 15న వాజ్‌పేయి తొలిసారి ప్రధానిగా ప్రమాణం చేశారు. కానీ ప్రాంతీయ పార్టీల మద్దతు కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దాంతో 13 రోజులకే వాజ్‌పేయి రాజీనామా చేశారు. రెండో పెద్ద పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు ఆసక్తి చూపలేదు. మరోసారి ప్రధాని పదవి చేపట్టేందుకు వీపీ సింగ్ తిరస్కరించడంతో జనతాదళ్ నేత హెచ్‌డీ దేవెగౌడ పేరును ప్రధాని పదవికి సీపీఎం దిగ్గజం, బెంగాల్ సీఎం జ్యోతిబసు ప్రతిపాదించారు. జనతాదళ్, నేషనల్ ఫ్రంట్‌లోని పార్టీలతో, కాంగ్రెస్ బయటి నుంచి మద్దతుతో యునైటెడ్ ఫ్రంట్ ఏర్పడింది. 1996 జూన్ 1న దేవెగౌడ ప్రధానిగా ప్రమాణం చేశారు. కానీ 11 నెలలకే కాంగ్రెస్ మద్దతు వెనక్కు తీసుకోవడంతో రాజీనామా చేశారు. కాంగ్రెస్‌తో మెరుగైన సంబంధాలున్న ఐకే గుజ్రాల్ 1997 ఏప్రిల్ 21న ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన సర్కారూ ఎంతోకాలం సాగలేదు. రాజీవ్‌గాంధీని బలితీసుకున్న ఎల్టీటీఈ పట్ల సానుభూతితో వ్యవహరించిన డీఎంకేను సంకీర్ణం నుంచి తొలగించాలని కాంగ్రెస్ పట్టుబట్టింది. అందుకు గుజ్రాల్ తిరస్కరించడంతో ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించింది. దాంతో 11 నెలలకే గుజ్రాల్ సర్కారూ కుప్పకూలింది. 1998లో రెండేళ్లకే లోక్‌సభకు మళ్లీ ఎన్నికలు జరిగాయి.

ఇదిగో నవరత్నాల వెలుగులు



పద్మావతి కుటుంబానికి 2019 నుంచి వివిధ పథకాల ద్వారా అందిన లబ్ధి మొత్తం వివరాలు

పథకం	లబ్ధి (రూ.లలో)
పింఛన్	1,21,500
వైఎస్సార్ ఆసరా	72,951
సున్నా వడ్డీ	5,355
వైఎస్సార్ చేయూత	56,250
రైతు భరోసా	21,000
జగనన్నతోడు	20,000
అమ్మ ఒడి	81,000
వైఎస్సార్ వాహనమిత్ర	20,000
ఇంటి స్థలం	1,50,000
పక్కా గృహం	1,80,000

పేద ప్రజల జీవన ప్రమాణాలను పెంచి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సీఎం వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు సత్ఫలితాలిస్తున్నాయి. నాడు కూలికి వెళితేనే పూట గడవని స్థాయి నుంచి ఎందరో నేడు పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగారు. ఈ క్రమంలోనే భర్త తోడు లేకపోయినా ఇద్దరు కుమారులతో కలిసి కష్టపడుతున్న మహిళకు ప్రభుత్వ నవరత్నాలు తోడయ్యాయి. కూలీ స్థాయి నుంచి కౌలు రైతుగా మారి గ్రామంలో ఎందరికో ఉపాధి కల్పిస్తున్న ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండల పరిధి గంగినేని గ్రామానికి చెందిన చింతలచెరువు పద్మావతి కుటుంబమే ఇందుకు నిదర్శనం.

నాడు కూలీ..నేడు కౌలు రైతు



గంగినేని గ్రామ శివారులో తాను కౌలు సాగు చేస్తున్న మిరప తోటలో కూలీలతో కలిసి ఉన్న పద్మావతి

జి.కొండూరు మండల పరిధి గంగినేని గ్రామానికి చెందిన చింతలచెరువు పద్మావతి భర్త అనారోగ్యంతో పదేళ్ల క్రితం మృతి చెందారు. ఈమెకు కుమారులు వెంకటేశ్వరరావు, వెంకటకృష్ణ, కోడళ్లు లక్ష్మి, దుర్గాభవాని, మనుమళ్లు, మనుమరాళ్లు చరణ్, శ్రీరామ్, పూజితా, లాస్య, ద్వారక ఉన్నారు. అంతా కలసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. 2019కి ముందు వరకు పద్మావతి తన కుమారులతో కలిసి వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ జీవనం సాగిస్తుండేవారు. అప్పట్లో ఒకటి రెండు సార్లు కౌలు వ్యవసాయం చేసినప్పటికీ పెట్టుబడి సాయంలేక నష్టపోయారు. కానీ 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలతో ఆ కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు తొలగి సాగుకు ఊతం పెరిగింది. పెద్ద కుమారుడు వెంకటేశ్వరరావు పూర్తిగా వ్యవసాయ పనులు చూసుకుంటూ తల్లికి సహకరిస్తూ ఉండగా చిన్న కుమారుడు వెంకటకృష్ణ వ్యవసాయ పనులలో సాయం చేస్తూనే ఆటోను నడుపుతున్నాడు. ఆ కుటుంబానికి ప్రభుత్వ పథకాల వల్ల రూ.5లక్షల పైగా లబ్ధి చేకూరింది. **–జి.కొండూరు**

భరోసా ఏర్పడింది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల మా లాంటి పేద కుటుంబాలకు భరోసా ఏర్పడింది. పథకాల ద్వారా వచ్చిన డబ్బు పెట్టుబడిగా పెట్టి కౌలు వ్యవసాయం చేస్తున్నాము. పిల్లల చదువులకు, ఆరోగ్యానికి భరోసా ఏర్పడింది. భర్త లేకపోయినా ఇద్దరు కొడుకులతో కష్టపడి వ్యవసాయం చేస్తున్న మా కుటుంబానికి జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద కొడుకులా అండగా నిలిచారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

–చింతలచెరువు పద్మావతి
(గంగినేని గ్రామం, జి.కొండూరు మండలం)

తరచూ పార్టీలు, నియోజకవర్గాలు మారే ఆ ఎమ్మెల్యే పేరు రాష్ట్ర వ్యాప్తంగా సుపరిచితం. మహాభారతంలోని భీముడి పేరుతో ఏర్పాటైన, దేశంలో రెండో అతి పురాతన మున్సిపాలిటీ కేంద్రంగా ఉన్న నియోజకవర్గానికి ఆయన గత ప్రభుత్వంలో ప్రాతినిధ్యం వహించారు. అమాత్య పదవిని.. దాంతోపాటే అంతులేని అవినీతికి పాల్పడ్డారు. అడ్డగోలు పనులకు కేరాఫ్‌గా నిలిచారు. ఆ ఐదేళ్లలో విశాఖ జిల్లాలో జరిగిన అనేక భూ కుంభకోణాలు, కబ్జాలకు కేంద్ర బిందువుగా మారారు. ఆయన అక్రమాలకు వంతపాడిన పలువురు తహసీల్దార్లు కోర్టుమెట్లు ఎక్కారు. అప్పట్లో జిల్లాకు చెందిన మరో మంత్రి కూడా ఈయన అక్రమాలపై 'చింత'నిప్పులు కురిపించడం అప్పటి అధికార పార్టీని కుదిపేశాయి. **-సాక్షి, టాస్క్‌ఫోర్స్**



గంటాపథంగా అక్రమార్కుడే

- అడ్డగోలు పనులకు కేరాఫ్ అడ్రస్ ఆ ఎమ్మెల్యే
- ప్రైవేట్ వ్యక్తి స్థలాన్ని ఆక్రమించి అనుమతి లేకుండానే భవన నిర్మాణం
- 2005లో ఇండియన్ బ్యాంకు నుంచి సొంత సంస్థ పేరిట రూ.141.68 కోట్ల రుణం
- ఎగ్గొట్టేందుకు యత్నిస్తే ఆస్తులు స్వాధీనం చేసుకున్న బ్యాంకు

→ జీవీఎంసీ జోనల్ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న క్యాంపు కార్యాలయం స్థలాన్ని అసలు యజమానికి తెలియకుండానే గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే కబ్జా చేసి నిర్మాణం ప్రారంభించినట్టు అప్పట్లో తీవ్ర దుమారం లేపింది. తనకు అమ్మే ఉద్దేశం లేదని అసలు యజమాని చెప్పినా వినకుండా బలవంతంగా తీసుకున్నారు. ఈ నిర్మాణానికి జీవీఎంసీ నుంచి అనుమతులు లేకపోవడం, జోనల్ కార్యాలయం నుంచి నేరుగా విద్యుత్ తీసుకోవడం, భవన నిర్మాణంలో యథేచ్ఛగా జీవీఎంసీ ట్యాంకర్లు వినియోగం వంటి ఉల్లంఘనలకు పాల్పడ్డారు. తరువాత కాలంలో ఈ భవనాన్ని కూల్చేందుకు రెండు సార్లు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు యత్నించారు. తరువాత దీనిని వేర్వేరు వ్యక్తుల పేర్ల మీద మార్చి క్రమబద్ధీకరణ చేసినట్టు తెలిసింది.

→ 2005 ఆగస్టులో విశాఖ నగరంలోని డాబాగార్డెన్స్ ఇండియన్ బ్యాంక్ బ్రాంచ్ నుంచి ఎమ్మెల్యే తన సంస్థ పేరిట రూ.141.68 కోట్లు రుణం తీసుకున్నారు. ఒక్క వాయిదా కూడా చెల్లించక పోవడంతో కొంత కాలానికి బకాయి మొత్తం రూ.196.51 కోట్లకు చేరినట్టు బ్యాంకు లెక్కకట్టింది. ఎమ్మెల్యే, ఆయన బంధువులను ఎగవేతదారులుగా ప్రకటించింది. దీంతో ఆస్తులు స్వాధీనం చేసుకుంది. ఇందులో ఎమ్మెల్యే సొంత ఆస్తులూ ఉండడం గమనార్హం. దీనిపై అప్పట్లో స్పందించిన ఎమ్మెల్యే తాను తన సంస్థకు గ్యారెంటీర్‌నే గానీ బ్యాంకు డిఫాల్టర్‌ను కాదని చెప్పుకున్నారు.

నీరు-చెట్టు నిధులు స్వాహా

అప్పట్లో నియోజకవర్గంలో నీరు-చెట్టు పథకం సాగునీటి సంఘాలు, జన్మభూమి కమిటీలు, ఇటుక బట్టీ యజమానులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు వరంగా మారింది. ఈ పథకం ద్వారా 722 పనులకు సంబంధించి వచ్చిన నిధులన్నీ ఎమ్మెల్యే స్వాహా చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. మట్టి విక్రయించగా వచ్చిన రూ.78 కోట్ల మొత్తాన్ని నియోజకవర్గంలోని మూడు మండలాల దేశం పార్టీ నేతలు, జన్మభూమి కమిటీల నాయకులు పంచుకున్నట్టు ఆరోపణలున్నాయి. ఈ నిధుల పంపిణీలో తేడాలు రావడంతో స్థానిక నాయకులు రెండు వర్గాలుగా చీలిపోయారు.

'నీలయమ్మ' భూముల్లో చేతివాటం

భీమిలి మండలం దాకమర్రి పంచాయతీ నీలయమ్మసత్రం భూముల్లో ఉన్న కౌలుదారుల పేరుతో సర్వే చేయించి పట్టాలు ఇప్పించి వాటిని కారుచౌకగా కొనుగోలు చేసేందుకు ఎమ్మెల్యే వేసిన స్కెచ్‌కు దేవదాయ శాఖ ఆదిలోనే అడ్డుకట్ట వేసింది. వివాదంలో ఉన్న 427 ఎకరాలలో 1,279 మందికి 1బీ ఫామ్‌లు జారీ చేశారు. అప్పట్లో దీని విలువ రూ.150 కోట్ల పైమాటే.

భీమిలి మండలం సంగివలస, చిప్పాడ, అన్నవరం, కాపులుప్పాడ తదితర చోట్ల వందల ఎకరాల భూముల రికార్డులు తారుమారు చేసి బినామీల పేరుతో కొట్టేసిన ఘటనల్లోనూ ఎమ్మెల్యే పేరు ప్రముఖంగా వినిపించింది. ఈ పాపంలో అప్పటి భీమిలి తహసీల్దార్‌తోపాటు మరో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్ల హస్తం ఉన్నట్టు నిరూపణయింది.

నామినేషన్ అఫిడవిట్‌లో కేసుల వివరాలు

2009 ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. అనంతరం అనుచరులతో అనుమతులు తీసుకోకుండా తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీలో ప్రవేశించి హడావుడి చేసి.. అడ్డుకున్న పోలీసులను గాయపరిచారు. దీంతో పోలీసులు 147, 148,332, 333,307, 447,188 149 రెడ్ విత్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. 2009 ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు క్రికెట్ కిట్లు, చీరలు, ప్రచార సామాగ్రి ఎమ్మెల్యే సిద్ధం చేశారు. వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు 171(ఈ), 511 సెక్షన్ల కింద ఆయనపై కేసు నమోదు చేశారు. 2023లో పోలీసు విధులకు ఆటంకం కలిగించినందుకు 153ఏ, 285/ఆర్/డబ్ల్యూ, 188 సెక్షన్ల కింద ఎమ్మెల్యేపై కేసు నమోదు చేశారు. వీటితో పాటు ఎంవీపీ పోలీస్ స్టేషన్లో 3, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు ఎమ్మెల్యేపై ఉన్నాయి.

సర్వనాశనం నిజమే!

▶ మొదటి పేజీ తరువాయి

విద్యార్థుల తల్లులకు రూ.15 వేలు.. జగనన్న విద్యా కానుక కింద పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగ్, యూనిఫామ్స్, సాక్సులు, బూట్లతోపాటు గోరు ముద్ద పథకం ద్వారా రుచికరమైన భోజనం పెడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన చేస్తుండటంతో ప్రైవేటు పాఠశాలల దోపిడీకి చెక్ పడింది. తద్వారా చంద్రబాబు బినామీల విద్యా వ్యాపారాన్ని సీఎం వైఎస్ జగన్ సర్వనాశనం చేశారు.

కాల్ మనీ సెక్స్ రాకెట్ పీడ విరగడ

వ్యవసాయ రుణాలు రూ.87,612 కోట్లు, డ్వాక్రా రుణాలు రూ.14,205 కోట్లు మాఫీ చేస్తానని 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వాటికి తూట్లు పొడిచారు. దాంతో రైతులు, మహిళలు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఇదే అదనుగా వడ్డీ వ్యాపారులు, కాల్‌మనీ సెక్స్ రాకెట్ గాళ్లు అధిక వడ్డీకి రుణాలు ఇచ్చి.. సకాలంలో చెల్లించని మహిళల మాన ప్రాణాలతో చెలగాటమాడారు. విజయవాడలో వెలుగు చూసిన కాల్‌మనీ సెక్స్ రాకెట్ దురాగతాలే అందుకు పరాకాష్ట. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ రూపంలో పేదల ఖాతాల్లో రూ.2.70 లక్షల కోట్లు జమ చేశారు. పొదుపు సంఘాల మహిళలకు సున్నా వడ్డీకే విరివిగా రుణాలు అందిస్తున్నారు. సీఎం జగన్ ఆర్థికంగా తోడ్పాటు అందిస్తుండటంతో వడ్డీ వ్యాపారులు, కాల్‌మనీ సెక్స్ రాకెట్‌గాళ్లను రుణం కోసం ఆశ్రయించాల్సిన అగత్యం లేకుండా పోయింది. చంద్రబాబు సృష్టించిన కాల్ మనీ సెక్స్ రాకెట్లను సీఎం జగన్ సర్వనాశనం చేయడంతో వాటి పీడ విరగడైందని ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

నామినేషన్ దందాకు ముగింపు

అడిగినంత కమీషన్లు ఇచ్చిన కాంట్రాక్టర్లకు నామినేషన్ పద్ధతిలో వేలాది కోట్ల పనులను చంద్రబాబు అప్పగించారు. జాతీయ ప్రాజెక్టు పోలవరం హెడ్ వర్క్స్ పనుల్లో ఏకంగా రూ.2,917 కోట్ల విలువైన పనులు ఈనాడు రామోజీరావు వియ్యంకుడికి చెందిన నవయుగకు నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టడమే అందుకు తార్కాణం. నీరు-చెట్టు కింద ఏకంగా రూ.పది వేల కోట్ల విలువైన పనులను కాంట్రాక్టర్ల ముసుగేసుకున్న టీడీపీ నేతలు, కార్యకర్తలకు కట్టబెట్టి ప్రభుత్వ ఖజానాను దోచుకున్నారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక చంద్రబాబు నామినేషన్ దందాకు ముగింపు పలికారు. అప్పట్లో నామినేషన్ పద్ధతిలో ఇచ్చిన పనులను రద్దు చేసి.. వాటికి రివర్స్ టెండరింగ్ నిర్వహించి ప్రభుత్వ ఖజానాకు భారీ ఎత్తున ఆదా చేశారు. ఒక్క పోలవరం హెడ్ వర్క్స్ పనులకు నిర్వహించిన రివర్స్ టెండరింగ్‌లోనే ప్రభుత్వ ఖజానాకు రూ.780 కోట్లు ఆదా కావడమే అందుకు నిదర్శనం. చంద్రబాబుకు కమీషన్ల వర్షం కురిపించిన నామినేషన్ పద్ధతిని సీఎం జగన్ సర్వనాశనం చేశారు.

అమరావతి రియల్ ఎస్టేట్ కలలు కల్లలు

సంక్షోభాన్ని అవకాశంగా మల్చుకుని.. రాజధాని లేని రాష్ట్రానికి దేవతల రాజధానిని తలదన్నేలా అమరావతిని నిర్మిస్తానని 2014లో చంద్రబాబు ప్రగల్భాలు పలికారు. ఓత్ ఆఫ్ సీక్రెసీని తుంగలో తొక్కి.. రాజధాని ఏర్పాటుపై ముందే వందిమాగధులకు లీకులు ఇచ్చి ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడి రైతుల నుంచి తక్కువ ధరలకే భూములు కాజేశారు. అలా కొల్లగొట్టిన భూముల సమీపంలోనే రాజధానిని ఏర్పాటు చేశారు. రాజధానిలో 1,691 ఎకరాలను సింగపూర్ ప్రైవేటు సంస్థలకు స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు పేరుతో కట్టబెట్టి.. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి రూ.లక్ష కోట్లకుపైగా దోపిడీకి చంద్రబాబు స్కెచ్ వేశారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక స్టార్టప్ ఏరియా ప్రాజెక్టును రద్దు చేసి చంద్రబాబు రియల్ ఎస్టేట్ కలలను కల్లలు చేశారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా.. మూడు ప్రాంతాల మనోభిప్రాయాల మేరకు మూడు రాజధానులు ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతో చంద్రబాబు అమరావతి రియల్ ఎస్టేట్ వ్యాపారం కలలు కల్లలయ్యాయి.

పేదల బియ్యం.. పెద్దల భోజ్యం

చౌక దుకాణాల ద్వారా ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని దారి మళ్లించి.. సరిహద్దులు దాటించి స్మగ్లర్ల ముఠాకు కొమ్ము కాయడం ద్వారా చంద్రబాబు భారీ ఎత్తున కమీషన్లు రాబట్టుకున్నారు. సక్రమంగా రేషన్ అందక పోవడంతో పేదలు పస్తులతో తల్లడిల్లారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక ప్రతి నెలా క్రమం తప్పకుండా పేదల ఇళ్ల వద్దకే రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. బియ్యం స్మగ్లర్ల ఆగడాలకు చెక్ పెట్టారు. చంద్రబాబు సృష్టించిన బియ్యం స్మగ్లర్ల వ్యవస్థను సీఎం జగన్ సర్వనాశనం చేశారు. బాబు దోపిడీతో కుంగి కుదేలైపోయిన రాష్ట్రాన్ని తన సుపరిపాలనతో సీఎం వైఎస్ జగన్ పునర్నిర్మిస్తున్నారు. విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలతో అభివృద్ధిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారు.

మీకు తెలుసా?

ప్రపంచ వ్యాప్త ఎన్నికల నిర్వహణలో ఎ-వెబ్

ఎ- వెబ్... ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎన్నికల నిర్వహణ సంస్థల విశాల వేదిక. ఇందులో 115 ఎలక్షన్ మేనేజ్‌మెంట్ బాడీస్(ఈఎంబీ) సభ్యులుగా, 21 ప్రాంతీయ సంస్థలు అసోసియేట్ సభ్యులుగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా స్వేచ్ఛగా, సజావుగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడంలో సామర్థ్యం, వేగాన్ని పెంచడం ఎ-వెబ్ ప్రధాన లక్ష్యం. ఇది 2013 అక్టోబర్‌లో ప్రారంభమైంది. అప్పట్నుంచి వరుసగా 2013-15, 2015-17లో దీని ఎగ్జిక్యూటివ్ బోర్డు మెంబర్‌గా భారత ఎన్నికల సంఘం కీలక బాధ్యతలు నిర్వర్తించింది. 2017-19లో ఎ-వెబ్ వైస్ ఛైర్మన్‌గా ఈసీఐ వ్యవహరించింది. ఈ గుర్తింపు మన భారత దేశానికే గర్వకారణం.

17 దేశాల ఎన్నికల అధికారులకు ఈసీఐ ఆతిథ్యం

2014 ఎన్నికల సందర్భంగా భారత ఎన్నికల సంఘం లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల పరిశీలనకు 17 దేశాలకు చెందిన 41 మంది ఎన్నికల అధికారులను ఆహ్వానించి, ఆతిథ్యమిచ్చింది. భారత దేశంలో ఎన్నికల ప్రక్రియను పరిశీలించడానికి 2017 ఫిబ్రవరి-మార్చి నెలల్లో గోవా, పంజాబ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, మణిపూర్ శాసన సభ ఎన్నికల సందర్భంగా 5 ఎలక్షన్ మేనేజ్‌మెంట్ బాడీస్(బంగ్లాదేశ్, ఈజిప్ట్, కిర్గిస్తాన్, నమీబియా, రష్యా)ల నుంచి 13 ప్రతినిధి బృందాలకు ఆతిథ్యమిచ్చింది. ఇందులో భాగంగానే గత ఐదేళ్లలో భారత ఎన్నికల సంఘం 200కు పైగా ఎక్స్ఛేంజ్ విజిట్స్ నిర్వహించింది. ఇందులో సగం ఇతరదేశాలు మన దేశంలో జరిపిన పర్యటనలున్నాయి. ఎన్నికల అనుభవాలు, నైపుణ్యాలను పరస్పరం పంచుకోవడానికి ఈ పర్యటనలను ఈసీఐ నిర్వహించింది.

గ్రామాల్లోకి గుంట నక్కలు

▶ మొదటి పేజీ తరువాయి

విశ్వప్రయత్నం చేస్తున్నారు. ఇక్కడికి వచ్చిన వారు తాము పని చేసే దేశాల నుంచి వెబ్‌సైట్ ద్వారా నిధులు తెప్పిస్తున్నారు.

ఓటర్లను కొనేయాలి..

ఎన్నికలు సమీపించడంతో ఈ గుంపులన్నీ ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ఓటర్లను ప్రలోభపెట్టే పనిని ప్రారంభించాయి. తమ గ్రామాలు, పట్టణాల్లో టీడీపీ శ్రేణుల ద్వారా వైఎస్సార్‌సీపీ కుటుంబాలను గుర్తించి, వారిని టీడీపీకి అనుకూలంగా ఓటు వేసేందుకు సిద్ధం చేయడానికి పూనుకున్నారు. ఈ విషయాన్ని కోమటి జయరాం ఇటీవల జరిగిన టీడీపీ ఎన్ఆర్ఐల సమావేశంలో స్పష్టంగా చెప్పారు. 'ఏదో ఒక విధంగా వైఎస్సార్‌సీపీ ఓటర్లను ప్రభావితం చేయాలి. అవసరమైతే ఆ వెధవలను మూడు, నాలుగు లక్షల రూపాయలు ఇచ్చి కొనేయాలి' అని సూచించారు. ఇలా ప్రతి నియోజకవర్గంలో కనీసం వెయ్యి కుటుంబాలను మార్చాలని వారికి దిశానిర్దేశం చేశారు. ఇందుకోసం వారు మొదట జగన్ హయాంలో రాష్ట్రం అభివృద్ధి చెందలేదని, పెట్టుబడులు రాలేదని, రాజధాని లేదనే ప్రచారాన్ని ఆయా ప్రాంతాల్లో చేస్తున్నారు. ఆ విషయాలను వైఎస్సార్‌సీపీ కుటుంబాల్లో కొందరికి చెబుతూ చంద్రబాబు వస్తే ఉద్యోగాలు వస్తాయని, పరిశ్రమలు వస్తాయని మాట్లాడుతున్నారు. చంద్రబాబు హయాంలో ఏం జరిగిందో, ఎంత నష్టం జరిగిందో తమకు తెలుసని చెప్పిన వారిని.. లొంగదీసుకునేందుకు వారి అవసరాల గురించి తెలుసుకుంటున్నారు. చదువుకున్న వారు ఉంటే ఉద్యోగం ఇప్పిస్తామని, వైద్యం అవసరం ఉంటే అదంతా తాము చూసుకుంటామని చెబుతున్నారు. చివరిగా ఆర్థికంగా ఉపయోగపడతామని డబ్బు ఇవ్వజూపుతున్నారు. ఇదంతా ఒక ప్రణాళిక ప్రకారం తెలిసిన స్థానికుల ద్వారానే చేస్తున్నారు.

జగన్‌పై 'సోషల్' విషం

మరోవైపు ఏపీకి వచ్చిన గుంపులతోపాటు వివిధ దేశాల్లో ఉండి రాలేని టీడీపీ అభిమాన ఎన్ఆర్ఐలు సోషల్ మీడియాలో వైఎస్ జగన్‌కు వ్యతిరేకంగా విపరీత ప్రచారం చేస్తున్నారు. ఎల్లో మీడియా పత్రికలు బరి తెగించి అడ్డగోలుగా వ్యవహరిస్తున్నట్లే సోషల్ మీడియాలోనూ అదే పనిగా విషం కక్కుతున్నారు. వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీకి సంబంధించిన ప్రతి విషయాన్ని ప్రజల్లోకి నెగిటివ్ యాంగిల్‌లో తీసుకెళ్లి తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేస్తున్నారు. ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విటర్), ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, వాట్సాప్‌ను ఇందుకోసం ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. నెల రోజుల్లోనే ఈ తరహా ఖాతాలు ఆ మాధ్యమాల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకురావడమే ఇందుకు నిదర్శనం. వైఎస్ జగన్ ప్రతి చర్యను హేళన చేయడం, తప్పు పట్టడం, చంద్రబాబు చేసిన ప్రతి పనినీ పొగడడం, గొప్పగా కీర్తించడమే పనిగా పెట్టుకున్నారు. కొత్తగా వేలాది వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి విచ్చలవిడిగా ఇదే ప్రచారాన్ని వైరల్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందుకు పచ్చ మీడియా తన వంతుగా శక్తి వంచన లేకుండా సహకారం అందిస్తోంది.

పచ్చ గుంపులతో ప్రజాస్వామ్యానికే ప్రమాదం

ప్రజల అభిప్రాయాలతో పని లేకుండా కేవలం చంద్రబాబుకు ప్రయోజనం చేకూర్చి, తద్వారా తాము లబ్ధి పొందాలనే ఇలాంటి ఎన్ఆర్ఐల తీరు వల్ల ప్రజాస్వామ్యానికే ప్రమాదం అని రాజకీయ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుల దురభిమానంతో, డబ్బు ఉందనే పొగరుతో ప్రజల్ని ఏమార్చాలని చూడడం ప్రమాదకరమని వాపోతున్నారు. అడ్డూ అదుపు లేకుండా రెచ్చిపోతున్న వీరిని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెబుతున్నారు. తక్షణం ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని టీడీపీ ఎన్ఆర్ఐలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఖండాలు దాటి... జగనన్న కోసం...



పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం చందపర్రు గ్రామానికి చెందిన బొందా కుమారస్వామి ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశంలో గత పదేళ్లుగా ఉంటున్నాడు. అక్కడ కంపెనీలో డెలివరీ విభాగంలో డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతను సీఎం జగన్ వీరాభిమాని. ఏడాది క్రితం తన గుండెలపై సీఎం జగన్ పచ్చబొట్టు వేయించుకున్నారు. సోషల్ మీడియాలో చందపర్రు చిన్నోడుగా ప్రత్యర్థి పార్టీలకు చెందిన సోషల్ మీడియాద్వారా నిత్యం పోరాటం చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికలు రావడంతో ఉపాధిని సైతం వదిలి స్టార్ క్యాంపెయినర్‌గా మారాడు. రెండు నెలల క్రితం తన సొంత గ్రామమైన చందపర్రుకు వచ్చిన కుమారస్వామి.. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు(గోపి)కి మద్దతుగా నియోజకవర్గంలో ఎక్కడ ప్రచారం జరిగినా పాల్గొంటూ సీఎం జగన్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నాడు. ఇతని సేవలను గుర్తించి గల్ఫ్ దేశాల కన్వీనర్ బీహెచ్ ఇలియాజ్, కువైట్ కన్వీనర్ మామిడి బాలిరెడ్డి సిఫార్సుతో వైఎస్సార్‌సీపీ కువైట్ కోర్ కమిటీ సభ్యుడిగా నియమితుడు కావడం గమనార్హం.

– పాలకొల్లు అర్బన్

భూ రీసర్వే చట్టం.. ఊరూరికీ చుట్టం

సాక్షి, అమరావతి: ఏపీలో రెండు రకాల భూ సర్వేలు చేస్తున్నారు. ఒకటి వ్యవసాయ భూములపై, రెండోది వ్యవసాయేతర భూముల సర్వే (ఇంటి స్థలాల సర్వే). 30 ఏళ్లకు ఒకసారి భూ రికార్డుల సర్వే జరగాల్సి ఉన్నా, దేశంలో వందేళ్ల నుంచి దాని ఊసే లేదు. ఏపీలో 1900–1910 సంవత్సరాల మధ్య చివరి సారిగా వ్యవసాయ భూముల సర్వే జరిగింది. ఆ తర్వాత రీ సర్వే జరగలేదు. భూములపై హక్కులు భద్రంగా ఉండాలన్నా, భూ పరిపాలన సజావుగా సాగాలన్నా రీ సర్వే తప్పనిసరి. అలాంటి రీ సర్వేను సమగ్రంగా చేస్తున్న రాష్ట్రం ఏపీ. గుజరాత్, కర్ణాటకల్లో వ్యవసాయ భూముల సర్వే మాత్రమే చేసి వదిలేశారు. వ్యవసాయేతర భూముల సర్వే దేశంలో ఎక్కడా ఎప్పుడూ జరగలేదు. ఇంటి స్థలాలకూ రికార్డులు లేకపోవడం వల్ల చాలా నష్టం వాటిల్లుతోందని కేంద్ర ప్రభుత్వం చాలాసార్లు చెప్పింది. గ్రామ కంఠం (అబది)లోని ఇళ్ల స్థలాల రికార్డులు లేకపోవడం వల్ల వాటి అమ్మకాలు, రుణాలు పొందడం సమస్యగా మారింది. వ్యవసాయ భూములకు ఆర్‌వోఆర్ రికార్డు ఉన్నట్లే ఇంటి స్థలాలకూ ఉండాలని కేంద్రం చెప్పినా ఏ రాష్ట్రమూ ముందుకు రాలేదు. ఏపీలో మాత్రమే ఇలాంటి రికార్డులను తయారు చేస్తున్నారు. గతంలో మొత్తం ఊరిని కలిపి గ్రామ కంఠం అని చెప్పి దానికి ఏ నంబరు లేకుండా వదిలేశారు. ఇప్పటికే 4 వేల గ్రామాల్లో రీ సర్వే పూర్తయినట్లు ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. రీ సర్వేతో రూపొందించే కొత్త రికార్డులతో భూమి హక్కులు, హద్దులకు స్పష్టత వస్తుంది. దీని వల్ల హద్దుల సమస్యలు, గట్టు తగాదాలు తగ్గుతాయి.

కొత్త కౌలుదారుల చట్టంతో 25 లక్షల మందికి ఉపయోగం

పాత కౌలు చట్టాల వల్ల కౌలుదారుకు రైతుగా గుర్తింపు రావడం లేదనే అభిప్రాయం ఉండడంతో దాన్ని మార్చాలని నీతి ఆయోగ్ ఎన్నోసార్లు చెప్పింది. పాత చట్టాన్ని రద్దు చేసి ఒక ముసాయిదా చట్టం చేశారు. దాని ప్రకారం యజమానులకు భయం లేకుండా కౌలుకు ఇచ్చేలా ఒక చట్టం చేయాలని అన్ని రాష్ట్రాలకు చెప్పినా ఏ రాష్ట్రమూ చేయలేదు. ఏపీ మాత్రమే మొదటిసారి చట్టం చేసింది. దీనివల్ల కౌలు రైతులకు మేలు జరిగి వాళ్లు రైతులుగా గుర్తింపు పొందుతారు. భూ యజమానులకు భూములు పోతాయనే భయం ఉండదు. పాత చట్టం ప్రకారం కౌలుదారులు ఉంటే రికార్డులు మారిపోతాయేమో... వాళ్లు భూ యజమానులైపోతారేమోననే భయాలు ఉండేవి. కొత్తగా వచ్చిన క్రాప్ కల్టివేషన్ రైట్స్ యాక్ట్‌లో అవేమీ ఉండవు. దీని వల్ల 25 లక్షల మంది కౌలుదారులకు మేలు జరుగుతుంది. మిగతా రాష్ట్రాలూ ఇలాంటి చట్టం చేయాలనే ఆలోచన చేస్తున్నాయి. తెలంగాణలోనూ ఏపీ చట్టం లాంటిదాన్నే తేవాలనే చర్చ జరుగుతోంది. చాలా రాష్ట్రాలకు ఏపీ మోడల్‌గా ఉంది.

భూములపై ఆంక్షల తొలగింపు మరో పెను మార్పు

తమ భూమి ద్వారా భూ యజమానులు లబ్ధి పొందాలన్నా, ఆర్థిక ప్రగతి సాధించాలన్నా వాటిపై ఉన్న ఆంక్షలు తొలగించాలనేది అంతర్జాతీయంగా పాటించే సూత్రం. అసైన్‌మెంట్ భూములు అమ్మకాలు జరగకపోవడం, పట్టాలు ఉండీ పాత రికార్డుల్లో పరాధీనం అనో... చుక్కల భూములనో... ఉండడం వల్ల, తన చేతుల్లో భూమి ఉన్నా యజమాని దాన్ని అమ్ముకోవడానికి అవకాశం ఉండేది కాదు. ఇలాంటి అడ్డంకులన్నిటినీ నాలుగైదేళ్లుగా ఏపీ ప్రభుత్వం తొలగించే ప్రయత్నం చేసింది. అందులో ప్రధానమైంది 20 సంవత్సరాలకు ముందు ఇచ్చిన అసైన్‌మెంట్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించడం ద్వారా 33 లక్షల ఎకరాలకు పూర్తిగా హక్కులు వచ్చినట్లయింది. పరాధీనం, చుక్కల భూములు, నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న భూములపైనా ప్రభుత్వం ఆంక్షలను తొలగించింది. అన్ని లక్షల ఎకరాలపై భూమికి రికార్డు రావడం చాలా పెద్ద విషయం. ఆర్థికంగా చూస్తే భూ యజమానులకు కొన్ని వేల కోట్ల సంపద వచ్చినట్లే.

గ్రామస్థాయికి భూ పరిపాలన

భూ పరిపాలనా సంస్కరణలకు ఏపీలో గట్టి ప్రయత్నం జరిగింది. భూ పరిపాలనను గ్రామ స్థాయికి తెచ్చారు. ఒకప్పుడు భూములకు సంబంధించి కాగితాలు కావాలన్నా.. సమస్యలున్నా.. తహసీల్దార్ కార్యాలయానికో, ఆర్డీవో దగ్గరికో వెళ్లాల్సివచ్చేది. ఇప్పుడా సమస్య లేకుండా భూములకు సంబంధించి రైతులకు ఏం కావాలన్నా అన్నీ గ్రామ స్థాయిలోనే అందుతున్నాయి. గ్రామ స్థాయిలో ఇప్పుడు రెవెన్యూ సిబ్బంది ఐదారుగురు ఉన్నారు. ఒక సర్వేయర్, ఒక వీఆర్‌వో, ఒక వీఆర్ఏ, వలంటీర్లు ఉన్నారు.

ఈ మూడూ ఏపీలోనే యునిక్‌గా అమలు

మిగతా రాష్ట్రాలతో పోల్చి చూస్తే కౌలుదారుల చట్టం, రీ సర్వే, టైటిల్ గ్యారంటీ చట్టాల అమలు ఏపీలోనే అద్వితీయంగా ఉంది. అసైన్‌మెంట్ భూములపై ఆంక్షలు ఎత్తేయడం దక్షిణాది రాష్ట్రాల్లో ఇప్పుడే జరుగుతోంది. రీ సర్వే, టైటిల్ గ్యారంటీ చట్టం అమలు కొనసాగకపోతే ఏపీకి నష్టం వాటిల్లుతుంది. ఈ చట్టం రాకపోతే రైతులు తమ భూములకు పూర్తి భద్రతను పొందే అవకాశం కోల్పోతారు. ఇక్కడ అమలు కాకపోతే మిగతా రాష్ట్రాలూ దీన్ని నెగిటివ్‌గా తీసుకునే అవకాశముంది. ఏ కారణం చేతనైనా టైటిల్ గ్యారంటీ చట్టం అమలు ఆంధ్రాలో నిలిచిపోతే మిగతా రాష్ట్రాలూ వెనకడుగు వేసే అవకాశముంటుంది. అది ఏపీకి మాత్రమే కాదు దేశం మొత్తానికి నష్టం. ఇందులో టైటిల్ గ్యారంటీ అనేది ముఖ్యాంశం. ఏ ప్రాంతమైనా, ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే భూ పరిపాలనా సంస్కరణలు చాలా అవసరం. అందులో టైటిల్‌కి భద్రత కల్పించడం, అమ్మకాలు, కొనుగోళ్లపై ఆంక్షలు తొలగించడం... ఈ రెండే కీలకం. అవి రెండూ ఏపీలో అమలవుతున్నాయి.

టైటిల్ గ్యారంటీ చట్టంతో భూ హక్కులకు భద్రత

ఇలాంటి చట్టం కావాలని 1989 నుంచి భూ యజమానులు కోరుతున్నారు. ప్లానింగ్ కమిషన్ దీనిపై నివేదిక ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా 2004లో టైటిల్ గ్యారంటీ చట్టం తేవాలని నిర్ణయం తీసుకుంది. దీనిపై ఇప్పటికి 3 ముసాయిదా చట్టాలూ తయారు చేసింది. అయినా చట్ట రూపం దాల్చలేదు. అందుకనుగుణంగా మొదటిసారి చట్టం చేసిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. మహారాష్ట్రలో బిల్లు పెట్టారు. రాజస్థాన్ రాష్ట్రమూ ఓ ప్రయత్నం చేసింది. ఢిల్లీ రాష్ట్రమూ చేయాలనుకుంది. అయినా ఎక్కడా చట్టం రాలేదు. ఈ చట్టం వస్తే భూ రికార్డుల్లో స్పష్టత వస్తుంది. ల్యాండ్ టైటిల్ గ్యారంటీ చట్టం ద్వారా భూమి హక్కులకు ప్రభుత్వమే భద్రత కల్పిస్తుంది. ఒకసారి రికార్డుల్లో పేరు ఎక్కితే రైతుకు భూమి హక్కులపై పూర్తి భరోసా ఉంటుంది. అమెరికా, కెనడా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఎలాంటి భూ విధానం ఉందో మనకూ అలాగే ఉంటుంది. దీని వల్ల భూ యజమానికి భద్రత పెరగడమే కాదు భూముల విలువలూ పెరుగుతాయి. ఆ భూములపై లావాదేవీలు సులువవుతాయి. 'ఇప్పటి దాకా హక్కులు పోతాయి, భూములు బలవంతంగా లాక్కుంటారు, ఆక్రమిస్తారనే ' మాటలు వింటున్నాం... ఈ చట్టం ఉద్దేశం అది కానే కాదు. అలాంటిదేదీ జరగదు గాక జరగదు. ఈ చట్టం గురించి దేశంలో 40 ఏళ్లుగా రకరకాల కమిటీలు, నిపుణులు అధ్యయనం చేస్తూనే ఉన్నారు. అన్నీ అయిన తర్వాతే ఈ విధానాన్ని తెచ్చారు. చట్టంలో కొన్ని రకాల సమస్యలు ఉంటే ఉండవచ్చు. అయినా చట్టమే తప్పనడం సరికాదు.

ఈ చట్టంపై కొందరిది అవగాహనా రాహిత్యం

టైటిల్ గ్యారంటీ చట్టం గురించి చాలా మంది అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. ఇలా మాట్లాడేవారు ఈ చట్టంలో ఏముంది, ఏం చేస్తారనే విషయాలు తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. ఈ చట్టం వస్తే వివాదాలు తగ్గిపోతాయి. 66 శాతం కోర్టు కేసులు భూములకు సంబంధించినవే ఉన్నాయి. ఈ చట్టం వల్ల ఈ కేసులు ఐదు శాతానికి పడిపోతాయి. కేసులు పోతాయి కాబట్టి కొందరు దాన్ని వ్యతిరేకిస్తున్నారు. దీన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకుందామనుకునే వారే ఈ చట్టం విలువ తెలియకుండా వ్యతిరేకిస్తున్నారు. ఇది మంచిది కాదు.

ఊరికో సర్వేయర్.. ఏపీకే సొంతం

గ్రామ స్థాయిలో భూ పరిపాలన చేసే ఇంత మంది సిబ్బంది ఉన్న రాష్ట్రం బహుశా ఏపీయే కావచ్చు. ఏ రాష్ట్రంలోనూ ఊరికో సర్వేయర్ లేరు. తెలంగాణలో మూడు, నాలుగు మండలాలకు ఒక సర్వేయర్ ఉంటారు. ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ సచివాలయంలోనే రికార్డులు అందుబాటులో ఉంచడం, రిజిస్ట్రేషన్లు గ్రామ సచివాలయాల్లోనే చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రీ సర్వే మొత్తం పూర్తయితే భూముల రిజిస్ట్రేషన్ గ్రామ సచివాలయాల్లోనే చేయవచ్చు. పంట సాగు హక్కుల కార్డు పొందాలంటే అక్కడే పొందవచ్చు. ఒకప్పుడు తహసీల్దార్ కార్యాలయంలో చేసే పనులు ఈ రోజు గ్రామ, వార్డు స్థాయిలోనే చేసేలా ప్రభుత్వం సంస్కరణలు తెచ్చింది. భూ సేకరణలో అసైన్డ్ భూములను ప్రభుత్వం సేకరించినప్పుడు పట్టా భూములతో సమానంగా నష్ట పరిహారం ఇచ్చేలా మార్గదర్శకాలు మార్చింది. సమాన పరిహారం ఇవ్వడంతో పాటు ఒకవేళ అసైనీలు ఎస్సీ, ఎస్టీలైతే ఎకరానికి మరో రూ.10 వేలు అదనంగా ఇవ్వాలని నిర్ణయించింది. ఇతర రాష్ట్రాల్లో ఈ విధానం లేదు. భూమి రికార్డులను ఎప్పటికప్పుడు పారదర్శకంగా ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు. మీ భూమి పోర్టల్‌లో గ్రామ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి మొత్తం గ్రామ రికార్డు చూసుకునే వెసులుబాటు కల్పించారు.

జైత్రయాత్ర 2024

మేనిఫెస్టో అమలులో జగన్ ఆదర్శం



ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చిన గొప్ప దార్శనికుడు. సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చిన ఘనత ఆయనదే. జగన్ ప్రభుత్వం వచ్చాక అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల వారికీ తరతమ భేదం లేకుండా సంక్షేమ లబ్ధి అందుతోంది. ఐదేళ్లలోనే ఇంత మంచి చేసిన సీఎం జగన్‌ను మళ్లీ గెలిపిస్తే రాష్ట్రం మరింత అభివృద్ధికి నోచుకుంటుంది. బూటకపు హామీలిచ్చే వారిని నమ్మి, మోసపోయేందుకు ప్రజలు సిద్ధంగా లేరు.

- ఉన్నమట్ల కరుణాకరరావు, విశ్రాంత ఉప విద్యాశాఖాధికారి, భీమవరం

మీరూ స్పందించండి

పబ్లిక్ వాయిస్

ఎన్నికల గురించి మీరేం అనుకుంటున్నారు.. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య తేడా ఏమిటి? పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరగాలంటే మీ సూచనలేంటి? అభివృద్ధికి మీరిచ్చే నిర్వచనం ఏమిటి? ప్రజలకు, రాజకీయ పార్టీలకు మీరేమైనా చెప్పాలనుకుంటున్నారా? ఇలా ఎన్నికలకు సంబంధించి ఏ అంశంపై అయినా సరే మీ అభిప్రాయాలను **73867 92224** నంబర్‌కు మీ ఫొటో సహా వాట్సాప్ ద్వారా పంపిస్తే ప్రచురిస్తాం.

జగనన్న వల్లే అన్ని రంగాల్లో అభివృద్ధి



జగనన్న అధికారంలోకి వచ్చాకే అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగింది. 2019 నాటికి వైజాగ్‌లో సుమారు 12,500 ఐటీ జాబ్స్ ఉండేవి. ఇప్పుడు దాదాపు 27 వేల మంది ఐటీలో పనిచేస్తున్నారు. ఇన్ఫోసిస్ వచ్చింది. అదానీ డేటా సెంటర్, రాండ్‌స్టాడ్ రావడం గొప్ప విషయం. మూలపేట పోర్టు, భోగాపురం ఎయిర్‌పోర్టు మణిహారాలు కానున్నాయి. జీడీపీలో 16వ(2019) స్థానం నుంచి 4వ(2023) స్థానానికి చేరాం. తలసరి ఆదాయంలో 18వ స్థానం నుంచి 9వ స్థానానికి వచ్చాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో వరుసగా అగ్రస్థానంలో నిలిచాం. ఇదంతా సీఎం జగన్ వల్లే సాధ్యమైంది.

-కొర్లాం మనోజ్‌కుమార్, ఐటీ డెవలపర్, చండిపుట్టుగ, శ్రీకాకుళం

2,23,270 మంది ఇంగ్లిష్‌లోనే పరీక్ష

ఇంగ్లిష్ మీడియం బోధనతో 2022–23 విద్యా సంవత్సరంలో 84 శాతం మంది విద్యార్థులు ఇంగ్లిష్‌లోనే పరీక్షలు రాసి ఉత్తీర్ణులైతే, 2023–24 సంవత్సరంలో ఆ సంఖ్య 93 శాతానికి పెరిగింది. ఈ ఏడాది 2,23,270 మంది ఇంగ్లిష్ మీడియంలో పదో తరగతి పరీక్షలు రాస్తే.. 1,96,067 మంది పాసయ్యారు. వాస్తవానికి ఇప్పటి దాకా ఇంగ్లిష్ మీడియం బోధన 9వ తరగతి వరకు అందిస్తున్నారు. కానీ బైలింగ్వల్ పుస్తకాలతో పదో తరగతి విద్యార్థులు 2023–24 విద్యా సంవత్సరంలో ఇంగ్లిష్ మీడియంలో పరీక్షలు రాసి విజయం సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 43 లక్షల మంది విద్యార్థులు చదువుతుండగా, 39 లక్షల మందికి పైగా ఇంగ్లిష్ మీడియంలోనే పరీక్షలు రాస్తుండడం విశేషం.



అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం దేవల చెరువుకు చెందిన ఎం.ధోనిక 2023-24 పదో తరగతి పరీక్షల్లో 594/600 మార్కులు సాధించి సీఎం జగన్ ప్రవేశపెట్టిన విద్యా సంస్కరణల సత్తాను చాటిచెప్పింది.



పిరధి భవాని

ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరంలో అనకాపల్లి జిల్లా నక్కపల్లికి చెందిన పిరధి భవాని 430/440 మార్కులు సాధించింది. ఎంపీసీ ఫస్టియర్‌లో తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన కె.లక్ష్మీదేవి 462/470 మార్కులు సాధించింది.



ఈ అమ్మాయి పేరు డి.లావణ్య.. సత్యవేడు (తిరుపతి జిల్లా)కు చెందిన ఈ బాలిక ఇంటర్ బైపీసీలో 986/1000 మార్కులు సాధించింది. శ్రీకాకుళం జిల్లా కొల్లివలసకు చెందిన ఎ.కరుణ సాగర్, జి.శరణ్యప్రియలు ఎంపీసీలో 982/1000 మార్కులతో సత్తా చాటారు.

వీరంతా రాష్ట్ర సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)ల్లో చదువుకున్నవారే. సాధారణ కూలీల బిడ్డలైన వీరు తమ గ్రూపుల్లో రాష్ట్రంలో అత్యధిక మార్కులు సాధించారు. ప్రభుత్వ మేనేజ్‌మెంట్ జూనియర్ కాలేజీల్లో చదువుకుని ఇంటర్ మొదటి, రెండో సంవత్సరాల్లో రాష్ట్రంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు 15 వేల మందికి పైగా ఉన్నారు.

సర్కారు దిద్దిన చదువులు



ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా కుట్రలకు చెంపపెట్టు

- ✔ టెన్త్, ఇంటర్‌లో టాప్ ర్యాంకులతో అదరగొడుతున్న పేదింటి పిల్లలు
- ✔ పదో తరగతిలో 600కు 594 మార్కులు సాధించిన ఎం.ధోనిక
- ✔ 18 వేల మందికి పైగా విద్యార్థులకు అత్యధిక మార్కులు
- ✔ ఇంటర్‌లో 1000కి 986, 982 మార్కులు
- ✔ ఇంటర్‌లో 15 వేల మందికి పైగా విద్యార్థులకు అత్యధిక మార్కులు
- ✔ ఈ ఏడాది పదో తరగతిలో 93 శాతం ఇంగ్లిష్‌లోనే రాసిన విద్యార్థులు
- ✔ విద్యారంగంపై 58 నెలల్లో రూ.72,919 కోట్ల ఖర్చు
- ✔ నాడు-నేడుతో వెలిగిపోతున్న ప్రభుత్వ పాఠశాలలు
- ✔ పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఏపీ సంస్కరణలకు ఫిదా
- ✔ దేశంలోనే అత్యుత్తమ సంస్కరణలుగా గుర్తింపు

రాష్ట్రంలో విద్యా సంస్కరణలకు వైఎస్ జగన్ సర్కారు పట్టంకడితే..
ప్రతిపక్షాలు కోర్టులను అడ్డుపెట్టుకుని కుట్రలకు తెరతీశాయి.
ఎల్లో మీడియా రోత రాతలు రాసింది.
ప్రజల దీవెనలే అండగా ముందుకెళ్లారు జగన్..
ఆయన కృషికి తగ్గట్టుగా గత రెండేళ్లుగా సర్కారు స్కూళ్లు, కాలేజీల్లో చదివిన మన పిల్లలు అదరగొడుతున్నారు.
మన పిల్లలు ఇంగ్లిష్ చదువులు చదివి పెద్ద ఉద్యోగాలు చేయాలని..
ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో చదివి ప్రతిభను చాటాలన్న జగన్ కలలు సాకారమవుతున్నాయి.
పదో తరగతి, ఇంటర్ పరీక్షా ఫలితాల్లో..
రోజువారీ కూలీల పిల్లలు దుమ్ములేపుతున్నారు.
చంద్రబాబు హయాంలో.. వర్షం వస్తే కారిపోయే శ్లాబులు, నేల మీద చదువులు..
అప్పులు చేసి ప్రైవేటు స్కూళ్లలో చదివించే పేద, మధ్య తరగతి కుటుంబాలు..
జగన్ అధికారంలోకి రాగానే ప్రభుత్వ విద్యకు పట్టం కట్టారు. అక్షరానికి అగ్రాసనం వేసి, సౌకర్యాలకు సమున్నత స్థానం కల్పించారు.
ఏ రాష్ట్రంలోనూ లేనట్టుగా.. సర్కారు బడి రూపురేఖల్ని సమూలంగా మార్చేశారు.
కార్పొరేట్ విద్యా రంగం ఈర్ష్యపడేలా కొత్త పాఠశాల భవనాలు..టాయిలెట్ల నుంచి కాంపౌండ్ వాల్ వరకు 11 రకాల సదుపాయాలు కల్పించారు.

-నానాజీ అంకంరెడ్డి, సాక్షి, అమరావతి

ఫలించిన చదువుల యజ్ఞం

రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టిన చదువుల యజ్ఞం ఫలించింది. ఐదేళ్లలో విద్యారంగంపై రూ.72,919 కోట్లు ఖర్చు చేసి అద్భుతమైన ఫలితాలు సాధించింది. జగనన్న విద్యాకానుకతో తల్లిదండ్రులకు పుస్తకాలు, యూనిఫాం వంటి భారం లేకుండా పోయింది. అమ్మ ఒడితో డ్రాపవుట్లు ఆగిపోయాయి. 'మనబడి నాడు-నేడు'తో రాష్ట్రంలోని 45 వేల ప్రభుత్వ పాఠశాలలు సమున్నతంగా మారాయి. కొత్త పాఠశాల భవనాలు, డబుల్ డెస్క్ బెంచీల నుంచి కాంపౌండ్ వాల్ వరకు దాదాపు 11 రకాల సదుపాయాలు సమకూరాయి. పిల్లలకు మధ్యాహ్న భోజనంలో జగనన్న గోరుముద్ద కింద నాణ్యమైన పోషకాలతో కూడిన రుచికరమైన భోజనం అందుతోంది. దేశంలో ఈ తరహా భోజనం పిల్లలకు అందిస్తున్న రాష్ట్రం మరొకటి లేదని కేంద్ర ప్రభుత్వమే ప్రకటించింది. దేశ చరిత్రలోనే ఎక్కడాలేని విధంగా 45 వేల ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం అమలుతో పేదింటి పిల్లల చదువులు సమున్నత స్థాయికి చేరాయి. ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు, ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లతో డిజిటల్ బోధన అందించడంతో విద్యార్థుల్లో సామర్థ్యాలు పెరిగాయి. 2022–23, 2023–24 విద్యా సంవత్సరాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 93 శాతం మంది విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలోనే పరీక్షలు రాసి ఉత్తీర్ణులయ్యారు. తాజాగా పదో తరగతి ఫలితాల్లోను అత్యధిక మంది ప్రభుత్వ విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో పరీక్షలు రాసి విజయం సాధించారు. ఒకప్పుడు కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలకే పరిమితమైన 'స్టేట్ టాపర్స్'.. గత రెండు విద్యా సంవత్సరాల్లో పది, ఇంటర్మీడియట్‌లో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీ విద్యార్థులే సాధించడం గమనార్హం. ఇలా టాపర్స్‌గా వచ్చిన 10 మంది విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులుగా ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించి ఏపీ విద్యా సంస్కరణలను ప్రపంచానికి చాటిచెప్పారు.



నాడు నేడులో విశాలమైన ఆటస్థలాలు



ప్రతి పాఠశాలలో పరిశుభ్రమైన మరుగుదొడ్లు



విద్యార్థులకు పోషకాహారం

ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలనే గొప్ప ఆలోచనతో 2020, జనవరి 1న రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న గోరు ముద్ద'పథకానికి శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వం సాంబారు, ముద్ద అన్నంతో సరిపెట్టగా, ఈ ప్రభుత్వం రోజుకో మెనూ చొప్పున వారానికి 16 రకాల పదార్థాలతో పాటు ఫోర్టిఫైడ్ సార్టెక్స్ బియ్యంతో భోజనం అందిస్తున్నారు. పిల్లల్లో రక్తహీనతను అరికట్టడానికి వారంలో మూడు రోజులు బెల్లంతో చేసిన రాగి జావ, మూడు రోజులు చిక్కీ, వారంలో ఐదు రోజులు కోడిగుడ్డును తప్పనిసరి చేశారు. మధ్యాహ్న భోజనానికి గత టీడీపీ ప్రభుత్వం ఏటా రూ.450 కోట్లు ఖర్చు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం ఏటా రూ.1,449 కోట్ల చొప్పున ఖర్చు చేసింది. ప్రతి గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాల, విలేజ్ క్లినిక్ సిబ్బంది ప్రభుత్వ బడులకే వచ్చి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, విద్యార్థుల్లో రక్తహీనతను తగ్గించేందుకు మాత్రలు ఇస్తున్నారు.



ఐక్యరాజ్య సమితిలో ప్రసంగించిన తెలుగు తేజాలు

'కార్పొరేట్'ను తలదన్నేలా ఫలితాలు

ఒకప్పుడు కార్పొరేట్ విద్యా రంగానికే పరిమితమైన స్టేట్ ర్యాంకులు 2022–23 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ విద్యార్థులు సొంతం చేసుకున్నారు. ప్రతిభ కనబరిచిన 22,768 మంది విద్యార్థులను 'జగనన్న ఆణిముత్యాలు'గా ప్రభుత్వం సత్కరించింది. రాష్ట్ర స్థాయిలో ప్రతిభావంతులను ఎంపిక చేసి ప్రభుత్వం అమెరికా పర్యటనకు పంపించింది. తొలిసారి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10 మంది విద్యార్థులు రాష్ట్ర ప్రతినిధులుగా ఐక్యరాజ్యసమితిలో అమెరికా అధ్యక్ష భవనం సాక్షిగా ఏపీ విద్యా సంస్కరణలను ప్రపంచానికి వినిపించారు.



ద్విభాషా పుస్తకాలతో విద్యార్థులు

నాడు-నేడులో సకల సౌకర్యాలు

జగన్ ప్రభుత్వం వచ్చాక మనబడి నాడు-నేడు కింద ప్రతి ప్రభుత్వ పాఠశాలలోను టాయిలెట్ నుంచి తాగునీరు వరకు విద్యార్థికి అవసరమైన 11 రకాల వసతులు కల్పించారు. మొదటి దశలో 15,715 పాఠశాలలు అభివృద్ధి చేయగా, రెండో విడతలో 22,344 స్కూళ్లలో అభివృద్ధి పనులు చేపట్టారు. పనులు పూర్తయిన హైస్కూళ్లకు 62 వేల ఐఎఫ్‌పీలు, ఎలిమెంటరీ స్కూళ్లకు 45 వేల స్మార్ట్ టీవీలు అందించి 'డిజిటల్ బోధన' ప్రవేశపెట్టారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో 9,52,925 ట్యాబ్‌లు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం 2020–21లో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధన ప్రవేశపెట్టింది. విద్యార్థులకు బైలింగ్వల్ పాఠ్య పుస్తకాల(ఇంగ్లిష్+తెలుగు/ఉర్దూ)ను అందించింది.



డిజిటల్ బోర్డులతో విద్యా బోధన



చిన్నారులను ఆకట్టుకునేలా క్లాస్ రూమ్‌లు

మండలానికి రెండు జూనియర్ కాలేజీలు

రాష్ట్రంలోని ప్రతి మండలంలోను రెండు ప్రభుత్వ జూనియర్ కాలేజీలు తప్పనిసరిగా ఉండాలని, వాటిలో ఒకటి బాలికల కోసం కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అనుగుణంగా కొత్తగా 292 ఉన్నత పాఠశాలలు బాలికల కోసం హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేశారు. మొత్తం 352 కేజీబీవీల్లో ఇంటర్మీడియట్ విద్యను ప్రవేశపెట్టారు. 2022–23 నుంచి 14 కో-ఎడ్ జూనియర్ కళాశాలలను బాలికల జూనియర్ కళాశాలలుగా మార్చారు. మొత్తం 679 మండలాల్లో రెండు ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉండడమే కాకుండా బాలికల కోసం ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల అందుబాటులోకి వచ్చింది.

ఫలితాల్లో టాప్ లేపారు

గతేడాది ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన పది, ఇంటర్ విద్యార్థులు 22,710 మంది ఉంటే, ఈ ఏడాది ఒక్క ఇంటర్‌లోనే 15 వేల మందికి పైగా ఉన్నారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. గతేడాది '0'ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలలు 6 ఉంటే ఈ ఏడాది ఒక్కటి మాత్రమే ఉంది. గతేడాది 100 శాతం ఫలితాలు సాధించిన సర్కారు బడులు 162 ఉంటే ఈ సంవత్సరం ఆ సంఖ్య 666కి పెరిగింది. 'పది'లో 18 వేల మందికి పైగా విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు.

బోధన-పాఠ్యాంశాల్లో సంస్కరణలు

మూసపద్ధతిలో బోధనను మార్చి క్లాస్‌రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్‌ను అమలు చేస్తున్నారు. పిల్లల్లో మెరుగైన అభ్యసన ఫలితాల కోసం 3 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు సబ్జెక్ట్ టీచర్లను నియమించారు. అన్ని పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల అవసరాలు తీర్చేందుకు దాదాపు 25 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించారు. సీబీఎస్ఈ బోధనకు అనుగుణంగా టీచర్లకు శిక్షణ ఇచ్చారు. ఐబీ సిలబస్ బోధన కోసం టీచర్ల శిక్షణకు చర్యలు ప్రారంభించారు.

పెరిగిన చేరికలు

2019–20లో 15,715 పాఠశాలలను రూ.3,669 కోట్లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రెండో విడతలో రూ.8 వేల కోట్లతో 22,344 పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారు. పిల్లలను బడికి పంపుతున్న 44,48,865 మంది తల్లుల ఖాతాల్లో ఏటా రూ.15 వేల చొప్పున అమ్మఒడి నగదు జమ చేస్తున్నారు. నిరంతర నీటి సదుపాయంతో కూడిన టాయిలెట్లు ఉండడంతో డ్రాపవుట్లు నిలిచిపోయాయి. కార్పొరేట్ విద్యా సంస్థలే ప్రభుత్వ పాఠశాలలను అనుసరించే పరిస్థితి వచ్చింది. ఈ సంవత్సరం ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు 1,50,005 మంది విద్యార్థులు అదనంగా ప్రభుత్వ స్కూళ్లు, ఇంటర్ కాలేజీల్లో చేరారు. ప్రాథమిక స్థాయిలో 84.48 శాతంగా ఉన్న చేరికల శాతం ఇప్పుడు 100 శాతానికి పెరిగింది. సెకండరీ స్థాయిలో 79.69 శాతం నుంచి 100 శాతానికి, హయ్యర్ సెకండరీ స్థాయిలో 46.88 శాతం నుంచి 79.69 శాతానికి పెరిగింది.

మన చదువులకు జాతీయ స్థాయిలో గుర్తింపు

'జగనన్న గోరుముద్ద'కు జాతీయ అవార్డు రావడంతో పలు రాష్ట్రాల మంత్రులు, అధికారులు ప్రశంసించారు. ఏపీ విద్యా సంక్షేమ పథకాలను తమ రాష్ట్రాల్లోను అమలు చేసేందుకు ఆసక్తి చూపారు. మహారాష్ట్ర, ఒడిశా, అసోం, హరియాణా, ఛత్తీస్‌గఢ్, మిజోరాం, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, నాగాలాండ్, గుజరాత్, పుదుచ్చేరి, కేరళ, తెలంగాణ, అండమాన్-నికోబార్, డామన్ డయ్యూ, దాద్రానగర్ హవేలీ విద్యాశాఖాధికారులు మన విద్యా విధానాలను వారి రాష్ట్రాల్లోనూ, కేంద్రపాలిత ప్రాంతాల్లోనూ అమలు చేసేందుకు ముందుకు వచ్చారు. అమెరికాలోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై జరిగిన ఉన్నత స్థాయి సదస్సులో 140 దేశాల విద్యావేత్తలు మన ప్రభుత్వ విద్యా సంస్కరణలను కొనియాడారు.

1000 సీబీఎస్ఈ స్కూళ్లు



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు మొదటి విడతగా 2023–23 విద్యా సంవత్సరంలో 1,000 ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ అమలు చేశారు. ఈ స్కూళ్లలోని విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరంలో తొలిసారి పదో తరగతి పరీక్షలు సీబీఎస్ఈ విధానంలో రాస్తారు.

'టోఫెల్' శిక్షణ



విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంచేందుకు, వారు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు మరో గొప్ప నిర్ణయం తీసుకున్నారు. 2023–24లో మూడో తరగతి నుంచే 'టోఫెల్' శిక్షణ ప్రారంభించారు. టోఫెల్ ప్రైమరీలో 3 నుంచి 5 తరగతులకు, టోఫెల్ జూనియర్‌లో 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు ఇంగ్లిష్ శిక్షణనిస్తున్నారు. 20 లక్షల మంది పిల్లలకు ఈ సదుపాయం లభించింది.

ప్రభుత్వ స్కూళ్లలో ఐబీ విద్య



'మన పేదింటి పిల్లలు అంతర్జాతీయంగా ఎదగాలి. ప్రపంచానికి దిక్సూచిగా మారాలి' అన్న ఆలోచనతో ప్రభుత్వ బడుల్లోకి 'ఇంటర్నేషనల్ బాకలారియేట్(ఐబీ)' బోధన తెస్తున్నారు. ఇప్పటిదాకా దేశంలో 210 ప్రముఖ కార్పొరేట్ స్కూళ్లలో సంపన్నుల పిల్లలకు మాత్రమే ఐబీ బోధన అందుబాటులో ఉంది. 2025 జూన్ నుంచి రాష్ట్రంలోని 38 వేల ప్రభుత్వ పాఠశాలల్లో దీన్ని ప్రారంభిస్తున్నారు. విద్యార్థులకు 'సంకల్పం'పేరుతో లైఫ్ స్కిల్స్‌ను నేర్పిస్తున్నారు. ఈ శిక్షణ అభివృద్ధి చెందిన దేశాల్లోని స్కూళ్లలో మాత్రమే అందిస్తున్నారు.

ఐటీలో 'ఫ్యూచర్ స్కిల్స్'



రాష్ట్రంలోని 6790 ఉన్నత పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం (2024–25) నుంచి 'ఫ్యూచర్ స్కిల్స్'బోధన అందిస్తారు. ఎనిమిదో తరగతి నుంచి ఐటీ రంగంలోని కీలకమైన 10 కోర్సులపై శిక్షణ ఇస్తారు. ఇంటర్నెట్ థింకింగ్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), బ్లాక్ చైన్ టెక్నాలజీ, వర్చువల్ రియాలిటీ (వీఆర్), ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), మెటావర్స్/వెబ్ 3.0, 3డీ మోడలింగ్ అండ్ ప్రింటింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, రోబోటిక్స్ కోర్సులు ఉన్నాయి.

విద్యపై ప్రతి పైసా.. భవిష్యత్తుకు భరోసా

అంబేడ్కర్ విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య నిమ్మ వెంకట రావు

ఇంటర్వ్యూ



ఏయూ క్యాంపస్, విశాఖపట్నం:

''విద్యారంగంలో పెట్టుబడులను కేవలం సంక్షేమంగా పరిగణించ కూడదు. ఇవి దీర్ఘకాలంలో మంచి ఫలితాలను అందిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం గత ఐదు సంవత్సరాలుగా విద్యా రంగంలో తీసుకువచ్చిన సంస్కరణలు భవిష్యత్తు రూపురేఖలను పూర్తిగా మార్చివేస్తాయి'' అని అంబేడ్కర్ విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య నిమ్మ వెంకట రావు అన్నారు. విద్యా వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న సంస్కరణలు, అవి ఇస్తున్న సత్ఫలితాలపై తన విశ్లేషణను 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

పాఠశాల రూపురేఖలు మారాయి

ప్రతీ పాఠశాలను నాడు-నేడులో ఆధునికీకరించారు. భవనం, తాగునీటి సదుపాయం, టాయిలెట్స్, ఫర్నీచర్, ఇతర మౌలిక వసతుల కల్పనతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. చిన్నారుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. జగనన్న గోరుముద్ద పథకం చిన్నారులను పాఠశాల దిశగా నడిపిస్తోంది.

సీబీఎస్ఈ సిలబస్ అమలు

ప్రపంచ స్థాయిలో ఎదురయ్యే పోటీని తట్టుకునేందుకు సీబీఎస్ఈ సిలబస్ మెరుగైన అవగాహన, అత్యుత్తమ కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపునకు దోహదపడుతోంది. పేదింటి పిల్లలు ఎటువంటి ఆర్థిక భారం లేకుండా సీబీఎస్ఈ విధానంలో చదువుకోవడం కొత్త ఒరవడికి నాందిగా నిలుస్తోంది.

ఆంగ్ల మాధ్యమం వద్దంటే ఎలా

కేవలం మాతృభాషలోనే విద్య అందించాలంటే ఎలా? అలాంటప్పుడు రాష్ట్రంలో వేలాది ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు ఎందుకు ఉన్నాయి. ఉద్యోగులు, విద్యావంతులు, రాజకీయ నాయకుల పిల్లలు ఆంగ్ల మాధ్యమం పాఠశాలల్లోనే చదువుకుంటున్నారు. మరి పేద పిల్లలు ఎందుకు చదువుకోకూడదు. ఈ ప్రశ్న ప్రతి వ్యక్తి వేసుకోవాలి. బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను విద్యార్థులకు ఇవ్వడం అవకాశాలను సమానం చేయడంగా భావించవచ్చు. కార్పొరేట్ పాఠశాలలు చేయలేని సాహసాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేస్తోంది.

ఉన్నత అవకాశాలకు మార్గం టోఫెల్

ఉన్నత పాఠశాల స్థాయి నుంచి టోఫెల్ శిక్షణ అందించడంతో విద్యార్థుల భాషా పటిమ పెరుగుతుంది. ఆంగ్ల భాషపై పట్టు సాధించే దిశగా ఈ ప్రోత్సాహం ఆదర్శం. ఐబీ ఎడ్యుకేషన్ ప్రవేశ పెట్టడానికి సిద్ధం కావడం ఆహ్వానించదగ్గ అంశం.

తల్లిదండ్రులకు భరోసా...

ఆంగ్ల మాధ్యమం బోధనతో పాటు పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్, షూ, బెల్ట్ వంటివి విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యే సమయానికల్లా అందిస్తోంది. ఇది తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని తప్పిస్తూ భరోసాగా నిలుస్తోంది. అమ్మఒడి లాంటి పథకం ప్రవేశ పెట్టిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్.







మన బడి నాడు-నేడు కార్యక్రమంలో ఆధునీకరించిన ప్రభుత్వ పాఠశాలల భవనాలు

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
మంగళవారం॥ 23-4-2024



ఏపీలో టెన్త్ క్లాస్ ఫలితాలు వచ్చాయి.
టెన్త్‌లో స్టేట్ టాపర్ ఓ అమ్మాయి.
పేరు... **వెంకట నాగసాయి మనస్వి.**
ఎన్ని మార్కులొచ్చాయంటే...
వందకు వంద. వందకు వంద.
ఇలా ఒకటి కాదు... రెండు కాదు...
ఏకంగా ఐదు సబ్జెక్టుల్లో
వందకు వంద.
హిందీలో మాత్రం
ఒకటి తగ్గించుకుంది.
మొత్తంగా 600కి
599 మార్కులు!!
పేపర్‌లు దిద్దే
టీచర్లకే ఓ పరీక్ష.

టీచర్‌గారమ్మాయి! స్టేట్ ఫస్ట్!!

ఆకుల వెంకట నాగసాయి మనస్విది ఏలూరు జిల్లా, నూజివీడు పట్టణం. ఈ అమ్మాయి పదోతరగతిలో రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు సాధించింది. ఏటా ఎవరో ఒకరు ఈ రికార్డు సాధిస్తారు. కానీ ఇన్ని మార్కులు తెచ్చుకోవడం ఆమె సాధించిన మరో రికార్డు. 600కి ఒక్క మార్కు తక్కువగా 599 మార్కులతో ఉత్తీర్ణత సాధించడం పదవ తరగతి పరీక్షలకు కూడా రికార్డే.

మా నాన్నే హీరో!

చదువుకోవడమే జీవిత లక్ష్యం అన్నట్లు చదువుకుంటున్న మనస్వి నేపథ్యం కూడా పుస్తకాలమయమే. ఆమె తల్లి నాగ శైలజ, తండ్రి నాగ వరప్రసాదరావు ఇద్దరూ గవర్నమెంట్ స్కూల్ టీచర్‌లు. వెంకట నాగ సాయి మనస్వి వారి ఏకైక సంతానం. మనస్వికి క్లాసు పుస్తకాలు చదవడమే కాకుండా మంచి రీడింగ్ హ్యాబిట్ కూడా ఉంది. అయితే హాబీగా చదివే పుస్తకాలు కూడా కాలక్షేపం కోసం అన్నట్లు ఉండవు, మంచి సబ్జెక్టు ఉన్నవే కావడం విశేషం. సిలబస్ ద్వారా తెలుసుకున్న విషయాలకు మరికొంత సమాచారాన్ని అందించేవిగా ఉంటాయి. ''నా రోల్ మోడల్ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్. స్పోర్ట్స్‌లో క్రికెట్ అంటే క్రేజ్. కానీ ఆడడానికి సమయం ఉండదు. మ్యాచ్ వస్తుంటే వీలయినంత సేపు చూస్తాను. విరాట్ కోహ్లీ ఆట నచ్చుతుంది. సినిమాలు చూస్తాను కానీ చాలా తక్కువ. నాకు నచ్చే హీరో రామ్ చరణ్. అందరికంటే ఈ ప్రపంచంలో నాకు అత్యంత ఇష్టమైన వ్యక్తి మా నాన్న. మా నాన్న కంటే బెస్ట్ హీరో మరెవరూ ఉండరు. ఆయన ఎప్పుడూ ఖాళీగా ఉండరు. నాన్న పాతికేళ్ల కిందట డీఎస్సీ రాశారు. కానీ ప్రభుత్వ ఉద్యోగం రాలేదు. దాంతో ట్యూషన్‌లు చెప్పారు. వ్యవసాయం చేశారు. గత ఏడాది గవర్నమెంట్ చేసిన రిక్రూట్‌మెంట్‌లో నాన్నకు ఉద్యోగం వచ్చింది. తన చదువుకు తగిన ఉద్యోగం వచ్చే వరకు ఆయన నిరాశపడకుండా ఎదురుచూశారు'' అని సంతోషంగా చెప్పింది మనస్విని. ఇంతలో వాళ్ల తల్లి మాట్లాడుతూ ''మనస్వి చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉండేది. పదవ తరగతిలో చాలా కష్టపడింది. ఇక చాలు నిద్రపొమ్మని చెప్పినా వినేది కాదు. అర్ధరాత్రి వరకు చదువుతూనే ఉండేది. సిలబస్ పూర్తికాకపోతే తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి చదువుకునేది. మంచి మార్కులు వస్తాయనుకున్నాం. కానీ ఇన్ని మార్కులు తెచ్చుకుంటుందని, రికార్డు సాధిస్తుందని ఊహించలేదు. తల్లిదండ్రులుగా మాకు ఇంతకంటే సంతోషం మరి ఏముంటుంది'' అని ఆనందం వ్యక్తం చేశారామె. అత్యధిక మార్కుల సాధనలో మనస్వి రికార్డును భవిష్యత్తులో మరొకరు బ్రేక్ చేయడం అంత సులువు కాకపోవచ్చు. మనస్వి మార్కుల రికార్డు ఎప్పటికీ ఆమెకే ఉండిపోవచ్చు కూడా.

– ఉమ్మా రవీంద్ర రెడ్డి, సాక్షి, ఏలూరు జిల్లా



టెక్ట్స్ బుక్ చదివాను!

టెన్త్ క్లాస్ మార్కుల లిస్ట్ మనకు జీవితమంతా తోడు ఉంటుంది. డేట్ ఆఫ్ బర్త్ కోసం మాత్రమే కాదు మనకు చదువు మీద ఉండే ఇష్టానికి ప్రతిబింబం. అందుకే అంత ఎక్కువ కష్టపడ్డాను. మా అమ్మానాన్న నా కోసం తీసుకుంటున్న శ్రద్ధ అంతా ఇంతా కాదు. వారికి నేనివ్వగలిగిన గొప్ప బహుమతి మంచి మార్కులే. పరీక్షలకు ప్రిపరేషన్‌లో నేను గైడ్‌లు, నోట్స్ కంటే ఎక్కువగా టెక్ట్స్‌బుక్స్ చదివేదానిని. టాపర్ అనే లక్ష్యాన్ని పెట్టుకోలేదు. కానీ మంచి మార్కులు రావాలని కష్టపడ్డాను. మొత్తానికి నేను కోరుకున్నదానికంటే మించిన ఫలితాన్ని అందుకున్నాను. సంతోషంగా ఉంది. నాకు మ్యాథ్స్ ఇష్టం. ఐఐటీలో ఇంజినీరింగ్ చేసి జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడాలనేది నా లక్ష్యం.

- ఆకుల వెంకట నాగ సాయి మనస్వి,
టెన్త్ క్లాస్ స్టేట్ టాపర్, ఆంధ్రప్రదేశ్.

నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం

ఆత్మవిశ్వాసం నుంచి లోతైన విషయ విశ్లేషణ వరకు పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాల గురించి శాస్త్రీయ పరిశోధనలు నొక్కి చెబుతున్నాయి. పిల్లలకు 'పాఠ్యపుస్తకం' తప్ప కాల్పనిక పుస్తకాలు చదవడం అనేది కలగా మారిన ఈ కాలంలో, పిల్లలను స్క్రీన్ ఎడిక్షన్ నుంచి దూరం చేసి పుస్తక పఠన అభిరుచిని పెంపొందించడానికి కేరళకు చెందిన రియా జార్జ్ 'కుటుబుక్ యూ' స్టార్టప్ ద్వారా కృషి చేస్తోంది. పిల్లల అభిరుచిని దృష్టిలో పెట్టుకొని బుక్ సబ్‌స్క్రిప్షన్ సర్వీస్ ప్రారంభించింది. 'రైజింగ్ రీడర్స్' నినాదంతో 'సోనాలీస్ బుక్ క్లబ్' ఫౌండర్, నటి సోనాలీ బింద్రేతో 'కుటుబుక్ యూ' కలిసి పని చేస్తోంది.



● సోనాలీ బింద్రే, రియా జార్జ్

మిషన్ ఆర్‌ఆర్
రైజింగ్ రీడర్స్

కోవిడ్ టైమ్ అనేది పిల్లలను స్క్రీన్‌కు హత్తుకుపోయేలా చేయడమే కాదు అదొక వ్యసనం అయ్యేలా చేసింది. పుస్తకం పఠనం అనేది అరుదైన దృశ్యం అయింది. ఈ నేపథ్యంలో స్క్రీన్ టైమ్‌ను, పుస్తక పఠనంతో బ్యాలెన్సింగ్ చేయడానికి పిల్లల ముందుకు వచ్చింది చిల్డ్రన్స్ బుక్ సబ్‌స్క్రిప్షన్ సర్వీస్ ... కుటుబుక్ యూ.

కుటుబుకు అంటే... పుస్తకాలను బాగా ఇష్టపడడం, పుస్తకాల పురుగు అని అర్థం.

మన జాతీయ విద్యావిధానంలో లైబ్రరీ కల్చర్ వెల్లివిరియడం ఒకటి. పిల్లలు పుస్తకాల సంస్కృతికి దూరం అవుతున్న నేపథ్యంలో, పాఠ్యపుస్తకాల గురించి తప్ప పర పుస్తకాల గురించి మాట్లాడడం కాలహరణం అనే అపోహ పాతుకుపోయిన కాలంలో పుస్తకాల వెలుగును 'కుటుబుక్ యూ'లాంటి సంస్థలు పిల్లలకు దగ్గర చేస్తున్నాయి.

'కాలం ఎంత మారినా సరే కొన్నిటిని రీప్లేస్ చేయలేము.. పుస్తకం అలాంటిదే' అంటున్న బుక్‌యూ, పుస్తకపఠనం వల్ల సంతోషస్థాయి పెరగడం, టాకింగ్ స్కిల్స్, క్రియేటివిటీ, ఇమాజినేషన్ మెరుగుపడడం, శక్తిమంతం కావడం గురించి ప్రచారం చేస్తోంది.

'పుస్తకాన్ని మీ పిల్లలకు నేస్తం చేయండి' నినాదంతో కేరళలోని వయనాడ్ నుంచి మొదలైంది కుటుబుక్ యూ. పిల్లల వయసు, అభిరుచిని బట్టి కుటుబుక్ యూ 'బుక్ బాక్స్' నుంచి నచ్చిన పుస్తకాన్ని ఎంపిక చేసుకోవచ్చు. పిల్లలను లైఫ్‌లాంగ్ రీడర్‌లుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తోంది కుటుబుక్ యూ.

'పుస్తకాలకు పిల్లలు దూరం అవుతున్నారని బాధపడుతుంటాం. అయితే పిల్లలను పుస్తకాలతో ప్రేమలో పడేలా చేయడం అంత కష్టమేమీ కాదు. సరైన సమయంలో సరైన పుస్తకాలు ఇవ్వాలి. పిల్లలకు తమవైన ఆసక్తులు ఉంటాయి. ఆ ఆసక్తిని, పుస్తకంతో మ్యాచ్ చేయాలి. ఒక ఎడ్యుకేటర్‌గా నాకు పిల్లల మనస్తత్వం బాగా తెలుసు. పుస్తకాలను బాగా ఇష్టంగా చదివే పిల్లలను, పుస్తకాలు అంటేనే ముఖం అటు తిప్పుకునే పిల్లలను చూశాను. పుస్తకాలు అంటే అయిష్టంగా ఉండే పిల్లలు కూడా ఏదో ఒక సందర్భంలో తమకు నచ్చిన పుస్తకం చదవడం ద్వారా పఠనాసక్తిని పెంచుకోవడాన్ని చూశాను' అంటుంది 'కుటుబుక్ యూ' చీఫ్ బుక్స్ క్యూరేటర్ రియా జార్జ్. నిట్, కాలికట్‌లో ఇంజినీరింగ్ చేసిన జార్జ్ ఐఎంటీ, ఘజియాబాద్‌లో ఎంబీఏ చేసింది. 'కరికులమ్ అండ్ టీచింగ్'లో మాస్టర్స్ డిగ్రీ చేసింది. ఫిన్‌ల్యాండ్, సింగపూర్‌లోని విద్యావేత్తలతో కలిసి పనిచేసింది.

పుస్తకపఠన ఆసక్తిని పిల్లల్లో పెంపొందించడానికి జార్జ్ ఎంతోమంది తల్లిదండ్రులతో మాట్లాడి రకరకాల ఐడియాలతో వారికి మార్గనిర్దేశం చేస్తోంది. ఒక పుస్తకానికి సంబంధించిన హైలైట్స్‌ను ఏ5 సైజ్ కార్డుల ద్వారా పిల్లలకు చేరువ చేయడం, ఒక పుస్తకాన్ని పిల్లలు చదవడం పూర్తి చేసిన తరువాత ఆ పుస్తకానికి సంబంధించిన యాక్టివిటీస్ రూపొందించడం... ఆ ఐడియాలలో కొన్ని.

పుస్తకంతో కొత్త ప్రపంచంలోకి...

గత ఏడు సంవత్సరాలుగా సోనాలీస్ బుక్ క్లబ్ (ఎస్‌బీసీ) అనేది నా ప్యాషన్ ప్రాజెక్ట్. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఎంతోమంది పుస్తక ప్రేమికులతో కనెక్ట్ అయ్యాను. పుస్తకం రెక్కలతో మేము కొత్త ప్రపంచంలోకి వెళ్లాం. ఎన్నో పుస్తకాల గురించి మాట్లాడుకున్నాం. రచయితలతో చర్చలు చేశాం. పిల్లలతో కలిసి పుస్తకాలు చదువుకున్నాం. పుస్తకాలు చదవడం అనేది మా పిల్లాడికి బాగా ఇష్టమైన అభిరుచిని చేయడానికి కృషి చేస్తున్నాను. కుటుంబ బంధాలను బలోపేతం చేయడంలో, పిల్లలతో అర్థవంతమైన సంభాషణలు జరపడంలో పుస్తకం కీలక పాత్ర పోషిస్తుంది. మా పిల్లాడితో కలిసి పిల్లల పుస్తక ప్రపంచంలోకి వెళ్లడం నాకు ఇష్టమైన పని. రైజింగ్ రీడర్స్ ఉద్యమంలో భాగం కావడం నాకెంతో సంతోషాన్ని ఇస్తోంది.

-సోనాలి బింద్రే, ఎస్‌బీసీ ఫౌండర్



సాగుబడి
భరణి కార్తె :
ఏప్రిల్ 27 నుంచి

ఈ సంవత్సరం వేసవిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలతోపాటు పశు పక్ష్యాదులు కూడా దీర్ఘకాలం పాటు వడగాడ్పులను ఎదుర్కోవలసిన గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ప్రతికూల వాతావరణం పాడి పశువులను పోషిస్తున్న రైతులకు పెను సవాళ్లు విసురుతోంది. పాడి పశువులు అధిక వేడి వత్తిడికి గురైతే పాల దిగుబడి తగ్గిపోవటంతో పాటు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంది. ముఖ్యంగా అధిక పాలదిగుబడినిచ్చే ఆవులు, గేదెలు ఇతర పశువులతో పోల్చితే ఎక్కువ ఇబ్బందిపడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో కర్ణాటకకు చెందిన 'అక్షయకల్ప' సంస్థ పాడి పశువులను ఎండ వేడిమి ముప్పు నుంచి కాపాడుకునే అనేక మెలకువలను రైతులకు సూచిస్తోంది. ప్రత్యేక డిజైన్‌తో ఆ సంస్థ రూపొందించిన పశువుల షెడ్డు పశువులు వేడి వత్తిడిని తట్టుకోవటానికి ఎంతగానో ఉపయోగపడటంతో పాటు పాల దిగుబడిని కూడా పెంచుతోందని అక్షయకల్ప ఆర్గానిక్ ప్రతినిధి డాక్టర్ తేజేశ్వర్ రెడ్డి 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. ఆసక్తికరమైన ఈ వివరాలతో ప్రత్యేక కథనం...

వేడి ఒత్తిడి చిత్తు!

● పశువులను కట్టెయ్యకుండా దొడ్డిలో స్వేచ్ఛగా వదలటం వేడి ఒత్తిడి (హీట్ స్ట్రెస్)ని ఎదుర్కొనే దిశగా చెయ్యాల్సిన మొదటి పని ● గోడల్లేని విశాలమైన షెడ్లతో పాటు పందిరి/ షామియానాలతో కృత్రిమ నీడను కల్పించాలి ● తుంపర్ల వాన ఏర్పాటు చేయాలి / తరచూ పశువులను నీటితో తడుపుతూ ఉండాలి ● ఒంటి మీద తడి గోనె పట్టా వెయ్యాలి ● పుష్కలంగా నీటిని, పోషకాలతో కూడిన మేత అందుబాటులో ఉంచాలి.



● వేడిని తట్టుకునే విధంగా అక్షయకల్ప డిజైన్ చేసిన ఓపెన్ షెడ్



● చల్లదనం కోసం వేసిన టెంట్లు

15 నుంచి 27 డిగ్రీల సెల్షియస్ ఉష్ణోగ్రతలో సంకరజాతి పాడి ఆవులు సౌకర్యవంతంగా జీవిస్తూ మంచి పాల దిగుబడిని అందిస్తాయి. దేహంలో సహజ జీవక్రియ ద్వారా పుట్టే వేడికి వాతావరణంలో అధిక వేడి తోడైనప్పుడు జంతువు వేడి ఒత్తిడికి గురవుతుంది. అప్పుడు పశువు దేహంలో శక్తి వినియోగంలో మార్పు వస్తుంది. ప్రాధాన్యం పాల ఉత్పత్తి వైపు నుంచి ఆరోగ్య నిర్వహణ వైపు మళ్ళుతుంది. పశువు వేడి వత్తిడి (హీట్ స్ట్రెస్)కి గురైనప్పుడు దాని నిర్వహణ అవసరాలు 35% వరకు పెరుగుతాయి. పాల ఉత్పత్తి, పునరుత్పత్తి, ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు పడతాయి. అందువల్ల, వాతావరణంలో ఉష్ణోగ్రత సాధారణ స్థాయిని మించి పెరుగుతూ ఉన్నప్పుడు పశు పోషణకు రైతులు అప్రమత్తతతో వ్యవహరించటం అవసరం.

ఉష్ణోగ్రతను నియంత్రించే షెడ్డు

పాడి పశువులు, ముఖ్యంగా సంకరజాతి ఆవులు, ఎండ వేడిమిని సమర్థవంతంగా తట్టుకోవాలంటే సాధారణంగా నిర్మించే పద్ధతిలో కాకుండా ప్రత్యేక డిజైన్‌ను అనుసరిస్తే మేలని 'అక్షయకల్ప' రైతులకు సూచిస్తోంది. ఉష్ణోగ్రతను నియంత్రించే పశువుల షెడ్‌ల నమూనాకు ఈ సంస్థ నిపుణులు కొన్ని ఏళ్ల క్రితమే రూపకల్పన చేశారు. ఎంపిక చేసిన డెయిరీ ఫామ్‌లలో ఈ 'ఉష్ణోగ్రతను నియంత్రించే షెడ్‌ల'ను పైలట్ ప్రాతిపదికన అమలు చేశారు. సత్ఫలితాలు సాధించిన తర్వాత ఇతర రైతులకు ఈ నమూనాను సంస్థ సూచిస్తోంది. షెడ్డు నాలుగు వైపుల నుంచీ సహజంగా గాలి, వెల్తురు వచ్చేలా, విశాలంగా, తగినంత ఎత్తు ఉండాలి. అన్ని వైపులా సహజ గాలి, వెల్తురు పారాడే వీలు కల్పించటంతోపాటు.. వేడి గాలి వెళ్లిపోడానికి పైకప్పు మధ్యలో ఖాళీ స్థలం వదలాలి. పైకప్పు ఆస్బెస్టాస్ రేకులకు బదులు జింక్ రేకులు వాడాలి. సౌకర్యవంతమైన ఫ్లోరింగ్‌ను కలిగి ఉండటం ఈ నమూనా ముఖ్యాంశాలు.



పెరిగిన పాల దిగుబడి

తమ డిజైన్ ప్రకారం ప్రత్యేకంగా రూపొందించిన షెడ్‌లలో 2016 నుంచి 2022 మధ్య కాలంలో పెరిగిన ఆవుల రోజువారీ సగటు పాల దిగుబడి (సాంప్రదాయ షెడ్‌లలో పెరిగిన ఆవులతో పోలిస్తే) 1.2 లీటర్ల నుంచి 3.7 లీటర్ల మేరకు అధికమని తమ అధ్యయనంలో తేలిందని అక్షయకల్ప ఆర్గానిక్ ప్రతినిధి డాక్టర్ తేజేశ్వర్ రెడ్డి తెలిపారు.

ఈ షెడ్లను కూడా చౌకగానే నిర్మించవచ్చు. ఒక అంచనా ప్రకారం.. గోడలతో మూసివేసినట్లు వుండే సంప్రదాయ షెడ్ నిర్మాణానికి రూ. 3,20,725 ఖర్చు అవుతూ ఉంటే.. అక్షయకల్ప నమూనా ప్రకారం నాలుగు వైపులా గోడలు లేకుండా ఎత్తుగా నిర్మించే షెడ్డుకు రూ. 1,70,000 ఖర్చవుతుందని తెలిపారు. ఈ షెడ్డు వల్ల పెరిగిన ఉత్పాదకత రైతులకు అధిక ఆర్థిక ప్రయోజనాలను అందిస్తుందని అక్షయకల్ప రైతుల అనుభవాలు చెబుతున్నాయి.

వేడి ఒత్తిడిని ఎదుర్కొనే ఉపాయాలు

● ఆవులను ఎప్పుడూ షెడ్డు కింద కట్టేసి ఉంచకూడదు. చుట్టూ గట్టి కంచె ఉన్న దొడ్డిలో గోడలు లేకుండా ఎత్తుగా నిర్మించిన షెడ్‌లో స్వేచ్ఛగా తిరగనివ్వాలి ● వడ గాడ్పులు ఉన్నప్పుడు తరచూ నీటిని తుంపర్లుగా చల్లేందుకు పశువుల షెడ్డులో మైక్రో స్ప్రింక్లర్లు లేదా మిస్టర్లను ఏర్పాటు చేసుకోవాలి ● ఇది వీలుకాకపోతే తడిపిన గోనె పట్టాలను పశువు నడుముపై వేసి చల్లదనాన్ని కలిగించాలి. పట్టా తడి ఆరిపోకుండా గమనించాలి ● అధిక వేడి ఉండే రోజుల్లో పశువులు వీలైతే దొడ్డిలోని చెట్ల నీడన సేద తీరే అవకాశం కల్పించాలి లేదా షామియానా వంటి కృత్రిమ నీడను ఏర్పాటు చెయ్యాలి ● ఎక్కువ పశువులను తక్కువ స్థలంలో ఉంచవద్దు. ఇరుకు స్థలంలో ఎక్కువ పశువులు ఉంటే శరీరంలో అధికంగా ఉష్ణం పెరుగుతుంది. గాలి ప్రసరణ తగ్గుతుంది ● నిరంతరం స్వచ్ఛమైన నీటి సరఫరా పుష్కలంగా ఉండేలా చూడాలి. ఆవులు వేడి వాతావరణంలో ఎక్కువ నీరు తాగి శరీర ఉష్ణోగ్రతను నియంత్రించుకోవటానికి అవకాశం కల్పించాలి ● పరిసరాలను చల్లబరచడానికి స్ప్రింక్లర్లు లేదా మిస్టర్లను అమర్చండి లేదా శరీరంపై నేరుగా నీరు చల్లండి ● చల్ల పూటల్లోనే మేత, దాణా ఇవ్వండి ● వేడి ఒత్తిడి సమయంలో ఆవు జీవక్రియకు తోడ్పడేందుకు తగిన శక్తి, ప్రోటీన్, ఖనిజాలతో కూడిన సమతుల్య దాణాను అందించండి ● జంతువులపై ఒత్తిడిని తగ్గించడానికి చల్లని సమయాల్లోనే పాలు పితకండి ● పశువులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయా? శ్వాసక్రియ రేటు పెరుగుతోందా? మేత తీసుకోవడం తగ్గిందా? వంటి వేడి ఒత్తిడి లక్షణాలు ఏమైనా ఉన్నాయా అని క్రమం తప్పకుండా గమనిస్తూ ఉండండి. ● టెంపరేచర్ హ్యూమిడిటీ ఇండెక్స్(హెచ్ టి ఐ) 68 దాటితే జాగ్రత్త పడాలి. 98 దాటితే ప్రమాదం ● అతి తీవ్రమైన వడ గాడ్పులను తట్టుకోవటానికి అత్యవసర ప్రణాళికలు సిద్ధం చేసుకోండి. ఆపత్కాలంలో జంతువులను త్వరగా చల్లబరచడానికి, అవసరమైతే తక్షణ వైద్యం అందించే ఏర్పాట్లు చేసిపెట్టుకోండి ● వీలైతే వేడిని తట్టుకోగల పాడి పశువుల జాతులను ఎంపిక చేసుకోండి.



● షెడ్ లోపల అమర్చిన ఫాగర్లు

ప్రతికూలంలోనూ అధిక పాల దిగుబడి

ఉష్ణోగ్రత 15 – 27 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉంటే పాడి పశువులు హాయిగా ఉంటాయి. ఆవుల జీవక్రియ వేడిని పుట్టిస్తుంటుంది. మేతను జీర్ణం చేసుకునే క్రమంలో విడుదలయ్యే శక్తి వల్ల పశువు దేహంలో వేడి పుడుతుంది. వాతావరణంలో వేడి అధికంగా ఉంటే, అది శరీరంలోని సూక్ష్మజీవుల అసమతుల్యతకు కారణమై జీర్ణక్రియను నిరోధిస్తుంది. జంతువు దేహంలో అసౌకర్యం కలుగుతుంది. వేడిని తగ్గించే చర్యలు తీసుకోలేకపోతే అవి ఒత్తిడికి గురవుతాయి. ప్రత్యేక నమూనాలో షెడ్లను నిర్మించటంతో పాటు ఇతర జాగ్రత్తలు పాటిస్తే వడగాడ్పుల నుంచి పాడి పశువులను కాపాడుకోవచ్చు. ప్రతికూల వాతావరణంలోనూ అధిక పాల దిగుబడి కూడా పొందవచ్చన్నది మా రైతుల అనుభవం.

- డాక్టర్ తేజేశ్వర్ రెడ్డి (86390 80108),
అక్షయకల్ప ఆర్గానిక్ ప్రతినిధి



నిర్వహణ: **పంతంగి రాంబాబు,** సాగుబడి డెస్క్

బయో ఫిష్ ట్యాంకుల్లో తక్కువ ఖర్చుతో చేపల సాగు!



బయో ఫిష్ ట్యాంకులు.. తమిళనాడులో చిన్న, సన్నకారు చేపల రైతులకు ఈ చిన్నపాటి కృత్రిమ చెరువులు ఆక్వా సిరులు కురిపిస్తున్నాయి. చేపల పెంపకంలో అనుభవం లేని వారు కూడా మత్స్య శాఖ వద్ద శిక్షణ పొంది తక్కువ పెట్టుబడితో, కొద్దిపాటి చోటులో బయో ఫిష్ ట్యాంకులను ఏర్పాటు చేసుకుంటూ కుటుంబ ఆదాయాన్ని పెంపొందించుకుంటున్నారు. ఇనుప మెష్‌లో టార్పాలిన్ వేసి, అందులో నీటిని నింపి చేపలు పెంచుతున్నారు. తక్కువ నీటితోనే చేపల పెంపకం చేపట్టగలుగుతున్నామని రైతులు చెబుతున్నారు. ఒక్కో బయో ఫిష్ ట్యాంకులో 450 తిలాపియా, లాబ్‌స్టర్ వంటి చేపలను పెంచుతున్నారు. ఇంటి దగ్గరే రెండు ట్యాంకులు పెట్టుకొని వెయ్యి చేపల వరకు పెంచుతున్నారు. దీనిపైన వల కప్పి కొంగలు, కాకుల నుంచి చేపలను రక్షించుకుంటున్నారు. మహిళలకు 60%, పురుషులకు 40% సబ్సిడీతోపాటు లబ్ధిదారులకు తమిళనాడు మత్స్య శాఖ తగిన శిక్షణ కూడా ఇవ్వటంతో ఆక్వా రంగంలో పూర్వానుభవం లేని వారు కూడా ఆసక్తి చూపుతున్నారు.

సాక్షి బిజినెస్

మంగళవారం
23-4-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
560	189
73,649	22,336

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	15,506	▲	226
డోజోన్స్	38,418	▲	432
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,024	▲	18
డాక్స్	17,861	▲	124
షాంఘై	3,044	▼	21
నికాయ్	37,439	▲	370

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	72,875
బంగారం (99.5 స్వచ్ఛత)	72,583
వెండి (కిలో)	81,554

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.17	84.19
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	102.67	105.22
€	యూరో	ఎస్‌బీఐ	87.86	90.22
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.62	54.82
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.57	54.49
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.20	63.40
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.37	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.84	23.61
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.39	12.39

రిలయన్స్ ఇండస్ట్రీస్ లాభం ఫ్లాట్

- క్యూ4లో రూ. 18,951 కోట్లు
- 2023–24లో లాభాల్లో రికార్డ్



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్) చివరి త్రైమాసికంతోపాటు పూర్తి ఏడాది(2023–24)కి ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం నామమాత్ర క్షీణతతో రూ. 18,951 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 19,299 కోట్లు ఆర్జించింది. అయితే గతేడాది క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో సాధించిన రూ. 17,265 కోట్లతో పోలిస్తే లాభం మెరుగుపడింది. ఇక మొత్తం ఆదాయం వార్షికంగా 11 శాతం పుంజుకుని రూ. 2.64 లక్షల కోట్లకు చేరింది. కన్సాలిడేటెడ్ ఫలితాలివి. నిర్వహణ లాభం(ఇబిటా) 14 శాతం వృద్ధితో రూ. 47,150 కోట్లను తాకింది.

పూర్తి ఏడాదికి

గత ఆర్థిక సంవత్సరంలో ఆర్‌ఐఎల్ నికర లాభం కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 69,621 కోట్లకు చేరింది. 2022–23లో రూ. 66,702 కోట్లు మాత్రమే ఆర్జించింది. ఈ బాటలో మొత్తం ఆదాయం 2.6 శాతం పుంజుకుని రూ. 10 లక్షల కోట్లకు చేరింది. అంతక్రితం రూ. 9.74 లక్షల కోట్ల టర్నోవర్ నమోదైంది. వెరసి రూ. 10 లక్షల కోట్ల టర్నోవర్‌ను సాధించిన తొలి దేశీ కంపెనీగా రిలయన్స్ ఆవిర్భవించింది.

వ్యాపారాలు పటిష్టం

అన్ని విభాగాలూ నిర్వహణ, ఆర్థికపరంగా పటిష్ట పనితీరు చూపాయి. ఇది పలు మైలురాళ్ల సాధనకు సహకరించింది. పన్నుకుముందు లాభం రూ. లక్ష కోట్లను అధిగమించిన తొలి దేశీ కంపెనీగా రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆవిర్భవించిందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. 10.8 కోట్లను మించిన 5జీ కస్టమర్ల ద్వారా జియో దేశ 5జీ ప్రయాణంలో ప్రధాన పాత్ర పోషిస్తోంది.

– ముకేశ్ అంబానీ, చైర్మన్, ఎండీ, రిలయన్స్ ఇండస్ట్రీస్



బీఎస్‌ఈలో షేర్ ధర 0.7% లాభపడి రూ.2,961 వద్ద ముగిసింది.

హైలైట్స్

- మార్చి త్రైమాసికంలో (క్యూ4) ఓ2సీ విభాగం ఇబిటా 3 శాతం వృద్ధితో 16777 కోట్లను తాకగా.. మొత్తం ఆదాయం 11 శాతం అధికంగా రూ. 1.43 లక్షల కోట్లకు చేరింది.
- రిటైల్ బిజినెస్ నికర లాభం 12 శాతం బలపడి రూ. 2,698 కోట్లకు చేరగా.. మొత్తం ఆదాయం రూ. 76683 కోట్లకు చేరింది. రూ. 5,829 కోట్ల ఇబిటా సాధించింది.
- ఆయిల్ అండ్ గ్యాస్ ఇబిటా 47 శాతంపైగా జంప్‌చేసి రూ. 5,606 కోట్లను తాకింది.
- కేజీ–డీ6 బ్లాక్ ప్రస్తుతం రోజుకి 30 మిలియన్ ప్రామాణిక ఘనపు మీటర్ల గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తోంది. రోజుకి 23,000 బ్యారళ్ల చమురు (కండెన్సేట్) ఉత్పత్తవుతోంది.
- 2024 మార్చి31కల్లా చేతిలో ఉన్న నగదును పరిగణించాక నికర రుణభారం రూ. 1.16 లక్షల కోట్లకు తగ్గింది. 2023మార్చిలో రూ. 1.25 లక్షల కోట్లుగా నమోదైంది.
- వార్షిక డివిడెండ్ షేరుకు రూ.10 చొప్పున బోర్డ్ ఆమోదముద్ర వేసింది.





జియో.. భళా

రిలయన్స్ జియో క్యూ4సహా.. పూర్తి ఏడాదికి పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చిలో జియో ప్లాట్‌ఫామ్స్ నికర లాభం 12 శాతం పుంజుకుని రూ. 5,583 కోట్లను తాకింది. కన్సాలిడేటెడ్ ఆదాయం 13 శాతం బలపడి రూ. 33,835 కోట్లకు చేరింది. ఇక 2023–24లో నికర లాభం 12 శాతంపైగా ఎగసి రూ. 21,423 కోట్లను తాకగా.. మొత్తం ఆదాయం 12 శాతం అధికమై రూ. 1,09,558 కోట్లుగా నమోదైంది. క్యూ4లో ఏఆర్‌పీయూ 1.6 శాతం మెరుగై రూ. 181.7కు చేరింది. మొత్తం 10.9 మిలియన్ సబ్‌స్క్రయిబర్లు జత కలిశారు. మార్చికల్లా మొత్తం వినియోగదారుల సంఖ్య 48.18 కోట్లకు ఎగసింది. 5జీ కస్టమర్ల సంఖ్య 10.8 కోట్లకు చేరింది. జియోఎయిర్‌ఫైబర్ 5,900 పట్టణాలలో సర్వీసులు అందిస్తోంది.

ఎండీ రాజీనామా: కాగా 2013 నుంచి ఎండీగా విధులు నిర్వహిస్తున్న సంజయ్ మష్రువాలా రాజీనామా చేసినట్లు జియో పేర్కొంది. జూన్ 9 నుంచి కంపెనీని వీడనున్నట్లు వెల్లడించింది. ధీరూభాయ్ అంబానీ కాలం నుంచి ఆయన ఆర్‌ఐఎల్‌లో ఉన్నారు.

హైసెన్స్ హెచ్‌వీఏసీ ఎక్స్‌పీరియెన్స్ సెంటర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హీటింగ్, వెంటిలేషన్, ఎయిర్ కండీషనింగ్ (హెచ్‌వీఏసీ) సంస్థ హైసెన్స్ భారత్‌లో తొలి ఎక్స్‌పీరియెన్స్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించింది. హైసెన్స్ చానెల్ పార్ట్‌నర్ ఆర్టస్ హెచ్‌వీఏసీ ఇంజనీరింగ్ ఇండియా ఈ కేంద్రాన్ని బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసింది. రెసిడెన్షియల్, కమర్షియల్ విభాగాల్లో ప్రత్యేక డిమాండ్‌లను తీర్చడానికి రూపొందించిన విభిన్న శ్రేణి హెచ్‌వీఏసీ సొల్యూషన్స్ ఇక్కడ కొలువుదీరాయని ఆర్టస్ ఎండీ లింగిరెడ్డి నవనీత్ రెడ్డి తెలిపారు. ప్రారంభోత్సవంలో హైసెన్స్ హెచ్‌వీఏసీ ఇండియా డైరెక్టర్ రాకేశ్ చౌహాన్ పాల్గొన్నారు.



నవనీత్ రెడ్డి, రాకేశ్ చౌహాన్ (కుడి)

ఇంటర్నెట్ స్పీడ్ తగ్గింది

56 శాతం నెటిజన్ల మాట ఇదే ● లోకల్‌సర్కిల్స్ సర్వేలో వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: 'ఇంటర్నెట్ వేగం తగ్గింది. టెలికం కంపెనీ ఇచ్చిన హామీ మేరకు వేగం లేదు. మేం చెల్లిస్తున్న డబ్బులకు తగ్గట్టుగా స్పీడ్ రావడం లేదు' అంటూ కమ్యూనిటీ ప్లాట్‌ఫామ్ లోకల్‌సర్కిల్స్ వార్షిక బ్రాడ్‌బ్యాండ్ సర్వేలో 50 శాతం మందికిపైగా తమ అసంతృప్తిని వ్యక్తపరిచారు. భారత్‌లో 86 శాతం మంది యూజర్లు ప్రధానంగా ఫైబర్, బ్రాడ్‌బ్యాండ్, డిజిటల్ సబ్‌స్క్రైబర్ లైన్ లేదా ఫిక్స్‌డ్–లైన్ కనెక్షన్ ద్వారా ఇంట్లోనే ఇంటర్నెట్‌కు కనెక్ట్ అయ్యారు. వీరిలో 56 శాతం మంది ఇంటర్నెట్ వేగం తగ్గడంతోపాటు కనెక్టివిటీ సమస్యలు తలెత్తుతున్నాయని సర్వేలో వెల్లడించారు. సర్వీస్ ప్రొవైడర్‌ను మారుస్తామంటూ 70 శాతం మంది అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా 286 జిల్లాల్లో 70 వేల పైచిలుకు బ్రాడ్‌బ్యాండ్, ఫైబర్ కస్టమర్లు ఈ సర్వేలో పాలుపంచుకున్నారు. ఫిర్యాదులను పరిష్కరించడానికి టెలికం కంపెనీ 24 గంటలకుపైగా సమయం తీసుకుంటోందని 47 శాతం మంది చెప్పారు.

పేటీఎం మేడిన్ ఇండియా సౌండ్ బాక్సులు

న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ కంపెనీ పేటీఎం తాజాగా మేడిన్ ఇండియా సౌండ్ బాక్స్‌లను ప్రవేశపెట్టింది. యూపీఐతో పాటు క్రెడిట్ కార్డ్ ఆధారిత యూపీఐ చెల్లింపులను వీటి ద్వారా వర్తకులు స్వీకరించవచ్చని కంపెనీ తెలిపింది. లావాదేవీ పూర్తి కాగానే వెంటనే నోటిఫికేషన్ వస్తుందని సంస్థ ఫౌండర్, సీఈవో విజయ్ శేఖర్ శర్మ తెలిపారు.

అన్‌లిమిటెడ్ నుంచి బాటమ్‌వేర్

న్యూఢిల్లీ: ఫ్యాషన్ రిటైల్ బ్రాండ్ అన్‌లిమిటెడ్ 1000 రకాల స్టైల్స్‌లో బాటమ్‌వేర్ ను మార్కెట్లోకి విడుదల చేసింది. అన్ని వర్గాలకు సరిపడే భిన్నమైన కార్గోలు, స్టైలిష్ జాగర్స్, సౌకర్యవంతమైన ట్రాక్ పాయింట్స్, క్యాజువల్ షర్టులతో పాటు మరెన్నో వీటిలో ఉన్నాయి. ఒక బాటమ్‌వేర్ కొంటే ఒకటి ఉచితంగా పొందవచ్చు. పరిమితకాలంగా ఉండే ఈ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకునేందుకు దగ్గర్లోని అన్‌లిమిటెడ్ షోరూం సందర్శించాల్సిందిగా కంపెనీ ప్రకటన ద్వారా తెలిపింది.

UNLIMITED

భీమా జ్యువెల్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా రామ్ చరణ్



ముంబై: భీమా జ్యువెల్స్ సినీ నటుడు రామ్ చరణ్‌ను తమ సంస్థ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. "సినిమా ఆకర్షణకు, కళా నైపుణ్యానికి మధ్య సరికొత్త అనుబంధం ఇది. నేటి తరం అభిరుచులకు తగ్గట్టు తీర్చిదిద్దిన కలెక్షన్లకు తోడు, చరణ్ ప్రచారం వల్ల యువతరం కస్టమర్ల సంఖ్య పెరుగుతుందని ఆశిస్తున్నాము'' అని కంపెనీ చైర్మన్ బి. బిందుమాధవ్ అన్నారు. సాంప్రదాయం–నైపుణ్యాల మేలికలయిక అయిన భీమా బ్రాండ్‌కు తాను ప్రచారకర్తగా వ్యవహరించడం సంతోషంగా ఉందని రామ్‌చరణ్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-4-2024 ఫామ్ ధర...

విశాఖ	400–00
చిత్తూరు	473–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	380–00
విజయవాడ	380–00
హైదరాబాద్	360–00
వరంగల్	362–00

కొనసాగిన కొనుగోళ్లు

- పశ్చిమాసియాలో సద్దుమణిగిన ఉద్రికత్తలు
- దిగివచ్చిన క్రూడాయిల్ ధరలు
- సూచీలకు 2వ రోజూ భారీ లాభాలే

ముంబై: పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతలు సద్దుమణగడం, క్రూడాయిల్ ధరలు దిగిరావడంతో స్టాక్ మార్కెట్లలో రెండోరోజూ కొనుగోళ్ల జోరు కొనసాగింది. ఫలితంగా సోమవారం సెన్సెక్స్ 560 పాయింట్లు పెరిగి 73,649 వద్ద నిలిచింది. నిఫ్టీ 189 పాయింట్లు పెరిగి 22,336 వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందిపుచ్చుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలో కాస్త తడబడినా.., అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్థిరంగా ముందుకు కదిలాయి. ఒక దశలో సెన్సెక్స్ 680 పాయింట్లు బలపడి 73,768 వద్ద, నిఫ్టీ 229 పాయింట్లు ఎగసి 22,376 వద్ద ఇంట్రాడే గరిష్టాలను అందుకున్నాయి. లాభాల మార్కెట్లోనూ యుటిలిటీ షేర్లు మాత్రం అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.26%, 0.93% చొప్పున లాభపడ్డాయి.

- రెండు రోజుల్లో సెన్సెక్స్ 1,159 పాయింట్ల ర్యాలీతో బీఎస్‌ఈలో 4.97 లక్షల కోట్లు సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.397 లక్షల కోట్లకు చేరింది.



వొడాఫోన్ ఎఫ్‌పీవో సక్సెస్

Vi

వొడాఫోన్ ఐడియా మొత్తం రూ. 18,000 కోట్ల సమీకరణకు చేపట్టిన ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పీవో) విజయవంతమైంది. చివరి రోజు సోమవారానికల్లా ఇష్యూ 7 రెట్లు అధికంగా సబ్‌స్క్రయిబ్ అయ్యింది. దీంతో కంపెనీ తాజాగా రూ. 12,600 కోట్లు సమకూర్చుకుంది. ఎఫ్‌పీవో షేర్లు ఈ నెల 25న లిస్టింగ్ కానున్నాయి. కాగా ఎన్‌ఎస్‌ఈలో వొడాఫోన్ ఐడియా షేరు యథాతథంగా రూ. 12.90 వద్దే ముగిసింది.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ ఎడ్‌సెట్-2024

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏపీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎడ్‌సెట్)-2024 నోటిఫికేషన్ విడుదలైంది. బీఈడీ, బీఈడీ(స్పెషల్) కోర్సుల్లో ప్రవేశాలకు ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. బీటెక్, బీసీఏ, బీబీఎం విద్యార్థులు అర్హులే. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **పరీక్ష విధానం:** మొత్తం 150 ప్రశ్నలు మూడు విభాగాల నుంచి ఉంటాయి. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 18.04.2024.
- **ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.05.2024.
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 22.05.2024 నుంచి 25.05.2024 వరకు
- **హాల్ టిక్కెట్ల డౌన్‌లోడ్ తేది:** 30.05.2024.
- **ప్రవేశ పరీక్ష తేది:** 08.06.2024.
- **వెబ్‌సైట్:** https://cets.apsche.ap.gov.in

యూజీసీ-నెట్-2024

యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్)-2024 నోటిఫికేషన్‌ను విడుదలచేసింది. ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తుంది. యూనివర్శిటీల్లో జూనియర్ రీసెర్ ఫెలోషిప్(జేఆర్‌ఎఫ్), అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు, పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఈ పరీక్షను ఏటా రెండుసార్లు నిర్వహిస్తుంటారు.

- **సబ్జెక్టులు:** అడల్ట్ ఎడ్యుకేషన్, ఆంత్రోపాలజీ, అరబ్ కల్చర్ అండ్ ఇస్లామిక్ స్టడీస్, అరబిక్, ఆర్కియాలజీ, అస్సామీ, బెంగాలీ, బోడో, బౌద్ధ, జైన, చైనీస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్, క్రిమినాలజీ, జాగ్రఫీ, ఎకనామిక్స్, ఇంగ్లిష్, హోం సైన్స్, హిస్టరీ, ఫోరెన్సిక్ సైన్స్, ఇండియన్ కల్చర్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, లింగ్విస్టిక్స్, మ్యూజిక్, సైకాలజీ, లా తదితరాలు.
- **అర్హత:** 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. ఓబీసీ-ఎన్‌సీఎల్/ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/థర్డ్ జెండర్ కేటగిరీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు అవసరం.
- **వయసు:** జేఆర్‌ఎఫ్‌కు 01.06.2024 నాటికి 30 ఏళ్ల మించకూడదు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు గరిష్ఠ వయోపరిమితి లేదు.
- **పరీక్ష విధానం:** ఓఎమ్మార్ ఆధారిత విధానంలో పరీక్ష ఉంటుంది. పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. రెండు పేపర్లలో ఆబ్జెక్టివ్ టైప్, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. పేపర్-1లో 50 ప్రశ్నలు(100 మార్కులు), పేపర్-2లో 100 ప్రశ్నలు(200 మార్కులు) కేటాయించారు. పరీక్షకు మూడు గంటల వ్యవధి ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 20.04.2024.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.05.2024
- **పరీక్ష ఫీజు చెల్లింపుకు చివరితేది:** 12.05.2024.
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 13.05.2024 నుంచి 15.05.2024వరకు
- **పరీక్ష తేది:** 16.06.2024.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ugcnet.nta.ac.in

ఎస్‌వీఎన్‌ఐఆర్‌టీఏఆర్-పీజీఈటీ-2024

కటక్(ఒడిశా)లోని స్వామి వివేకానంద నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిహాబిలిటేషన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్(ఎస్‌వీఎన్‌ఐఆర్‌టీఏఆర్).. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

- మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ(ఎంపీటీ)- 15 సీట్లు.
- మాస్టర్ ఆఫ్ ఆక్యుపేషనల్ థెరపీ(ఎంఓటీ)-15 సీట్లు.
- మాస్టర్ ఇన్ ప్రోస్థెటిక్స్ అండ్ ఆర్థోటిక్స్ (ఎంపీఓ)-10 సీట్లు.
- **కోర్సు వ్యవధి:** రెండేళ్లు.
- **అర్హత:** కోర్సును అనుసరించి కనీసం 50% మార్కులతో బీపీటీ/బీఎస్సీ(పీటీ), బీఓటీ/బీఎస్సీ(ఓటీ), బీపీఓ/బీఎస్సీ(పీఓ) డిగ్రీ లేదా తత్సమానం ఉత్తీర్ణులై ఉండాలి.
- **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష-2024, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** సికింద్రాబాద్, విజయవాడ.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.05.2024
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ తేది:** 04.06.2024.
- **ప్రవేశ పరీక్ష తేది:** 23.06.2024.
- **ఫలితాల ప్రకటన:** 09.07.2024.
- **సెషన్ ప్రారంభం:** 01.10.2024.
- **వెబ్‌సైట్:** https://admission.svnirtar.nic.in

ఉమ్మడి ప్రిపరేషన్.. గ్రూప్స్ గెలుపు!

- టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1, 2, 3 పరీక్షల తేదీలు ఖరారు
- ఉమ్మడి వ్యూహంతో రాణించేందుకు అవకాశం
- అనుసంధాన దృక్పథం కీలకమంటున్న నిపుణులు

టీఎస్‌పీఎస్సీ గ్రూప్ సర్వీసెస్.. తెలంగాణ రాష్ట్రంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణుల కలల కొలువులు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షల ద్వారా డిప్యూటీ కలెక్టర్ నుంచి జూనియర్ అసిస్టెంట్ పోస్ట్‌ల వరకు.. వివిధ ఉద్యోగాలను భర్తీ చేస్తారు. వీటికి లక్షల మంది అభ్యర్థులు పోటీ పడుతుంటారు. ఇటీవల టీఎస్‌పీఎస్సీ.. గ్రూప్-1, 2, 3 పరీక్షల తేదీలను ఖరారు చేసింది. ఎక్కువ మంది అభ్యర్థులు మూడింటికీ దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో.. ఈ మూడు పరీక్షలకు కామన్ ప్రిపరేషన్‌పై ప్రత్యేక కథనం..

టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన నోటిఫికేషన్ల ప్రకారం-గ్రూప్-1లో 563 పోస్ట్‌లు, గ్రూప్-2లో 783 పోస్ట్‌లు, గ్రూప్-3లో 1,388 పోస్ట్‌లు భర్తీ చేయనున్నారు. గ్రూప్ 1 పోస్టులకు ప్రిలిమ్స్, మెయిన్స్ ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నారు. గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులకు ఆబ్జెక్టివ్ తరహా రాత పరీక్షలు ఉంటాయి.

జూన్ 9న గ్రూప్1 ప్రిలిమ్స్

టీఎస్‌పీఎస్సీ ఇటీవల గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షల తేదీలను ఖరారు చేసింది. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను జూన్ 9న, మెయిన్ పరీక్షలను అక్టోబర్ 21 నుంచి నిర్వహించనున్నారు. అదే విధంగా గ్రూప్-2 పరీక్ష నాలుగు పేపర్లుగా రెండు రోజుల్లో ఆగస్ట్ 7, 8 తేదీల్లో జరుగుతుంది. గ్రూప్-3 పరీక్షను మూడు పేపర్లుగా నవంబర్ 17, 18 తేదీల్లో నిర్వహించనున్నారు.

పోటీ కూడా ఎక్కువగానే

గ్రూప్-1, 2, 3 పరీక్షలకు పోటీ కూడా ఎక్కువగానే ఉంటుంది. గ్రూప్-1కు సంబంధించి మూడు లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. గతంలో విడుదల చేసిన గ్రూప్-2 నోటిఫికేషన్‌కు 5.5 లక్షలు, గ్రూప్-3 నోటిఫికేషన్‌కు 5.3 లక్షల మంది దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. ఈ గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే.. దాదాపు 80 శాతం మంది అభ్యర్థులు మూడు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఉమ్మడి సన్నద్ధత

గ్రూప్-1, 2, 3.. మూడు పరీక్షలను లక్ష్యంగా చేసుకున్న అభ్యర్థులు.. మూడింటికీ సన్నద్ధత పొందేందుకు అవకాశముంది. అందుకోసం ఆయా అభ్యర్థులు ప్రధాన లక్ష్యమైన పరీక్షకు అధిక ప్రాధాన్యమిస్తూ.. ఆ ప్రిపరేషన్‌ను మిగతా రెండు పరీక్షలతో అనుసంధానం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

సిలబస్.. ఒకే రీతి

మూడు సర్వీసులకు సిలబస్ దాదాపు ఒకే రీతిలో ఉండడం ఉమ్మడి ప్రిపరేషన్ అభ్యర్థులకు కలిసొచ్చే అంశంగా చెప్పొచ్చు. గ్రూప్-1 అభ్యర్థులు ఆబ్జెక్టివ్ విధానంలో ఉండే ప్రిలిమినరీ పరీక్షతోపాటు.. ఆ తర్వాత దశలో ఏడు పేపర్లుగా.. డిస్క్రిప్టివ్ పద్ధతిలో నిర్వహించే మెయిన్ ఎగ్జామ్స్‌కు సన్నద్ధత పొందాల్సి ఉంటుంది. గ్రూప్-1 మెయిన్స్‌కు ప్రిపరేషన్ సాగిస్తే..గ్రూప్-1 ప్రిలిమ్స్, మెయిన్స్‌తోపాటు గ్రూప్-2, 3లకు కూడా సన్నద్ధత పూర్తవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

గ్రూప్-2, 3 పరీక్షలు పూర్తిగా ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి. గ్రూప్-2ను నాలుగు పేపర్లుగా, గ్రూప్-3ను మూడు పేపర్లుగా నిర్వహించనున్నారు. గ్రూప్-2లో నాలుగో పేపర్‌గా తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావంపై పరీక్ష ఉంటుంది. ఈ అంశాలను గ్రూప్-3లోని పేపర్-2, పేపర్-3లతో సమ్మిళితం చేసుకునే అవకాశం ఉంది.

సిలబస్‌కు సరితూగే పుస్తకాలు

ఉమ్మడి ప్రిపరేషన్ సాగించే అభ్యర్థులు అందుకు అనుకూలమైన పుస్తకాలను మాత్రమే చదవాలి. ఆయా పరీక్షల సిలబస్ అంశాలన్నీ ఉన్న పుస్తకాలను ఎంచుకొని ప్రిపరేషన్‌కు ఉపక్రమించాలి. ప్రధానంగా తెలంగాణ ఉద్యమ దశలకు సంబంధించి ప్రత్యేక దృష్టితో చదవాలి. మార్కెట్లో ఈ అంశానికి సంబంధించి పదుల సంఖ్యలో పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. సిలబస్‌కు సరితూగే విధంగా తెలంగాణ ఉద్యమానికి సంబంధించి అన్ని ముఖ్యమైన ఘట్టాలు ఉన్న ఒకట్రెండు పుస్తకాలను ఎంచుకోవడం మేలు చేస్తుంది. అదే విధంగా అకాడమీ పుస్తకాలను చదవడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

విశ్లేషణాత్మక అధ్యయనం

గ్రూప్స్ అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌లో విశ్లేషణాత్మక అధ్యయనానికి ప్రాధాన్యం ఇవ్వాలి. గ్రూప్-1 ప్రిలిమ్స్, గ్రూప్-2, 3 పరీక్షలు ఆబ్జెక్టివ్ విధానంలో, బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటాయి. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉన్నప్పటికీ.. ప్రిపరేషన్ మాత్రం డిస్క్రిప్టివ్ విధానంలోనే కొనసాగించాలి. తద్వారా ఆయా అంశాలపై పూర్తి స్థాయిలో అన్ని కోణాల్లో అవగాహన లభిస్తుంది. ఫలితంగా గ్రూప్-1 మెయిన్స్‌కు కూడా సన్నద్ధత పూర్తవుతుంది.

మెయిన్స్ స్థాయి ప్రిపరేషన్

గ్రూప్ 1 అభ్యర్థులు మెయిన్స్ స్థాయిని దృష్టిలో పెట్టుకుని అధ్యయనం సాగించాలి. మెయిన్స్‌లో ఏడు పేపర్లు(పేపర్-1 జనరల్ ఎస్సే; పేపర్-2 -హిస్టరీ, కల్చర్, జాగ్రఫీ; పేపర్-3 ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం, పరిపాలన; పేపర్-4 ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్; పేపర్-5 సైన్స్ టెక్నాలజీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్; పేపర్-6 తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం) ఉంటాయి. జాతీయ, రాష్ట్ర స్థాయి అంశాలు కూడా సిలబస్‌లో ఉన్నాయి. కాబట్టి గ్రూప్ 1-మెయిన్ అప్రోచ్‌తో ప్రిపరేషన్ సాగిస్తే.. గ్రూప్-2, 3లకు కూడా సన్నద్ధత లభిస్తుంది. అదే విధంగా పేపర్-ఎ పేరుతో ఇంగ్లిష్ పేపర్ నిర్వహిస్తారు. ఇది అర్హత పేపర్ మాత్రమే.



అనుసంధాన దృక్పథం

ఉమ్మడి ప్రిపరేషన్‌లో భాగంగా అభ్యర్థులు అనుసంధాన దృక్పథం అనుసరించాలి. మూడు పరీక్షల్లోని ఉమ్మడి సిలబస్ అంశాలను గుర్తించి.. వాటిని అనుసంధానం చేసుకుంటూ చదవాలి. జనరల్ స్టడీస్, కరెంట్ అఫైర్స్, ఇంటర్నేషనల్ రిలేషన్స్; భారత రాజ్యాంగం విధానం, పరిపాలన, ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్.. ఇలా అనేక అంశాలను అనుసంధానం చేసుకుంటూ చదివే వీలుంది. అభ్యర్థులు ప్రతి రోజు సగటున 8 నుంచి 10 గంటల సమయం ప్రిపరేషన్‌కు కేటాయించేలా టైమ్ టేబుల్ రూపొందించుకోవాలి.

తెలంగాణకు ప్రాధాన్యం

ప్రిపరేషన్ సమయంలో అభ్యర్థులు జాతీయం నుంచి తెలంగాణ ప్రాంత ప్రాధాన్యమున్న అంశాల వరకూ.. అన్నింటినీ ఔపోసన పట్టాలి. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతానికి సంబంధించి తెలంగాణ ఉద్యమ దశలు, తెలంగాణ ఆవిర్భావ దశ, మలిదశ ఉద్యమంలో ముఖ్యమైన ఘట్టాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా తెలంగాణ చరిత్రలో తెలంగాణ సామాజిక ముఖ చిత్రాన్ని తెలియజేసే అన్ని అంశాలను చదవాలి. సాహిత్యం, కళలు, కవులు, సంస్థానాలు, భౌగోళిక స్వరూపం, వనరులు, ప్రభుత్వ పథకాలు, రాష్ట్రంలో అమలవుతున్న కొత్త పథకాలు.. ఇలా అన్ని అంశాలపైనా దృష్టి పెట్టాలి.

ప్రత్యేక అంశాలకు ఇలా

తెలంగాణ హిస్టరీ, తెలంగాణ జాగ్రఫీ, తెలంగాణ ఎకానమీలపై అభ్యర్థులు మరింత ఎక్కువగా దృష్టిపెట్టాలి. తెలంగాణలో శాతవాహనుల నుంచి అసఫ్ జాహీల వరకూ.. ఆయా రాజ వంశాలు, రాజకీయ చరిత్ర, ముఖ్య యుద్ధాలు, ఒప్పందాలు, తెలంగాణలోని కవులు-రచనలు; కళలు; ముఖ్య కట్టడాలు-వాటిని నిర్మించిన రాజులు తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అదే విధంగా స్వాతంత్ర్యోద్యమ సమయంలో తెలంగాణ ప్రాంత ప్రమేయం ఉన్న సంఘటనలపై అవగాహన ఏర్పరచుకోవాలి. తెలంగాణలోని ముఖ్యమైన నదులు-పరీవాహక ప్రాంతాలు; ముఖ్యమైన పంటలు; భౌగోళిక ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలపై దృష్టి పెట్టాలి. దీంతోపాటు తెలంగాణ భౌగోళిక స్వరూపం, విస్తీర్ణం, జనాభా వంటివి తెలుసుకోవాలి. ఎకానమీలో తెలంగాణ స్థూల రాష్ట్రీయోత్పత్తి, ముఖ్యమైన పథకాలు, 2011 జనాభా గణాంకాలు; ముఖ్యమైన పరిశ్రమలు -ఉత్పత్తిదాయకత, రాష్ట్ర ప్రధాన ఆదాయ వనరులపై అవగాహన పెంచుకోవాలి. తాజా బడ్జెట్ గణాంకాలు, ఆయా శాఖలు, పథకాలకు కేటాయింపులను తెలుసుకోవాలి.

జాతీయ ప్రాధాన్యం

జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో సామాజిక సమస్యలు, వాటిపై ప్రభుత్వాలు చేసిన విధానాలకు సంబంధించి ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. కాబట్టి వీటిపై అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా మహిళా సాధికారత, గిరిజనుల సమస్యలు వంటివి. మహిళల సాధికారత కోసం జాతీయ స్థాయిలో పలు పథకాలు తెచ్చారు. మైనారిటీలు, వెనుకబడిన తరగతులు, గిరిజన సంక్షేమం కోసం విధానాలు అమలు చేస్తున్నారు. అదే విధంగా పలు నూతన పాలసీలు రూపొందుతున్నాయి.

సొంత నోట్స్

అభ్యర్థులు ఆయా సబ్జెక్టులను చదువుతున్నప్పుడే ముఖ్యమైన అంశాలను పాయింట్ల వారీగా నోట్స్ రాసుకోవాలి. ఒక అంశాన్ని చదివేటప్పుడు అన్ని కోణాల్లో అధ్యయనం చేస్తూ ముఖ్యమైన పాయింట్లను నోట్ చేసుకోవాలి. ఉదాహరణకు సామాజిక వర్గాలనే పరిగణనలోకి తీసుకుంటే.. ఆ వర్గాల నిర్వచనానికే పరిమితం కాకుండా.. వాటి ఆవిర్భావ చరిత్ర, విస్తరణ, తాజా పరిస్థితులు.. ఇలా అన్నింటినీ చదవాలి. ఇలా చదువుతూ కీలకాంశాలతో సిద్ధం చేసుకున్న నోట్స్‌ను పరీక్ష రోజు వరకూ పదే పదే రివిజన్ చేస్తుండాలి.

ప్రాక్టీస్ టెస్ట్‌లకు హాజరు

గ్రూప్-1, 2, 3 అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో ప్రాక్టీస్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లకు హాజరవడం మేలు చేస్తుంది. దీనివల్ల ఆయా సబ్జెక్ట్‌లలో తమకు అప్పటి వరకు లభించిన పరిజ్ఞాన స్థాయిపై అవగాహన లభిస్తుంది. ఇంకా చదవాల్సిన అంశాల విషయంలో స్పష్టత వస్తుంది.